సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 286

సోమవారం 6-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'



సిరీస్ సమర్పయామి

చివరి టెస్టులో ఓడి 1-3తో ఆస్ట్రేలియాకు సిరీస్ కోల్పోయిన టీమిండియా -14లో



ఈ ఏడాదికి పెట్టుబడి అస్త్రాలు!

ఈక్విటీలది లాభాల బాటే.. బంగారం, వెండి ర్యాలీ ముందుకే -15లో



'ఆప్'ద నుంచి... ఢిల్లీకి విముక్తి

ఢిల్లీలో పదేళ్లుగా అధికారంలో ఉన్న ఆప్ ప్రజలకు చేసిందేమీ లేదని మోదీ మండిపడ్డారు. బీజేపీకి అవకాశమివ్వాలని కోరారు.

వివరాలు 6లో ▸



హడలెత్తిస్తున్న మంచు

కనీవినీ ఎరగనంతటి భారీ మంచు అమెరికా, యూరప్‌లను హడలెత్తిస్తోంది. పలు దేశాల్లో విమానాలు, రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి.

వివరాలు 6లో ▸



ఆ విద్యార్థులకు ప్రత్యేక వీసాలు

ఉన్నత విద్యకు భారత్ వచ్చే విద్యార్థుల కోసం ఈ-స్టూడెంట్ వీసా, ఈ-స్టూడెంట్-ఎక్స్ వీసాలను కేంద్ర హోం శాఖ ప్రవేశపెట్టింది.

వివరాలు 6లో ▸



'మహా' వ్యాఖ్యల... మర్మమేమిటో?!

మహారాష్ట్రలో అధికార కూటమికి చేరువయ్యేందుకు శివసేన (ఉద్ధవ్), ఎన్సీపీ (పవార్) యత్నిస్తున్నాయని వార్తలు వినిపిస్తున్నాయి.

వివరాలు 6లో ▸

స్మార్ట్‌గా సర్కారీ స్కూల్

3,673

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ స్క్రీన్ల ద్వారా తొలిదశలో బోధన


- ఇంటర్నెట్ సదుపాయం, ఆధునిక కంప్యూటర్ వ్యవస్థ, డిజిటల్ లైబ్రరీ, సరిపడా టీచర్లు, ఇతర మౌలిక వసతులు, ఆట స్థలం, ఉచిత రవాణా వసతి ఉండాలి
- మండలానికి రెండు లేదా మూడు పెద్ద స్కూళ్లుంటే చాలు.. ఆ మేరకు 10 వేల చిన్న స్కూళ్లు విలీనం చేయాలి
- స్మార్ట్ విద్యా విధానం, పెద్ద స్కూళ్ల నాణ్యత పెంచుతాయి



ప్రభుత్వానికి విద్యా కమిషన్ సిఫారసు! త్వరలో నివేదిక

సాక్షి, హైదరాబాద్: ఇంటర్నెట్ సదుపాయం, ఆధునిక కంప్యూటర్ వ్యవస్థ, డిజిటల్ లైబ్రరీ, అన్నిటికీ మించి డిజిటల్ విద్యాబోధనకు అనుగుణంగా డిజిటల్ స్క్రీన్లు..తదితర ఏర్పాట్లతో రాష్ట్రంలోని స్కూళ్లను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని విద్యా కమిషన్ భావిస్తోంది. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పెరగాలంటే పెద్ద స్కూళ్ళ ఏర్పాటే మార్గమని స్పష్టం చేస్తోంది. ఈ విధానంతో ప్రైవేటు స్కూళ్ళకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను ముందుకు తీసుకెళ్ళొచ్చని అభిప్రాయపడుతోంది. విద్యార్థుల సంఖ్యను బట్టి మండలానికి 2 లేదా 3 స్కూళ్ళు ఉంటే సరిపోతుందని సూచిస్తోంది. విద్యా రంగం సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ వంద రోజులు స్కూళ్ళ నాణ్యతపై అధ్యయనం చేసింది. ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, స్థానిక ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకుంది. తక్షణమే తీసుకోవాల్సిన దిద్దుబాటు చర్యలకు సంబంధించిన కొన్ని సిఫారసులతో త్వరలోనే నివేదిక సమర్పించనుంది. విశ్వసనీయ సమాచారం మేరకు నివేదికలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

స్మార్ట్ విద్యా విధానంతో నాణ్యత: పాఠశాలల్లో ప్రతి సబ్జెక్టుకు సరిపడా టీచర్లు, ప్రయోగశాలలు, విశాలమైన తరగతులు, స్మార్ట్ కిచెన్, మౌలిక వసతులు, ఆట స్థలం ఉండేలా చూడాలి. విద్యార్థులు ప్రత్యక్షంగా చూసి వివిధ అంశాలు నేర్చుకునేందుకు వీలుగా మిగతా 2వ పేజీలో ▶



రైతు భరోసా కుదింపు వంచనే

ఏటా రూ. 15 వేలిస్తామని రూ. 12 వేలకు కుదిస్తారా?

రైతాంగానికి రేవంత్ తీరని ద్రోహం చేశారు: కేటీఆర్

- నమ్మి ఓటేసినందుకు మోసగించిన కాంగ్రెస్‌ను రైతాంగం క్షమించదు
- నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైతాంగానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరని ద్రోహం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం, దగా, నయవంచన అని మరోసారి రుజువు చేశారని మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైతుభరోసా సాయాన్ని ఎకరానికి ఏటా రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి చివరకు రూ. 12 వేలకు కుదించడం రైతులను నిలువునా వంచించడమేనని దుయ్యబట్టారు. తెలంగాణ రైతాంగం ఈ ద్రోహాన్ని క్షమించదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ చేసిన మోసాన్ని గ్రామగ్రామాన ఎండగట్టేందుకు సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతోపాటు రైతులు కూడా నిరసనల్లో పాల్గొనాలని కోరారు.

నాడు బిచ్చం అన్నావు.. నేడు ముష్టి వేస్తున్నావా?

'ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టిన కేసీఆర్ రైతులకు ఏటా రూ. 10 వేలు ఇస్తే దాన్ని రేవంత్ 'బిచ్చం'అన్నాడు. మరి నువ్వు ఇప్పుడు పెంచిన మొత్తం మాటేమిటి? రైతులకు మిగతా 3వ పేజీలో ▶

నేడు ఏసీబీ ముందుకు కేటీఆర్!

- 'ఫార్ములా-ఈ రేసు'కేసు విచారణకు హాజరుకానున్న మాజీ మంత్రి
- కేటీఆర్ ఆదేశంతో నిబంధనలకు విరుద్ధంగా ఓ విదేశీ సంస్థకు రూ. 54.88 కోట్లు చెల్లించినట్లు ఆరోపణలు.. దీనిపై సీనియర్ ఐఏఎస్ దానకిశోర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏసీబీ

3లో

న్యూస్‌రీల్

'చర్లపల్లి' ప్రారంభం నేడే



భాగ్యనగరం సిగలో మరో మణిహారం ప్రారంభానికి సిద్ధమైంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌పై ఒత్తిడిని తగ్గించేందుకు సుమారు రూ. 413 కోట్ల వ్యయంతో నిర్మించిన చర్లపల్లి నూతన రైల్వే టెర్మినల్‌ను ప్రధాని మోదీ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

- వివరాలు 2లో▶

8 కులాల పేర్ల మార్పు!



వెనుకబడిన తరగతుల్లోని ఎనిమిది కులాల పేర్లను మార్చేందుకు తెలంగాణ బీసీ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా కులాల పేర్లను తిట్ల రూపంలో వాడుతున్నారని, దీంతో కులం పేరు చెప్పేందుకు ఇబ్బందికరంగా ఉందని ఆయా కులాల ప్రతినిధులు కమిషన్‌కు వినతులు సమర్పించారు.

- వివరాలు 2లో▶

'కోవ్'.. కేక



చుట్టూ నీళ్లు.. మధ్యలో ఉన్న దీవిలో అందమైన కుటీరాలు.. వాటిల్లో అద్భుతమైన వసతులు.. ఇవన్నీ లక్నవరం చెరువులో ఉన్నాయి. అక్కడ ఇప్పటికే ఉన్న అందమైన దీవులకు అదనంగా టీఎస్‌టీడీసీ, ఫ్రీకోట్స్ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో 'ది కోవ్'రిసార్ట్స్ పేరుతో మూడో ద్వీపాన్ని తీర్చిదిద్దారు.

- వివరాలు 2లో▶

కోర్టు ఆదేశించినా పట్టించుకోరా?



హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో అక్రమాలపై విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశించి రెండు నెలలైనా సహకార శాఖలో చలనం లేకుండా పోయిందని సభ్యులు మండిపడ్డారు.

- వివరాలు 5లో▶

అభయహస్తం చెక్కును అభ్యర్థికి ఇస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల



సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల్లో మనమే నంబర్ 1 కావాలి

సివిల్స్ అభ్యర్థులకు రూ.లక్ష చెక్కుల పంపిణీలో సీఎం రేవంత్‌రెడ్డి

సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైనవారికి ఢిల్లీలో ఉచిత బస: భట్టి

కేలండర్ ప్రకారమే ఉద్యోగాలు!

మార్చి 31లోగా గ్రూప్-1 నియామకాలు పూర్తి • ఏడాదిలోనే రికార్డు స్థాయిలో 55,143 పోస్టుల భర్తీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబ్ కేలండర్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. 14 ఏళ్లుగా గ్రూప్-1 పరీక్ష నిర్వహించలేదని.. తాము అన్ని అడ్డంకులను, కుట్రలను అధిగమించి 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. మార్చి 31లోగా ఈ పోస్టుల భర్తీని పూర్తి చేస్తామని చెప్పారు. సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలకు ఎంపికైన 20 మంది తెలంగాణ అభ్యర్థులకు రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద ఆదివారం ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి రూ.లక్ష చొప్పున చెక్కులను సీఎం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీ లేక నిరుద్యోగులు ఎంతో నష్టపోయారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే దేశంలో ఎక్కడా లేనివిధంగా 55,143 ఉద్యోగ నియామకాలు చేపట్టిందని తెలిపారు.

సివిల్స్‌లో సత్తా చాటండి

సివిల్స్‌లో తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో అభ్యర్థులు ఎంపిక కావాలన్న లక్ష్యంతోనే రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకాన్ని ప్రారంభించినట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం బిహార్ నుంచి ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపికవుతున్నారని తెలిపారు. దేశంలో అత్యధికంగా తెలంగాణ నుంచి సివిల్స్‌కు ఎంపికవుతారని గర్వంగా చెప్పుకునే స్థాయికి మిగతా 2వ పేజీలో ▶

ఏ భాష అయినా నేర్చుకోండి..

తెలుగులోనే మాట్లాడండి

- ప్రపంచ తెలుగు ఫెడరేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి
- దేశంలో అత్యధికులు మాట్లాడుతున్న రెండో భాష తెలుగు..
- అయినా దేశ రాజకీయాలను ప్రభావితం చేయలేకపోతున్నాం

2లో

హైడ్రా మళ్లీ వీకెండ్ ఆపరేషన్



- అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాల కూల్చివేత
- బాహుబలి క్రేన్‌తో నేలమట్టం చేసిన అధికారులు
- హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన భవన యజమాని

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) తన వీకెండ్ ఆపరేషన్లను పునఃప్రారంభించింది. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో ఉన్న 684 చదరపు గజాల ప్రభుత్వ స్థలంలో హైకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి అక్రమంగా నిర్మిస్తున్న ఐదు అంతస్తుల భవనాన్ని హైడ్రా అధికారులు ఆదివారం కూల్చేశారు. హైడ్రా కమిషనర్ మిగతా 12వ పేజీలో ▶

రాష్ట్ర సర్కారు బడ్జెట్ ప్రతిపాదనల కంటే అధికంగా బహిరంగ మార్కెట్ రుణాలు



అప్పుల లెక్క పెరిగింది!

తెస్తామని చెప్పినది రూ.57 వేల కోట్లు.. అవుతున్నది రూ.70,500 కోట్లు.. అంటే 23శాతం అదనం

ఇప్పటికే సెక్యూరిటీల వేలం ద్వారా అప్పు	జనవరి-మార్చి మధ్య మరో రూ.30 వేల కోట్ల కోసం రిజర్వ్ బ్యాంకుకు ఇండెంట్
రూ. 40,500 కోట్లు	

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన దానికంటే ఈసారి బహిరంగ మార్కెట్ రుణాలు భారీగా పెరుగుతున్నాయి. ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొన్నదానికంటే 23శాతం అదనంగా అప్పులు తీసుకోనుంది. రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) ద్వారా రుణ సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఇండెంట్‌ను బట్టి ఈ విషయం స్పష్టమవుతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే రూ.40,500 కోట్ల రుణాలను సెక్యూరిటీల వేలం ద్వారా ఆర్‌బీఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. ఇప్పుడు చివరి త్రైమాసికంలో (జనవరి నుంచి మార్చి నెలాఖరు వరకు) నెలకు రూ.10వేల కోట్ల చొప్పున మరో రూ.30 వేల కోట్ల రుణం కోసం ఆర్బీఐకి ఇండెంట్ పెట్టింది. అంటే బహిరంగ మార్కెట్ నుంచి తీసుకునే రుణం రూ.70,500 కోట్లకు మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఒక్కరు కూడా లేర్సార్! అందరూ వచ్చి వాళ్ల వాళ్ల పేరెంట్స్‌ని తీసుకెళ్లారు!!

పెట్టుబడులు రూ. 1.98 లక్షల కోట్లు | ఉద్యోగాలు 1.14 లక్షలు

2035 నాటికి 49,500 మెగావాట్లకు పునర్వినియోగ ఇంధన ఉత్పత్తి

- ప్రస్తుతం రాష్ట్ర గ్రీన్ ఎనర్జీ సరఫరా సామర్థ్యం 10,095.20 మెగావాట్లు
- వచ్చే ఐదేళ్లలో అదనంగా 20,000 మెగావాట్లకు పెంచాలని లక్ష్యం.. 2030 నాటికి 31,400 మెగావాట్లకు పెంచాలని నిర్ణయం
- ప్లాంట్ల కోసం 10% నామమాత్రపు అద్దెతో లీజుకు సర్కారీ స్థలాలు

తెలంగాణ రెన్యూవబుల్ పాలసీ-2025లో ప్రభుత్వం నిర్ణయాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సౌర, పవన, డిస్ట్రిబ్యూటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ, ఎనర్జీ స్టోరేజీ (బ్యాటరీ స్టోరేజీ+ పంప్డ్ స్టోరేజీ) ప్రాజెక్టులు, జియోథర్మల్, గ్రీన్ హైడ్రోజన్, హైబ్రిడ్ వంటి పునరుత్పాదక విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటును భారీ ఎత్తున ప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం రాష్ట్ర పునరుత్పాదక విద్యుత్ సరఫరా సామర్థ్యం (కాంట్రాక్టెడ్ కెపాసిటీ) 10,095.20 మెగావాట్లు ఉండగా, 2029–30 నాటికి సుమారు 20,000 మెగావాట్ల అదనపు సామర్థ్యాన్ని జత చేసి మొత్తం 31,400 మెగావాట్లకు పెంచాలని నిర్ణయించింది. 2034–35 నాటికి అదనంగా మరో 18,100 మెగావాట్ల సామర్థ్యాన్ని జత చేసి మొత్తం సామర్థ్యాన్ని 49,500 మెగావాట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకోసం వచ్చే పదేళ్లలో రూ.1.98 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు 1.14 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి మిగతా 12వ పేజీలో ▶





బుల్ స్వారీలో 'ఆమె' ఫస్ట్

స్టాక్ మార్కెట్‌లో నయా ట్రెండ్

ప్రతి నాలుగు కొత్త డీమ్యాట్ అకౌంట్లలో ఒకటి మహిళదే

3లో

పక్షి ఎదురొచ్చినా.. పక్షికి ఎదురెళ్లినా..

ముప్పు విమానాలకే!

- విమాన ప్రమాదాలకు కారణమవుతున్న పక్షుల కదలికలు
- ఒక్క ఢిల్లీలోనే 2023లో 169 విమానాల్ని ఢీకొట్టిన విహంగాలు.. కొరియా ప్రమాదంతో అప్రమత్తమైన డీజీసీఏ
- ఎయిర్‌ఫీల్డ్ పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా చర్యలు
- దేశంలోని అన్ని విమానాశ్రయాల్ని అప్రమత్తం చేసిన డీజీసీఏ

16లో

క్లుప్తంగా...

రేపు తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 10- 19 వరకు వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలను పురస్కరించుకుని జనవరి 7న మంగళవారం నాడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఆనంద నిలయం మొదలుకొని బంగారు వాకి లి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రిని నీటితో శుభ్రం చేస్తారు. ఈ సమయంలో మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పుతారు. శుద్ధి అనంతరం సుగంధ ద్రవ్యాలతో ఆలయాన్ని ప్రోక్షణం చేస్తారు. మూలవిరాట్టు కు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజలు చేపట్టి నైవేద్యం సమర్పించి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. ఈ కారణంగా 7న బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతో పాటు 6న సిఫార్సు లేఖలను స్వీకరించేది లేదని టీటీడీ స్పష్టం చేసింది. కాగా, వైకుంఠ ద్వార దర్శన రోజుల్లో వేచి ఉండే సమయాన్ని నివారించేందుకు టోకెన్లు, టికెట్లపై నిర్దేశించిన సమయం ప్రకారం మాత్రమే భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.

విధుల్లో అలసత్వం సహించం: మంత్రి సీతక్క


సమావేశంలో మంత్రి సీతక్క తదితరులు

సాక్షి, హైదరాబాద్: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) హెచ్చరించారు. హైదరాబాద్‌లోని గ్రామీణ మంచి నీటి సరఫరా కేంద్ర కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారుల(డీపీఓ)తో ఆమె ఆదివారం సమీక్ష జరిపారు. పల్లెలను ప్రగతి పథంలో నడిపించేందుకు డీపీవోలు కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలకు సురక్షిత మంచి నీరు సరఫరా అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా అవుతున్న తాగునీటి విషయంలో ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు తెరిచేలోపు తాగునీటి సరఫరా పూర్తవుతున్నందున, తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు హెడ్ మాస్టర్, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. ఉదయమే ట్యాంకులు నింపుకొనేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇకనుంచి ప్రతి నెల డీపీవోలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. కింది స్థాయి ఉద్యోగులతో 15 రోజులకోసారి డీపీవోలు సమీక్ష జరపాలన్నారు. సఫాయి కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్లకు ప్రతీ నెల ఐదో తేదీన వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్, కమిషనర్ శ్రీజన తదితరులు పాల్గొన్నారు.

నేడు జెన్‌కో ఏఈ, కెమిస్ట్ అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో అసిస్టెంట్ ఇంజనీర్లు, కెమిస్టులుగా ఎంపికైన అభ్యర్థులకు సోమవారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేయనున్నారు. రాష్ట్ర సచివాలయం ఎదుట ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహ ప్రాంగణంలో జరగనున్న ఈ కార్యక్రమంలో.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మల్లు తదితరులు పాల్గొంటారు. జెన్‌కోలో 399 ఏఈ, కెమిస్ట్ పోస్టుల భర్తీకి 2023 అక్టోబర్ 4న ప్రకటన జారీ చేయగా, ఎట్టకేలకు సోమవారంతో నియామకాలు పూర్తికాబోతున్నాయి.

కోవ్.. కేక!







మాల్దీవులను తలపిస్తున్న లక్నవరం ద్వీపాలు

ది కోవ్ రిసార్ట్ పేరుతో అందుబాటులోకి మూడో దీవి

పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్న వసతులు

ఒక రోజుకు రూ.5 వేల నుంచి రూ.15 వేల అద్దె

గోవిందరావుపేట: చుట్టూ నీళ్లు.. మధ్యలో ఉన్న దీవిలో అందమైన కుటీరాలు.. వాటిల్లో లోకాన్ని మరిచి సేదదీరేందుకు అద్భుతమైన వసతులు.. ఈ సీన్ ఊహించుకోగానే ఏ మాల్దీవులో ఠక్కున గుర్తుకొస్తున్నాయి కదా? కానీ.. ఆ అనుభూతిని ఆస్వాదించేందుకు అంతదూరం వెళ్లాల్సిన పనిలేదు. తెలంగాణ రాష్ట్రంలోనే అంతటి అందాల ప్రదేశం ఉంది. అదే లక్నవరం చెరువు. లక్నవరం చెరువులో ఇప్పటికే ఉన్న అందమైన దీవులకు అదనంగా టీఎస్‌టీడీసీ, ఫ్రీకోట్స్ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో 'ది కోవ్'రిసార్ట్స్' పేరుతో మూడో ద్వీపాన్ని తీర్చిదిద్దాయి. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామ పరిధిలో ఉన్న ఈ జలాశయంలోని కొత్త ఐలాండ్ పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటోంది. రూ.7 కోట్ల వ్యయంతో మూడెకరాల విస్తీర్ణంలో 21 కాటేజీలతో తీర్చిదిద్దిన ఈ దీవి 2024 నవంబర్‌లోనే అందుబాటులోకి వచ్చింది.

వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్

ది కోవ్ రిసార్ట్‌లో పర్యాటకులు ఆటలతో ఉల్లాసంగా గడపడానికి జల క్రీడలు, సాహస కార్యకలాపాలు, కృత్రిమ బీచ్, బాక్స్ క్రికెట్, షటిల్ కోర్టులు, ఈత కొలనులు, క్యాంపింగ్ జోన్‌లు ఏర్పాటు చేశారు. మాల్దీవుల్లో ఉన్న అనుభూతిని కలిగించేలా ఇక్కడ ఏర్పాట్లు చేశారు. దీంతో టూరిస్టుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ ద్వీపం మాల్దీవులు, మున్నార్, గోవా, అండమాన్ దీవులను తలపిస్తోందని పర్యాటకులు చెబుతున్నారు.



ఇవీ ప్రత్యేకతలు..

ఒక్కో కాటేజీలో నలుగురు బస చేయవచ్చు. వ్యక్తిగత కాటేజీలకు ఈత కొలనులు నిర్మించారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఈత కొలనులు, ఆట వస్తువులు ఉన్నాయి. పెద్దల కోసం రెండు స్పాలు, రెస్టారెంట్ ఉన్నాయి. ఈ కాటేజీల్లో ఒకరోజు (24 గంటలు) బస చేయడానికి అద్దె రూ.5,000 నుంచి రూ.15, 000 వరకు వసూలు చేస్తున్నారు.

పొంచి ఉన్న నీటి సమస్య

పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్న లక్నవరం సరస్సుకు త్వరలోనే నీటి సమస్య ఏర్పడవచ్చని ఆందోళన వ్యక్తమవుతోంది. చెరువు కింద 4,150 ఎకరాల ఆయకట్టు భూములకు యాసంగి పంట కోసం నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. ఫిబ్రవరి నుంచి సరస్సులో నీటి మట్టం తగ్గిపోయి సరస్సు అడుగంటే ప్రమాదం ఉంది.అదే జరిగితే వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్ మూలనపడ నున్నాయి.

ది కోవ్ రిసార్ట్‌లో బస చేయాలంటే పర్యాటక శాఖ వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలి. వివిధ రకాల కాటేజీల అద్దెలు.. పూర్తి వివరాలు సాక్షి ప్లస్ (ఈపేపర్)లో..

చర్లపల్లి టెర్మినల్ ప్రారంభం నేడే

వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- మార్చి నుంచి రెగ్యులర్ రైళ్ల సేవలు
- కొన్ని రైళ్లకు హాల్టింగ్ సదుపాయం
- 30 ప్రత్యేక రైళ్లు చర్లపల్లి నుంచి ప్రారంభం
- ఔటర్‌కు సమీపంలో ఉండటంతో ఎక్కడి నుంచైనా రాకపోకలకు వీలు


కొత్తగా నిర్మించిన చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్ బయటి, లోపలి దృశ్యాలు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: భాగ్యనగరం సిగలో ముస్తాబైన మరో మణిహారం ప్రారంభానికి సిద్ధమైంది. సుమారు రూ. 413 కోట్ల వ్యయంతో, పర్యావరణ అనుకూలంగా నిర్మించిన చర్లపల్లి నూతన రైల్వే టెర్మినల్‌ను ప్రధాని మోదీ సోమవారం మధ్యాహ్నం 12:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారని ప్రధాని కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు అశ్వనీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి, సహాయ మంత్రులు సోమన్న, బండి సంజయ్, మంత్రి శ్రీధర్‌బాబు, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొననున్నారు. వాస్తవానికి గతేడాది డిసెంబర్ 28నే టెర్మినల్ ప్రారంభం కావాల్సి ఉంది. అయితే మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణంతో వారం రోజులు సంతాప దినాలుగా కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ప్రారంభోత్సవం వాయిదా పడింది. ఈ టెర్మినల్ అందుబాటులోకి వచ్చాక సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ తగ్గుతుందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉండటం వల్ల ప్రయాణికులు నగరంలో ఎక్కడి నుంచైనా సులువుగా ఈ స్టేషన్‌కు చేరుకొనే వీలుంది.

ఆధునిక హంగులు.. సదుపాయాలు..

ప్రయాణికుల రాకపోకలకు అనుగుణంగా ఆధునిక హంగులతో చర్లపల్లి రెండవ ప్రవేశద్వారం, నూతన రైల్వే టెర్మినల్‌ను అభివృద్ధి చేశారు. స్టేషన్‌లో 6 టికెట్ బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. స్త్రీ, పురుషులకు ప్రత్యేక విశ్రాంతి గదులు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎగ్జిక్యూటివ్ లాంజ్ ఉంది. మొదటి అంతస్తులో కెఫెటేరియా, రెస్టారెంట్, విశ్రాంతి గదులు ఉన్నాయి. ఒక ప్లాట్‌ఫాం నుంచి మరో ప్లాట్‌ఫాంకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా 12 మీటర్ల వెడల్పుతో ఒక ఫుట్‌ఓవర్ బ్రిడ్జితోపాటు 6 మీటర్ల వెడల్పుతో మరో బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. మొత్తం 9 ప్లాట్‌ఫాంలలో 7 లిఫ్టులు, 6 ఎస్కలేటర్లు ఉన్నాయి. రైళ్ల నిర్వహణ కోసం ఆధునిక కోచ్ డిపోను కూడా నిర్మించారు. బస్‌బే తోపాటు కార్లు, బైక్‌లను నిలిపేందుకు విశాల పార్కింగ్ సదుపాయం కల్పించారు.

మూడు రైళ్లకు హాల్టింగ్ సదుపాయం

- చర్లపల్లి టెర్మినల్‌లో మంగళవారం నుంచి మూడు రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పించనున్నారు.
- సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు వెళ్లే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12757/12758) మంగళవారం నుంచి ప్రతిరోజూ ఉదయం 8:32 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. నిమిషంపాటు ఆగాక సికింద్రాబాద్ బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 7:02 గంటలకు చర్లపల్లికి చేరుకొని నిమిషం హాల్టింగ్ తరువాత సిర్పూర్ కాగజ్‌నగర్ బయలుదేరుతుంది.
- గుంటూరు-సికింద్రాబాద్ (17201/1702) ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్‌కు వచ్చేటప్పుడు మధ్యాహ్నం 12:41కు.. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 12:50 గంటలకు నిమిషంపాటు చర్లపల్లిలో ఆగనుంది.
- సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ (17233/17234) మధ్యాహ్నం 3:47 గంటలకు, తిరుగు ప్రయాణంలో ఉదయం 9:20 గంటలకు నిమిషంపాటు ఆగుతుంది.

సంక్రాంతి ప్రత్యేక రైళ్లు చర్లపల్లి నుంచే..

సంక్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల మధ్య 52 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు దక్షిణమధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. సోమవారం నుంచి ఈ నెల 17 వరకు ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. ముఖ్యంగా ఈ నెల 9 నుంచి 13 మధ్య ఎక్కువ రైళ్లు ప్రయాణికులకు అందుబాటులో ఉండనున్నాయి. ఈ రైళ్లలో సుమారు 30 రైళ్లను చర్లపల్లి నుంచి నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. చర్లపల్లి-తిరుపతి (07077/ 07078), చర్లపల్లి-తిరుపతి (02764/02763), చర్లపల్లి-నర్సాపూర్ (07035/07036), చర్లపల్లి-నర్సాపూర్ (07033/07034), చర్లపల్లి-కాకినాడ (07031/ 07032), చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు (07041/07042) తదితర రైళ్లు చర్లపల్లి నుంచి రాకపోకలు సాగించనున్నాయి. అలాగే కాచిగూడ-తిరుపతి, సికింద్రాబాద్-కాకినాడ, కాచిగూడ-శ్రీకాకుళం రోడ్డు, నాందేడ్-కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు.

మార్చి నుంచి రెగ్యులర్ రైళ్లు

- మార్చి నుంచి రెగ్యులర్ రైళ్ల సేవలు ప్రారంభమవుతాయని దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. ప్రస్తుతం నాంపల్లి నుంచి చెన్నైకి రాకపోకలు సాగించే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మార్చి 7 నుంచి చెన్నై సెంట్రల్-చర్లపల్లి (12603/12604)గా సేవలు అందించనుంది. తిరుగు ప్రయాణంలో 8వ తేదీ నుంచి సాయంత్రం 5:25 గంటలకు బయలుదేరి మర్నాటి ఉదయం 5:40 గంటలకు చెన్నైకి చేరుకుంటుంది.
- ప్రస్తుతం గోరఖ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ మార్చి 12 నుంచి గోరఖ్‌పూర్-చర్లపల్లి మధ్య రాకపోకలు సాగించనుంది. ఈమేరకు గోరఖ్‌పూర్-చర్లపల్లి (12589/12590) 12న ఉదయం 6:35 గంటలకు గోరఖ్‌పూర్ నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1:30 గంటలకు చర్లపల్లి చేరుకోనుంది. తిరుగు ప్రయాణంలో 13న రాత్రి 9:45 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మర్నాటి ఉదయం 6:40 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకోనుంది.

సిటీ బస్సులు ఇలా..

- ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి చర్లపల్లికి (250సీ) బస్సు ప్రతి 10 నిమిషాలకు ఒకటి అందుబాటులో ఉంది.
- బోరబండ నుంచి చర్లపల్లికి (113 రూట్) సిటీ బస్సు సదుపాయం ఉంది.
- ఉప్పల్ నుంచి చెంగిచెర్ల మీదుగా చర్లపల్లికి రెండు రోజుల్లో సర్వీసులను ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.
- రైళ్ల రాకపోకలకు అనుగుణమైన వేళల్లో మరిన్ని బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.

త్వరలో ఎంఎంటీఎస్ సర్వీసులు...

సికింద్రాబాద్-చర్లపల్లి, బొల్లారం-చర్లపల్లి, ఫలక్‌నుమా-చర్లపల్లి, లింగంపల్లి-చర్లపల్లి, మేడ్చల్-చర్లపల్లి స్టేషన్‌ల మధ్య త్వరలో ఎంఎంటీఎస్ సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఈ రైళ్ల రాకపోకలు, సమయపాలనపై కసరత్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రాయగడ డివిజన్‌కు శంకుస్థాపన కూడా..

ఈస్ట్ కోస్ట్ రైల్వే రాయగడ రైల్వే డివిజన్ భవనానికి ప్రధాని మోదీ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఇది అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, ఒడిశా సహా పరిసర ప్రాంతాల్లో రైల్వే అనుసంధానం మెరుగుపడటంతోపాటు సామాజిక, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని ప్రధాని కార్యాలయం పేర్కొంది. మరోవైపు 742.1 కి.మీ. మేర కొత్తగా ఏర్పాటు చేసిన జమ్మూ రైల్వే డివిజన్‌ను మోదీ ప్రారంభించనున్నట్లు తెలిపింది.

ఎనిమిది కులాల పేర్లు మార్పు!

కులసంఘాల విజ్ఞప్తిపై బీసీ కమిషన్ నోటిఫికేషన్

ఈ నెల 18 వరకు అభ్యంతరాల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల్లోని ఎనిమిది కులాల పేర్లను మార్పు చేసేందుకు తెలంగాణ బీసీ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా కులాల పేర్లను తిట్ల రూపంలో వాడుతున్నారని, దీంతో కులం పేరు చెప్పేందుకు ఇబ్బందికరంగా ఉందని దొమ్మర, పిచ్చకుంట్ల, తమ్మలి, బుడబుక్కల, కుమ్మరి, చాకలి, చిప్పోలు, వీరముష్టి కులాలకు చెందిన ప్రతినిధులు పలు సందర్భాల్లో బీసీ కమిషన్‌కు పెద్ద సంఖ్యలో వినతులు సమర్పించారు. ఈ అంశంపై స్పందించిన బీసీ కమిషన్ తాజాగా పేర్ల మార్పునకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 18వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు ప్రకటించింది. అభ్యంతరాలను ఖైరతాబాద్‌లోని తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో ప్రభుత్వ పనివేళల్లో స్వీకరించనున్నట్లు వివరించింది.

సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా గిరి శ్రీనివాస్‌రెడ్డి

సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో విజయం సాధించినవారి సంబురాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈనెల 4వ తేదీన ఎన్నికలు జరిగాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియ శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా గిరి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జె.ప్రేమ్ ఎన్నికయ్యారు. మొత్తం 11 మంది ఆఫీస్ బేరర్లు, 31 మంది డిపార్ట్‌మెంటల్ రిప్రజెంటేటివ్స్‌ను ఎన్నుకున్నారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులుగా ఎం.నవీన్‌కుమార్ (జనరల్), ఆయేషా తబస్సుం (మహిళ), అదనపు కార్యదర్శిగా రాము భుక్యా, సంయుక్త కార్యదర్శిగా కె.శ్రీనివాస్‌రెడ్డి (ఆర్గనైజేషన్), ఎల్.నీరజాక్షి(మహిళ), డి.వంశీధర్‌రెడ్డి (క్రీడలు), యామిని కనకతార(కల్చరల్), పి.రాజేశ్వర్ (పబ్లిసిటీ), కోశాధికారిగా వి.కైలాసం ఎన్నికయ్యారు. మొత్తం 1101 ఓట్లకు.. 1059 ఓట్లు పోల్ అయ్యాయి. మొత్తం 11 ఆఫీస్ బేరర్స్ పోస్టులకు 67 మంది పోటీ పడ్డారు. ఎన్నికల అధికారిగా ఎస్.శంకర్ వ్యవహరించారు.

'డిండి ఎత్తిపోతలతో మేలు'

సాక్షి, హైదరాబాద్: డిండి ఎత్తిపోతల పథకానికి రూ.1,788.89 కోట్లతో ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే అలైన్‌మెంట్‌ను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడం మంచి పరిణామమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి ప్రశంసించారు. ఈ అలైన్‌మెంట్‌ను ప్రకటించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి, మంత్రులు ఎస్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత, వెనుకబడిన మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల ప్రజలకు మేలు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఆ నియోజకవర్గాలకు సాగు, తాగు నీటి వసతి ఏర్పడుతుందని పేర్కొన్నారు.

కేలండర్ ప్రకారమే ఉద్యోగాలు!

▶ మొదటి పేజీ తరువాయి

చేరుకోవాలని అన్నారు. రూ.లక్ష సాయాన్ని ప్రభుత్వ ప్రోత్సాహకంగా భావించాలని కోరారు. ఇంటర్వ్యూలకు వెళ్లే ప్రతి అభ్యర్థి సివిల్స్‌కు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

ఢిల్లీలో సివిల్స్ అభ్యర్థులకు ఉచిత బస: భట్టి

సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు ఢిల్లీలో ఉచిత వసతి కల్పిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సివిల్స్ వైపు రాష్ట్ర యువతను మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ పక్షాన ఆర్థిక సహాయం అందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. ఇంటర్వ్యూలకు ఎంపికైన 20 మంది సివిల్స్ తుది పరీక్షలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి, వారి పిల్లల చదువులకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. సింగరేణిలో తవ్వి వదిలేసిన గనులు, ఇతర ఖాళీ స్థలాల్లో సోలార్, పంప్డ్ స్టోరేజ్ ద్వారా గ్రీన్ పవర్ ఉత్ప త్తి చేస్తామని వెల్లడించారు. సింగరేణి సంస్థ సుస్థిర మనుగడ కోసం దేశవ్యాప్తంగా లిథియం, గ్రాఫైట్ వంటి మైనింగ్ రంగాల్లో విస్తరించే ఆలోచ న చేస్తున్నామని తెలిపారు. సింగరేణి పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తు న్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సింగరేణి సీఎండీ బలరాం పాల్గొన్నారు.

ఏ భాష అయినా నేర్చుకోండి.. తెలుగులోనే మాట్లాడండి


ప్రపంచ తెలుగు ఫెడరేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్, ఎమ్మెల్యే వివేక్, ఫెడరేషన్ చైర్మన్ ఇందిరాదత్, సినీనటులు సాయికుమార్, మురళీమోహన్, జయప్రద, జయసుధ తదితరులు

ప్రపంచ తెలుగు ఫెడరేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి
- దేశంలో అత్యధికులు మాట్లాడుతున్న రెండో భాష తెలుగు
- అయినా దేశ రాజకీయాలను ప్రభావితం చేయలేకపోతున్నాం

సాక్షి, హైదరాబాద్: ''రాజకీయాలు, ఆర్థికం, సినిమా ఇలా ఏ రంగంలోనైనా రాణించాలంటే నాలెడ్జ్ సంపాదించండి. ఏ భాష అయినా నేర్చుకోండి. కానీ తెలుగులోనే మాట్లాడుకోండి. దేశంలో అత్యధిక ప్రజలు మాట్లాడుతున్న రెండో భాషగా తెలుగు నిలిచింది. సుమారు 18 కోట్ల మంది తెలుగులో మాట్లాడుతారు. కానీ ఈ స్థాయిలో దేశ రాజకీయాలను ప్రభావితం చేయలేకపోతున్నాం. దీనికి గల కారణాలను విశ్లేషించుకోవాలి..''అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు ఫెడరేషన్ సభల ముగింపు కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

''దేశ రాజకీయాల్లో నీలం సంజీవరెడ్డి, పీవీ, ఎన్టీఆర్.. తర్వాత కాకా, జైపాల్‌రెడ్డి వంటివారు ప్రభావం చూపించారు. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో తెలుగు వారి పాత్ర సన్నగిల్లింది. తర్వాత చట్టసభల్లో తెలుగువారు ఎవరు మాట్లాడుతారా? అని ఎదురుచూసే పరిస్థితి వచ్చింది. అయితే ఎన్టీఆర్ ప్రారంభించిన ప్రపంచ తెలుగు ఫెడరేషన్ ప్రపంచం ముందు తెలుగు ప్రజలు తలెత్తుకునేలా ఆత్మగౌరవాన్ని పెంపొందించింది. ఇలాంటి సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడం వల్ల మన బాధ్యతను గుర్తుచేసినట్టు అవుతుంది. ఎవరెస్ట్ ఎక్కి చూసినా అక్కడో మలయాళీ ఉంటాడనే నానుడి ఉంది. ఇప్పుడలా తెలుగువారు కనిపిస్తున్నారు. సినిమా రంగంలో హాలీవుడ్ స్థాయిలో రాణిస్తున్నాం.

గత పాలకులతో అభివృద్ధి

రాజీవ్‌గాంధీ దేశానికి కంప్యూటర్‌ను పరిచయం చేశారు. హైదరాబాద్ ప్రాంతం సాంకేతిక నైపుణ్యంతో అభివృద్ధి చెందింది. ప్రపంచంతో పోటీపడేలా ఆర్థికంగా అవకాశాలు కల్పిస్తోంది. వైఎస్ రాజశేఖరరెడ్డి ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు కట్టి ఐటీ, ఫార్మా కంపెనీల ఏర్పాటును ముందుకు తీసుకెళ్లారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కలిసి ప్రపంచంలోనే ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను. విడిపోయి పోటీపడే కంటే కలసి ఉండి అభివృద్ధి వైపు నడిస్తే కచ్చితంగా ప్రపంచానికే ఆదర్శంగా ఈ రెండు రాష్ట్రాలు నిలుస్తాయి. దేశాల మధ్య యుద్ధాలకే చర్చలు పరిష్కారం చూపిస్తుంటే.. రాష్ట్రాల మధ్య సమస్యలకు చర్చలు దారి చూపవా?.

అందరినీ ఆహ్వానిస్తున్నాం...

హైదరాబాద్ విశ్వనగరంగా రాణిస్తుందని భరోసా ఇస్తున్నాం. రవాణా సౌకర్యాలను మెరుగు పరుస్తున్నాం. వరంగల్, రామగుండం, ఆదిలాబాద్, భద్రాచలంలో ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేస్తున్నాం. ఔటర్ రింగురోడ్డు ఆర్థికంగా అంతర్జాతీయ స్థాయికి ఎదగడానికి ఉపయోగపడింది. ఇకపై రీజనల్ రింగ్‌రోడ్డుతో తెలంగాణ రాష్ట్రాన్ని 60 శాతం పట్టణీకరణ చేసేలా ప్రభుత్వం పనిచేస్తోంది. 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తెలంగాణ రైజింగ్ స్లోగన్‌తో 2050 లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళికలు చేస్తున్నాం. అందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలి''అని రేవంత్ పిలుపునిచ్చారు.

స్మార్ట్‌గా సర్కారీ స్కూల్

▶ మొదటి పేజీ తరువాయి

స్టడీ టూర్లు నిర్వహించాలి. తొలిదశలో 3,673 పాఠశాలల్లోని 7,346 తరగతుల్లో తక్షణమే డిజిటల్ స్క్రీన్ ద్వారా బోధన జరగాలి. స్మార్ట్ విద్యా విధానం నాణ్యతను పెంచుతుంది. ఇందుకు కనీసం రూ.300 కోట్లు ఖర్చవుతుంది.

ఒక్కో స్కూల్లో 100కు పైగా విద్యార్థులుండాలి

పెద్ద స్కూళ్ల నిర్ణయం తీసుకునే ముందు ముఖ్యమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 41,628 ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లున్నాయి. ఇందులో 59 లక్షల మంది చదువుతున్నారు. ప్రభుత్వ స్కూళ్ళు 26,337 ఉంటే, వాటిల్లో 22.63 లక్షల మంది విద్యార్థులున్నారు. 11 వేల ప్రైవేటు స్కూళ్ళల్లో 34 లక్షల మందికి పైగా ఉన్నారు. ప్రైవేటు స్కూళ్ళు కూడా ఊరూరా లేవు. మండలంలోనూ ఒకటికి మించి ఉండటం లేదు. వీటిల్లో కనిష్టంగా 500, గరిష్టంగా 4 వేల మంది విద్యార్థులుంటున్నారు. కానీ రాష్ట్రంలోని 1,800 ప్రభుత్వ స్కూళ్ళల్లో అసలు అడ్మిషన్లే లేవు. 8,782 స్కూళ్ళల్లో 30కి మించి విద్యార్థులు లేరు. ఇందులో ప్రాథమిక పాఠశాలలే 8 వేలకుపైగా ఉన్నాయి. 10 వేల స్కూళ్ళల్లో 100 మందికి మించి లేరు. 5,800 స్కూళ్ళల్లో ఒకే ఉపాధ్యాయుడు ఐదు తరగతులకు బోధించే పరిస్థితి ఉంది. నిబంధనల ప్రకారం ప్రతి 30 మందికి ఒక టీచర్ ఉండాలి. కానీ ఇటీవల బదిలీలు, పదోన్నతుల నేపథ్యంలో 20 మందికి ఒక టీచర్ ఉండాలనే నిబంధన తెచ్చారు. అయినప్పటికీ గత ఏడాది కన్నా ఈ సంవత్సరం 1.62 లక్షల ప్రవేశాలు తగ్గాయి. ఈ నేపథ్యంలో ఒక్కో స్కూల్లో కనీసం వందకు పైగా విద్యార్థులు ఉండేలా చూడాలనేది మెజారిటీ అభిప్రాయంగా ఉంది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రంలో పది వేల స్కూళ్ళను ఆయా మండలాల పరిధిలో విలీనం చేయవచ్చు.

ఉచిత రవాణా వ్యవస్థ అవసరం

గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను ప్రైవేటు యాజమాన్యాలు సులభంగా దూరంలో ఉన్న తమ స్కూళ్ళకు తీసుకెళ్తున్నాయి. ఇందుకోసం బస్సులు, ఆటోలు, వ్యాన్లు ఉపయోగిస్తున్నాయి. ఇదే తరహాలో ప్రభుత్వ స్కూళ్ళకు ఉచిత రవాణా వ్యవస్థ ఉండాలి. సుదూర ప్రాంతాలకు విద్యార్థులను పంపేందుకు 92 శాతం గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రులు సిద్ధంగా ఉన్నట్టు మా అభిప్రాయ సేకరణలో తేలింది. అయితే రవాణా సౌకర్యం కోసం ఖర్చు పెట్టేందుకు వాళ్ళు సిద్ధంగా లేరు. అందువల్ల ప్రభుత్వం ఉచితంగా ఈ సౌకర్యం కల్పిస్తే ప్రభుత్వ స్కూళ్ళ వైపే మొగ్గు చూపుతారు.

క్లుప్తంగా...

8న టీపీసీసీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ భేటీ

- హాజరుకానున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండోసారి టీపీసీసీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) భేటీ కానుంది. గత ఏడాది డిసెంబర్7న రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరగా, అదే నెల 18న గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ పీఏసీ సమావేశం జరిగింది. ఆ తర్వాత మళ్లీ ఈనెల 8వ తేదీన రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ అధ్యక్షతన ఈ భేటీ జరగనుంది. ఈ సమావేశానికి ఏఐసీసీ నుంచి పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోపాటు పీఏసీలోని 23 మంది సభ్యులు బుధవారం సాయంత్రం ఆరు గంటలకు గాంధీభవన్‌లో జరిగే సమావేశానికి హాజరవుతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. కాగా, ఈ సమావేశంలో ఏడాది కాలంలో ప్రభుత్వ పనితీరు, ఆరు గ్యారంటీల అమలు, రాష్ట్ర పార్టీ కార్యకలాపాలు, స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికలు, ఎమ్మెల్యేల పనితీరు, దేశ రాజకీయాలు తదితర అంశాలపై చర్చ జరగనున్నట్టు సమాచారం.

రాష్ట్రంలో ఉన్నది కోతల ప్రభుత్వం

బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్నది ప్రజా ప్రభుత్వం కాదని, ఇది కోతల ప్రభుత్వమని బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్.. ఎగవేతల ప్రభుత్వంగా మారిందని, ప్రభుత్వ పథకాలు ఖతమయ్యాయని, రాష్ట్రంలోని రైతులు నిండా మునుగుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా జరిగిన కేబినెట్ సమావేశంలో రైతుభరోసా కింద రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించినట్టు మంత్రులు చెబుతున్నారని, అయితే ఎన్నికల ప్రచారం, మేనిఫెస్టో, డిక్లరేషన్‌లో చెప్పిన విధంగా రూ.15 వేలకు కోతపెట్టినట్లేనా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కారు నిర్ణయంతో రైతుల ఆశలు అడియాసలయ్యాయన్నారు. ఇప్పటికే రెండు దఫాల రైతుభరోసా ఎగ్గొట్టారని, ఇప్పుడు డిక్లరేషన్ ఇస్తేనే రైతుభరోసా అంటూ కొత్తగా మెలిక పెట్టారని పేర్కొన్నారు.

పాలన చేతకాకుంటే ముక్కు నేలకు రాసి దిగిపో

- సీఎం ప్రజలను నట్టేట ముంచారు: బీజేపీ ఎంపీ డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రజలకు ఆశ చూపిన సీఎం రేవంత్‌రెడ్డి.. వారిని నట్టేట ముంచారని బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆదివారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. పాలన చేతకాకుంటే ముక్కు నేలకు రాసి దిగిపోవాలని హెచ్చరించారు. రైతులను మోసం చేస్తాం.. హామీలు మమ అనిపిస్తాం... అడ్డగోలు నిర్ణయాలు తీసు కుంటాం అంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రైతుభరోసా పేరిట అన్నదాతలను రేవంత్‌రెడ్డి నిండా ముంచారన్నారు. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.12 వేలకు కుదించడాన్ని ఆమె తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్కదానిని కూడా అమలు చేయలేదన్నారు. మాట తప్పినందుకు రైతులకు సీఎం రేవంత్ రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే రైతుభరోసాపై ప్రకటన చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పై వ్యతిరేకత వస్తుందన్న ఇంటెలిజెన్స్ నివేదిక మేరకే హడావుడిగా రైతుభరోసా ప్రకటన చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చే వరకు వదిలేదే లేదని అరుణ అన్నారు.

ఇది ప్రజా వ్యతిరేక ప్రభుత్వం

బీజేఎల్పీ నేత ఏలేటి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పని చేస్తోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేశాయన్నారు. పెన్షన్ పెంపు, ఆరు గ్యారంటీలను పట్టించుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ అవినీతిపై దాటవేత ధోరణిని ప్రజాప్రభుత్వం అవలంబిస్తోందన్నారు. హెటిరో స్కాంలో రూ.కోట్లు చేతులు మారాయని, సివిల్ సప్లై అక్రమాలపై ఆధారాలు బయట పెట్టినా చర్యలు లేవని, సీఎం రేవంత్ తప్పు ఒప్పుకుంటున్నారా అని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కంపెనీ వ్యవహారంలో ఇప్పటికైనా కళ్లు తెరవాలని, సీఎం రేవంత్ నియోజకవర్గం కొడంగల్ లిఫ్ట్ టెండర్లలో గోల్‌మాల్ సంగతేంటని, ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

బుల్ స్వారీలో 'ఆమె' ఫస్ట్

స్టాక్ మార్కెట్‌లో నయా ట్రెండ్ కొత్తగా ప్రతి నాలుగు డీమ్యాట్ అకౌంట్లలో ఒకటి మహిళదే

- 2021 నుంచి ఏటా 3 కోట్లకుపైగా డీమ్యాట్ ఖాతాలు
- ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడుల్లో అత్యధికంగా మహిళా ఇన్వెస్టర్లు
- హైదరాబాద్, బెంగళూరు, కాన్పూర్ నగరాల్లో ఎక్కువ ఆసక్తి
- 2014లో పబ్లిక్ ఇష్యూల ద్వారా రూ.12,068 కోట్ల నిధులు సేకరణ
- 2024లో రూ.1.60 లక్షల కోట్ల సేకరణ
- కోవిడ్ తర్వాత ఇన్వెస్టర్లలో 30 ఏళ్లలోపు వారే ఎక్కువ
- మ్యూచువల్ ఫండ్స్‌లో ఏటా రూ.రెండు లక్షల కోట్లకుపైగా ఇన్వెస్ట్‌మెంట్స్
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదికలో వెల్లడి



వివిధ రాష్ట్రాల్లో మహిళా ఇన్వెస్టర్ల శాతం

రాష్ట్రం	2022	2025	వృద్ధి %
హిమాచల్‌ప్రదేశ్	16.3	20	3.7
ఆంధ్రప్రదేశ్	19.5	22.7	3.2
ఛత్తీస్‌ఘడ్	18.8	21.9	3.1
మధ్యప్రదేశ్	18.2	21.3	3.1
పంజాబ్	22.9	25.9	3
ఒడిశా	16.6	19.4	2.8
తమిళనాడు	24.8	27.5	2.7
తెలంగాణ	21.6	24.3	2.7
కర్ణాటక	24.3	26.9	2.6

డీమ్యాట్ ఖాతాల పెరుగుదల

సంవత్సరం	ఖాతాల సంఖ్య (కోట్లలో)
2019-20	4.01
2020-21	5.43
2021-22	8.88
2022-23	11.34
2023-24	15.02
2024-25	17.76

సాక్షి, అమరావతి: స్టాక్ మార్కెట్లో బుల్ స్వారీ చేయడానికి మహిళా ఇన్వెస్టర్లు విపరీతమైన ఆసక్తి చూపిస్తున్నారు. కరోనా లాక్ డౌన్ తర్వాత స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసే మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఆర్థిక సంవత్సరం 2022 తర్వాత ప్రారంభమవుతున్న ప్రతి నాలుగు డీమ్యాట్ అకౌంట్లలో ఒకటి మహిళా ఖాతాగా ఉన్నట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. 2021 నుంచి సగటున ఏటా మూడు కోట్ల ఖాతాలు ప్రారంభమవ్వగా, ఈ ఏడాది ఇప్పటికే నాలుగు కోట్లకు పైగా డీమ్యాట్ ఖాతాలు ప్రారంభం కావడం గమనార్హం. 2014లో దేశం మొత్తం మీద 2.2 కోట్ల ఖాతాలు ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 17 కోట్లు దాటింది. ముఖ్యంగా కోవిడ్ తర్వాత స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసే వారి సంఖ్య క్రమేపి పెరుగుతూ వస్తోంది. 2014 ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూల ద్వారా రూ.12,068 కోట్ల నిధులు సేకరిస్తే, 2024లో రూ.1.60 లక్షల కోట్లు స్టాక్ మార్కెట్ ద్వారా సేకరించడం గమనార్హం. ఇదే సమయంలో సిప్ విధానం ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌లో ఏటా రూ.రెండు లక్షల కోట్లకుపైగా ఇన్వెస్ట్‌మెంట్స్ చేస్తున్నారు.

కొత్త ఇన్వెస్టర్లలో హైదరాబాదీలు అధికం

మహిళా ఇన్వెస్టర్ల విషయంలో పెద్ద రాష్ట్రాల్లో ఢిల్లీ 29.8%, మహారాష్ట్ర 27.7%, తమిళనాడు 27.5%తో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. చిన్న రాష్ట్రాలు కూడా కలుపుకుంటే గోవా 32%తో మొదటి స్థానంలో ఉంది. మహిళా ఇన్వెస్టర్ల సంఖ్య తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా ఉన్నాయి. 2022లో ఏపీలో మొత్తం ఇన్వెస్టర్లలో మహిళా ఇన్వెస్టర్ల సంఖ్య 19.5% ఉండగా, అది ఇప్పుడు 22.7 శాతానికి పెరిగింది. మహిళా ఇన్వెస్టర్లు వేగంగా పెరుగుతున్న రాష్ట్రాల్లో ఏపీ రెండవ స్థానంలో నిలిచింది. హిమాచల్ ప్రదేశ్ 3.7% వృద్ధితో మొదటి స్థానంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్ 3.2% వృద్ధితో రెండవ స్థానంలో నిలిచింది. కోవిడ్ తర్వాత నుంచి స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టే 30 ఏళ్లలోపు వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. 2018లో మొత్తం ఇన్వెస్టర్లలో 22.9 శాతంగా ఉన్న 30 ఏళ్లలోపు ఇన్వెస్టర్ల సంఖ్య ఇప్పుడు 40 శాతానికి చేరుకుంది. కొత్తగా ఇన్వెస్ట్ చేస్తున్న వారిలో అత్యధికంగా హైదరాబాద్, బెంగళూరు, కాన్పూర్ వంటి పట్టణ ఇన్వెస్టర్లు ఉంటున్నట్లు ఎస్‌బీఐ నివేదిక వెల్లడించింది.

భోజనం ఎలా ఉందమ్మా?

- కొత్త మెనూ అమలు అవుతోందా?
- విద్యార్థులను ఆరా తీసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- బీబీనగర్ బీసీ బాలికల గురుకులం, ఎస్సీ బాలికల హాస్టల్ తనిఖీ



బీబీనగర్‌లోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బీబీనగర్: 'భోజనం ఎలా ఉందమ్మా? కొత్త మెనూ ప్రకారం అన్నీ పెడుతున్నారా? సదుపాయాలు బాగున్నాయా?..' అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యార్థులను ఆరా తీశారు. వారితో కలిసి భోజనం చేశారు. ఆదివారం ఆయన వరంగల్ వెళుతూ మధ్యలో యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని బీసీ బాలికల గురుకులం, ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. తొలుత బీసీ బాలికల గురుకుల పాఠశాలకు వెళ్లారు. కొత్త మెనూ అమలు, వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ అడిగారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అరగంటకు పైగా అక్కడ గడిపారు. అనంతరం అదే ఆవరణలో ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించి తనిఖీలు చేశారు. భోజనం, కిచెన్, డైనింగ్ హాల్, కూరగాయలు, కిరాణా సరుకులు, బియ్యం తదితర వంట సామాన్లను పరిశీలించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారా అని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. హెల్త్‌చెకప్ కార్డులు మెయింటెయిన్ చేయడం లేదని, రిజిస్టర్లలో నమోదు చేస్తున్నారని ఆయన చెప్పడంతో, హెల్త్ చెకప్ కార్డులు తప్పనిసరిగా మెయింటెయిన్ చేయాలని వైద్యారోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఎస్సీ బాలికల హాస్టల్‌లో డిప్యూటీ సీఎం గంటన్నర పాటు ఉన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.

ఆర్థిక భారం ఉన్నా డైట్ చార్జీలు పెంచాం

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం కోసం డైట్ చార్జీలను 40 శాతం పెంచినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. పెంచిన చార్జీలు, మెనూ ప్రకారం హాస్టళ్లలో అన్నీ సక్రమంగా అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు మంత్రులతో పాటు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్లు గంధాధర్, వీరారెడ్డి ఆయన వెంట ఉన్నారు.

వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా: భట్టి



గీసుకొండ మండలంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరైన జనం

గీసుకొండ: భూమిలేని వ్యవసాయ కూలీలందరికీ 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం ద్వారా ఆర్థిక చేయూత అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి హామీ ఇచ్చారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మొగిలిచర్లలో కీర్తినగర్, మొగిలిచర్ల, విశ్వనాథపురం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ల పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ సర్కారు రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తామని మాయమాటలు చెప్పి అప్పుల కుప్పగా మార్చి ప్రజల జీవితాలను ఆగం చేసిందని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు చేసిన నిర్వాకానికి ప్రతి నెలా రూ.6,500 కోట్ల మేరకు అసలు, వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో కరెంటు సమస్య లేకుండా చేస్తామని అన్నారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మురళీనాయక్, రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కులను కాలరాస్తున్న మోదీ

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- ఆదివాసీ, గిరిజనుల చైతన్యమే కాంగ్రెస్ లక్ష్యం: దీపాదాస్ మున్షీ



దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, దీపాదాస్ మున్షీ తదితరులు

నాగార్జునసాగర్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. ఆదివారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ్‌విహార్ అతిథిగృహంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ శిక్షణ తరగతులను ఆయన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ గిరిజనులు కాంగ్రెస్ పార్టీ ఆస్తి అని, కాంగ్రెస్ పార్టీ గిరిజనులు, ఆదివాసీల కోసం అనేక చట్టాలను తెచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో గిరిజనులు, ఆదివాసీల పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. పెసా చట్టం అమలుపై అవగాహన కల్పించడానికి ప్రతి గ్రామంలో కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సహజ వనరులపై గిరిజనుల హక్కుల కోసం రాహుల్‌గాంధీ యాత్ర చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడంకోసం కాంగ్రెస్ కార్యకర్తలు సైనికులుగా పని చేయాలని పిలుపునిచ్చారు. దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ దేశంలో గిరిజనులు, ఆదివాసీల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాహుల్‌గాంధీ ఆశయాలను ఆచరణలో పెట్టడం కోసం ఆదివాసీ, గిరిజనులను చైతన్యం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఏఐసీసీ ఆదివాసి కాంగ్రెస్ కమిటీ చైర్మన్ కొప్పుల రాజు మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలు, జిల్లాలు, మండల స్థాయిలో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్యేలు బాలు నాయక్, జైవీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్ పాల్గొన్నారు.

రూ.12 వేల రైతు భరోసా భేష్

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఎకరాకు ఇచ్చే మొత్తాన్ని రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతో పాటు మంత్రులందరికీ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఆదివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ ఆర్థిక విధ్వంసం తర్వాత.. తీవ్ర స్థాయిలో ఆర్థిక సమస్యలున్నప్పటికీ.. అన్నదాతకు అండగా ఉండాలన్న ప్రభుత్వ సంకల్పం కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిన మంచి పనులను చూసి ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్‌లు ఓర్వలేకపోతున్నాయని ఎద్దేవా చేశారు. రూ.12వేల రైతు భరోసా ప్రకటించినందుకు రైతులు, కాంగ్రెస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు నిర్వహించాలని ఆ ప్రకటనలో మహేశ్‌కుమార్‌గౌడ్ కోరారు.

డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

- 'నల్లగొండ దృష్టి' పేరుతో 65వ జాతీయ రహదారిపై కార్యక్రమం
- వట్టిమర్తి వద్ద ఆదివారం ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి
- వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు.. వెంటనే అద్దాలు అందజేత
- ఈ కార్యక్రమాన్ని రాష్ట్రమంతా నిర్వహిస్తాం: మంత్రి వెంకట్‌రెడ్డి



వట్టిమర్తిలో డ్రైవర్లకు కంటి పరీక్షల శిబిరం ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

చిట్యాల: రోడ్డు ప్రమాదాలకు గల కారణాల్లో డ్రైవర్లకు దృష్టిలోపం ఉండటం కూడా ఒకటి. చాలామంది డ్రైవర్లకు అవగాహన లేక కంటి పరీక్షలు చేయించుకోరు. దాంతో వారికి దృష్టిలోపం ఉన్న విషయం వారికే తెలియదు. ఈ విషయాన్ని గుర్తించిన రోడ్డు రవాణా, పోలీస్ శాఖల అధికారులు.. వైద్యారోగ్య సహకారంతో డ్రైవర్లకు రహదారుల వెంట ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి వెంటనే కళ్లద్దాలు అందిస్తున్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సడక్ సురక్ష అభియాన్ కార్యక్రమంలో రాష్ట్రంలో మొదటిసారి నల్లగొండ జిల్లాలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై 'నల్లగొండ దృష్టి' పేరుతో ఈ కార్యక్రమం చేపట్టారు. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ పరిధిలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ దాబా వద్ద ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు.

వెంటనే అద్దాలు..

కంటి పరీక్షల శిబిరంలో పరీక్ష చార్ట్‌ను ఆహార పదార్థాల మెనూ కార్డు మాదిరిగా ఏర్పాటు చేశారు. రోటి, పరోటా, తందూరి, దాల్ వంటి పేర్లను హిందీలో రాశారు. ఆదివారం వివిధ రాష్ట్రాలకు చెందిన 82 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 32 మందికి కంటి అద్దాలు అందజేశారు. వీరిలో చాలామంది మొదటిసారి కంటి పరీక్షలు చేయించుకోవటం విశేషం. రాష్ట్రంలోని అన్ని జాతీయ రహదారుల వెంట ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మంత్రి వెంకట్‌రెడ్డి తెలిపారు. కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా అవసరమైన సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ గురువు కేసీఆరే

రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఫైర్



సాక్షి, హైదరాబాద్: ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి గురువుగా మాజీ సీఎం కేసీఆర్‌ను ఊహించుకోవచ్చని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ ప్రభుత్వం కేసీఆర్ బాటలోనే నడుస్తోందన్నారు. ఒక్కో రైతుకు ఏడాది బకాయితో కలిపి ఎకరాకు రూ.18 వేల బకాయి చెల్లిస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు రూ.12,600 కోట్లు జనవరి 26న చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా సొమ్ము చెల్లించేందుకు టీఎస్ఐఐసీ భూములను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు తెచ్చారని, మరి వచ్చేదఫా రైతు భరోసా సొమ్ము కోసం మీ దగ్గర తాకట్టు పెట్టడానికి ఇంకేం మిగిలి ఉందని ప్రభుత్వాన్ని నిలదీశారు. స్థానిక ఎన్నికలు ముగియగానే రైతు భరోసా బంద్ పెట్టడం ఖాయమని చెప్పారు. ఫామ్‌హౌస్‌లో పడుకునే కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత పదవి ఎందుకని, చేతనైతే ఆ పదవిని హరీశ్‌రావుకో లేకుంటే గంగుల, తలసాని, జగదీశ్‌రెడ్డిలలో ఒకరికి ఇచ్చే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీకి అంతు లేకుండా పోయిందన్నారు. హైదరాబాద్‌లో రెయిన్‌బో ఆస్పత్రి ఆగడాలు శ్రుతి మించిపోయాయని, చేతగాని కాంగ్రెస్ సర్కార్ వల్లే ఆస్పత్రులు అడ్డగోలు దోపిడీ చేస్తున్నాయని చెప్పారు. రాబోయే ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు.

నేడు ఏసీబీ ముందుకు కేటీఆర్!

- 'ఫార్ములా–ఈ రేసు' కేసు విచారణకు హాజరుకానున్న మాజీ మంత్రి
- కేటీఆర్ ఆదేశంతో నిబంధనలకు విరుద్ధంగా ఓ విదేశీ సంస్థకు రూ.54.88 కోట్లు చెల్లించినట్లు ఆరోపణలు
- దీనిపై సీనియర్ ఐఏఎస్ దాన కిశోర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏసీబీ



సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ రేసుకు సంబంధించిన కేసు దర్యాప్తులో భాగంగా ఏసీబీ అధికారులు మున్సిపల్ శాఖ మాజీ మంత్రి కె. తారక రామారావును విచారించేందుకు సిద్ధమయ్యారు. సోమవారం ఉదయం 10:30 గంటలకు తమ ముందు విచారణకు హాజరుకావాలని కేటీఆర్‌కు ఈ నెల 3న ఏసీబీ అధికారులు సమన్లు జారీ చేయడం తెలిసిందే. ఈ మేరకు కేటీఆర్ ఏసీబీ ఎదుట విచారణకు హాజరుకానున్నారు. హైదరాబాద్‌లో ఫార్ములా–ఈ రేసు నిర్వహించిన యూకే సంస్థ ఫార్ములా–ఈ ఆపరేషన్స్ లిమిటెడ్ (ఎఫ్ఈఓ)కు నిబంధనలకు విరుద్ధంగా, కేబినెట్ ఆమోదం లేకుండానే కేటీఆర్ ఆదేశాలతో అధికారులు పలు దఫాల్లో రూ. 54.88 కోట్లు చెల్లించారనేది ప్రధాన ఆరోపణ. దీనిపై పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ ఫిర్యాదుతో ఏసీబీ గతేడాది డిసెంబర్ 19న ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ–1గా, ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్‌ను ఏ–2గా, హెచ్ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డిని ఏ–3గా చేర్చింది. ఇప్పటికే సేకరించిన పత్రాల ఆధారంగా కేటీఆర్‌ను ప్రశ్నించనుంది. మరోవైపు ఏసీబీ కేసు ఆధారంగా ఇప్పటికే ఈసీఐఆర్ నమోదు చేసిన ఈడీ.. ఈ నెల 7న విచారణకు రావాలంటూ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. అయితే ఈడీ కేసులో ఏ–1గా ఉన్న బీఎల్ఎన్ రెడ్డి, అర్వింద్‌కుమార్ విచారణకు హాజరయ్యేందుకు మరికొంత సమయం కావాలని కోరగా అంగీకరించిన ఈడీ వారిద్దరికీ మళ్లీ సమన్లు జారీ చేసింది. ఈ నెల 8న బీఎల్ఎన్ రెడ్డిని, 9న అర్వింద్‌కుమార్‌ను హాజరుకావాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఈడీ ఎదుట విచారణకు హాజరుకావాల్సిన కేటీఆర్ సైతం వారి బాటలోనే మరికొంత సమయం అడుగుతారా లేదా అనేది వేచిచూడాల్సి ఉంది.

మీరెక్కడ.. మేమెక్కడ..?

కేటీఆర్ ట్వీట్‌కు ఎంపీ చామల రీట్వీట్



సాక్షి, హైదరాబాద్: రైతుల విషయంలో బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు పోలికా? అని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. రైతు భరోసాపై సీఎం రేవంత్ చేసిన ప్రకటనను విమర్శిస్తూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్‌కు ఆయన ఘాటుగా రీట్వీట్ చేశారు. 'వరి వేస్తే ఉరే అన్న మీరెక్కడ.. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి రికార్డు సృష్టించిన మేమెక్కడ? రైతులకు రూ.లక్ష రుణమాఫీ అని చెప్పి ఐదేళ్లు వంచించిన మీరెక్కడ..? మాటిచ్చిన ఏడాదిలోపే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసిన మేమెక్కడ? పెట్టుబడి సాయం పేరుతో రాళ్లు, రప్పలకు రూ.22 వేల కోట్లు మింగిన మీరెక్కడ.. పండించే ప్రతి భూమికి రూ.12 వేల రైతు భరోసా, రూ.500 బోనస్, పంటబీమా, పరిహారం, సబ్సిడీ విత్తనాలు ఇస్తున్న మేమెక్కడ? భూమి లేకపోతే రైతుకూలీ బజారున పడాల్సిందే అన్న మీరెక్కడ.. గుంట భూమి లేకపోయినా రూ.12 వేలు ఇస్తున్న మేమెక్కడ? ధరణి దోపిడీతో లక్షల ఎకరాల రైతుల భూములను గుంజుకున్న మీరెక్కడ..? భూభారతి చట్టంతో రైతుల కష్టాలు తీరుస్తున్న మేమెక్కడ?' అని ఎంపీ చామల కిరణ్ ఆ ట్వీట్‌లో ఎద్దేవా చేశారు.

రైతు భరోసా.. కుదింపు వంచనే

▶ మొదటి పేజీ తరువాయి

ముష్టి వేస్తున్నావా? తెలంగాణ ప్రజలకు కష్టమొస్తే వెంటనే వస్తానని రాహుల్ గాంధీ అన్నారు. రేవంత్‌రెడ్డి చేసిన మోసంతో తెలంగాణ ప్రజలు కష్టాల్లో ఉన్నారు. మరి రాహుల్ గాంధీ ఎక్కడ? ఇచ్చిన మాట తప్పడమే ఇందిరమ్మ రాజ్యమా? రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి. రేవంత్ రైతాంగానికి తీరని ద్రోహం చేసినందుకు తెలంగాణ ప్రజాక్షేత్రంలో ముక్కు నేలకు రాయాలి. నమ్మించి నయవంచన చేసినందుకు రాహుల్ గాంధీ 70 లక్షల మంది రైతులకు క్షమాపణలు చెప్పాలి. మేనిఫెస్టోలో రైతులకిచ్చిన ప్రధాన హామీని నిలబెట్టుకోనందుకు ముఖ్యమంత్రి ముందుగా రాష్ట్ర రైతాంగం ముందు లెంపలేసుకోవాలి. కాంగ్రెస్ నాయకులు రైతుభరోసాపై మాట మార్చినందుకు ప్రజాక్షేత్రంలో ముక్కు నేలకు రాయాలి. కేసీఆర్ రైతుబంధుగా నిలిస్తే రేవంత్ రాబందుగా మిగులుతారు. హార్టికల్చర్ రైతులకు రైతు భరోసా ఇస్తారా ఇవ్వరా? ఉద్యోగులకు భూమితో సంబంధం లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గండం దాటేందుకు రైతు భరోసాపై ప్రకటన చేశారు. ఎన్నికల తరువాత ఎత్తేసే కుట్ర జరుగుతుంది. రైతుబంధు పథకం ఉండాలా వద్దా అనేది రైతులు నిర్ణయం తీసుకోవాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు.

రెవెన్యూ మిగులుతో రాష్ట్రాన్ని అప్పగిస్తే..

'రాష్ట్రం దివాలా తీసిందని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారు. దివాలా తీసింది తెలంగాణ రాష్ట్రం కాదు.. దివాలా తీసింది రేవంత్‌రెడ్డి మెదడు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని నాశనం చేసింది ఆయనే. రాష్ట్రానికి ఆర్థిక ఇంజన్‌గా ఉన్న హైదరాబాద్‌లో హైడ్రా, మూసీ పరిధిలో కూల్చివేతల వల్ల రియల్ ఎస్టేట్ పడిపోయింది. సంవత్సరంలో రూ. లక్షా 38 వేల కోట్ల అప్పు చేశారు. 2014లో రెవెన్యూ మిగులు రూ.369 కోట్లతో మాకు ప్రభుత్వాన్ని అప్పగిస్తే 2023లో రూ.5,943 కోట్ల రెవెన్యూ మిగులుతో మేం రాష్ట్రాన్ని అప్పగించాం. అప్పుల పేరుతో రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అన్యాయం చేస్తున్నారు' అని కేటీఆర్ విమర్శించారు. ఉమ్మడి ఏపీలోనే ఉద్యోగుల పరిస్థితులు బాగుండేవంటూ రేవంత్‌రెడ్డి తెలంగాణను కించపరిచారని కేటీఆర్ ఆరోపించారు. దేశంలో బీఆర్ఎస్ పాలనలో అత్యధిక జీతాలు ఇచ్చిన తెలంగాణ రాష్ట్రం గురించి రేవంత్ అవమానకరంగా మాట్లాడారని దుయ్యబట్టారు.



రోజూ ఏదో ఒక భయాన్ని జయించనివాడు జీవిత రహస్యాన్ని నేర్చుకోలేడు.

– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి

సోమవారం, 6 జనవరి 2025

జీవితపు తాళంచెవి

''ఉదయం నాలుగు కాళ్లతో, మధ్యాహ్నం రెండు కాళ్లతో, సాయంత్రం మూడు కాళ్లతో నడిచేది ఏమిటి?'' క్రీస్తు పూర్వ కాలపు గ్రీకు విషాదాంత నాటక రచయిత సోఫోక్లిస్ రాసిన 'ఈడిపస్ రెక్స్' నాటకంలో 'స్ఫింక్స్' అడిగే ఈ చిక్కుప్రశ్న పాశ్చాత్య సాహిత్యంలో శ్రేష్ఠమైనది. థీబ్స్ నగరంలోకి ప్రవేశించాలంటే– మనిషి ముఖం, సింహం శరీరం, గద్ద రెక్కలుండే స్ఫింక్స్ ప్రశ్నలకు సమాధానం చెప్పి తీరాలి. లేదంటే మరణం తప్పదు. చివరకు రాజు ఈడిపస్ వాటికి జవాబు చెప్పి, ఆ విచిత్ర జీవి పీడను వదిలిస్తాడు. పాకే బాలుడిగా నాలుగు కాళ్లతో, నిటారుగా నిలబడే యువకుడిగా రెండు కాళ్లతో, వృద్ధుడిగా కర్ర ఊతంగా మూడు కాళ్లతో నడిచే 'మనిషి' దీనికి సమాధానం. ఇందులోదే మరో ప్రశ్న. ఇద్దరు అక్కాచెల్లెళ్లు. అక్క చెల్లికి జన్మనిస్తే, తిరిగి చెల్లి అక్కకు జన్మనిస్తుంది. ఏమిటి ఇందులోని మర్మం? ఆ అక్కాచెల్లెళ్లు రాత్రీ పగలూ అని తెలిస్తే, ఆ రోజు ఎంత బాగుంటుంది!

ఇలాంటి చిక్కు ప్రశ్నలు సాహిత్యంలో లెక్కకు మిక్కిలిగా కనబడతాయి. కూట ప్రశ్న, పొడుపు కథ, ప్రహేళికగా అర్థం ఉన్న 'రిడిల్స్' ఆబాలగోపాలాన్నీ అలరిస్తాయి. 'పొడుపు కథల' రూపంలో చెప్పినప్పుడు పిల్లలు వాటికోసం చెవులు అప్పగిస్తారు; పెద్దలకు జ్ఞానచక్షువులు తెరుచుకుంటాయి. ఏ స్థాయిలో వారికి ఆ స్థాయి కఠినత్వం, విస్తృతి వీటిల్లో కలగలిసి ఉంటాయి. అందుకే ఇవి సాహిత్యంలో ఒక మనోహరమైన అంశంగా ప్రత్యేకంగా కనబడతాయి. జీవితంలోని సంక్లిష్టతలను తేలిగ్గా విడమరిచి చెప్పడానికి పనికొస్తాయి.

నాలుగు వేల ఏళ్ల క్రితం నుంచే జనం తమ మేధాశక్తిని, విశ్లేషణా సామర్థ్యాలను చిక్కుప్రశ్నలతో సాన పట్టుకున్నారు. ప్రపంచానికి తెలిసిన తొట్టతొలి చిక్కుప్రశ్నల్లో ఒకటి ఒకప్పటి సుమేరియన్ (ఇప్పటి ఇరాక్ ప్రాంతం) నాగరికతా సాహిత్యంలో కనిపిస్తుంది. 'అక్కడొక ఇల్లుంది. అందులోకి ఒకరు గుడ్డివాడిగా ప్రవేశించి, చూపుతో బయటికి వస్తారు. ఏమిటది?' ప్రపంచానికి రాత రూప పలకలను పరిచయం చేసిన సుమేరియన్ నాగరికత మనిషి విజ్ఞానానికి అమితమైన ప్రాధాన్యతను ఇచ్చింది. అందుకే పై ప్రశ్నకు 'బడి' సమాధానం కావడంలో ఆశ్చర్యం లేదు. అజ్ఞానం అనేది అంధత్వమే కదా! చదువుతో వచ్చే జ్ఞానం మనిషికి ఒక కొత్త చూపునిస్తుంది కదా!

''పట్టువదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు తిరిగి వెళ్లి, చెట్టు పైనుంచి శవాన్ని దించి భుజాన వేసుకుని, ఎప్పటిలాగే మౌనంగా శ్మశానంకేసి నడవసాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు, 'రాజా, శ్రమ తెలియకుండా ఉండటానికి'' అంటూ ప్రారంభించి ఒక కథ చెప్పడమూ, ఆ కథ చివర పలు ప్రశ్నలు సంధించడమూ, ఆ కథలోని ప్రశ్నలకు 'సమాధానం తెలిసి కూడా చెప్పలేకపోయావో నీ తల వేయి ముక్కలుగా పగిలిపోతుంది' అని షరతు విధించడమూ, విక్రమార్కుడు జవాబు చెప్పి 'మౌనభంగం కాగానే, బేతాళుడు శవంతో సహా మాయమై, తిరిగి చెట్టెక్క'డమూ తెలుగు బాల కథా సాహిత్యంలో ఒక అరుదైన ధారావాహిక వేడుక. మూలంలోని భట్టి విక్రమార్క కథల్లో బేతాళుడు అడిగిన 23 ప్రహేళిక ప్రశ్నల నమూనాలోనే 'చందమామ' పత్రిక ఎన్నో ప్రశ్నలను సంధించింది. అయితే, అసలు మూలంలో విక్రమార్కుడంతటివాడు కూడా జవాబు ఇవ్వలేని ప్రశ్న ఏమిటి? ఇరువురికీ భార్యలు లేని ఓ తండ్రి కొడుకులు తోవలో పాదముద్రలను చూసి, పెద్ద పాదాలావిడను తండ్రీ, చిన్న పాదాలావిడను కొడుకూ పెళ్లాడాలనుకుంటారు. తీరా పెద్ద పాదాలావిడ కూతురుగానూ, చిన్న పాదాలావిడ తల్లిగానూ తేలుతుంది. అయినా ఇచ్చుకున్న మాట ప్రకారమే వాళ్లు పెళ్లి చేసుకుంటారు. అప్పుడు ఆ ఇద్దరికీ చెరొక కొడుకు పుడితే, వాళ్లు వరుసకు ఏమవుతారు? బేతాళుడు అడిగిన ఈ ప్రశ్నకు సమాధానం లేక, విక్రమార్కుడు సహేతుక మౌనం వహించడంతో బేతాళుడు ఆయన వశమవుతాడు. కాలగమనంలో సడలనున్న నైతిక నియమావళికి ఈ ప్రశ్నొక ముందు చూపు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'వడ్లగింజలు' కథలోని ఇతివృత్తం ఒక ప్రశ్న కాకపోయినా చిక్కుతో ముడిపడినదే. ''చదరంగానికి అరవై నాలుగు గదులు. మొదటి గదిలో వొక వడ్లగింజ వుంపించండి. తరవాత రెండో గదిలో రెండు, మూడో గదిలో నాలుగు, నాలుగో గదిలో యెనిమిది– యిలాగా వెళ్లినకొద్దీ రెట్టింపు చేయిస్తూ నాకు వడ్లగింజలు దయచేయించండి మహాప్రభూ'' అంటూ తాను చదరంగంలో గెలిస్తే ఏమివ్వాలో తన ప్రత్యర్థి అయిన 'శ్రీ వత్సవాయి చతుర్భుజ తిమ్మజగపతి మహారాజులు' గారికి తంగిరాల శంకరప్ప సవినయంగా విన్నవించుకుంటాడు. తీరా ఆటలో మహారాజును కట్టడి చేశాక, ''మహాప్రభూ! వారి కోరిక తీర్చాలంటే పెద్దాపురం రాజ్యంలోనే కాదు, త్రిలింగ దేశం అంతటా వరాసగా నూరు సంవత్సరాలు పండిన ధాన్యం అయినా చాలదు'' అని తేలినప్పుడు అందరూ నోరెళ్లబెట్టవలసి వస్తుంది.

సాహిత్యంలో ఇలాంటి చిక్కుప్రశ్నలు మాటల ఎత్తుగడలను, భాషాపటిమను చాటుతాయి. పాత్ర లక్షణాలను బహిర్గతం చేయడానికీ, వాటి తెలివితేటలను తెలియజెప్పడానికీ, కథను ముందుకు నడపడానికీ కూడా రచయితలు వాటిని ఉపయోగించుకున్నారు. ఈ చిక్కుప్రశ్నలు తరచుగా జ్ఞానం, అవగాహన కోసం మానవుడు చేసే అన్వేషణను సూచిస్తాయి. జీవితం అనేది ఒక తాళం అయితే, దాన్ని తెరిచే తాళంచెవి ఒక కూటప్రశ్న. అదే సమయంలో అది ఒక మనోవ్యాయామం, ఒక భాషావినోదం, ఒక తాత్విక పరిమళం, ఒక జీవిత రహస్యం కూడా!

ద్వంద్వ పౌరసత్వం ఇవ్వకూడదా?

కామెంట్



కరణ్ థాపర్

భారతీయ పౌరులకు ఒకటే పౌరసత్వం ఎందుకు ఉండాలి? పౌరసత్వం అనేది పుట్టుకతో మాత్రమే సంక్రమించే ప్రత్యేక హక్కు కాదు. అది పౌరుడి సొంత గుర్తింపును వెల్లడించడంతో పాటు బహుళజాతి పూర్వీకుల వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఇండియా ప్రయోజనాలకు విఘాతం కలిగించే శత్రుదేశాల పౌరులను ఇండియా పౌరులుగా ఎలా గుర్తిస్తామన్నది ఒక వాదన. ఇది చాలా చిన్న సమస్య. ఈ సాకుతో మొత్తంగా ద్వంద్వ పౌరసత్వం మీద వేటు వేయడం సరికాదు. ఒక వ్యక్తి బ్రిటిష్ లేదా అమెరికా పౌరుడు కూడా అయినంత మాత్రాన అతడి భారతీయత ఎలా తగ్గిపోతుంది? నూతన సంవత్సరంలోనైనా ఈ సంకుచిత వైఖరి మీద పునరాలోచన చేయాలి.

2025 వచ్చేసింది. కొత్త సంవత్సరం అనగానే విధిగా కొన్ని తీర్మానాలు చేసుకుంటాం. నేను ఇది మానేస్తాను, అలా ఉంటాను అంటూ ప్రతిజ్ఞలు చేస్తాం. వాటితో పాటు... ఒక విష్ లిస్ట్ కూడా పెట్టుకుంటాం. నాకు అది కావాలి, ఇలా జరగాలి అని కోరుకుంటాం. నేనూ ఈ విషయంలో తక్కువేం కాదు. చాలా తీర్మానాలు తయారు చేసుకుంటా! కొద్ది రోజుల తర్వాత షరా మామూలు. ఒట్లన్నీ గట్టున పెట్టేస్తానేమో! అందుకే నా విష్ లిస్ట్ గురించి మాట్లాడుకుందాం.

నాది చాలా సింపుల్ కోరికే. కానీ అది నెరవేరితే లబ్ధి పొందేది నేనొక్కడినే కాదు, కొన్ని లక్షల మంది ఉంటారు! భారతీయ పౌరులకు ఒకటే పౌరసత్వం ఎందుకు ఉండాలి? మరో దేశపు జాతీయత కూడా పొందే అవకాశం ఎందుకు కల్పించకూడదు? ప్రభుత్వం ఈ డ్యూయల్ నేషనాలిటీ హక్కును మన్నించాలి. తల్లిదండ్రుల మాతృదేశం పరంగా కావచ్చు, నివాసం రీత్యా అవ్వచ్చు... ఒక వ్యక్తి ఇలాంటి హక్కు పొందగలిగినప్పుడు దాన్నెందుకు నిరాకరించాలి?

పౌరసత్వం అనేది పుట్టుకతో మాత్రమే సంక్రమించే ప్రత్యేక హక్కు కాదు. అది పౌరుడి సొంత గుర్తింపును వెల్లడించడంతో పాటు బహుళజాతి పూర్వీకుల వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఇందుకు ఒక ఉదాహరణ చెప్పుకుందాం. తల్లిదండ్రులు బ్రిటిష్, ఇండియా దేశాల వారు అనుకోండి. వారి పిల్లలకు ఏకకాలంలో అటు బ్రిటిషర్లు, ఇటు ఇండియన్లు అయ్యే హక్కు ఉంటుంది. అలా కాకుండా, ఇండియా పౌరసత్వం కావాలంటే బ్రిటిష్ పౌరసత్వం వదులుకోవాలని పట్టుపట్టడం న్యాయం కాదు. అదేమాదిరిగా విదేశాల్లో నివాసం ఉండేవారికి... స్వదేశంలో హక్కు కోల్పోకుండా నివాస దేశంలో పౌరసత్వం తీసుకునే హక్కు ఉంటుంది. ఇప్పుడు భారతీయ చట్టాల ప్రకారం, ఈ రెండూ నిషిద్ధం.

ఉన్నత ప్రజాస్వామ్య దేశాలుగా మన్నన పొందిన చోట్ల ఈ ద్వంద్వ పౌరసత్వ హక్కు లేదు కదా అంటారు. నిజమే. ఆస్ట్రియా, జపాన్, నెదర్లాండ్స్, నార్వేలు ఈ కోవలోకి వస్తాయి. ద్వంద్వ పౌరసత్వ నిరాకరణను వారు అప్రజాస్వామిక విధానంగా పరిగణించరు. కాకపోతే అనుమతించే దేశాల గురించి చెబుతాను. ఆస్ట్రేలియా, బెల్జియం, కెనడా, డెన్మార్క్ , ఫ్రాన్స్, ఐర్లాండ్, స్వీడన్, యుకే, యూఎస్ఏ వంటి దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఇవన్నీ అత్యంత గౌరవప్రదమైన ప్రజాస్వామ్య దేశాలే! ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యంగా గొప్పలు చెప్పుకునే ఇండియా వీటి సరసన చేరాలని ఎందుకు అనుకోదు?



2025 న్యూ ఇయర్ విష్

వాస్తవానికి, మన పొరుగున ఉన్న అనేక దేశాలు ద్వంద్వ జాతీయతను అనుమతిస్తున్నాయి. బంగ్లాదేశ్‌కు సమ్మతమే. శ్రీలంకదీ అదే బాట. ఆఖరుకు పాకిస్తాన్ కూడా అనుమతిస్తోంది. ఎటొచ్చీ చైనా, బర్మా, నేపాల్ససేమిరా అంటాయి. అయితే, ఈ దేశాలా మనకు ఆదర్శం?

ద్వంద్వ పౌరసత్వం అనుమతించక పోవడానికి అడ్డు పడే కారణాలు ఏంటో చూద్దాం. ఇండియా ప్రయోజనాలకు విఘాతం కలిగించే శత్రుదేశాల పౌరులను ఇండియా పౌరులుగా ఎలా గుర్తిస్తామన్నది వీటిలో ఒకటి. ఇది చాలా చిన్న సమస్య. ఈ సాకుతో మొత్తంగా ద్వంద్వ పౌరసత్వం మీద వేటు వేయడం సరికాదు. పాకిస్తాన్ పదహారు దేశాలను గుర్తించి వాటికి మాత్రమే ద్వంద్వ పౌరసత్వ విధానం అమలు చేస్తోంది. ఇండియా ఈ జాబితాలో లేదు. ఇలాంటి వ్యతిరేక దేశాల జాబితా రూపొందించుకోవాలి. వాటిని పక్కన పెట్టాలి.

ద్వంద్వ పౌరసత్వ నిషేధాన్ని సమర్థించుకునేందుకు చెప్పే మరో ప్రధాన కారణం ఏమిటంటే, అలా అనుమతిస్తే భారతీయ పౌరసత్వ ప్రాధాన్యం తగ్గిపోతుంది. ఇది అర్థం లేనిది. వేరేది తీసుకోగలిగిన వారు ఇండియా పౌరసత్వం అక్కర్లేదు అనుకుంటే, ఎప్పుడు కావాలంటే అప్పుడు వదిలేస్తారు. ఇతర దేశాల్లో పౌరసత్వం ఉండి కూడా భారత జాతీయతను కొనసాగించాలి అనుకునేవారూ ఉంటారు. వారికి ఈ ద్వంద్వ పౌరసత్వం ముఖ్యమైన అంశం అవుతుంది. ఒక వ్యక్తి బ్రిటిష్ లేదా అమెరికా పౌరుడు కూడా అయినంత మాత్రాన అతడి భారతీయత ఎలా తగ్గిపోతుంది? అలా అని చెప్పి ఈ హక్కు నిరాకరించడం ఎలా సబబు?

ఇలా కోరుకునేవారు అతి కొద్ది మందే ఉంటారు, కేవలం వారి కోసం ప్రత్యేక చట్టం ఉండాలా అన్నది కొందరి వాదన. ఎందుకు ఉండకూడదన్నది నా సమాధానం.

ప్రవాస భారతీయులను అన్ని ప్రభుత్వాలూ ఏదో విధంగా దగ్గర చేసుకునేందుకు ప్రయత్నించాయి. వారికి 'పర్సన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్', 'ఓవర్సీస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా' కార్డులు ఇచ్చాయి. వ్యవసాయ భూమిపై యాజమాన్య హక్కు, ఓటు హక్కు, ప్రభుత్వ పదవులు మినహా ఇతరత్రా అన్నిటికీ వారు అర్హులు. అలాంటప్పుడు, ద్వంద్వ పౌరసత్వంతో అదనంగా లభించేది ఏమిటి?

సింపుల్‌గా చెప్పాలంటే, విదేశీ ప్రయాణం అత్యంత సులభం అవుతుంది. ఉదాహరణకు, బ్రిటిష్ లేదా అమెరికా పౌరసత్వం ఉన్న పాకిస్తానీయులు యూరప్ అంతటా వీసాల్లేకుండా పర్యటించవచ్చు. ఇండియా పాస్‌పోర్ట్ దారుడికి ఈ సౌలభ్యం లేదు. భారత పౌరులు పర్యటన వీసాలు సంపాదించడానికి నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. చాలామందికి ఇది ప్రధానమైన అంశమే.

కాబట్టి, 2025 నూతన సంవత్సరంలోనైనా నరేంద్ర మోదీ గానీ రాహుల్ గాంధీ గానీ ఈ ద్వంద్వ పౌరసత్వం విషయంలో తమ పార్టీల సంకుచిత వైఖరి మీద పునరాలోచన చేయాలి. అవకాశం ఉన్న భారత పౌరులు రెండో పౌరసత్వం పొందేందుకు అంగీకరించాలి. ఎవరికీ ఎలాంటి నష్టం లేకుండా వారికి ప్రయోజనం చేకూర్చవచ్చు. ఇది న్యాయం. అర్థవంతం. ఇదే నా న్యూ ఇయర్ విష్!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

గుర్తుకొస్తోంది!



రామకృష్ణుడి జయంతి సందర్భంగా నెప్రూ 1949లో ప్రత్యేక ప్రసంగం చేశారు. పరమహంస, వివేకానందల నుంచి తాను నేర్చుకున్న విషయాల గురించి మాట్లాడారు. వాటిల్లోని ఒక అందమైన మాట: "హృదయంలో బలం లేనివాళ్లే తమ బలహీనతను దాచుకోటానికి బిగ్గరగా మాట్లాడతారు".

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఉన్నదెందుకు?



ఎవరైనా రోగులు ఆసుపత్రికి వచ్చినప్పుడు... మనం పీల్చే గాలి, తాగే నీరు అనేక వ్యాధులకు ప్రధాన కారణమని వైద్యులు చెప్పరు. కానీ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించటం ప్రభుత్వం బాధ్యత కనుక ప్రజల అనారోగ్యాలకూ ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుంది.

– వివేక్ రంజన్ అగ్నిహోత్రి, దర్శకుడు

సంతోషమే జీవితం



నా బ్యాచ్‌మేట్‌లలో ఇద్దరు 30 సంవత్సరాల వయసులో ఎంబీబీఎస్‌లో చేరారు. ఇద్దరికీ పెళ్లయింది. ఇద్దరికీ మెడిసిన్‌పై పిచ్చి ఉంది. ఇప్పుడు ఇద్దరూ 36 సంవత్సరాల వయసులో పీజీ చేస్తున్నారు. తమ నిర్ణయాలపై సంతోషంగా ఉన్నారు. జీవితం అన్నది ఇతరులకు నచ్చినట్లుఉండేందుకు కాదు. మనకు ఇష్టమైనట్లు ఉంచుకోవటానికి.

– డాక్టర్ ధ్రువ్ చౌహాన్, మెడ్–ఇన్‌ఫ్లుయెన్సర్

మాటలతో జాగ్రత్త



'కశ్యప్' అనే పేరు నుండి కశ్మీర్ అనే పేరు వచ్చి ఉంటుందని అమిత్ షా అన్నట్లు నేను విన్నాను. 'వచ్చి ఉంటుంది' అనటానికి, 'వచ్చి ఉండే అవకాశం ఉంది' అనటానికీ తేడా తెలియదా? తప్పుదారి పట్టించే మాటలు ప్రజల్లో గందరగోళం సృష్టించి, ఆగ్రహ జ్వాలలు రేపుతాయని బాధ్యత గల నేతలు గ్రహించాలి.

– సల్మాన్ నిజామీ, డీపీఏపీ ప్రతినిధి

పాజిటివ్ ఎనర్జీ



మనల్ని ప్రేమించే, మనకు మద్దతు ఇచ్చే వ్యక్తులకు ఎప్పుడూ దగ్గరగా ఉండటం ; మనల్ని ఇష్టపడని వ్యక్తులను పూర్తిగా విస్మరించటం మన మానసిక ఆరోగ్యానికి అద్భుతమైన ఔషధంలా పని చేస్తుంది.

– శీతల్ సక్పాల్, ఆర్టిస్ట్

బలమైన బలహీనత



ప్రేమ ఒక ఆక్సిమొరాన్ (వైరుధ్యాల మిశ్రమం). మిమ్మల్ని బలంగా మార్చుతుంది. అదే క్షణంలో బలహీనులుగానూ చేస్తుంది.

– సెజల్ సూద్, కంటెంట్ క్రియేటర్

ప్రశ్నించకుండా...



పేదలు భూమ్మీద ఏ హక్కూ పొందకుండా ఉండటానికి ఇచ్చే వాగ్దానమే స్వర్గం.

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

ఇన్ బాక్స్

'నో డిటెన్షన్' రద్దుపై మన వైఖరేమిటి?

ఇప్పటి వరకు అమలులో ఉన్న నో–డిటెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా 5, 8 తరగతుల విద్యార్థులకు డిటెన్షన్ విధానాన్ని తీసుకువచ్చింది. వాస్తవానికి విద్యా హక్కు చట్టం, 2009 సెక్షన్ 16 ప్రకారం ఒకసారి బడిలో ప్రవేశం పొందిన బాలలను ఎలిమెంటరీ విద్య పూర్తయ్యే వరకు బడి నుంచి తొలగించకూడదు. సెక్షన్ 30 ప్రకారం, ఎలిమెంటరీ విద్య పూర్తయ్యే వరకు పిల్లలు ఎలాంటి బోర్డు పరీక్షలూ రాయాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం నో–డిటెన్షన్ పాలసీని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం వల్ల 5, 8 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించవలసి వస్తుంది. వాటిల్లో వారు ఉత్తీర్ణులు కానట్లయితే తిరిగి రెండు నెలల్లో మళ్లీ పరీక్షలు నిర్వహించాలి. అప్పుడైనా ఉత్తీర్ణులు అయితేనే పై తరగతిలోకి వెళ్లగలుగుతారు.



కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలు, సైనిక పాఠశాలలతో కలిపి దేశవ్యాప్తంగా మూడు వేల విద్యా సంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ నో–డిటెన్షన్ రద్దు ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయి. ఇది తిరోగమన చర్య. దీనివల్ల ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమై ఆత్మ న్యూనతకు లోనయ్యే అవకాశాలు ఉన్నాయి. ఫలితంగా బాల కార్మికులు పెరిగే ప్రమాదం ఉంది. కేంద్ర ప్రభుత్వానికి నిజంగా పేద విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉంటే అభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. నేర్చుకోవడానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించాలి. బోధనను, అభ్యాసాన్ని మెరుగు పరిచేందుకు పర్యవేక్షణను ఏర్పాటు చేయాలి.


విద్య ఉమ్మడి జాబితాలో అంశం అయినందున గతంలో నూతన జాతీయ విద్యా విధానం అమలు విషయంలో రాష్ట్రాల నుంచి నిరసనలు వ్యక్తం అయి, కేంద్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకుంది. విద్య అనేది రాష్ట్రాల పరిధిలోని అంశం కూడా (ఉమ్మడి జాబితా) అయినందున గెజిట్ నోటిఫికేషన్‌పై రాష్ట్రాలు తగు నిర్ణయం తీసుకోవచ్చని ఆనాడు కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్య రాష్ట్ర జాబితాలోని అంశం కాబట్టి నో–డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసే విషయంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవచ్చు. అయితే ఇప్పటివరకు మన రాష్ట్రాల నుంచి ఈ విషయమై గట్టిగా ఎలాంటి స్పందనా లేదు. కనుక విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, విద్యావంతులు, మేధావులు దీనిపై అసెంబ్లీలలో చర్చించాలని ప్రభుత్వాలను కోరవలసిన అవసరం ఎంతైనా ఉంది. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పిల్లలను బడులకు ప్రోత్సహించటానికి, డ్రాప్ అవుట్స్‌ను గణనీయంగా తగ్గించటానికి 'నో డిటెన్షన్' విధానం అమలు అవుతున్న సమయంలోనే ఈ విధానాన్ని విద్యా హక్కు చట్టంలో పొందుపరచడానికి ఉమ్మడి రాష్ట్రం ఒక మోడల్‌గా నిలిచిందని మనం గుర్తు చేసుకోవాలి. అందువల్ల మన రెండు తెలుగు రాష్ట్రాలు పాత విధానాన్ని కొనసాగించేలా కేంద్రం మీద ఒత్తిడి తెచ్చి నో–డిటెన్షన్ అమలుకు కృషి చేయాలి.

– నామాల ఆజాద్

పీడీఎస్‌యూ తెలంగాణ ప్రధాన కార్యదర్శి

సృజనకు వివాహం ఆటంకమా?

అభిప్రాయం



డా॥ ఇండ్ల రామసుబ్బా రెడ్డి

భారత మాజీ రాష్ట్రపతి, ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలామ్ బ్రహ్మచారి అని మనందరికీ తెలుసు. ఆయనకు 'భారతరత్న' ప్రకటించిన సందర్భంగా వివిధ పత్రికలు కలామ్ తన శాస్త్ర పరిశోధనలకు ఎటువంటి ఆటంకం కలగకూడదనే బ్రహ్మచారిగా ఉండిపోయారని ప్రస్తావించాయి. మాజీ ప్రధాని వాజ్‌పేయి కూడా బ్రహ్మచారే! ప్రజాసేవకు సంసార జీవితం అడ్డు కాకూడదనే భావనతో ఆయన వివాహం చేసుకోలేదని అనేవారు. బ్రహ్మచారిగా మిగిలిపోయిన ప్రతి సెలబ్రిటీ గురించి ఇంచుమించు ఇలాంటి విషయమే చెబుతుంటారు. ఇందుకు తోడు 'వివాహం విద్య నాశాయ' అనే సూక్తి వింటూనే ఉంటాం.

కానీ శాస్త్రీయంగా చెప్పాలంటే పెళ్లి చేసుకోవడం వల్ల సృజనాత్మకత తగ్గిపోతుందని ఎక్కడా నిర్ధారణ కాలేదు. పెళ్ళయి చక్కటి వైవాహిక జీవితం గడుపుతూ సృజనాత్మక రంగంలో ప్రఖ్యాతి గాంచిన వారు చాలామందే ఉన్నారు. ప్రముఖ రచయిత సల్మాన్ రష్దీ మూడు సార్లు వివాహం చేసుకున్నారు. ప్రముఖ తమిళ సినీ గేయ రచయిత, ప్రప్రథమ జాతీయ ఉత్తమ సినీ గేయ రచయిత కన్నదాసన్‌కు ముగ్గురు భార్యలన్న విషయం చాలామందికి తెలియకపోవచ్చు. కుశ్వంత్ సింగ్ చక్కటి వైవాహిక జీవితం గడుపుతూనే, ప్రముఖ రచయితగా పేరొందారు. చెప్పుకుంటూ పోతే ఈ జాబితాలో చాలా మంది ప్రముఖులే ఉంటారు.



కాకపోతే సృజనాత్మక రంగాలలో పని చేసేవారికి జీవిత భాగస్వాములుగా, క్రియేటివ్ రంగానికి చెందినవారు లేదా కనీసం దానిపట్ల ఆసక్తి ఉన్న వారు లభించే పక్షంలో ఆయా వ్యక్తులు మరింతగా రాణిస్తారు. క్రియేటివ్ వ్యక్తుల ఆలోచనా ధోరణికి ఇతరుల ఆలోచనా ధోరణులకు కొంత తేడా ఉంటుంది. దాని వల్ల వారి దైనందిన జీవితంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. కొందరు రచయితలు రాత్రంతా మేల్కొని తమ రచనా వ్యాసంగాన్ని కొనసాగించి పగలు నిద్రపోతుంటారు. కళాకారులు, నటులు... షూటింగ్‌లు, రిహార్సల్స్ అని అర్ధరాత్రి వరకు కష్టపడి ప్రాక్టీస్ చేసి ఇంటికి వస్తే, ఇంట్లో వారి భాగస్వామి సర్దుకు పోలేకపోవచ్చు. వాస్తవానికి ఆ స్థితికి ఎవర్నీ తప్పు పట్టలేం! పరస్పర విరుద్ధమైన మనస్తత్వం కలిగినవారు వివాహం చేసుకోవడమే కారణం.

వైవాహిక పరమైన సమస్యలు సృజనాత్మక రంగంలో పనిచేసే వారిపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. క్రియేటివ్ వ్యక్తులకు ఇంటి బాధ్యతలు, భాగస్వామి కోర్కెలు చిన్న విషయాలుగా కనిపిస్తాయి. సహజంగా రచయితలు తమ రచనలకు సంబంధించి మేధా మథనం చేస్తుంటారు. ఆ సమయంలో భార్య వచ్చి ఇంటి సమస్యలు ఏకరువు పెడితే అతని ఆలోచనలకు ఆటంకం కలగవచ్చు. ఇంకో ముఖ్య విషయమేటింటే, క్రియేటివ్ వ్యక్తులకు వారి భావాలు వెలికి వచ్చేందుకు ఒక ఉత్ప్రేరకం అవసరం కావచ్చు. 'మేఘసందేశం' సినిమాలో నాగేశ్వరరావుకు జయసుధ ఉత్తమ ఇల్లాలైనప్పటికీ ఆయనలోని రచయితకు, గోదావరి ఒడ్డున నాట్యం చేసే జయప్రద ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది.

అయితే జీవిత భాగస్వామి ఏ మాత్రం సహకరించకపోయినా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మేధావులు ఎందరో వున్నారు. ప్రముఖ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ భార్య పరమ గయ్యాళి అని ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. ప్రముఖ రచయిత బెర్నార్డ్ షా భార్యతో కలిసి ఒక పార్టీకి వెళ్ళినపుడు అందరూ ఆనందంగా డాన్స్ చేస్తుంటే, భార్య కూడా చేద్దామని పిలుస్తుంది. ఆయన ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ, 'తర్వాత రాసే నవల ప్లాన్ గురించి ఆలోచిస్తున్నాను, నేను రా'నంటాడు. 'ఎప్పుడూ రచనలేనా, కొంచెం సేపు జీవితంలో ఎంజాయ్‌మెంట్ కూడా ఉండా'లంటుంది. అందుకాయన 'ఈ డాన్స్ వల్ల వచ్చే ఆనందం క్షణికమైనది. కానీ నేను ఆలోచించి రాసే నవల వల్ల వచ్చే ఆనందం, కీర్తి శాశ్వతంగా ఉంటా'యంటాడు. వృత్తి ముఖ్యమా, ఆనందించడం ముఖ్యమా అంటే, ఎవరికి నచ్చిన దాంట్లోనే వారికి ఆనందం ఉంటుంది.

క్రియేటివ్ రంగంలో ఉన్నవారు తమకు తగిన జీవిత భాగస్వామి లభించలేదని బాధపడాల్సిన పని లేదు. ఇరువురికి ఎలాంటి వాటిల్లో అభిప్రాయ బేధాలు వస్తున్నాయో, సమస్యలు ఎదురవుతున్నాయో గుర్తించి, ప్రయారిటీ ప్రకారం వాటిని సామరస్యంగా పరిష్కరించు కోవాలి. ఒకరి అభిప్రాయాలను మరొకరికి చెప్పుకోవాలి. కార్లు, బంగళాలు లేకపోయినా, క్రియేటివ్ రంగంలో ఉండటం వల్ల సమాజంలో లభించే గౌరవం, కీర్తి గురించి అవతలి వ్యక్తికి తెలియజెప్పాలి. క్రియేటివిటీకి ఆటంకం కల్గకుండా, వైవాహిక జీవితానికి ఇబ్బందులు కల్గకుండా వర్క్–లైఫ్ బేలన్స్ చేసుకోవాలి. అప్పుడు వైవాహిక జీవితం, సృజనాత్మకత కలకాలం పరిపూర్ణంగా ఉంటాయి.

వ్యాసకర్త ప్రముఖ మానసిక వైద్య నిపుణులు । 9348114948

రాముడి నివాసాలు

జ్యోతిర్మయం

సీతా రామ లక్ష్మణులు వనవాసం చేస్తూ చిత్రకూట పర్వతానికి చేరుకుంటారు. అక్కడ వాల్మీకి మహర్షి ఆశ్రమం ఉంది. శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతంగా వాల్మీకికి నమస్కరిస్తారు. వాల్మీకి ఆనందాశ్రువులతో వారిని సాదరంగా ఆహ్వానించి, మధుర ఫలాలతో ఆతిథ్యమిస్తాడు. అప్పుడు రాముడు, తాము తండ్రి ఆదేశంతో వనవాసానికి వచ్చామనీ, కొంతకాలం పాటు నివసించటానికి తగిన స్థలాన్ని చూపించమనీ అడుగుతాడు. అప్పుడు వాల్మీకి, 'సకల జీవుల హృదయాలు రాముని నివాస స్థానాలు. ఇది నీ సర్వ సాధారణ నివాస స్థలం. నువ్వు విశేషంగా సీతతో కలిసి నివసించే స్థలాన్ని అడిగావు. కాబట్టి మీరు నివసించటానికి నిశ్చితమైన స్థానాన్ని చెపుతాను' అని ఇలా చెప్పాడు.

'ప్రశాంతుడు, సమదర్శి, సమస్త జీవుల పట్ల ద్వేషం లేనివాడు, అహర్నిశలు రామునే స్మరించేవాడు అయిన భక్తుని హృదయమే రాముడు నివసించే ప్రశాంత నిలయం. ఎవరు రామమంత్రాన్ని నిరంతరం జపిస్తూ రాముని శరణు వేడతారో వారి హృదయం రాముని సుందర మందిరం. ఎవరు అహంకార శూన్యులై, శాంత స్వభావులై, రాగ ద్వేషాల కతీతులై, బంగారాన్ని, రాతిని, మట్టిని సమానంగా చూస్తారో వారి మనసే రాముని నివాసం. ఎవరు అప్రియాన్ని పొందినా విచారం పొందకుండా, ప్రియం జరిగినా హర్షించకుండా సమస్త ప్రపంచం మాయా కల్పితమని నిశ్చయం కలిగి రాముని సేవిస్తారో వారి మనసే రాముని నిజమైన గృహం. ఎవరు సంసారిక ధర్మాల నుండి విముక్తులవుతారో వారి హృదయాన్ని రాముడు నివాసంగా చేసుకుంటాడు.

నిరంతర అభ్యాసం వలన ఎవరి చిత్తం స్థిరత్వం పొంది ఉంటుందో, ఎవరు సర్వదా రాముని చరణ సేవలో లీనమై వుంటారో, రామనామ కీర్తన వలన ఎవరి పాపాలు ప్రక్షాళిత మవుతాయో వారి హృదయ కమలం సీతా సమేతుడగు శ్రీరాముని పావన నివాస గృహం అవుతుంది'.

తన పట్ల భక్తితో నిండిన నిర్మల హృదయాలలో రాముడు సదా కొలువై ఉంటాడని సారాంశం.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.సప్తమి సా.6.54 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.8.02 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ఉ.6.33 నుండి 8.03 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.27 నుండి 1.13 వరకు, తదుపరి ప.2.41 నుండి 3.25 వరకు, **అమృతఘడియలు:** ప.3.30 నుండి 5.02 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.35.

క్లుప్తంగా...

8న విద్యుత్ బీసీ ఉద్యోగుల మహాసభ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల 19వ రాష్ట్ర మహాసభను ఈ నెల 8న హైదరాబాద్‌లోని ఇంజనీర్స్ భవన్‌లో నిర్వహించనున్నట్లు విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడెపాక కుమారస్వామి, ముత్యం వెంకన్న గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ వచ్చాక ఇచ్చిన పదోన్నతులను సమీక్షించి.. నష్టపోయిన బీసీ ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని, 2004 ముందు చేరిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, ఆర్టిజన్లకు పదోన్నతి కల్పించాలని, డైరెక్టర్ల నియామకాల్లో 50 శాతం పోస్టులను బీసీలతో భర్తీ చేయాలనే డిమాండ్లతో సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

రైతుభరోసా కింద రూ.15 వేలు ఇవ్వాలి

- తెలంగాణ రైతు సంఘం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో రైతాంగానికి ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా కింద ఏటా రూ.15 వేలు జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి.సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పుడు రూ. 12 వేలు చెల్లిస్తామని నిర్ణయించడం అన్యాయమని వారు పేర్కొన్నారు. పంటలకు కనీస మద్దతు ధర లభించకపోవడం, అప్పుల బారిన పడటమే రైతుల ఆత్మహత్యలకు కారణమని స్వామినాథన్ కమిషన్ గుర్తించిందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుభరోసా కింద ఒక్కో సీజన్‌కు రూ.7,500 ఇస్తామన్న కాంగ్రెస్ సర్కార్, వానాకాలం పంటకు ఎగ్గొట్టిందని, ఇప్పుడు దానిని రూ.6,000గా ప్రకటించి మోసం చేసిందని విమర్శించారు.

10న బీసీ మేధావుల సమావేశం: జాజుల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సమగ్ర కుల గణన నిర్వహణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు.. తదితర అంశాలపై ఈనెల 10న హోటల్ హరిత ప్లాజాలో బీసీ మేధావుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో చేసిన పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమగ్ర కులగణనను చేపట్టిందన్నారు. అయితే సర్వే తర్వాత తదుపరి ప్రభుత్వ కార్యాచరణ నెమ్మదించిందని, కులగణనపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచుతారా? లేదా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. బీసీ రిజర్వేషన్లను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే న్యాయ నిపుణులు, బీసీ సంఘాలతో ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని జాజుల డిమాండ్ చేశారు.

పాత పెన్షన్ కోసం పోరాటం: నిర్మల



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు జాతీయ స్థాయిలో సమైక్య ఉద్యమం చేపట్టాలని కోల్‌కతాలో ఆదివారం జరిగిన ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ నిర్ణయించినట్టు తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ జి.నిర్మల తెలిపారు. అలాగే అన్ని రాష్ట్రాల్లో ఉద్యోగుల డీఏ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.

వర్గీకరణపై కుట్రలను ఛేదిస్తాం: మందకృష్ణ



అభివాదం చేస్తున్న మందకృష్ణ తదితరులు

గజ్వేల్: ఎస్సీ వర్గీకరణపై కుట్రలను ఛేదించి అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో నిర్వహించిన మాదిగ–మాదిగ ఉప కులాల ఆత్మీయ సమ్మేళనానికి ప్రొఫెసర్ కాశీం, ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, జాతీయ మాదిగ కళామండలి అధ్యక్షుడు అశోక్‌లతో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. సుప్రీం కోర్టులో వర్గీకరణకు అనుకూలంగా స్పష్టమైన తీర్పు వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి, దేశంలోనే మొట్టమొదటిసారిగా వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ఇది జీర్ణించుకోలేక మాల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే వద్దకు వెళ్లి కుట్రలు చేశారని ఆరోపించారు. వర్గీకరణపై కాంగ్రెస్ జాతీయస్థాయిలో విధానం ప్రకటించే వరకూ రాష్ట్రాలలో నిర్ణయం తీసుకోవద్దని ఆ పార్టీ అధికార ప్రతినిధి కేసీ వేణుగోపాల్ చేత ప్రకటన చేయించారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'లక్ష డప్పులు– వెయ్యి గొంతుకలు' కార్యక్రమంతో కుట్రలన్నీ ఛేదిస్తామన్నారు.





ఆదివారం రాత్రి విద్యుత్ దీపాల వెలుగుల్లో రామాలయం. (ఇన్‌సెట్‌లో) పరశురామావతారంలో రామయ్య. స్వామివారు సోమవారం నిజరూపమైన రామావతారంలో దర్శనమిస్తారు

ముక్కోటికి భద్రగిరి ముస్తాబు

తుది దశకు చేరుకున్న ఏర్పాట్లు

భద్రాచలం: భూలోక వైకుంఠంగా భక్తులు భావించే భద్రగిరి.. ముక్కోటి ఏకాదశికి ముస్తాబవుతోంది. భద్రుడి తపస్సుతో వైకుంఠం నుంచి సరాసరి సాక్షాత్కరించి దర్శనమిచ్చిన శ్రీ మహావిష్ణువు అవతార రూపమే భద్రాచలం రామయ్యగా ప్రతీతి. నాలుగు చేతుల్లో ఆయుధాలు, సీతమ్మతోపాటు సోదరుడైన లక్ష్మణుడితో శ్రీరాముడు దర్శనమివ్వడం ఇక్కడి విశిష్టత.

10న ఉత్తర ద్వార దర్శనం..

వేడుకల్లో భాగంగా ఈ నెల 9వ తేదీ సాయంత్రం పవిత్ర గోదావరి నదిలో హంస వాహనంపై శ్రీ సీతారామచంద్రస్వామి జలవిహారం చేస్తారు. 10వ తేదీ తెల్లవారుజామున ఉత్తర ద్వారంలో దర్శనమిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. స్వామి వారు జలవిహారం చేసే హంస వాహనాన్ని ఇప్పటికే సిద్ధం చేయగా, విద్యుత్ దీపాల పనులు పూర్తి కావాల్సి ఉంది. హంస వాహనానికి గోదావరిలో ట్రయల్ రన్ సైతం పూర్తయ్యింది. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, దీనికి అనుబంధంగా ఉన్న పర్ణశాల ఆలయాలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముక్కోటి వేడుకలు జరిగే ఉత్తర ద్వారానికి మరమ్మతులు నిర్వహించి పంచరంగులు వేశారు. గోదావరి తీరంతోపాటు పలుచోట్ల భక్తుల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానాల గదులను సిద్ధం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉంచగా, భక్తులు కొనుగోలు చేస్తున్నారు.

భద్రగిరికే ప్రత్యేకం..

భద్రాచలంలో ముక్కోటి పర్వదినం రోజున రామయ్యను దర్శించుకుంటే ముక్కోటి దేవతలను దర్శించుకున్నంత పుణ్యం దక్కుతుందని భక్తుల నమ్మకం. ఇదేరోజున వైకుంఠంలో స్వామివారిని ముక్కోటి దేవతలు దర్శించుకుంటారని, వైకుంఠం నుంచి సరాసరి భద్రగిరిపై ప్రత్యక్షమైన స్వామి వారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగి.. వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని వేద పండితులు చెబుతున్నారు. ఉత్తర ద్వార దర్శనానికి ముందురోజు సాయంత్రం గోదావరిలో జరిగే స్వామివారి తెప్పోత్సవాన్ని వీక్షించాలన్నా భద్రాచలం రావాల్సిందే. మిరుమిట్లు గొలిపే విద్యుత్‌దీపాల వెలుగులు, భక్తుల శ్రీరామ నామస్మరణల నడుమ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య హంస వాహనంలో 'లాహిరి లాహిరి..లాహిరిలో' అంటూ జలవిహారం చేసే అద్భుత దృశ్యాలు భద్రాచలంలో మాత్రమే ప్రత్యేకం.

కోర్టు ఆదేశించినా పట్టించుకోరా?

- జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో ఉల్లంఘనలపై కో–ఆపరేటివ్ సొసైటీస్ అధికారుల అలసత్వం
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్న సీనియర్ సభ్యులు
- త్వరలో ఆందోళన చేపట్టనున్నట్టు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సహకార సొసైటీల్లో అక్రమాలు, అవకతవకలు జరగకుండా పర్యవేక్షించాల్సిన 'రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీస్' విభాగం తీరుపై విమర్శలు వస్తున్నాయి. నిబంధనల ఉల్లంఘనపై హౌసింగ్ సొసైటీల సభ్యుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా ఏ మాత్రం స్పందించడం లేదనే ఆగ్రహం కనిపిస్తోంది. అక్రమాలపై విచారణ చేపట్టాలని సాక్షాత్తు న్యాయస్థానం ఆదేశించినా కూడా అలసత్వం వహించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ వ్యవహారంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ సొసైటీలో అక్రమాలపై విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశించి రెండు నెలలైనా సహకార శాఖలో చలనం లేకుండా పోయిందని సభ్యులు మండిపడ్డారు. కో–ఆపరేటివ్ కార్యాలయం ముందు ఆందోళనను నిర్వహించేందుకు సీనియర్ సభ్యులు సిద్ధమవుతున్నట్టు వెల్లడించారు.

ఎన్నెన్నో ఆరోపణలు, ఉల్లంఘనలు..

1962లో ఏపీ కో–ఆపరేటివ్ సొసైటీ చట్టం కింద 'జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ హౌజింగ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ (జీహెచ్‌సీహెచ్‌బీఎస్)' రిజిస్టర్ అయింది. ఇందులో 4,962 మంది సభ్యులు ఉండగా.. 3,035 మందికి ఇళ్ల స్థలాలు అందజేశారు. మరో 1,952 మంది వెయిటింగ్‌లో ఉన్నారు. సొసైటీకి సంబంధించి కొన్ని నిబంధనలు ఉన్నాయి. చాలాకాలం పాటు వాటికి అనుగుణంగా సొసైటీ కార్యకలాపాలు సాగినా.. తర్వాత కొందరు స్వలాభాపేక్షతో సొసైటీని ఆర్థిక వనరుగా మార్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రస్తుత సొసైటీ పాలకవర్గం అక్రమాలకు అడ్డు అదుపులేకుండా పోయిందని సీనియర్ సభ్యులు ఆరోపిస్తున్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న 800 మంది సభ్యులను తొలగించే ప్రయత్నం చేయడం, కొత్త సభ్యులకు అవకాశం పేరుతో దరఖాస్తులు పంచుకుని సొమ్ము చేసుకోవడం, సొసైటీకి సంబంధం లేని ప్రైవేటు వెంచర్‌కు జూబ్లీహిల్స్–4 పేరుపెట్టి అక్కడ ప్లాట్స్ కొంటే సొసైటీలో సభ్యత్వం అంటూ ప్రచారం చేయడం వంటి ఎన్నో అవకతవకలు జరిగాయని చెబుతున్నారు.

ప్రత్యేక పర్యవేక్షణ ఏది?

సహకార చట్టం ప్రకారం ఎక్కువ సభ్యత్వం, ఉన్నతస్థాయి వ్యక్తులు సభ్యులుగా ఉన్న సొసైటీలపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఇలా రాష్ట్రస్థాయి రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీస్ ప్రత్యేక పర్యవేక్షణలోకి 'జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ'తోపాటు మరో నాలుగు సొసైటీలు కూడా వస్తాయి. కానీ జూబ్లీహిల్స్ సొసైటీపై కొన్నేళ్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నా.. పట్టించుకునేవారే లేరన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల సొసైటీ సభ్యులు కొందరు పాలకమండలి అక్రమాలపై కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయిందని అంటున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. ఈ వ్యవహారం పోలీసుల పరిధిలోకి రాదని, అక్రమార్కులపై క్రిమినల్ కేసు పెట్టేలా సహకార శాఖలో అర్జీ పెట్టుకోవాలని వారు పేర్కొన్నారని చెబుతున్నారు. పోలీసులు ఇచ్చిన కాపీని సైతం జతపర్చి సహకార కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సీనియర్ సభ్యులు వాపోతున్నారు.

పాలక వర్గం అక్రమాలపై విచారణ జరిపించాలి

సొసైటీ పాలక మండలి అక్రమాలపై తక్షణమే విచారణ జరిపించాలి. నిబంధనల ప్రకారం పాత సభ్యులందరికీ స్థలాల కేటాయింపు అనంతరమే కొత్త సభ్యత్వం చేపట్టాలి. సహకార రిజిస్ట్రార్ తక్షణమే స్పందించాలి.

– జ్యోతిప్రసాద్ కొసరాజు, సీనియర్ సభ్యుడు, జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ

ఎలాంటి ఉత్తర్వులు అందలేదు..

జూబ్లీహిల్స్ సొసైటీకి సంబంధించి ఎలాంటి ఉత్తర్వుల ప్రతి నాకు అందలేదు. రాష్ట్రంలోని 90 సొసైటీల్లో ఇదొకటి. సొసైటీలపై ఫిర్యాదులు రావడం సహజం. విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఉత్తర్వులు ఏవైనా వచ్చి ఉంటే.. సెక్షన్‌కు వచ్చి ఉండవచ్చు.

– జి.శ్రీనివాసరావు, కో–ఆపరేటివ్ అడిషనల్ రిజిస్ట్రార్

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

- కళాశాల యాజమాన్యం వేధింపులే కారణమంటున్న తండ్రి



రామ్‌పవర్

కొత్తగూడెం రూరల్: ఇంటర్ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన రామ్‌పవర్ లక్ష్మీదేవిపల్లి మండలంలోని నలంద కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ విద్యానగర్‌లోని తాత స్వామి ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రికి తరలించగా.. ఆస్పత్రి ఎదుట తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేపట్టారు. తన కుమారుడి మృతికి కళాశాల యాజమాన్యం వేధింపులే కారణమని మృతుడి తండ్రి రామ్‌లక్ష్మణ్ ఆరోపించాడు. రామ్‌పవర్ సున్నిత మనస్తత్వం కలవాడని, పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించాడని చెప్పాడు. కళాశాల యాజమాన్యం వారు మాత్రం 'నీకు చదువు రాదని, మొద్దువని' వేధించారని దీంతో మనస్తాపం చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడని ఆరోపించాడు. ఈ ఘటనపై కళాశాల చైర్మన్ చైతన్య కృష్ణను వివరణ కోరగా.. రామ్‌పవర్ రెగ్యులర్‌గా కాలేజీకి రావడం లేదన్నారు. డిసెంబర్ నెలలో 12 రోజులు మాత్రమే వచ్చాడని, 29వ తేదీ తర్వాత అసలు రాలేదని, అలాంటి విద్యార్థిని తామెలా వేధిస్తామని ప్రశ్నించారు. విద్యార్థి ఆత్మహత్యకు తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. రామ్‌లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ రాయల వెంకటేశ్వరరావు తెలిపారు.

అడవిలో పేలిన మందుపాతర

- కట్టెల కోసం వచ్చి కాలు వేయడంతో పేలుడు
- ఒకరికి తీవ్ర గాయాలు



కావడిలో నవీన్‌ను తీసుకెళ్తున్న దృశ్యం

వెంకటాపురం(కె)/ఏటూరునాగారం: కట్టెల కోసం అడవికి వెళ్లి.. మందుపాతరపై అడుగు వేయడంతో పేలి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం వీరభద్రవరం పంచాయతీ పరిధి ముత్యంధార జలపాతం అటవీ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలివి. ఇప్పగూడెం గ్రామానికి చెందిన బొగ్గుల నవీన్, నర్సింహులు, ఎడమయ్య (బాబు) అటవీ ప్రాంతంలో పొయ్యి కట్టెల కోసం వెళ్లారు. ఇంతలో నవీన్ మందుపాతరపై అడుగు వేయడంతో.. ఒక్కసారిగా అది పేలింది. ఈ ప్రమాదంలో నవీన్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలై కుప్పకూలిపోయాడు. దీంతో నర్సింహులు, ఎడమయ్య (బాబు) కలిసి లుంగీ పంచతో చేసిన కావడిలో బాధితుడిని వీరభద్రవరం అడవి నుంచి ప్రధాన రోడ్డుకు మోసుకొచ్చారు. అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. బాధితుని పరిస్థితి విషమించడంతో ములుగుకు తరలించారు.

మందుపాతరలు కనిపిస్తే సమాచారం ఇవ్వండి: ఎస్పీ

అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవించే అమాయక ఆదివాసీలను మావోయిస్టులు బలిగొంటున్నారని ములుగు ఎస్పీ శబరీశ్ అన్నారు. వెంకటాపురం(కె), వాజేడు మండల ప్రజలు అనుమానాస్పద మందుపాతరలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాంబ్ డిస్పోజబుల్ బృందాలతో నిరంతరం కర్రిగుట్ట అటవీ ప్రాంతంలో తనిఖీలు చేస్తున్నాయన్నారు.

సీఎంఆర్ హాస్టల్ ఘటనలో ఇద్దరి రిమాండ్

- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సోదరుడిపై కూడా కేసు నమోదు



నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

మేడ్చల్‌రూరల్: గర్ల్స్ హాస్టల్‌లోని బాత్‌రూంలో వీడియోల చిత్రీకరణ ఘటనలో మేడ్చల్ పోలీసులు ఇద్దరిని రిమాండ్ చేశారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సోదరుడు, సీఎంఆర్ గ్రూప్స్ చైర్మన్ గోపాల్‌రెడ్డి సహా మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...కండ్లకోయలోని సీఎంఆర్ ఐటీ కళాశాల గర్ల్స్ హాస్టల్‌లో డిసెంబర్ 31 రాత్రి బాత్‌రూంలోకి ఓ విద్యార్థిని వెళ్లగా, ఆ సమయంలో ఎవరో వెంటిలెటర్ నుంచి తొంగి చూస్తున్నట్టు గుర్తించింది. ఈ విషయాన్ని హాస్టల్ వార్డెన్ దృష్టికి తీసుకెళ్లగా, సకాలంలో స్పందించలేదు. దీంతో హాస్టల్‌లోని విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. జరిగిన ఘటనను రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించి కళాశాలకు నోటీసులు జారీ చేసి విచారణ జరిపింది. విద్యార్థినుల ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. బిహార్‌కు చెందిన కిశోర్‌కుమార్, గోవింద్‌కుమార్‌తో పాటు మరికొందరు మెస్‌లో పనిచేస్తున్నారు. హాస్టల్ వెనుక భాగంలో యాజమాన్యం ఏర్పాటు చేసిన గదుల్లో వారు ఉంటున్నారు. విద్యార్థుల ఆరోపణలు, ఆందోళన నేపథ్యంలో మెస్‌లో పనిచేసే ఐదుగురిని అదుపులోకి తీసుకొని విచారించగా, కిశోర్ కుమార్, గోవింద్‌కుమార్‌లు బాత్‌రూం వెంటిలేటర్ ద్వారా తొంగి చూసినట్టు నేరం అంగీకరించారు. దీంతో వారిపై పోక్సో కేసు నమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. విద్యార్థినులు ఫిర్యాదు చేసిన సమయంలో వారిని కించపరుస్తూ మాట్లాడిన హాస్టల్ వార్డెన్లు ప్రీతిరెడ్డి, ధనలక్ష్మిలపై కూడా కేసు నమోదు చేశారు. జరిగిన ఘటనను బయటకు రాకుండా చూడాలని, పోలీసులు, విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారం చేరకుండా చూసుకోవాలని హాస్టల్ వార్డెన్‌లపై ఒత్తిడి తీసుకొచ్చిన సీఎంఆర్ సెట్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, సీఎంఆర్ ఐటీ కళాశాల డైరెక్టర్ మాదిరెడ్డి జంగారెడ్డి, సీఎంఆర్ విద్యాసంస్థల చైర్మన్ గోపాల్‌రెడ్డిలపై కూడా కేసు నమోదు చేశారు.

అటవీ సిబ్బందిపై దాడికి ముల్తానీల యత్నం

- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన



కేశవపట్నంలో అటవీ సిబ్బంది, గ్రామస్తుల మధ్య ఘర్షణ

ఇచ్చోడ: అటవీ సిబ్బందిపై కొందరు ముల్తానీలు దాడికి ప్రయత్నించారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం కేశవపట్నంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కలప స్మగ్లర్ల ఆచూకీ కోసం అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఉదయం గ్రామానికి చేరుకున్నారు. ఈ క్రమంలో కొంత మంది ముల్తానీలు వారిపై రాళ్లు, కర్రలతో దాడికి ప్రయత్నించారు. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసుల సాయంతో పలు ఇళ్లలో అటవీ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. నిల్వ ఉంచిన టేకు కలప స్వాధీనం చేసుకొని ఇచ్చోడ అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. కాగా, వారం క్రితం స్మగ్లర్లు సిరిచెల్మ అటవీప్రాంతంలో టేకు చెట్లను నరికివేస్తుండగా అటవీ సిబ్బంది రావడంతో పరారయ్యారు. అందులో ఒకరిని పట్టుకొని విచారించగా పరారయిన వారిలో కేశవపట్నంకు చెందిన వారు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ క్రమంలో ఉట్నూర్ ఎఫ్‌డీవో చంద్రారెడ్డి ఆధ్వర్యంలో కేశవపట్నం వెళ్లారు. స్మగ్లర్ల గురించి ఆరా తీస్తుండగా గ్రామస్తుల్లో కొంత మంది అటవీ సిబ్బందిపై దాడికి యత్నించారు. ఇచ్చోడ సీఐ భీమేశ్, ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. ఇదిలా ఉండగా కలప స్మగ్లింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్ అన్నారు. మండలకేంద్రంలోని ఎఫ్‌డీవో కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీ సిబ్బందిపై దాడులకు దిగడం సరికాదన్నారు. కారకులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. అవసరమైతే పీడీ యాక్టు కింద కేసుల నమోదుకు కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు. కేశవపట్నంలో అటవీశాఖ సిబ్బంది ద్వారా తనిఖీలు నిర్వహించి రూ.3.50 లక్షల కలప స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముల్తానీలు కలప స్మగ్లింగ్ మానుకొని ఇతర వ్యాపారాలు చేసుకోవాలని కోరారు.

అత్తను చంపిన అల్లుడు

- దొంగ అంటూ అవమానించడంతో హత్య
- నిందితుడిపై 34 కేసులు..
- గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): దొంగ అంటూ తరచూ అవమానిస్తుండడాన్ని తట్టుకోలేక అత్తను హతమార్చాడో అల్లుడు. నిజామాబాద్‌లోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. నిజామాబాద్ సౌత్ సీఐ సురేశ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 3వ తేదీన అర్ధరాత్రి సారంగాపూర్‌లోని వడ్డెర కాలనీకి చెందిన దుబ్బాక సాయమ్మ హత్యకు గురైంది. ఆమె కూతురు సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చుట్టుపక్కలవారు, బంధువులను విచారించారు. అయితే హతురాలి రెండో కూతురు భర్త సారంగాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ కనిపించకపోవడంతో పోలీసులు అతడి కోసం గాలించారు. నిందితుడు శనివారం సారంగాపూర్‌లోని మసీదు వద్ద ఉన్నట్టు సమాచారం రావడంతో అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు.

హత్య చేసి.. ఆనవాళ్లు చెరిపేసి..: అత్త సాయమ్మ తనను తరచూ దొంగ అని నిందిస్తోందని నిందితుడు లక్ష్మణ్ పేర్కొన్నాడు. దీనిని తట్టుకోలేక ఈనెల 3 తేదీ రాత్రి ఆమె ఇంటికి వెళ్లి వాగ్వాదానికి దిగానని, ఆమె అరవడంతో షూ నాడాతో ఉరి వేసి, ఆ తర్వాత చిన్న రోకలి బండతో తలపై బాది చంపానని ఒప్పుకున్నాడు. అనంతరం ఆమె వద్దనున్న వెయ్యి రూపాయల నగదుతోపాటు బీరువాలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలు తీసుకొని పారిపోయానని చెప్పాడు. నిందితుడి వద్దనుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. హత్య అనంతరం ఆనవాళ్లు లేకుండా చేసేందుకు చేతులు కడుక్కొని, మృతదేహంపై రెండు బిందెల నీళ్లు పోశాడన్నారు. నిందితుడిపై ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 34 దొంగతనాల కేసులు, మాక్లూర్‌లో హత్య కేసు ఉందని చెప్పారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్సైలు అప్పారావు, యాదగిరి గౌడ్‌తోపాటు సిబ్బందిని ఇన్‌చార్జ్ సీపీ సింధుశర్మ, డీసీపీ(అడ్మిన్) బస్వారెడ్డి, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని టవర్‌పై నుంచి కిందకు దింపుతున్న కానిస్టేబుల్

తంగళ్లపల్లి (సిరిసిల్ల): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి సెల్ టవర్ ఎక్కి ఉరివేసుకున్నాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం తాడూర్‌లో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన కొమురవెల్లి శ్రీనివాస్‌గౌడ్ (49) కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నాలుగేళ్ల క్రితం అప్పు చేసి రేకుల ఇంటిని నిర్మించుకున్నాడు. కాగా, ఆర్థిక ఇబ్బందులు తీవ్రం కావడంతో గతంలో పలుమార్లు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఇటీవల 15 రోజులుగా పని దొరక్కపోవడంతో మనస్థాపానికి గురై గ్రామపంచాయతీ వద్ద ఉన్న టవర్ ఎక్కి ఉరివేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారంతో కానిస్టేబుల్ సంపత్‌రెడ్డి టవర్‌పైకి ఎక్కి మృతదేహాన్ని కిందకు దింపారు. మృతుడికి భార్య లత, రెండేళ్ల కూతురు మహశ్రీ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

అప్పల లెక్క పెరిగింది!

▶ మొదటి పేజీ తరువాయి

చేరనుంది. రాష్ట్ర సర్కారు బడ్జెట్‌లో పేర్కొన్న రుణ సమీకరణ అంచనా రూ.57,112 కోట్లు మాత్రమే. కానీ రుణాలు అంతకన్నా రూ.13 వేల కోట్లు (23 శాతం) అదనంగా పెరగనున్నాయి.

ప్రతి నెలా నాలుగు సార్లు..: ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు (చివరి త్రైమాసికం) ప్రతి నెలా నాలుగు దఫాల్లో ఆర్బీఐ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రుణం తీసుకోనుంది. ఈ మేరకు ఆర్బీఐకి ఇచ్చిన ఇండెంట్‌లో పేర్కొంది. ఆర్థిక సంవత్సరం చివరి నెలలు కావడంతో పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులపై ఆధారపడకుండా బహిరంగ మార్కెట్ రుణాలు తీసుకోవాలని భావిస్తున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ మూడు నెలల కాలంలో రైతు భరోసా, రేషన్ కింద సన్న బియ్యం సరఫరా, పింఛన్ల పెంపు వంటి పథకాలను అమల్లోకి తేవాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో నిధుల అవసరం పెరగనుందని పేర్కొంటున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలోనూ బడ్జెట్ ప్రతిపాదనల కంటే ఎక్కువగా బహిరంగ మార్కెట్ నుంచి రుణాలు తీసుకుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.40,615 కోట్లు రుణ సేకరణను ప్రతిపాదించగా.. సవరించిన అంచనాల్లో రూ.49,618 కోట్లు చూపారు. అంటే రూ.9వేల కోట్లకుపైనే అదనంగా తీసుకోవడం గమనార్హం.

2024-25లో రాష్ట్ర అప్పుల తీరు ఇదీ.. (రూ.కోట్లలో)

నెల	బహిరంగ మార్కెట్ రుణం
ఏప్రిల్–2024	4,000
మే	4,000
జూన్	5,000
జూలై	8,000
ఆగస్టు	6,000
సెప్టెంబర్	4,500
అక్టోబర్	4,500
నవంబర్	1,000
డిసెంబర్	3,500
జనవరి	10,000
ఫిబ్రవరి	10,000
మార్చి	10,000
మొత్తం	70,500

(2025 జనవరి నుంచి మార్చి వరకు ప్రతిపాదనలు మాత్రమే..)

చివరి త్రైమాసికంలో రుణాల కోసం పెట్టిన ఇండెంట్ (రూ.కోట్లలో)

తేదీ	రుణం
జనవరి 7	3,000
జనవరి 14	2,000
జనవరి 21	2,500
జనవరి 28	2,500
ఫిబ్రవరి 4	3,000
ఫిబ్రవరి 11	2,000
ఫిబ్రవరి 18	2,500
ఫిబ్రవరి 25	2,500
మార్చి 4	3,000
మార్చి 11	2,500
మార్చి 18	2,000
మార్చి 25	2,500

మా ఆలయాలపై మీ పెత్తనమేంటి?

- మాకు అప్పగిస్తే మేమే నిర్వహించుకుంటాం
- వీహెచ్‌పీ హైందవ శంఖారావ సభలో పీఠాధిపతులు, స్వామీజీలు



సభకు హాజరైన పీఠాధిపతులు, స్వామీజీలు

సాక్షి, అమరావతి: 'గుళ్లను హిందువులమైన మేమే నిర్మించుకున్నాం.. స్వామీజీల మార్గదర్శకంలో వాటిని హిందువులమే యోగ్యమైన పద్ధతిలో నిర్వహించుకుంటాం. రాష్ట్రంలో, దేశమంతటా హిందూ ఆలయాల నిర్వహణలో పెత్తనం చేయడం నుంచి ప్రభుత్వాలు తప్పుకో వాలి. ఆయా ప్రభుత్వాల నుంచి విముక్తి కలిగించాలి. ఆలయాలకు స్వయం ప్రతిపత్తి సాధించే వరకు విశ్రమించేది లేదు. అందరం కలిసి ఐక్యంగా అడుగులు ముందుకు వేద్దాం' అని వివిధ పీఠాధిపతులు, స్వామీజీలు, వీహెచ్‌పీ నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం గన్నవరం విమానాశ్రయానికి సమీపంలోని కేసరపల్లి వద్ద వీహెచ్‌పీ నిర్వహించిన హైందవ శంఖారావం బహిరంగ సభ మధ్యాహ్నం 12.40 గంటలకు మొదలై.. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. 'వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సాధు సన్యాసులు, నాయవేత్తలు, హిందు ప్రముఖులు కలిసి ఆలయాల స్వయం ప్రతిపత్తికి సంబంధించి రూపొందించిన ముసాయిదా చట్టం ప్రతులను ఇప్పటికే ఏపీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి అప్పగించాం. బీజేపీ జాతీయ నాయకత్వానికి కూడా చట్టం ప్రతిని అందించాం. ఆయా ప్రభుత్వాలు, పార్టీలు అత్యంత శీఘ్రంగా ఆ ముసాయిదా చట్టాన్ని పరిశీలించి, నూతన చట్టం రూపొందించడం ద్వారా ఆలయాలను హిందు సమాజానికి అప్పగించే చర్యలు చేపట్టాలి. వెంటనే చట్ట సవరణ చేయాలి. ఆ లోపు, ఆలయ ట్రస్టు బోర్డుల్లో రాజకీయేతర ధార్మిక వ్యక్తులను మాత్రమే నియమించాలి. ఆలయాల్లో, ఆలయాలు నిర్వహించే సంస్థల్లో పని చేసే అన్యమత ఉద్యోగులను తక్షణమే తొలగించాలి. ఆలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడడంతో పాటు అన్యాక్రాంతమైన ఆస్తులను తిరిగి ఆలయాలకు అప్పగించే బాధ్యతను ప్రభుత్వాలు వెంటనే తీసుకోవాలి' అని హైందవ శంఖారావం డిక్లరేషన్ ప్రకటించారు.

ఛత్తీస్‌లో ఎదురుకాల్పులు

- నలుగురు మావోయిస్టులు మృతి
- నేలకొరిగిన డీఆర్‌జీ కానిస్టేబుల్

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో శనివారం రాత్రి జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు చనిపోగా ఒక జవాన్ నేలకొరిగారు. నారాయణపూర్–దంతెవాడ జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో నారాయణపూర్, దంతెవాడ, సుకుమా, బిజాపూర్ జిల్లాల డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు శుక్రవారం నుంచి కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి ఇరు వర్గాలు తారసపడగా రెండున్నర గంటల పాటు హోరాహోరీగా ఎదురుకాల్పులు సాగాయి. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. డీఆర్‌జీ విభాగానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ సన్నూ కారం కూడా ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలి నుంచి ఏకే 47, ఎస్‌ఎల్‌ఆర్‌తో పాటు 315 బోర్ తుపాకీ లభించాయి. కాల్పుల నుంచి తప్పించుకున్న మావోయిస్టుల కోసం అదనపు బలగాలను రంగంలోకి దించారు.

కూలిన కోస్ట్ గార్డ్ హెలికాప్టర్.. ముగ్గురు సిబ్బంది దుర్మరణం



హెలికాప్టర్ నుంచి వస్తున్న మంటలు, పొగ

పోర్‌బందర్: భారత తీర రక్షక దళం(ఐసీజీ) హెలికాప్టర్ కుప్పకూలి మంటల్లో చిక్కుకున్న ఘటనలో ముగ్గురు సిబ్బంది చనిపోయారు. గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో ఆదివారం మధ్యాహ్నం 12.10 గంటల సమయంలో చోటుచేసుకుంది. రోజువారీ గస్తీని ముగించుకున్న వస్తున్న అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్(ఏఎల్‌హెచ్) రన్‌వే సమీపంలో కూలిందని, అనంతరం మంటల్లో చిక్కుకుందని అధికారులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన అందులోని ముగ్గురు సిబ్బందిని ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఇద్దరు అప్పటికే చనిపోగా, మరొకరు కొద్దిసేపటి తర్వాత కన్నుమూశారని వివరించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టామన్నారు. కాగా, గతేడాది సెప్టెంబర్ 2న ఐసీజీకే చెందిన ఏఎల్‌హెచ్ ఎంకే–3 హెలికాప్టర్ అరేబియా సముద్రంలో కూలిన ఘటనలో అందులోని ముగ్గురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.

హెచ్‌–1బీ వీసాల్లో భారత టెక్ కంపెనీలే టాప్



న్యూఢిల్లీ: అమెరికాలో విదేశీ నిపుణులు తాత్కాలికంగా ఉద్యోగాలు చేసుకొనేందుకు వీలు కల్పించే హెచ్‌–1బీ వీసాలు పొందడంలో భారత టెక్ కంపెనీలదే పై చేయిగా ఉంది. యూఎస్ సిటిజన్‌షిప్, ఇమిగ్రేషన్ సర్వీసెస్ గణాంకాల ప్రకారం 2024లో ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య అమెరికా ప్రభుత్వం 1.3 లక్షల హెచ్‌–1బీ వీసాలు జారీ చేయగా, వాటిలో 24,766 వీసాలు భారత కంపెనీలే దక్కించుకున్నాయి. ఇన్ఫోసిస్ సంస్థకు అత్యధికంగా 8,140, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు 5,274, హెచ్‌సీఎల్‌కు 2,953 వీసాలు లభించాయి. చెన్నైలో స్థాపించిన కాగ్నిజెంట్ సంస్థ ప్రధాన కార్యాలయం ప్రస్తుతం అమెరికాలోని న్యూజెర్సీలో ఉంది. ఈ సంస్థకు 6,321 వీసాలు లభించాయి. పలు దేశాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న అమెజాన్.కామ్ సర్వీసెస్‌కు 9,265 వీసాలు జారీ అయ్యాయి. ఇండియాలో స్థాపించిన విప్రో సంస్థకు 1,634, టెక్ మహీంద్రాకు 1,199 హెచ్‌–1బీ వీసాలు దక్కాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ తరహా వీసాలపై పరిమితులు విధించవచ్చని వార్తలు వస్తున్నాయి.

విదేశీ విద్యార్థులకు రెండు ప్రత్యేక కేటగిరీ వీసాలు

న్యూఢిల్లీ: ఉన్నత విద్య కోసం భారత్‌కు వచ్చే విదేశీ విద్యార్థుల కోసం రెండు ప్రత్యేక కేటగిరీ వీసాలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ–స్టూడెంట్ వీసా, ఈ–స్టూడెంట్–ఎక్స్ వీసాలను కేంద్ర హోం శాఖ ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు రకాల వీసాల కోసం విదేశీ విద్యార్థులు స్టడీ ఇన్ ఇండియా(ఎస్ఐఐ) పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించాయి. ఈ–స్టూడెంట్ వీసాలను అర్హులైన విదేశీ విద్యార్థులకు మంజూరు చేస్తారు. వారిపై ఆధారపడినవారు ఈ–స్టూడెంట్–ఎక్స్ వీసా ద్వారా భారత్‌కు రావచ్చు. వీటి కోసం పోర్టల్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. లాంగ్–టర్మ్, షార్ట్–టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ పోర్టల్ ద్వారా సేవలు పొందే వెసులుబాటు ఉంది. కేంద్ర విద్యా శాఖ ప్రాజెక్టు కింద దేశంలో 600కు పైగా విద్యా సంస్థలు విదేశీయులకు ప్రవేశాలు కల్పిస్తున్నాయి. వేర్వేరు రంగాలకు సంబంధించి 8 వేలకు పైగా కోర్సులు అందిస్తున్నాయి.

‘మహా’ వ్యాఖ్యలు... మర్మమేమిటో?!



మహారాష్ట్రలో ఆసక్తికర పరిణామాలు

- ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌పై ఉద్ధవ్, శరద్ పవార్ వర్గాల ప్రశంసలు
- వారిద్దరూ ఎన్డీయే వైపు చూస్తున్నారంటూ వార్తలు

మహారాష్ట్రలో రాజకీయ పునరేకీకరణకు రంగం సిద్ధమవుతోందా? కొద్ది రోజులుగా రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న అనూహ్య పరిణామాల నేపథ్యంలో ఈ దిశగా చర్చ జోరందుకుంటోంది. బీజేపీ సారథ్యంలోని అధికార మహాయుతి కూటమికి చేరువయ్యేందుకు విపక్ష శివసేన (ఉద్ధవ్), ఎన్సీపీ (శరద్ పవార్) ప్రయత్నం చేస్తున్నాయన్న వార్తలు సర్వత్రా ఆసక్తి కలిగిస్తున్నాయి. ఆ పార్టీల నేతల తాజా వ్యాఖ్యలు ఈ దిశగా సంకేతాలేనన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)కి మహాయుతి ఘోర ఓటమి రుచి చూపించడం తెలిసిందే. శివసేనను కొన్నేళ్ల క్రితం నిలువునా చీల్చిన ఏక్‌నాథ్ షిండే వర్గం, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) నుంచి విడిపోయిన అజిత్ పవార్ వర్గం మహాయుతి భాగస్వాములుగా బీజేపీతో అధికారం పంచుకుంటున్నాయి. తామే అసలైన పార్టీలమంటూ ఇప్పటికే గుర్తింపు కూడా దక్కించుకున్నాయి. బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రి పదవి చేపట్టగా షిండే, అజిత్ ఆయనకు డిప్యూటీలుగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్‌తో కలిసి ఎంవీఏ కూటమిగా ఎన్నికల్లో పోటీ చేసిన ఉద్ధవ్ సేన, శరద్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ భారీ ఓటమితో కుదేలయ్యాయి. ఒకరకంగా ఉనికి కోసం పోరాడాల్సిన పరిస్థితికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో రెండు పార్టీల అభిమానులు, కార్యకర్తల నుంచి వస్తున్న విజ్ఞప్తులు ఆసక్తి కలిగిస్తున్నాయి. విడిపోయిన పార్టీలు మళ్లీ కలిసి పోవాలంటూ కొద్ది రోజులుగా వారు గట్టిగా కోరుతున్నారు! ఈ నేపథ్యంలో శివసేన (ఉద్ధవ్) అధికారిక పత్రిక ‘సామ్నా’ తమ ప్రత్యర్థి అయిన ఫడ్నవీస్‌ను ప్రశంసల్లో ముంచెత్తడం ప్రాధాన్యం సంతరించుకుంది. గడ్చిరోలీ జిల్లాలో నక్సలిజం అంతానికి ఆయన బాగా కృషి చేస్తున్నారని సామ్నా తాజా సంచిక సంపాదకీయంలో పేర్కొంది. ‘‘గడ్చిరోలీలో పలు అభివృద్ధి పనులకు సీఎం ఫడ్నవీస్ శ్రీకారం చుట్టారు. గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఎంతో కృషి చేస్తున్నారు. గడ్చిరోలీకి నూతన గుర్తింపును ఇవ్వాలని ఫడ్నవీస్ భావిస్తే స్వాగతిస్తాం’’ అని చెప్పుకొచ్చింది. ‘‘నక్సల్స్ ప్రభావిత జిల్లాలో నూతన అభివృద్ధి శకానికి శ్రీకారం చుట్టిన ఫడ్నవీస్ నిజంగా ప్రశంసలకు అర్హుడు’’ అని పేర్కొంది! మరోవైపు పార్టీని చీల్చి ప్రస్తుత దుస్థితికి కారకుడైన షిండేపై సంపాదకీయం విమర్శలు గుప్పించింది. ఆయన గతంలో ఇన్‌చార్జి మంత్రి హోదాలో గడ్చిరోలీలో మైనింగ్ లాబీల ప్రయోజనాల పరిరక్షణకే పని చేశారని ఆరోపించింది.

లోగుట్టు ఏమిటో?!

ఉద్ధవ్ సేన ఉన్నట్టుండి బీజేపీ అనుకూల వైఖరి ప్రదర్శిస్తుండటం ఆసక్తికరంగా మారింది. గత నెల 17న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం ఫడ్నవీస్‌ను పార్టీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే ప్రత్యేకంగా కలుసుకున్నారు కూడా! ఎన్సీపీ (శరద్ పవార్) ఎంపీ సుప్రియా సూలే సైతం ఫడ్నవీస్‌ను అభినందించారు. రాష్ట్ర ప్రగతి కోసం ఆయన మిషన్ మోడ్‌లో పని చేస్తున్నారంటూ ప్రస్తుతించారు. ప్రధాన రాజకీయ ప్రత్యర్థులు బీజేపీ సీఎంను ఇలా ఆకాశానికెత్తుతుండటం యాదృచ్ఛికమేమీ కాదన్న అభిప్రాయాలు రాజకీయ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. అవి ఎన్డీఏ వైపు చూస్తున్నాయనేందుకు బహుశా ఇది సంకేతమని విశ్లేషకులు అంటున్నారు. హిందూత్వవాదమే మూల సిద్ధాంతంగా పుట్టుకొచ్చిన శివసేన రాష్ట్రంలో అధికారం కోసం ఐదేళ్ల కింద అనూహ్యంగా తన బద్ధ విరోధి కాంగ్రెస్‌తో జట్టుకట్టడం తెలిసిందే. అప్పటినుంచే పార్టీ పతనం ప్రారంభమైందన్నది పరిశీలకుల మాట. ఈ నేపథ్యంలో ఉనికిని కాపాడుకోవడానికి హిందూత్వవాది అయిన బీజేపీతో స్నేహం తప్పు కాదని ఉద్ధవ్ వర్గం నేతల్లో కొందరంటున్నారు. కానీ అది ఆత్మహత్యా సదృశమే కాగలదని, పార్టీ ఎదుగుదల అవకాశాలు శాశ్వతంగా మూసుకుపోతాయని మరి కొందరు వాదిస్తున్నారు. పైగా ఎన్డీఏలో చేర్చుకుని ఉద్ధవ్ సేనకు చేజేతులారా కొత్త ఊపిరి పోసే పని బీజేపీ ఎందుకు చేస్తుందని ప్రశ్నిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

మాది మనసున్న పార్టీ: రౌత్

సామ్నా సంపాదకీయాన్ని పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్, శివసేన (ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ సమర్థించుకున్నారు. తాము విపక్షంలో ఉన్నప్పటికీ గడ్చిరోలీ జిల్లాకు సీఎం మంచి పనులు చేస్తున్నారు గనుక ప్రశంసిస్తున్నామని చెప్పుకొచ్చారు. ‘‘మాది చాలా పెద్ద మనసున్న పార్టీ. ప్రజలకు మంచి చేస్తే మా ప్రత్యర్థులనైనా ప్రశంసిస్తాం’’ అన్నారు.

ఎన్సీపీల విలీనం!

ఎన్సీపీలో చీలిక నేపథ్యంలో కొన్నేళ్లుగా ఉప్పూ నిప్పుగా ఉంటున్న బాబాయి శరద్ పవార్, అబ్బాయి అజిత్ దగ్గరవుతున్న సంకేతాలు కొద్ది రోజులుగా ప్రస్ఫుటమవుతున్నాయి. విభేదాలకు స్వస్తి పలికి ఇద్దరూ కలిసిపోవాలని అజిత్ తల్లి ఇటీవలే పిలుపునివ్వడం తెలిసిందే. వారిద్దరూ కలిసి పని చేయాలని కోరుకుంటున్నట్లు ఆమె చెప్పారు. అందుకు తగ్గట్టే డిసెంబర్ 12న శరద్ జన్మదినం సందర్భంగా అజిత్ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దాంతో రెండు ఎన్సీపీలు కలిసిపోతాయంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. అది అతి త్వరలోనే జరగవచ్చని పవార్ కుటుంబ అభిమానులు చెప్పుకుంటున్నారు. శరద్ తమకు దేవుడని, పవార్ కుటుంబం ఒక్కటైతే చాలా సంతోషిస్తామని అజిత్ వర్గం ఎంపీ ప్రఫుల్ పటేల్ అన్నారు. శరద్ తన వర్గాన్ని అజిత్ పార్టీలోనే కలిపేసి ఎన్డీయే గూటికి చేరినా ఆశ్చర్యం లేదని మరికొందరు అంచనా వేస్తున్నారు. ఫడ్నవీస్‌కు శరద్ కూతురు సుప్రియ ప్రశంసలు అందులో భాగమేనని వారంటుండగా మరికొందరు ఈ వాదనను కొట్టిపారేస్తున్నారు.

గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు... ఒక్క రోజే 88 మంది మృతి

100కు పైగా హమాస్ స్థావరాలపై దాడులు

జెరూసలేం: గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడుల పరంపర ఉధృతమైంది. గాజా వ్యాప్తంగా జరిగిన వైమానిక, భూతల దాడుల్లో మొత్తంగా 88 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. తమపై రాకెట్ల వర్షం కురిపిస్తున్న హమాస్ సాయుధుల స్థావరాలపైనే తమ దృష్టి కేంద్రీకరించామని ఇజ్రాయెల్ ఆదివారం తెలిపింది. గత మూడ్రోజుల రోజుల వ్యవధిలో మొత్తం 100కుపైగా స్థావరాలపై దాడులు చేశామని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. ఈ మూడ్రోజుల్లో 200 మందికిపైగా చనిపోయారు. మరోవైపు అత్యంత చలిగాలుల బారిన పడి గాజాలో మరో చిన్నారి ప్రాణాలు విడిచింది. తాజా దాడుల్లో సర్వం కోల్పోయి ఆరుబయట, అతుకుల బొంతల టెంట్ల కింద బిక్కుబిక్కున బతుకుతున్న పాలస్తీనియన్ల చలికష్టాలు మరింత పెరిగాయి. తాజా మరణంతో అతిశీతల గాలులకు చనిపోయిన శిశువుల సంఖ్య ఎనిమిదికి పెరిగింది. మరో 15 రోజుల్లో దిగిపోనున్న అమెరికా అధ్యక్షుడు బైడెన్ తాజాగా ఇజ్రాయెల్‌కు 8 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలు అమ్మాలని నిర్ణయించడంతో కొత్త ఆయుధాలతో ఇజ్రాయెల్ మరెంత మారణహోమం చేస్తుందోనన్న ఆందోళనలు ప్రపంచదేశాల నుంచి వ్యక్తమయ్యాయి. మరోవైపు బందీలను అప్పగిస్తే కాల్పుల విరమణకు సిద్ధమన్న ప్రతిపాదనతో ఖతార్‌లో హమాస్ ప్రతినిధులతో చర్చలు మళ్లీ మొదలయ్యాయని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ చెప్పారు. 2023 అక్టోబర్ ఏడో తేదీన ఇజ్రాయెల్ శివారు గ్రామాలపై మెరుపుదాడి చేసిన హమాస్ సాయుధులు 1,139 మందిని పొట్టనబెట్టుకుని, 200కిపైగా ఇజ్రాయెలీలు, విదేశీయులను కిడ్నాప్‌చేసి గాజా స్ట్రిప్‌కు తీసుకురావడం తెల్సిందే. ఈ దాడికి ప్రతీకారంగా భీకరస్థాయిలో దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ ఇప్పటిదాకా గాజా స్ట్రిప్‌లో ఏకంగా 45,800 మంది పాలస్తీనియన్లను చంపేసింది. 23 లక్షల గాజా జనాభాలో దాదాపు 90 శాతం మంది స్వస్థలాలను వదిలి ప్రాణభయంతో వలసపోయారు.

మరింత క్షీణించిన దల్లేవాల్ ఆరోగ్యం

వైద్యులు, ఎస్‌కేఎం నేతల వెల్లడి



చండీగఢ్: పంజాబ్–హరియాణా సరిహద్దుల్లోని ఖనౌరీలో రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ దీక్ష(70) ఆదివారం 41వ రోజుకు చేరుకుంది. ఆయన ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో ఆయన సారథ్యంలోని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం–రాజకీయేతర) తీవ్ర ఆందోళన చెందింది. శనివారం స్ట్రెచర్ పైనుంచే మహా పంచాయత్‌ను ఉద్దేశించి ఆయన 11 నిమిషాలపాటు మాట్లాడారు. తిరిగి దీక్షా శిబిరంలోకి తీసుకెళ్లినప్పటి నుంచి ఆయన ఆరోగ్యం మరింతగా క్షీణించింది. ఆదివారం దల్లేవాల్ మగతలో ఉన్నారని, వాంతులు చేసుకున్నారని ఎన్‌జీవోకు చెందిన డాక్టర్ అవతార్ సింగ్ వెల్లడించారు. మూత్రపిండాలు కూడా క్రమేపీ పనిచేయలేని స్థితికి చేరుకుంటున్నట్లు గ్లోమెరులర్ ఫిల్ట్రేషన్ రేట్(జీఎఫ్ఆర్)ను బట్టి తెలుస్తోందని చెప్పారు. దల్లేవాల్ కనీసం మాట్లాడలేని స్థితిలో ఉన్నారని ఎస్‌కేఎం నేతలు తెలిపారు. ఆయన దీక్షను విరమించినా కీలక అవయవాలు వంద శాతం పూర్తి స్థాయిలో పనిచేస్తాయన్న గ్యారెంటీ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సరిగా నిలుచోలేని స్థితిలో ఉండటంతో బరువును కూడా కచ్చితంగా చెప్పలేకున్నామన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వైద్య సాయం అందించేందుకు పంజాబ్ ప్రభుత్వం ముందుకు రాగా ఆయన తిరస్కరించారు. దీంతో, పంజాబ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలపై ధిక్కారం కింద చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్ సుప్రీంకోర్టు ముందు విచారణకు రానుంది. ఆదివారం దల్లేవాల్‌ను పటియాలా సీనియర్ సూపరింటెండెంట్ నానక్ సింగ్, మాజీ డిప్యూటీ డీఐజీ నరీందర్ భార్గవ్ కలిసి మాట్లాడారు. పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లతో నవంబర్ 26 నుంచి నిరశన దీక్ష సాగిస్తుండటం తెలిసిందే.

ఆప్‌ద నుంచి ఢిల్లీకి విముక్తి

మార్పు కోసం బీజేపీని గెలిపించాలి: మోదీ • ఏ పథకాలనూ రద్దు చేయబోమని హామీ





నమో భారత్ రైలు టికెట్ కొనుగోలు చేస్తున్న ప్రధాని. అనంతరం రైల్లో బాలలతో మాటామంతి

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)పై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై పోరాటం పేరిట పదేళ్ల విలువైన కాలాన్ని ఆ పార్టీ వృథా చేసిందని విమర్శించారు. ఢిల్లీలో పదేళ్లుగా అధికారంలోకి కొనగుతున్నఆప్ ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అవకాశమివ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. దేశ రాజధానిని అద్భుత నగరంగా, ఫ్యూచర్ సిటీగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ప్రస్తుత ప్రజా సంక్షేమ పథకాలు వేటినీ రద్దు చేయబోమని హామీ ఇచ్చారు. వాటి అమలులో అవినీతిని మా త్రం అంతం చేస్తామన్నారు. ఆప్ ప్రభు త్వం ఆపేసిన కేంద్ర పథకాలను కూడా అమ లు చేస్తామన్నారు. మోదీ ఆదివారం ఢిల్లీలో పర్యటించారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. కొన్నింటికి శంకుస్థాపన చేశారు. రోహిణి ప్రాంతంలో బహిరంగ సభ లో ప్రసంగించారు. ‘‘ఆప్ ప్రభుత్వం అంటేనే ఆపద. దాని బారినుంచి ప్రజలకు విము క్తి కల్పించాలన్నదే మా లక్ష్యం’’ అని స్పష్టం చేశారు.

జనం సొమ్ముతో విలాసాలా?

‘‘కేంద్రం ఢిల్లీలో జాతీయ రహదారులను అభివృద్ధి చేసింది. మెట్రో రైలు నెట్‌వర్క్‌ను, నమో భారత్ రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేసింది. భారీ ఆసుపత్రులను నిర్వహిస్తోంది. కానీ స్థానిక రోడ్లపై ఎటు చూసినా గుంతలే. మురుగు నీరు ముంచెత్తుతోంది. ట్రాఫిక్ జామ్‌లు పరిపాటిగా మారాయి. ఇదంతా ఆప్ ప్రభుత్వ నిర్వాకమే’’ అంటూ మోదీ మండిపడ్డారు. కరోనా వేళ జనం కష్టాల్లో ఉంటే పాలకులు మాత్రం అద్దాల మేడ కట్టుకునే పనిలో బిజీగా ఉన్నారని ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఉద్దేశించి దుయ్యబట్టారు. ‘‘ఆ మేడకు చేసిన ఖర్చు చూస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. ప్రజల సొమ్ముతో విలాస జీవితం గడిపారు. ఢిల్లీలో ప్రతి రుతువును ఆప్ సర్కారు ఆపదగా మార్చేసింది. సమస్యలతో జనం అల్లాడుతున్నారు’’ అన్నారు.

ఢిల్లీ చేరిన నమో భారత్ రైలు

నమో భారత్ రైలు ఆదివారం ఢిల్లీలోకి ప్రవేశించింది. ఢిల్లీ–మీరట్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్‌లోని 13 కిలోమీటర్ల సాహిబాబాద్–న్యూ అశోక్ నగర్ మార్గాన్ని మోదీ ఆదివారం ప్రారంభించారు. సాహిబాబాద్ నుంచి న్యూ అశోక్ నగర్ వరకు నమో భారత్ రైలులో ప్రయాణించారు. ప్రయాణికులతో మాట్లాడారు. ఢిల్లీ మెట్రో రైలు నెట్‌వర్క్ నాలుగో దశలో భాగంగా జనక్‌పురి వెస్ట్–కృష్ణపార్కు ఎక్స్‌టెన్షన్ సెక్షన్‌ను ప్రారంభించారు.

ఒక్కసారి వెంబడిస్తే నేరం కాదు

టీనేజర్‌ను నిర్దోషిగా ప్రకటించిన బాంబే హైకోర్టు

నాగ్‌పూర్: బాధితురాలి వెనకాలే ఒకే ఒక్కసారి అనుసరిస్తూ వచ్చాడన్న కారణంగా అతడిని శిక్షించడం కుదరదని బాంబే హైకోర్టు తేల్చిచెప్పింది. అతడిని నిర్దోషిగా ప్రకటించింది. టీనేజీ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఒక బాలునికి స్నేహితుడన్న కారణంతో అతన్నీ నేరస్తునిగా చూడటం తగదని నాగపూర్ ధర్మాసనం పేర్కొంది. పలుమార్లు వెంబడించిన నేరానికి మాత్రమే భారతీయ శిక్షా స్మృతిలోని సెక్షన్ 354డీని ఆపాదించగలమని జస్టిస్ జీఏ సనప్ ఏకసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఏడేళ్ల బాలిక పట్ల ఒక టీనేజీ బాలుడు అనుచితంగా ప్రవర్తించిన కేసులో అతని స్నేహితున్ని కూడా నిందితునిగా బాధితురాలి తల్లి పేర్కొంది. ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని బాలుడు వేధించడంతో బాలిక భయపడి తల్లికి చెప్పింది. ఆమె బాలుని తల్లిదండ్రులను మందలించింది. కానీ కొద్ది రోజులకు అతను బాలిక ఇంట్లోకి చొరబడి ముద్దుపెట్టుకోబోయాడు. అనుచితంగా ప్రవర్తించాడు. బాలిక అక్క అడ్డుకోవడంతో పారిపోయాడు. ఆ సమయంలో అతని వెంట వచ్చి ఇంటి బయట వేచి చూసిన స్నేహితునికీ నేరంలో భాగముందంటూ కేసు నమోదైంది. నదిలో నీళ్లు తెచ్చుకునేందుకు వెళ్లినప్పుడు కూడా నిందితుని వెంట అతనూ వచ్చి తనను అనుసరించాడని బాలిక ఫిర్యాదులో పేర్కొంది. నిందితుని స్నేహితున్ని నిర్దోషిగా పేర్కొంటూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితునికి కింది కోర్టు విధించిన శిక్షను సమర్థించారు.

ప్రియాంక బుగ్గల్లా రోడ్లు

- ‘తండ్రి’ని మార్చిన ఆతిశి
- బీజేపీ నేత బిధూరి వ్యాఖ్యలు



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత, ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా, ఢిల్లీ సీఎం ఆతిశిపై బీజేపీ నేత రమేశ్ బిధూరి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వాటిపై అటు ఆప్, ఇటు కాంగ్రెస్ తీవ్రంగా మండిపడ్డాయి. బిధూరి వెంటనే క్షమాపణ చెప్పాలని, ఆయన తీరుపై బీజేపీ నాయకత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశాయి. కల్కాజీ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అయిన బిధూరి శనివారం ఢిల్లీలో పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ‘కల్కాజీలో రోడ్లను ప్రియాంకా గాంధీ బుగ్గల్లా మారుస్తాం’ అన్నట్లుగా ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఢిల్లీ సీఎం ఆతిశిపైనా విమర్శలు ఎక్కుపెట్టారు. ఆమె ఇంటిపేరు మార్లేనా నుంచి సింగ్‌గా మారింది. ఆమె తన తండ్రినే మార్చేసింది’’ అంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ నేతల సంస్కార రాహిత్యానికి బిధూరి వ్యాఖ్యలు తాజా ఉదాహరణ అని ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఒక మహిళను, పార్లమెంట్ సభ్యురాలిని గౌరవించలేని వ్యక్తికి బీజేపీ టికెటిచ్చిందంటూ కల్కాజీ కాంగ్రెస్ అభ్యర్థి అల్కా లాంబా దుయ్యబట్టారు. బిధూరి వ్యాఖ్యలకు నిరసనగా మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపీగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన బిధూరికి వివాదాస్పద వ్యాఖ్యలు కొత్తేమీ కాదు. గతేడాది లోక్‌సభ సమావేశాల సమయంలో బీఎస్పీ ఎంపీ డానిశ్ అలీపై ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి.

ఆర్జేడీతో స్నేహం ఓ తప్పిదం: నితీశ్




పట్నా: ఎప్పటికప్పుడు పాత మైత్రికి మంగళం పాడి కొత్త స్నేహాలు చేసే జేడీ(యూ) చీఫ్, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ వైరి పక్షం ఆర్జేడీపై విమర్శలు గుప్పించారు. జేడీ(యూ) ప్రస్తుతం ఎన్డీఏతో ఉన్నా ఆ పార్టీకి తమ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. నితీశ్ ఆదివారం ముజఫర్‌పూర్‌లో జరిగిన ప్రగతియాత్ర కార్యక్రమంలో మాట్లాడారు. ‘‘రాష్ట్రంలో మాకంటే ముందు ఆర్జేడీయే అధికారంలో ఉంది. అప్పుడు సూర్యాస్తమయం తర్వాత ఇంటి నుంచి కాలు బయటపెట్టడానికే జనం జంకారు. అలాంటి పార్టీతో పలుమార్లు జట్టుకట్టి నేను తప్పుచేశా. మా పాలనలో మహిళల జీవితాలు మెరుగయ్యాయి. మా హయాంలో జీవిక పేరుతో మొదలైన స్వయం సహాయక బృందాలకే కేంద్ర ప్రభుత్వం ఆజీవిక అని పేరు పెట్టుకుంది’’ అన్నారు.

అమెరికా, యూరప్‌లను... హడలెత్తిస్తున్న మంచు

స్తంభించిన జనజీవనం • రవాణాకు తీవ్ర అంతరాయం

ఆదివారం మంచుమయంగా మారిన ఇంగ్లండ్‌లోని నెర్స్‌బరో ప్రాంతం



వాషింగ్టన్/లండన్: కనీవినీ ఎరగనంతటి భారీ మంచు అమెరికా, యూరప్‌లను హడలెత్తిస్తోంది. అమెరికాలో మంచు తుపాను హెచ్చరికలు జారీ అయ్యాయి. బ్రిటన్‌లో హిమ బీభత్సం కొనసాగుతోంది. పలు దేశాల్లో విమానాలు, రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. వారం పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖలు హెచ్చరిస్తున్నాయి. అమెరికాలో దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంత భారీగా మంచు కురుస్తోందని నేషనల్ వెదర్ సర్వీస్ తెలిపింది. మధ్య అమెరికాలో మొదలైన మంచు తుపాను తూర్పు దిశగా కదులుతోందని హెచ్చరించింది. ప్రయాణాలు చేయకపోవడమే మంచిదని హెచ్చరించింది. కెంటకీ, వర్జీనియా రాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. మామూలుగా చలి అంతగా ఉండని మిసిసిపీ, ఫ్లోరిడా రాష్ట్రాలూ మంచు బారిన పడతాయని హెచ్చరించారు. ఆర్కిటిక్ చుట్టూ పోలార్ వోర్టెక్స్ కారణంగా ఏర్పడుతున్న విపరీతమైన వాతావరణ పరిస్థితులే ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు. వాషింగ్టన్ డీసీ, బాల్టిమోర్, ఫిలడెల్ఫియా నగరాలను మంచు ముంచెత్తుతోంది. వర్జీనియా తదితర చోట్ల 5 నుంచి 12 అంగుళాలు, కాన్సాస్, ఇండియానాల్లో 20 అంగుళాల మేర మంచు పేరుకుంది. మిస్సోరీ, ఇల్లినాయీ, కెంటకీ, వెస్ట్ వర్జీనియాల్లోనూ భారీగా మంచు కురియనుంది. విమాన సర్వీసులు కూడా ప్రభావితమవుతున్నాయి.

బ్రిటన్లో కరెంటు కట్

యూరప్ అంతటా ఆదివారం భారీగా మంచు వర్షం కురిసింది. బ్రిటన్, జర్మనీల్లో ప్రధాన నగరాల్లో హిమపాతంతో ప్రజా జీవనానికి అంతరాయం కలిగింది. విమానాలు నిలిపేశారు. బ్రిటన్లో దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. క్రీడా కార్యక్రమాలన్నీ వాయిదా పడ్డాయి. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రైల్వే సేవలు రద్దయ్యాయి. దక్షిణ ఇంగ్లాండ్‌లో ఎనిమిదో హెచ్చరిక జారీ చేశారు. మరో వారం ఇదే పరిస్థితి కొనసాగనుంది. జర్మనీలో మంచు బీభత్సం దృష్ట్యా బ్లాక్ ఐస్ హెచ్చరికలు జారీ చేశారు. ఇళ్లలోనే ఉండాలని ప్రజలకు సూచించారు. ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయంలో రాకపోకలన్నీ రద్దయ్యాయి. రైలు ప్రయాణాలకు సైతం తీవ్ర అంతరాయం ఏర్పడింది.

గడ్డకట్టిన కశ్మీర్

న్యూఢిల్లీ/శ్రీనగర్: కశ్మీర్ లోయ ఆదివారం మంచుతో తడిసి ముద్దయింది. ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోయాయి. దక్షిణ కశ్మీర్‌లోని కొకెర్‌నాగ్‌లో మైనస్ 8.1 డిగ్రీల సెల్సియస్, గుల్‌మార్గ్‌లో మైనస్ 4, పహల్గాంలో మైనస్ 3.2, శ్రీనగర్‌లో మైనస్ 2.5 డిగ్రీలు నమోదయ్యాయి. హరియాణా, పంజాబ్‌ల్లోనూ అతి శీతల పరిస్థితులు కొనసాగాయి. ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు కమ్మింది. చలి కారణంగా బిహార్, జార్ఖండ్‌ల్లో అన్ని స్కూళ్లకూ 8వ తరగతి దాకా 13వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు.

ఢిల్లీలో పొగ మంచు

ఢిల్లీని ఆదివారం దట్టమైన పొగమంచు కమ్మేసింది. కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని పరిస్థితుల్లో ఆదివారం 18 విమానాలు రద్దయ్యాయి. 250కు పైగా విమానాలు, 60కి పైగా రైళ్ల రాకపోకలు ఆలస్యమయ్యాయి. శనివారం కూడా 48 విమానాలు రద్దవగా 564 విమానాలు ఆలస్యమయ్యాయి.

సాక్షి హైదరాబాద్

సోమవారం | 6 | జనవరి | 2025



రహదారి భద్రత ఎక్కడ?
రహదారి భద్రతా ఉత్సవాలు ప్రహసనంగా మారాయి. ఇలాంటి మాసోత్సవాలు, వారోత్సవాలు మొక్కుబడిగా మారాయి. ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి.
-8లో



కొక్కొరొకోడ్డీ'
సంక్రాంతి వేళ నగరం నుంచి ఆంధ్రాకు పందెం రాయుళ్లతో పాటు పందెం కోళ్లు కూడా వెళ్తున్నాయి. బరిలో దిగేందుకు పాత బస్తీకి చెందిన కోళ్లు కాలు దువ్వుతున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.0/14.0
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు అలుముకుంటుంది. గరిష్టంగా 30, కనిష్టంగా 14 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

దేశాభివృద్ధిలో కాస్ట్ మేనేజ్‌మెంట్, అకౌంటెంట్స్ పాత్ర కీలకం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ




సంస్థ ప్రతినిధులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

పంజగుట్ట: దేశాభివృద్ధిలో కాస్ట్ మేనేజ్‌మెంట్, అకౌంటెంట్స్ పాత్ర కీలకమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆదివారం సోమాజిగూడలోని కత్రియా హోటల్‌లో ది ఇనిస్టిట్యూట్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలను గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థ గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించడం కేవలం కార్పొరేట్ విజయానికి పునాది కాదని, భారత ఆర్థిక స్థిరత్వం, గ్లోబల్ పోటీకి మూలస్తంభం అని పేర్కొన్నారు. ప్రొఫెషనల్, ప్రామాణికత, సామాజిక సేవ, దేశాభివృద్ధి పట్ల చేసిన దీర్ఘకృషికి నిదర్శనమన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే ఆకాంక్ష, సవాళ్లతో కూడిన లక్ష్యమన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు వినూత్న వ్యూహాలు, సామర్థ్యాలు అవసరమన్నారు. దేశ లక్ష్యాలను సాధించడంలో ఇనిస్టిట్యూట్ చేసిన ప్రయత్నాలు సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనే సిద్ధాంతాలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఐసీఎంఏ హైదరాబాద్ చైర్‌పర్సన్ డాక్టర్ లావణ్య కందురి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస ప్రసాద్, మూర్తి, దల్వాడి అశ్విన్ కుమార్ పాల్గొన్నారు.

'కుంభమేళా'పై సైబర్ నేరగాళ్ల కన్ను!

- టికెట్ల బుకింగ్, వసతి పేరిట యాత్రికులకు వల
- నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లతో మోసాలు
- డిస్కౌంట్లు, ఆఫర్లను చూసి తొందరపడొద్దు
- అప్రమత్తంగా ఉండాలని సైబర్ పోలీసుల సూచన




సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కుంభమేళా–2025కు వెళ్లాలని మీరు ప్లాన్ చేస్తున్నారా? కుంభమేళా ప్రయాణ టికెట్లు, వసతి తదితర సేవల మాటున సైబర్ నేరగాళ్ల ప్రమాదం పొంచి ఉంది. డిస్కౌంట్లు, ఆఫర్లు ఉన్నాయని అత్యాశతో తొందరపడ్డారో అసలుకే ఎసరొచ్చే ప్రమాదం ఉంది. ఏమరుపాటుగా ఉంటే సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి జేబులు ఖాళీ చేసుకునే ప్రమాదం ఉంది. నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లతో యాత్రికులు, భక్తులకు వల వేసే ప్రమాదం ఉందని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. కుంభమేళా టికెట్ల బుకింగ్ పేరుతో యాత్రికులను మోసం చేసిన పలు కేసులు ప్రయాగ్‌రాజ్‌లో నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. నగరంలో ఈ తరహా కేసులు నమోదు కాకపోయినప్పటికీ యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

నకిలీ వెబ్‌సైట్లు, యాప్స్..

కుంభమేళాకు లక్షలాది మంది యాత్రికులు వెళుతుంటారు. దీన్ని సైబర్ నేరస్తులు మోసాలకు అవకాశంగా మలుచుకునే ప్రమాదం ఉంది. కుంభమేళా ప్రయాణ టికెట్లు, వసతి ఇతరత్రా సేవల కోసం నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లను సృష్టించి సామాజిక మాధ్యమాలలో పోస్టు చేస్తున్నారు. భారీ డిస్కౌంట్లు, ఆఫర్లను ప్రకటిస్తూ యాత్రికులను ఆకర్షిస్తున్నారు. కాటేజీలు, టెంట్లు, హోటళ్లను అద్దెకు తీసుకునేందుకు నకిలీ బుకింగ్ వెబ్‌సైట్‌లతో యాత్రికులను లక్ష్యంగా చేసుకునే సైబర్ నేరస్తులు మోసాలకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా.. ప్రత్యేక వీఐపీ స్నానపు గదులు, ప్రీమియం ఏర్పాట్లతో నకిలీ ప్లాట్‌ఫారమ్‌లను సృష్టించి భక్తులను మోసం చేస్తున్నారు. అడ్వాన్స్ బుకింగ్ లు, ప్రత్యేక ఏర్పాట్ల ముసుగులో యాత్రికులను మోసం చేస్తూ భారీగా డబ్బులు దండుకుంటున్నారు.

అధీకృత ప్లాట్‌ఫామ్‌లనే ఎంచుకోవాలి..

కుంభమేళాకు వెళ్లే యాత్రికులు బుకింగ్ ప్లాట్‌ఫామ్‌లను క్షుణ్ణంగా ధ్రువీకరించుకోవాలని, రిజర్వేషన్‌ల కోసం ప్రభుత్వ అధీకృత వెబ్‌సైట్‌లపై మాత్రమే ఆధారపడాలని పోలీసులు సూచిస్తున్నారు. అనుమానాస్పద, గుర్తు తెలియని వెబ్‌సైట్లు, లింక్‌లను ఎట్టి పరిస్థితులను క్లిక్ చేయకూడదు. అలాగే.. అయాచిత లింక్‌లు లేదా నమ్మశక్యం కాని డిస్కౌంట్లను అందించే ప్రకటనలను విశ్వసించకూడదు. సురక్షిత చెల్లింపు పద్ధతులను వినియోగించాలి. అంతేకాకుండా.. రిజర్వేషన్ల బుకింగ్ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులతో బ్యాంక్ వివరాలు, ఇతరత్రా వ్యక్తిగత వివరాలను సమర్పించకూడదు.



ఆదివారం రాత్రి విద్యుత్ వెలుగుల మధ్య ఆరాంఘర్- జూ పార్కు ఫ్లై ఓవర్

ఆరాంసే రయ్ రయ్

- నేడు ఆరాంఘర్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించనున్న సీఎం
- రూ.799.74 కోట్ల ఎస్ఆర్‌డీపీ నిధులతో నిర్మాణం
- 6 లేన్లు, 4 ర్యాంపులతో 4.04 కి.మీ పొడవు

చార్మినార్: ఆరాంఘర్ ఫ్లై ఓవర్ ప్రారంభం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వాహనదారులకు శుభవార్త. జూపార్కు నుంచి ఆరాంఘర్ వరకు 6 లేన్లతో నిర్మించిన ఫ్లై ఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం ప్రారంభించనున్నారు. ఫ్లై ఓవర్‌ను గత డిసెంబర్‌లోనే ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేసినప్పటికీ.. కొన్ని సాంకేతిక కారణాలతో వాయిదా పడింది. ప్రజా పాలన విజయోత్సవాలను పురస్కరించుకుని గత నెల 8న అంటూ ఒకసారి.. కాదు కాదు 9 అంటూ మరోసారి ఏర్పాట్లు చేసినప్పటికీ వీలు పడలేదు. ఎట్టకేలకు నేడు ఆరాంఘర్ ఫ్లై ఓవర్ ప్రారంభానికి మోక్షం వచ్చింది.

మూడేళ్లుగా తప్పని తిప్పలు..

స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్ఆర్‌డీపీ) కింద 2021 డిసెంబర్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను ప్రారంభించారు. రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ.. పలు సాంకేతిక కారణాలతో జాప్యం ఏర్పడింది. మూడేళ్లుగా పనులు కొనసాగడంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. పూర్తిగా శిథిలావస్థకు చేరిన రోడ్లతో పడరాని పాట్లు పడ్డారు. 4.04 కిలో మీటర్ల పొడవుతో నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ఆయా ప్రాంతాల్లోని వాహనదారులు ఇబ్బందులకు గురవుతూ వచ్చారు.

తీరనున్న ట్రాఫిక్ కష్టాలు..

నగరంలో ఇప్పటికే ఆరు లేన్ల ఫ్లై ఓవర్‌లున్నప్పటికీ.. 4.04 కిలో మీటర్ల పొడవుతో ఉన్న ఈ ఫ్లై ఓవర్ వీటిలో మరొకటి. పీవీఎన్ఆర్, బహదూర్‌పురా, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు.. ఇలా పొడవైన ఫ్లై ఓవర్లున్నప్పటికీ.. 6 లేన్లతో 4 అప్ అండ్ డౌన్ ర్యాంపులతో జూపార్కు- ఆరాంఘర్ ఫ్లై ఓవర్‌ను నిర్మించడం గమనార్హం. రూ.799.74 కోట్ల వ్యయంతో నిర్మితమైన ఈ ఫ్లై ఓవర్ ఆరాంఘర్, శాస్త్రీపురం, మీరాలం ఫిల్టర్, కాలాపత్తర్, శివరాంపల్లి, హసన్‌నగర్ తదితర ప్రాంతాల ప్రజలకు ఎంతో అనుకూలంగా మారనుంది. బెంగళూరు జాతీయ రహదారిలో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.

అక్షరాలా రూ.2,739 కోట్లు!



నగరంలో 'వైట్ కాలర్' మోసగాళ్లు కాజేసిన మొత్తమిది

- 2023, 2024 గణాంకాల్లో వెల్లడి
- చక్కదిద్దేందుకు చర్యలు అన్వేషిస్తున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: రోజుకు రూ.3.8 కోట్లు.. వారానికి రూ.26.6 కోట్లు... నెలకు రూ.114.1 కోట్లు... ఏడాదికి రూ.1,369.5 కోట్లు. నగరంలో 'వైట్ కాలర్' నేరగాళ్లు కాజేసిన మొత్తమిది. 2023, 2024లలో నమోదైన మోసాల కేసుల్లో నగరవాసులు కోల్పోయింది అక్షరాలా రూ.2,739 కోట్లు. 'వైట్ కాలర్' మోసగాళ్లు రెచ్చిపోవడానికి అనేక అంశాలు కలిసి వస్తుండటం గమనార్హం.

ఆశ, నమ్మకాలే పెట్టుబడి...

'వైట్ కాలర్' మోసగాళ్లు ఎదుటి వారిలో ఉన్న ఆశ, వారి నమ్మకాలే పెట్టుబడిగా చేసుకుని దండుకుంటుంటారు. ఎదుటి వ్యక్తులనో, సంస్థనో పక్కాగా నమ్మించగలిగితే చాలు. ఒక్కోసారి వీరి 'లాభం' రూ.కోట్లలోనూ ఉంటుంది. ఈ కారణంగానే వైట్‌కాలర్ అఫెండర్లు ఓ పక్క నేరుగా, మరోపక్క సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ ద్వారా అందినకాడికి దండుకుంటున్నారు.

కఠిన చట్టం అవసరం

మోసగాళ్లను కట్టడి చేయడానికి మరిన్ని కఠిన చట్టాలు అవసరం. ప్రస్తుతం కేవలం డిపాజిటర్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌తో నమోదైన కేసులతో పాటు మనీ లాండరింగ్ యాక్ట్ కింద కేసుల్లో మాత్రమే నిందితుల ఆస్తులను స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. అలా కాకుండా ప్రతి ఆర్థిక నేరంలోనూ ఈ విధానం అమలయ్యేలా మార్పులు రావాలి. దీనికితోడు చోరీలు, దోపిడీలు చేసే వారితో పాటు ఇలాంటి వైట్ కాలర్ నేరగాళ్ల పైనా నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది. మోసగాళ్లు కాజేసిన మొత్తం ఆధారంగా శిక్షలు ఉండేలా చర్యలు తీసుకోవాలి.
– ప్రభాకర్, మాజీ డీఎస్పీ

చిక్కినా శిక్షలు తక్కువే..

ఈ మోసగాళ్లకు చట్టంలో ఉన్న లొసుగులే కలిసి వస్తున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న చట్ట ప్రకారం రూ.లక్ష మోసం చేసినా... రూ.10 కోట్లు మోసం చేసినా చీటింగ్ ఆరోపణలపై ఒకే సెక్షన్‌తో కేసులు నమోదవుతాయి. ఆ మోసం చేయడానికి అనుసరించిన మార్గాన్ని బట్టి ఇంకొన్ని సెక్షన్లు అదనంగా వచ్చి చేరే అవకాశం ఉంటుంది. ఎదుటి వారిని మోసం చేయడానికి పత్రాలు తయారు చేసినా, ఇతర గుర్తింపులు చూపించినా ఫోర్జరీ, ఇంపార్సినేషన్ తదితరాలను జోడిస్తారు. న్యాయస్థానంలో నేరం నిరూపితమైనప్పుడు అది నమోదైన సెక్షన్ ప్రకారమే శిక్ష ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎంత పెద్ద మొత్తం కాజేసినా మోసగాళ్లు తక్కువ శిక్షలతో బయటపడుతున్నారు.



చక్కదిద్దే చర్యలు ప్రారంభం...

ఈ పరిస్థితుల్ని బేరీజు వేసిన పోలీసు విభాగం కొన్ని చక్కదిద్దే చర్యల్ని ప్రారంభించింది. ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు నానాటికీ పేట్రేగుతుండటం, ఆర్థిక నేరాల వల్లే ప్రజలు ఎక్కువ నష్టపోవడాన్ని పరిగణనలోకి తీసుకుని అనేక చర్యలకు ఉపక్రమించారు. ప్రాథమికంగా అధికారులకు దర్యాప్తు తీరుతెన్నుల్లో మెలకువలు నేర్పిస్తున్నారు. సీసీఎస్ అధికారులకు అనుభవజ్ఞులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. సైబర్, ఎకనమిక్ నేరాల దర్యాప్తుపై తర్ఫీదు ఇవ్వడంతో పాటు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నారు. తీవ్రమైన నేరాల్లో ఆదాయపుపన్ను శాఖతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు సమాచారం ఇస్తున్నారు.

కొత్త తలనొప్పులు..

'వైట్ కాలర్' నేరాల్లో సైబర్ క్రైమ్ కూడా ఒకటి. సైబర్ నేరాలకు పాల్పడుతున్న నేరగాళ్లు చిక్కే అవకాశాలు చాలా తక్కువగా ఉంటున్నాయి. ఎన్ని వ్యయ ప్రయాసలకోర్చినా పాత్రధారులు, దళారులు తప్ప సూత్రధారులు చిక్కట్లేదు. కొన్ని సందర్భాల్లో ఈ నేరాలపై ఎవరికి ఫిర్యాదు చేయాలన్నది సామాన్యులకు స్పష్టంగా తెలియక, స్థానిక పోలీసుల నుంచి సరైన స్పందన లేక అనేక కేసులు నమోదు కావట్లేదు. నమోదైనా అవసరమైన స్థాయిలో దర్యాప్తు ఉండట్లేదు. ఇంటర్నెట్ కేంద్రంగా చోటు చేసుకుంటున్న సైబర్ నేరాల్లో 50 శాతం కూడా నమోదు కావట్లేదు. నమోదైన నేరాల్లో సగానికి సగం కూడా కొలిక్కి రావట్లేదు. ఇక వీరి నుంచి నగదు రికవరీ అనేది దుర్లభం. కేసు నమోదై, దర్యాప్తు పూర్తి అయినప్పటికీ... కోర్టు విచారణ ప్రక్రియ ముగియడానికి చాలా సమయం పడుతోంది. అప్పటి వరకు వేచి ఉండేందుకు ఆసక్తి చూపని బాధితులు మధ్యలోనే మోసగాళ్లతో రాజీ పడుతున్నారు.

నగరంలో నమోదైన నేరాల గణాంకాలు..

- 2023లో సీసీఎస్ పోలీసులు నమోదు చేసిన 361 వైట్ కాలర్ అఫెన్సెస్ రూ.1355 కోట్లు, 2984 సైబర్ నేరాల్లో బాధితులు రూ.147 కోట్లు నష్టపోయారు.
- 2024లో (నవంబర్ వరకు) సీసీఎస్ పోలీసులు నమోదు చేసిన 248 వైట్ కాలర్ అఫెన్సెస్‌లో రూ.1036 కోట్లు, 2868 సైబర్ నేరాల్లో రూ.38 కోట్లు బాధితులు కోల్పోయారు.

ముగ్గుర్ని కబళించిన కంటైనర్

- మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద రోడ్డు ప్రమాదం
- దంపతులు సహా కుమార్తె దుర్మరణం
- కుమారుడి పరిస్థితి విషమం
- మిత్రుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తుండగా విషాదం



మృతులు లావణ్య, బుల్లబ్బాయ్ (ఫైల్)



హర్షితాదేవి (ఫైల్)



ప్రమాద స్థలంలో మృతదేహాలు

మేడ్చల్‌రూరల్: ప్రమాదానికి గురై ఆపదలో ఉన్న వారిని పరామర్శించేందుకు వెళ్తున్న ఓ కుటుంబంలోని ముగ్గుర్ని కంటైనర్ వాహనం కబళించింది. ఈ విషాదకర ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ కాకినాడలోని ఎర్రవరంనకు చెందిన సాగి బుల్లబ్బాయ్ (35), భార్య లావణ్య (25), కూతురు హర్షితాదేవి (8), కుమారుడు సిద్ధేశ్వర్ (6)లతో కలిసి బతుకుదెరువు కోసం కొన్నాళ్ల క్రితం నగరానికి వలస వచ్చి ఉప్పల్ ప్రాంతంలో ఉంటున్నారు. బుల్లబ్బాయ్ ఉదయం పూట ఇడ్లీ (టిఫిన్స్) అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కాకినాడ ప్రాంతానికే చెందిన బుల్లబ్బాయ్ స్నేహితుడైన జోక వెంకటేశ్వర్‌రావు కుటుంబం మేడ్చల్ మండలం ఎల్లంపేట్ గ్రామంలో నివాసం ఉంటూ టిఫిన్స్ వ్యాపారం చేస్తోంది. కొన్ని రోజుల క్రితం వెంకటేశ్వర్‌రావు భార్య ప్రమాదానికి గురై చేతికి ఫ్రాక్చర్ అయింది. వీరిని పరామర్శించేందుకు ఆదివారం బుల్లబ్బాయ్ కుటుంబం (నలుగురు) తమ టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనంపై ఉప్పల్ నుంచి ఎల్లంపేట్‌కు వెళ్తోంది. మేడ్చల్ చెక్‌పోస్ట్ సమీపానికి చేరుకున్న వీరి ద్విచక్ర వాహనాన్ని వెనక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ వాహనం ఢీకొట్టింది. దీంతో టీవీఎస్‌పై ఉన్న బుల్లబ్బాయ్, ఆయన భార్య లావణ్య, కూతురు హర్షితా దేవి, కుమారుడు సిద్ధేశ్వర్ రోడ్డుపై పడిపోయారు. వీరిపై నుంచి కంటైనర్ వెళ్లడంతో దంపతులతో పాటు కుమార్తె అక్కడికక్కడే మృతి చెందారు. సిద్ధేశ్వర్ రెండు కాళ్లూ నుజ్జునుజ్జయ్యాయి. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మేడ్చల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రో భూసేకరణలో మరో అడుగు

- ప్రభావిత ఆస్తుల యజమానులకు చెక్కుల పంపిణీ నేడు
- హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: పాత నగరంలో రెండో దశ మెట్రో పనుల్లో మరో అడుగు పడింది. రోడ్డు విస్తరణలో భాగంగా ఆస్తులు కోల్పోయిన యజమానులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించడానికి ముహూర్తం ఖరారైంది. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు చెక్కులు పంపిణీ చేయనున్నారు. రెండో దశ కారిడార్–6లో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ మార్గంలో 1,100 ఆస్తులు ప్రభావితం కానున్నాయి. యజమానులు స్వచ్ఛందంగా తమ స్థలాలను మెట్రో రైలు నిర్మాణం కోసం ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 169 మంది అనుమతి పత్రాలను అందజేశారని చెప్పారు. వీరిలో 40కి పైగా ఆస్తుల యాజమాన్యానికి సంబంధించిన ధ్రువీకరణ పూర్తయిందన్నారు. తొలి దశలో ఈ 40కి పైగా ఆస్తుల యజమానులకు నష్ట పరిహారాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెక్కుల రూపంలో అందజేస్తారని ఆయన తెలిపారు. ప్రభావిత ఆస్తులకు చదరపు గజానికి రూ.81,000 చొప్పున అందజేయనున్నారు. దీంతో పాటు రిలీఫ్ అండ్ రిహాబిలిటేషన్ చట్టం ప్రకారం, పునరావాస పరిహారం, తొలగించే నిర్మాణాలకు కూడా నష్ట పరిహారాన్ని అర్హులైన ఆస్తుల యజమానులకు ఇవ్వనున్నట్లు ఎన్వీఎస్ స్పష్టం చేశారు. లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్‌లో చెక్కులు అందజేస్తామని ఆయన తెలిపారు.



నుమాయిష్.. న్యూ జోష్!



కొత్త సంవత్సరం.. తొలి ఆదివారం. సెలవు రోజు. ఇంకేం.. నుమాయిష్‌కు సందర్శకులు పోటెత్తారు. నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన జోరుగా కొనసాగుతోంది. ఆదివారం భారీ సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు.



రహదారి భద్రత ఎక్కడ?

- మొక్కుబడిగా వాహనాల తనిఖీలు.. సామర్థ్య నిర్ధారణ పరీక్షలు
- అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనలు
- ఏటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- ఏడాదికోసారి రహదారి భద్రతా ఉత్సవాలతో ప్రయోజనం నిల్



సాక్షి, సిటీబ్యూరో: అపరిమితమైన వేగంతో దూసుకొచ్చే వాహనాలు బెంబేలెత్తిస్తాయి. ప్రాణాలను హరిస్తాయి. రహదారులపైన రక్తపాతం సృష్టిస్తాయి. మొబైల్‌ఫోన్‌లో మాట్లాడుతూనే గంటలతరబడి బండ్లు నడిపే వాహనదారులు ఎక్కడ ఢీకొంటారో తెలియదు. సిటీ రోడ్లపైన ర్యాష్ డ్రైవింగ్ సర్వసాధారణంగా మారింది. ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా నిబంధనలు అడుగడుగునా ఉల్లంఘనకు గురవుతూనే ఉన్నాయి. వాహనదారుల్లో అవగాహనా రాహిత్యం, ప్రభుత్వ విభాగాల్లో నిర్లిప్తత రహదారిభద్రతకు పెనుసవాల్‌గా మారింది. ఏటేటా రహదారి భద్రతా ఉత్సవాలు ఒక ప్రహసనంగా మారాయి. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఇటీవల ఖైరతాబాద్ రవాణా కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వయంగా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రోడ్డు భద్రతా గోడపత్రికలు, కరపత్రాలు, తదితర ప్రచార సామాగ్రిని ఆవిష్కరించారు. అయితే..ఇలాంటి మాసోత్సవాలు, వారోత్సవాలు ప్రతి సంవత్సరం మొక్కుబడిగా మారాయి. కానీ ప్రమాదాలు మాత్రం ఏటేటా పెరుగుతూనే ఉన్నాయి.

మొక్కుబడిగా రోడ్డు భద్రతా విభాగం ...

రోడ్డుప్రమాదాల నియంత్రణకు రవాణాశాఖ నేతృత్వంలో రహదారిభద్రతా కమిటీని ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆర్టీఏ, పోలీస్, మెడికల్, ఆర్అండ్‌బి, జాతీయ రహదారుల సంస్థ, తదితర విభాగాలతో కమిటీని ఏర్పాటు చేశారు. నేషనల్ హైవేస్‌తో పాటు వివిధ రకాల రహదారుల్లో ఇంజనీరింగ్‌లోపాలను గుర్తిస్తూ ఎప్పటికప్పుడు పునరుద్ధరణ చర్యలు చేపట్టవలసి ఉంటుంది. అలాగే ఈ కమిటీ తరచుగా సమావేశమై రోడ్డు ప్రమాదాలపైన సమీక్షించాలి. ఎక్కడెక్కడ ఏయే కారణాల వల్ల ప్రమాదాలు జరిగాయనే వివరాలను నమోదు చేస్తూనే వాటి నివారణకు చేపట్టవలసిన చర్యలపైన ఆయా విభాగాలను అప్రమత్తం చేయవలసి ఉంటుంది. గతంలో రహదారులను ఆనుకొని మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నట్లు గుర్తించారు. ఇలాంటి వైన్‌షాపులను దూరంగా తరలించాలని ప్రతిపాదించారు. కానీ ఇది పూర్తిస్థాయిలో అమలుకు నోచడం లేదు. మరోవైపు ప్రతి నాలుగైదు కిలోమీటర్లకు ఒకటి చొప్పున ట్రామా కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన కూడా అమల్లోకి రాలేదు. చాలావరకు రోడ్డు ప్రమాదాల్లో మొదటి గంట ఎంతో కీలకమైంది. గోల్డెన్ టైమ్‌గా భావిస్తారు. ఆ మొదటి గంటలో సత్వరవైద్యం అందితే ప్రాణాలను కాపాడవచ్చు. కానీ సత్వర వైద్యసదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్లనే వందలాది మంది నిస్సహాయంగా తనువు చాలిస్తున్నారు.

గ్రేటర్‌లో రోడ్డు ప్రమాదాల తీరు ఇది...

అంశం	2023		2024	
వాహనాలు	ప్రమాదాలు	మృతులు	ప్రమాదాలు	మృతులు
పాదచారులు	290	299	256	261
సైకిల్	10	10	10	10
మోటార్ సైకిల్	418	444	447	465
ఆటో/ట్రాలీ ఆటో	24	24	30	27
లైట్ మోటార్ వెహికిల్స్	44	57	43	53
హెవీ వెహికిల్స్	26	32	19	26
మొత్తం	812	866	805	842

ఏదీ ఎన్‌ఫోర్స్‌మెంట్...

కాలం చెల్లిన వాహనాలు రోడ్లపైన పరుగులు తీసినా, సామర్థ్యం లేని బస్సులు, వ్యాన్‌లు తదితర వాహనాల్లో ప్రయాణికులను తరలించినా రవాణాశాఖ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి వదిలేస్తున్నారు. బడి బస్సుల సామర్థ్యం కూడా తరచుగా ప్రశ్నార్థకమవుతుంది. అనుభవం లేని డ్రైవర్లు, మైనర్లు యథేచ్ఛగా బండ్లు నడుపుతున్నారు. డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసే సమయంలోనే డ్రైవింగ్‌లో నైపుణ్యాన్ని కచ్చితంగా అంచనా వేసే వ్యవస్థ లేకపోవడం వల్ల లైసెన్సుల జారీ కూడా ఒక ప్రహసనంగా మారింది. రోడ్డుభద్రతను లక్ష్యంగా చేసుకొని ఎలాంటి నిఘా, ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థలు పని చేయడం లేదు. మరోవైపు రవాణా, ట్రాఫిక్ విభాగాల మధ్య సమన్వయలేమి వల్ల కూడా వాహనదారులు ఎక్కడా నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లోనూ రాష్ డ్రైవింగ్ ప్రమాదఘంటికలను మోగిస్తోంది. రోడ్లకు కుడివైపున వెళ్లవలసిన సిటీబస్సులు, నాలుగుచక్రాల వాహనాలు ఏకంగా ఎడమవైపు వచ్చి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రోడ్డు దాటే పాదచారుల ప్రాణాలను బలిగొంటున్నాయి.

సామర్థ్యం ఉందా, లేదా...

బస్సులు, లారీలు, ఆటోలు, తదితర ప్రజారవాణా, వస్తురవాణా రంగాలకు చెందిన వాహనాల సామర్థ్యాన్ని నిర్ధారించడంలో రవాణాశాఖ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది. కొందరు ఎంవీఐలు, సిబ్బంది అక్రమార్జనకు అలవాటు పడి సామర్థ్యం లేని వాహనాలకు సైతం ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు భద్రతా నిబంధనల్లో వాహనాల కండీషన్‌కు ప్రాధాన్యతనిచ్చారు. కానీ ఆ కండీషన్‌ను గుర్తించవలసిన అధికారులు, యంత్రాంగం మాత్రం విఫలమవుతోంది.

ఈ ఏడాది పర్వహ్-కేర్..

ఈ సంవత్సరం జాతీయ స్థాయిలో 'పర్వహ్-కేర్' అనే నినాదంతో రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. రోడ్డుపైన వాహనాలు నడిపేటప్పుడు శ్రద్ధగా, జాగ్రత్తగా నడపాలి అని కోరుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

- సీట్‌బెల్ట్, హెల్మెట్ వంటి నిబంధనలతో పాటు మద్యం సేవించి వాహనాలు నడుపరాదు. అతివేగం ప్రమాదకరం.
- సరైన కండీషన్ లేని వాహనాలను వినియోగంచరాదు.
- డ్రైవింగ్ లైసెన్సులు, వాహనధృవీకరణ పత్రాలు తప్పనిసరిగాఉండాలి.
- పరిమితికి మించి స్కూల్ బస్సుల్లో పిల్లలను తరలించరాదు..
- పాఠశాల బస్సులు, ప్రజారవాణా వాహనాలకు అనుభవం, నైపుణ్యం ఉన్న డ్రైవర్లను మాత్రమే ఏర్పాటు చేయాలి.

క్లుప్తంగా

అనారోగ్యంతో కానిస్టేబుల్ ఆత్మహత్య



భానుశంకర్ (ఫైల్)

అంబర్‌పేట: అనారోగ్యం, పని ఒత్తిడి తట్టుకోలేక ఓ కానిస్టేబుల్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం ప్రకారం..బాగ్ అంబర్‌పేట మల్లిఖార్జున్ నగర్‌లో కానిస్టేబుల్ జంగం భానుశంకర్ (47) భార్య నేత్రావతి, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. ఇతను పరిగి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భానుశంకర్ ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. దానికి తోడు నిత్యం విధులకు పరిగి వెళ్లి రావడంతో ఒత్తిడికి గురవుతున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా అతను తన బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు నిద్రపోయేందుకు వెళ్లాడని భావించారు. కొద్దిసేపటి తర్వాత బెడ్ రూమ్‌లోకి వెళ్లి చూడగా అతను ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. హుటాహుటిన భానుప్రసాద్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఎస్పీ బలోపేతమే లక్ష్యం

తుర్కయంజాల్: జిల్లాలో బీఎస్పీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లాటి రాములు అన్నారు. పురపాలక సంఘం పరిధి మన్నెగూడలో ఆదివారం మున్సిపాలిటీ అధ్యక్షుడు పట్నం రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనకళ్యాణ్ దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయని విమర్శించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి బీఎస్పీ గురించి వివరించడంతో పాటు పలువురికి సభ్యత్వాలు అందజేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు గుండె శ్రీనివాస్, కోశాధికారి బి.మహేందర్, నాయకులు మందరాజు, మేతరి కుమార్, జంతుక సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ఇస్తేమా



ఇస్తేమా అనంతరం ఇళ్లకు బయలుదేరిన ముస్లింలు

శంకర్‌పల్లి: పట్టణ శివారులోని జంబోరీ గ్రౌండ్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన ఇస్తేమా కార్యక్రమం ఆదివారం మధ్యాహ్నం పూర్తయింది. కార్యక్రమానికి చివరి రోజు కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు, హైదరాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. నిర్వాహకులు దీనికి అనుగుణంగానే ఏర్పాట్లు చేయడంతో ఎక్కడా ఇబ్బందులు తలెత్తలేదు. కార్యక్రమం ముగిసిన అనంతరం అందరూ ఒకేసారి బయటకు రావడంతో శంకర్‌పల్లి నుంచి పటాన్‌చెరు వైపు వెళ్లే ప్రధాన రహదారిపై కాసేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు శ్రమించి ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్

తుర్కయంజాల్: మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి వేతనాలను పెంచకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీష్ హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తుర్కయంజాల్‌లో మున్సిపల్ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎమ్ఆర్, ఫిక్స్ డ్ పే తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, 2వ పీఆర్సీ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, దాసు, మహేష్, వెంకటేష్, భాగ్యమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై దాడి హేయం

మహేశ్వరం: ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు బోడ సామెల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్కు ప్రకాశ్ కారత్ అధ్యక్షతన మహేశ్వరంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామెల్ మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధానికి 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భక్తి ముసుగులో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రధానోపాధ్యాయుడిని అసభ్య పదజాలంతో దూషించి దాడి చేయడంతో పాటు 8వ తరగతి విద్యార్థి కాళ్లు మొక్కించడం సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. ప్రధానోపాధ్యాయుడిపై దాడి జరిగి రెండు వారాలు గడుస్తున్నా ఇంతవరకు జిల్లా కలెక్టర్, విద్యాశాఖ, పోలీసు అధికారులు, శాసన సభ్యులు, ఎంపీ స్పందించక పోవడం దారుణమన్నారు.

మానవత్వం చాటిన కానిస్టేబుల్ కుటుంబం

- రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి
- అవయవాలను దానం చేసిన కుటుంబం



కానిస్టేబుల్ ప్రశాంత్‌రెడ్డి (ఫైల్)

ఉప్పల్/కందుకూరు: రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి చెందగా వారి కుటుంబీకులు అవయవ దానం చేసి పలువురి ప్రాణాలను కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పెద్దోళ్ల ప్రశాంత్‌రెడ్డి నాలుగేళ్లుగా కందుకూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గతనెల 28న విధులు ముగించుకుని బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో పహడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీంతో ప్రశాంత్‌రెడ్డి తండ్రి రిటైర్డ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాగిరెడ్డి, తల్లి సౌమ్య జీవన్‌దాన్‌కు కిడ్నీలు, కాలేయం దానం చేశారు. తమ బిడ్డ ప్రాణం పోయిన బాధలోనూ అవయవదానానికి ముందుకు రావడంపై రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు వారిని అభినందించారు. శాఖాపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. అవయవదానం చేసిన వారు భౌతికంగా మరణించినప్పటికీ జీవించి ఉన్నట్లేనని, అవయవదానంతో మరొక మనిషికి ప్రాణం పోయడం గొప్ప విషయమన్నారు. ఉప్పల్‌లో ఆదివారం జరిగిన ప్రశాంత్ రెడ్డి అంత్యక్రియల ఖర్చులకు రూ.90 వేలు మంజూరు చేశారు. సీపీ తరఫున మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ సీతారాం, రాచకొండ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ భద్రారెడ్డి, కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సువర్ణ, సహచరులు అంత్యక్రియలకు హాజరయ్యారు.


అట్టహాసంగా అవార్డుల పంపిణీ



రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్ ప్రాంగణంలో ఆదివారం రాత్రి తెలంగాణ ఎలైట్ బ్రాండ్ అవార్డ్స్–2024 సీజన్–2 కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. గ్లోబల్ పినాకిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్య, శిక్షణ, స్టార్టప్, వ్యాపార, ఫ్యాషన్ ఇండస్ట్రీ, యంగ్ అచీవర్స్ వంటి రంగాలలోని వారికి అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో కెనడా మాజీ మంత్రి లీలా షరోన్ అహీర్, అర్జున అవార్డు గ్రహీత అనూప్‌కుమార్, సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా వివిధ రంగాలలో ప్రతిభ చూపినవారికి అవార్డులను అందించారు. అవార్డులు పొందిన వారిలో మహిళలే అధికంగా ఉండటం విశేషం.

మాంజా..పంజా!

- నిషేధం ఉన్నా చైనా మాంజా విక్రయం
- పక్షులతో పాటు మనుషులకూ డేంజరే
- 2023 కంటే 2024లో పెరిగిన కేసులు
- నిఘా ముమ్మరం చేసిన సిటీ టాస్క్‌ఫోర్స్



సాక్షి, సిటీబ్యూరో/చార్మినార్: సంక్రాంతి సీజన్ వచ్చిందంటే పతంగులు ఎంత ఆహ్లాదాన్ని ఇస్తాయో...వాటిని ఎగరవేయడానికి చైనా మాంజా వాడటం అంతటి ప్రమాదహేతువుగా మారుతోంది. గత ఏడాది లంగర్‌హౌస్ ఫ్లైఓవర్ పైన చైనా మాంజా బారినపడి ఓ సైనికుడు అశువులు బాశాడు. ఏటా నగరంలో దీని బారినపడి వందల పక్షులు మరణిస్తుండగా... పెద్ద సంఖ్యలో మనుషులు, జంతువులు తీవ్ర గాయాల పాలవుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న నగర పోలీసు విభాగం చైనా మాంజాకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభించింది. టాస్క్‌ఫోర్స్‌కు చెందిన అధికారులు నిఘా ముమ్మరం చేసి చైనా మాంజా విక్రయిస్తున్న వారిని అరెస్టు చేస్తున్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసి, రూ.లక్షల విలువైన సరుకు స్వాధీనం చేసుకున్నారు.

నిషేధం విధించినా యథేచ్ఛగా విక్రయాలు..

చైనా మాంజా వల్ల జరిగిన, జరుగుతున్న ప్రమాదాలకు దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం దీని వినియోగాన్ని నిషేధించింది. అయినప్పటికీ కొందరు వ్యాపారులు దొడ్డిదారిన చైనా మాంజా ఖరీదు చేసి విక్రయిస్తున్నారు. ప్రధానంగా ఉత్తరాది నుంచి అక్రమ రవాణా ద్వారా నగరానికి తీసుకువస్తున్నారు. నగర కొత్వాల్ సీపీ ఆనంద్ ఆదేశాల మేరకు దీనికి చెక్ చెప్పడం కోసం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచుతున్నారు. స్థానిక పోలీసులతో కలిసి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దాడులు చేస్తున్నారు. నిషేధిత మాంజాతో చిక్కిన వారిపై పర్యావరణ పరిరక్షణ చట్టం–1986లోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి సరుకు స్వాధీనం చేసుకుంటున్నారు.

గత ఏడాది పెరిగిన కేసులు..

నగర పోలీసు విభాగం ప్రతి ఏడాది సంక్రాంతి సీజన్‌లో ఇలాంటి స్పెషల్ డ్రైవ్స్ చేపడుతోంది. ఎన్ని కేసులు పెట్టినా, ఎందరిపై చర్యలు తీసుకున్నా కొందరు వ్యాపారుల్లో మాత్రం మార్పు రావట్లేదు. 2023తో 2024లో చైనా మాంజా విక్రయం కేసులు గణనీయంగా పెరిగాయి. సిటీ పోలీసులు 2023లో 39 కేసులు నమోదు చేసి 47 మందిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.10.61 లక్షల విలువైన చైనా మాంజా సీజ్ చేశారు. గత ఏడాది 49 కేసులు నమోదు చేసిన అధికారులు 61 మందిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి ఏకంగా రూ.37.02 విలువ చేసే సరుకు స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామాలతో ఈ ఏడాది నిఘాను మరింత పెంచాలని నిర్ణయించారు. శుక్రవారం టాస్క్‌ఫోర్స్ బృందాలు ఈస్ట్, సౌత్, సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్ జోన్లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 14 కేసులు నమోదు చేశారు.

స్వచ్ఛంద సంస్థల సహాయం కావాలంటూ..

నగరం నుంచి చైనా మాంజాను తరిమేయాలంటే స్వచ్ఛంద సంస్థల సహకారం కూడా కావాలంటూ అధికారులు చెప్తున్నారు. అవి ముందుకు వచ్చి చైనా మాంజా వినియోగానికి వ్యతిరేకంగా నగరవాసులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. నిషేధిత చైనా మాంజాను వినియోగిస్తే కేసులు, జరిమానాలతో పాటు జైలు శిక్షకు ఆస్కారం ఉందని, దీని వల్ల పర్యావరణానికి హాని అనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరుతున్నారు. ఎవరైనా ఈ నిషేధిత మాంజా విక్రయిస్తూ రెండోసారి పట్టుబడితే గరిష్ఠంగా ఏడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ మాంజా నిల్వ, వినియోగం, విక్రయంపై సమాచారం ఉంటే తమకు తెలపాలని నగర అధికారులు కోరుతున్నారు.

నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసిన మంత్రి కోమటిరెడ్డి పీఏ

సాక్షి, సిటీబ్యూరో: ఉద్దేశపూర్వకంగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపరంగా ఎదుర్కొంటానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పీఏ సైదులు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న దుష్ప్రచారాలపై ఆదివారం ఆయన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగులపల్లి గ్రామ పరిధిలోని సింగారం తండాకు చెందిన భూ వ్యవహారంలో తన ప్రమేయం లేకున్నా.. కొంతమంది సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్నానని తెలిపారు. కుట్రపూరితంగా కొంతమంది వాట్సాప్ ద్వారా తప్పుడు కథనాలను వ్యాప్తి చేస్తున్నారని పేర్కొన్నారు. తన పరువుకు భంగం కలిగించేలా జరిగే దుష్ప్రచారాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులను ఆశ్రయించినట్లుగా సైదులు పేర్కొన్నారు. తాను చేసిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారని, విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు.

కురుమలు రాజకీయంగా ఎదగాలి

రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం

మీర్‌పేట: కురుమలు రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం పిలుపునిచ్చారు. మీర్‌పేటలో ఆదివారం జిల్లా కురుమ సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కురుమలు స్థానికంగా అన్ని వర్గాలను కలుపుకొని పోవడంతో పాటు ఐక్యంగా ఉండి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. సొసైటీలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. జిల్లాలో కురుమ సంఘం భవనం ఏర్పాటుకు స్థలం కోసం త్వరలోనే కలెక్టర్‌ను కలుస్తానని, వీలైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో కురుమలకు దక్కాల్సిన వాటా ప్రకారం టికెట్లు కేటాయించాలని సీఎంను కోరినట్లు చెప్పారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దాల దశరథ మాట్లాడుతూ.. ఐకమత్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు రానున్న ఎన్నికల్లో కురుమల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కా ర్యదర్శి బండారు నారాయణ, హాస్టల్ చైర్మన్ కొలుకుల నర్సింహ, గొర్రెల కాపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కిష్టగోని సదానందం, నాయకులు సిద్దాల బా లప్ప, సిద్దాల శ్రీశైలం, మీర్‌పేట అధ్యక్షుడు దేవరింటి వెంకటేశ్, అచ్చిని యాదగిరి, సిద్దాల జగదీశ్, మేకల ప్రశాంత్, పద్మశ్రీ, రేణుక పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మైలవరంలో అక్రమ మైనింగ్‌ను ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సైంటిస్టు బాబూరావు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నాగర్‌కర్నూలు జిల్లా మైలవరం గుట్టకు చారిత్రాత్మక ప్రాధాన్యం ఉందని, వెంటనే అక్కడి అక్రమ మైనింగ్‌ను ఆపాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మైలవరం గుట్ట పరిరక్షణ పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమితి అధ్యక్షుడు గుండాల వెంకటేష్, ప్రముఖ సైంటిస్ట్ బాబూరావు, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు మాట్లాడుతూ..మైలవరం గుట్ట అతిప్రాచీనమైందని ఈ గుట్టపై నిరుపేదలు ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారని అన్నారు. పక్కన 4, 5 గ్రామాలకు ఈ గుట్ట జీవనాధారంగా ఉందని అటువంటి గుట్టను అక్రమమైనింగ్‌తో ఆక్రమించాలని చూడడం సరైంది కాదన్నారు. అక్రమ మైనింగ్‌ను ఆపి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. లేని పక్షంలో ప్రకృతి ఆగ్రహానికి గురికాక తప్పదని వారు హెచ్చరించారు. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనం క్రీడా ప్రాంగణం గుట్టపై ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ మైనింగ్ జరగడంతో ప్రజా ధనం దుర్వినియోగం అవుతుందని అన్నారు. మైలవరం గుట్టపై ఇచ్చిన మైనింగ్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ లక్ష్మణ్, కార్యదర్శి నారాయణరావు, అడ్వొకేట్ లక్ష్మణ శర్మ, పీవోడబ్ల్యూ సంధ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.

విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్‌: సైఫాబాద్‌ డివిజన్‌ పరిధిలో ఇందిరాపార్క్, జవహర్‌నగర్‌ సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల తొలగింపు, విద్యుత్‌ మెయింటెనెన్స్‌లో భాగంగా సోమవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సైఫాబాద్‌ డీఈ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అరవింద్‌నగర్‌ ఏరియా, రిలయన్స్‌ టవర్, ఎన్టీఆర్‌ స్టేడియం, అరవింద్‌నగర్‌ ఏరియా, భద్రుకా కాలేజీ, దోమలగూడ, న్యూ ఎస్‌బీహెచ్‌ కాలనీ, శ్రీనివాస హోటల్, శివ ప్యాలెస్‌ ఏరియా, దెక్కన్‌ స్కూల్‌ ఏరియాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దోమలగూడ ఏరియా, మార్కెట్‌ ఏరియా, జేపీ అపార్ట్‌మెంట్, శ్రీనివాస డౌన్‌ ఏరియా, దోమలగూడ ఈ సేవా ఏరియా, జవహర్‌నగర్‌ ఏరియా, లేబర్‌ కమిషనర్‌ ఆఫీస్, ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్, పీఅండ్‌టీ క్వార్టర్స్, అంజయ్య భవన్‌ ఏరియా, హనుమాన్‌ టెంపుల్‌ ఏరియాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామని దీనికి సహకరించాలని ఆయన కోరారు.

వెంగళరావునగర్‌: పోస్టాఫీస్‌ 11కెవీ ఫీడర్‌ హెచ్‌పీఎస్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో జరుగుతున్న విద్యుత్‌ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగుతుందని గ్రీన్‌ లాండ్స్‌ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బేగంపేట పోస్టాఫీస్, రైల్వేస్టేషన్, గీతాంజలి స్కూల్, ఓల్డ్‌ కస్టమ్స్‌ బస్తీ, పీఎస్‌ క్వార్టర్స్, బ్రాహ్మణవాడి, వరుణ్‌ టవర్స్, మోతీ నగర్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపి వేయబడుతుందన్నారు. అదేవిధంగా హుడా, చిరాన్‌పోర్ట్‌ 11 కెవీ ఫీడర్లు, ఎయిర్‌పోర్ట్, ప్రకాశ్‌నగర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో హుడాలైన్, చిరాన్‌పోర్ట్‌ క్లబ్, పాస్‌పోర్ట్‌ ఆఫీస్‌ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ ఉండదని దీనిని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రేపటి నుంచి ఉచిత స్క్రీనింగ్‌ క్యాంపు

బంజారాహిల్స్‌: ప్రపంచ సెర్వికల్‌ కేన్సర్‌ అవగాహన మాసం సందర్భంగా బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్‌ కేన్సర్‌ ఆస్పత్రిలో ఈ నెల 6 నుంచి 31వ తేదీ వరకు అన్ని పనిదినాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఉచిత స్క్రీనింగ్‌ క్యాంపును నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్లాక్‌-1 మొదటి అంతస్తులోని సర్జికల్‌ విభాగంలో ఈ క్యాంపు జరుగుతుందని చెప్పారు. కేన్సర్‌ను ఎలా నివారించాలి అన్న అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ సెర్వికల్‌ కేన్సర్‌ స్క్రీనింగ్‌ క్యాంపును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాంపులో వైద్యులు ఉచితంగా ప్రాథమిక పరీక్షలు నిర్వహించి కేన్సర్‌ లక్షణాలను నిర్ధారించే ప్రయత్నాలను చేస్తారన్నారు. అనుమానం ఉన్న వారికి 50 శాతం రాయితీతో పాటు, ఇతరత్రా వ్యాధి నిర్ధారణ పరీక్షలను 20 శాతం రాయితీతో చేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 040-23551235 నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఘనంగా హోలి ఫ్యామిలీ చర్చి పండుగ



రహమత్‌నగర్‌: రహమత్‌నగర్‌లోని హోలి ఫ్యామిలీ చర్చి పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం యేసు నామాన్ని స్మరిస్తూ రహమత్‌నగర్‌ కూడలి వరకు ఊరేగింపు చేపట్టారు. అనంతరం చర్చి ఫాదర్‌ రెవరెండ్‌ విల్సన్‌ మానవ సంబధాలపై క్రీస్తు సందేశాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు జోసఫ్, జాకబ్, ధ్వనేజ్, బాలస్వామి, యేసప్ప తదితరులతో పాటు సంఘం సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

వెంగళరావునగర్‌: అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని మధురానగర్‌ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం.. ముషీరాబాద్‌కు చెందిన గులాం ముజమ్మిల్‌ ఆదివారం తెల్లవారు జామున రేషన్‌ బియ్యాన్ని టాటా ఏస్‌ వాహనంలో ముషీరాబాద్‌ నుంచి జహీరాబాద్‌కు తరలిస్తున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఎస్‌ఆర్‌నగర్‌ మెట్రోస్టేషన్‌ వద్ద ఆ వాహనాన్ని తనిఖీ చేయగా వాహనంలో 70బస్తాల రేషన్‌ బియ్యం ఉన్నాయని పోలీసులు గుర్తించారు. దీంతో రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు కటింగ్‌ చేసిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్‌: అనుమతులు లేకుండా రోడ్డు కటింగ్‌ చేసిన వ్యక్తిపై బంజారాహిల్స్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... శ్రీనగర్‌కాలనీ ప్రాంతంలో ఓ వ్యక్తి అనుమతులు లేకుండా రోడ్డు కటింగ్‌ చేసి స్థానికులు అసౌకర్యానికి గురిచేశాడని జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్‌ సర్కిల్‌-18 ఏఈ సుతీష్‌ గట్టు బంజారాహిల్స్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జరిమానాలకు జంకం..!

67,105 ఫైన్లు ... అయినా మారని బడాబాబుల పుత్రరత్నాలు

- జూబ్లీహిల్స్‌లోని పబ్‌ల ఎదుట అక్రమ పార్కింగ్‌ల జోరు
- స్థానికులతోపాటు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు



బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌లోని పలు పబ్‌ల ఎదుట అక్రమ పార్కింగ్‌లతో స్థానికులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.రాత్రి 7 గంటల నుంచి అర్ధరాత్రి 2గంటల వరకు దాదాపు అన్ని పబ్‌ల ఎదుట అక్రమ పార్కింగ్‌లు రోజూ ఒక న్యూసెన్స్‌గా మారాయి. జూబ్లీహిల్స్‌లో మొత్తం 32 పబ్‌లు ఉండగా, ఏ ఒక్క పబ్‌కు కూడా సరిపోయేంత పార్కింగ్‌ సౌకర్యం లేదు. దీంతో తమ మద్దకు వచ్చే కస్టమర్ల వాహనాలను వ్యాలెట్‌ డ్రైవర్లు దర్జాగా రోడ్ల పక్కనే పార్కింగ్‌ చేస్తున్నారు.రోడ్డు నెంబర్‌-45, 36,10లలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. జూబ్లీహిల్స్‌ రోడ్డునెంబర్‌-45లోని బ్రాడ్‌ వే,హలో, లార్డ్స్‌ ఆఫ్‌ డ్రింక్స్,ప్రోస్ట్,ఫోర్జ్‌ తదితర పబ్‌ల ఎదుట రోడ్డుకు రెండువైపులా,ఫ్లైఓవర్‌ కింద అక్రమ పార్కింగ్‌లు బారులుతీరుతున్నాయి. రోడ్డునెంబర్‌-36లోని ఎయిర్‌ లైవ్‌క్లబ్‌ రోగ్,లుఫ్ట్‌ తదితర పబ్‌ల మీదుగా నీరూస్‌ వరకు రోడ్డుకు రెండు వైపులా అక్రమ పార్కింగ్‌లు బెంబేలెత్తిస్తున్నాయి. రోడ్డునెంబర్‌-10లోని బాబీలాన్‌తో పాటు ఇక్కడ ఉన్న నాలుగు పబ్‌లకు పార్కింగ్‌ సౌకర్యం కరువైంది. అంతర్గత రహదారుల్లో ఉన్న పబ్‌లకు సైతం పార్కింగ్‌ సదుపాయం లేకపోవడంతో రోడ్ల పక్కన పార్కింగ్‌ చేస్తున్నారు. వారాంతాల్లో శుక్ర, శని, ఆదివారాల్లో ఇక్కడి పబ్‌లకు, హోటళ్లు కిక్కిరిసిపోతాయి. దీంతో వందలాదిగా కార్లు రోడ్లకు రెండువైపులా పార్కింగ్‌ చేస్తున్నారు. సమస్య పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ పోలీసులు అక్రమ పార్కింగ్‌ల్లో ఉన్న వాహనాల ఫొటోలు తీస్తూ ఆన్‌లైన్‌లో జరిమానాలు వేస్తున్నారు. అయినా సరే బడాబాబుల పుత్ర రత్నాలు ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. పబ్‌ల నిర్వాహకులు కూడా దర్జాగా రోడ్ల పక్కనే వాహనాలను పార్కింగ్‌ చేయిస్తున్నారు. ఈ అక్రమ పార్కింగ్‌ల బెడద ట్రాఫిక్‌ పోలీసులకు సైతం సవాల్‌గా మారింది. రాత్రిపూట అంబులెన్స్‌లు వెళ్లాలన్న దారి ఉండడం లేదు. ట్రాఫిక్‌ జాంలు నిత్యకృత్యమవుతున్నాయి.

హోటళ్ల ముందు కూడా..

జూబ్లీహిల్స్‌లోని కృష్ణపట్నం, అంతేనా, వివాహ భోజనంబు, తెలుగు కిచెన్, తెలంగాణ స్పైసీ కిచెన్‌ల ఎదుట కూడా వాహనాలను అక్రమ పార్కింగ్‌ చేస్తున్నారు. దీంతో వాహనదారులకు తిప్పలు తప్పటం లేదు. ఇప్పటికైనా ఈ అక్రమ పార్కింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులతోపాటు వాహనదారులు కోరుతున్నారు.

10లోపు ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

హౌసింగ్‌ ఎస్‌ఈ భాస్కర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

బంజారాహిల్స్‌: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా, వేగవంతంగా చేయాలని హౌసింగ్‌ ఎస్‌ఈ భాస్కర్‌రెడ్డి సూచించారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్‌ జోనల్‌ కార్యాలయంలో ఖైరతాబాద్‌ సర్కిల్‌-17, జూబ్లీహిల్స్‌ సర్కిల్‌-18 పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం కొత్తగా నియమించిన సిబ్బందికి ఆయన సూచనలు ఇవ్వడమే కాకుండా సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే కోసం ఇంటింటికి వెళ్లే సిబ్బంది జియో కో-ఆర్డినేట్స్‌తో ఫొటోలు తీసి అప్‌లోడ్‌ చేయడమే కాకుండా పూర్తి వివరాలు కూడా నమోదు చేయాలని వెల్లడించారు. సర్కిల్‌-17 పరిధిలో 27,000, సర్కిల్‌-18 పరిధిలో 28,000 మందిని గుర్తించగా ఇప్పటి వరకు ఈ రెండు సర్కిళ్ల పరిధిలో 40 శాతం సర్వే పూర్తయ్యిందన్నారు. ఈనెల 10వ తేదీలోపు సర్వే పూర్తి చేసేందుకు వీలుగా సర్కిల్‌-17 పరిధిలో 60 మందిని, సర్కిల్‌-18 పరిధిలో 63 మందిని కొత్తగా విధుల్లోకి తీసుకోవడం జరిగిందని, వీరంతా ప్రతి రోజూ 10 శాతం మందిని సర్వే చేసేలా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. ఏడాది క్రితం చేపట్టిన ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తుల ఆధారంగా వీరిని గుర్తించి ఈ సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వేలో సూచించిన విధంగా వివరాలన్నీ పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. ఏమాత్రం తేడా వచ్చినా ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. సర్వేలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న ఆయన సందేహ నివృత్తి కూడా చేశారు. పలువురు సిబ్బంది సర్వేకు సంబంధించిన అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో డీసీ ప్రశాంతి కూడా పాల్గొన్నారు.

అనుమతి లేకుండా గ్యాస్‌ రీఫిల్లింగ్‌

ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

వెంగళరావునగర్‌ : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సిలిండర్లు రీఫిల్లింగ్‌ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ కథనం ప్రకారం... ఎల్లారెడ్డిగూడ, రహమత్‌నగర్‌ ప్రాంతాల్లో సిలిండర్లు అక్రమంగా విక్రయిస్తున్నట్టుగా పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సదరు ప్రాంతానికి వెళ్లగా రహమత్‌నగర్‌లోని రాజీవ్‌నగర్‌ ప్రాంతానికి చెందిన ఏ.బాలాజీ, సర్దార్‌ దేవేందర్‌సింగ్‌లు గ్యాస్‌ రీఫిల్లింగ్‌ చేస్తూ కనిపించారు. దీంతో ఇరువురిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద ఉన్న ఇండియన్‌ గ్యాస్‌ రెండు పెద్ద సిలిండర్లు (నిండుది, ఖాళీది), నాలుగు నిండు చిన్న సిలిండర్లు, రెండు ఖాళీ సిలిండర్లు, గ్యాస్‌ రీ ఫిల్లింగ్‌ కిట్, వెయింగ్‌ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



హిమాయత్‌నగర్‌ డివిజన్‌ విఠల్‌వాడిలో నూతనంగా ఏర్పాటు చేసిన టర్కోయిస్‌ ఫిట్‌నెస్‌ ప్రోజిమ్‌ను కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, హిమాయత్‌నగర్‌ కార్పొరేటర్‌ మహాలక్ష్మి రామన్‌గౌడ్, నల్లకుంట కార్పొరేటర్‌ వై.అమృత తదితరులు పాల్గొన్నారు. – కాచిగూడ

పండుగ సాయన్న చరిత్రను భావితరాలకు తెలియజేద్దాం

ఎమ్మెల్సీ ప్రొఫెసర్‌ కోదండరాం


కోదండరామ్‌ను సత్కరిస్తున్న శివ ముదిరాజ్, బ్రహ్మ తదితరులు

కాచిగూడ: పండుగ సాయన్న చరిత్రను భవిష్యత్‌ తరాలకు తెలియజేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్‌ ఎం. కోదండరాం అన్నారు. ప్రజా వీరుడు పండుగ సాయన్న రాష్ట్రస్థాయి సేవా పురస్కారాల ప్రదానోత్సవ వేడుకలు ఆదివారం బషీర్‌బాగ్‌ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న సామాజిక వేత్తలు, జర్నలిస్టులు, మహిళా ప్రతినిధులు, కవులు, కళాకారులకు పండుగ సాయన్న రాష్ట్ర స్థాయి సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ప్రొఫెసర్‌ ఎం.కోదండరామ్, సీనియర్‌ జర్నలిస్టు పాశం యాదగిరి, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిన చంద్రశేఖర్‌ ముదిరాజ్, టీజేఎస్‌ ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్‌ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరామ్‌ మాట్లాడుతూ ప్రజావీరుడు పండుగ సాయన్న సమాజానికి చేసిన అమూల్యమైన సేవలను గుర్తించి ఆయన జయంతి, వర్ధంతిలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా చర్చించాల్సిన అవసరం ఉందని అన్నారు. సాయన్న అందించిన సేవలు చిరస్మరణీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న రాములు, బ్రహ్మయ్య, కార్యక్రమ నిర్వాహకులు శివ ముదిరాజ్, బ్రహ్మ, ఉదయ్, నీలం సైదులు, సాయి కిరణ్, మహేష్, ఆశాప్రియ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీఎన్జీవోస్‌ డైరీ, కేలండర్‌ ఆవిష్కరణ

కాచిగూడ: టీఎన్జీవోస్‌ సెంట్రల్‌ యూనియన్‌ డైరీ, కేలండర్‌ ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 6వ తేదీన సోమవారం సాయంత్రం 5 గంటలకు నాంపల్లి పబ్లిక్‌ గార్డెన్స్‌లోని తెలుగు లలిత కళా తోరణం ఓపెన్‌ ఎయిర్‌ థియేటర్‌లో నిర్వహిస్తున్నట్లు భాగ్యనగర్‌ టీఎన్జీవోస్‌ మాక్‌ హౌసింగ్‌ సొసైటీ అధ్యక్షుడు,సెంట్రల్‌ యూనియన్‌ అసోసియేట్‌ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ గౌడ్‌ తెలిపారు. టీఎన్జీవోస్‌ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌.ఎం.హుస్సేని (ముజీబ్‌) ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌ కుమార్‌తో పాటు పలువురు మంత్రులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. టీఎన్జీవోస్‌ సెంట్రల్‌ యూనియన్‌ డైరీ, కేలండర్‌తో పాటు టీఎన్జీవోస్‌ యూనియన్‌ హైదరాబాద్‌ జిల్లా, టీఎన్జీవోస్‌ యూనియన్‌ హైదరాబాద్‌ సిటీ, భాగ్యనగర్‌ టీఎన్జీవోస్‌ మాక్‌ హౌసింగ్‌ సొసైటీ లిమిటెడ్‌ల క్యాలెండర్ల ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. సొసైటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

చిన్నారులు మెచ్చే పుస్తకం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రియా ఠాకూర్‌

బంజారాహిల్స్‌: చిన్నారుల్లో సృజనాత్మకతను, ఆలోచన శక్తిని పెంచే విధంగా నోవాస్‌ లిటిల్‌ ఫ్రెండ్‌ పుస్తకాన్ని రచించినట్లు యువ రచయిత్రి ప్రియా ఠాకూర్‌ తెలిపారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఓ కెఫెలో చిన్నారుల కోసం రాసిన నోవాస్‌ లిటిల్‌ ఫ్రెండ్‌ పుస్తకాన్ని ఆమె పలువురు చిన్నారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పుస్తకం 2 నుంచి 8 సంవత్సరాల వయసు పిల్లలకు ఎన్నో విషయాలను తెలిసేలా చేస్తుందని అన్నారు. శృతి అనే మరో రచయిత్రి ఈ పుస్తకంలో చిన్నారుల కోసం ప్రత్యేక చిత్రాలను గీశారని వాటిని కూడా ఇందులో ప్రచురించినట్లు తెలిపారు. చిట్టిపొట్టి కథలతో రూపొందించిన ఈ పుస్తకం చిన్నారులకు ఎంతగానో నచ్చుతుందని తెలిపారు.

'శ్రీకృష్ణ జల జపదీక్ష'కు ఇండియన్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డు


ఇండియన్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డు అందుకుంటున్న రవీంద్రజిత్‌

పంజగుట్ట: ప్రపంచ నీటి లోతట్టు నగరాల దినోత్సవం సందర్భంగా డిసెంబర్‌ 21న ద్వారకలో జై ద్వారకా క్యాంపెయిన్‌లో భాగంగా నిర్వహించిన శ్రీకృష్ణ జల జప దీక్ష ఇండియన్‌ బుక్‌ఆఫ్‌ రికార్డు సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శ్రీకృష్ణ జల జప దీక్ష చేసిన ప్రసిద్ధ చిత్రకారుడు రవీంద్రజిత్‌ టీమ్‌కు ఇండియన్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ ప్రతినిధి స్వర్ణ శ్రీ ప్రశంసా పత్రాలు అందించారు. అనంతరం రవీంద్రజిత్‌ మాట్లాడుతూ డిసెంబర్‌ 21న ద్వారకలో జై ద్వారకా క్యాంపెయిన్‌లో భాగంగా శ్రీకృష్ణ జల జప దీక్ష నిర్వహించామని, గుజరాత్‌ పర్యాటక మంత్రిత్వ శాఖ, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం ఎంతో విజయవంతంగా చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర పౌరుడిగా ఈ మహత్తర కార్యక్రమం విజయవంతంగా నిర్వహించి ప్రపంచ రికార్డుల్లో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భారత భారతి జాతీయ అధ్యక్షుడు వినయ్‌ పాత్రలే, జై ద్వారకా ప్రచార ఆర్గనైజర్‌ షాహీఖాన్, మీనాక్షి పద్మనాభన్, శ్రీనివాస్‌ రెడ్డి, కలదర్‌ వల్లం తదితరులు పాల్గొన్నారు.

యాదగిరినగర్‌లో వృద్ధురాలి అదృశ్యం

వెంగళరావునగర్‌: అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈనెల 3వ తేదీ శ్రీకృష్ణానగర్‌కు చెందిన పి.గంగారామ్‌ నాయనమ్మ నర్సమ్మ ఆరోగ్య పరీక్షల నిమిత్తం యాదగిరినగర్‌లోని తన కుమార్తె మల్లమ్మ వద్దకు వెళ్లింది. 4వ తేదీ ఉదయం ఎవరి పనులకు వారు వెళ్లి తిరిగి వచ్చేసరికి నర్సమ్మ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో గంగారామ్‌ మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచారం చేయాలని కుమార్తెపై తల్లిదండ్రుల ఒత్తిడి

తప్పించుకున్న యువతి.. పోలీసులకు ఫిర్యాదు

వెంగళరావునగర్‌: వ్యభిచారం చేయాలని కుమార్తెను తల్లిదండ్రులు వేధించిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ వర్మ కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే కుటుంబంలో భార్యాభర్తలతోపాటు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఇటీవల భర్త మద్యానికి బానిస కావడంతో అతడి భార్య వ్యభిచారం చేస్తుంది. కుమార్తె, కుమారుడు విద్యనభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా యువతిని ఆమె తల్లి పలువురికి ఫోన్‌ చేసి డబ్బులు అడగమనడంతోపాటు వ్యభిచారం చేయాలని ఒత్తిడి చేస్తుంది. దీనికి యువతి ఒప్పుకోకపోవడంతో వేధించడం ప్రారంభించారు. ఒకరోజు గదిలో బంధించి వ్యభిచారం చేయించే ప్రయత్నం చేశారు. అయితే అక్కడి నుంచి తప్పించుకొని ఆమె స్నేహితురాలి వద్దకు వెళ్లింది. అక్కడికి కూడా యువతి తల్లిదండ్రులు రావడంతో యువతి విద్యనభ్యసిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు, లెక్కల మాస్టార్లకు విషయాన్ని తెలపడంతో వారు మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేసి, అనంతరం 1098 ద్వారా బాలికా సంరక్షణ విభాగానికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేబీఆర్‌ పార్కు వద్ద కారు బీభత్సం



ప్రమాదానికి కారణమైన కారు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌లోని కేబీఆర్‌ పార్కు వద్ద ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో అదుపుతప్పిన ఓ కారు డివైడర్‌ పైకెక్కి అక్కడే ఉన్న చెట్టును ఢీకొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో టీవీ-9 సాగర్‌ సొసైటీ నుంచి జూబ్లీహిల్స్‌ వైపు వెళ్తున్న ఏపీ09 బీఎఫ్‌ 1611 స్కోడా కారు వేగంతో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. కారులో ఉన్న వ్యక్తి బెలూన్లు ఓపెన్‌ కావడంతో క్షేమంగా బయటపడ్డాడు. టోయింగ్‌ వెహికల్‌ను రప్పించి సదరు వ్యక్తి కారును తీసుకుని వెళ్లిపోయాడు. పోలీసులు సమాచారం అందుకుని ఘటన స్థలానికి రాగా అప్పటికే కారును అక్కడి నుంచి తరలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఈ కారును గుర్తించారు. కారు ఎవరు నడిపారు, ఎక్కడి నుంచి వస్తుంది అన్న దానిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చైనా మాంజా విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

బంజారాహిల్స్‌: నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తున్న నలుగురిని జూబ్లీహిల్స్‌ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... బేగంపేటకు చెందిన శ్రీకృష్ణానగర్‌కు చెందిన ప్రవీణ్, మౌలాలి ఆర్టీసీ కాలనీకి చెందిన సాయి ప్రణీత్, మల్కాజిగిరి మధుసూదన్‌నగర్‌కు చెందిన జశ్వంత్‌లు యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో నిషేధిత మంజాను విక్రయిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందటంతో ఆదివారం దాడి చేయగా వీరి వద్ద చైనా మాంజాను పోలీసులు గుర్తించారు. బేగంపేటలోని బాబా కైట్స్‌ నుంచి వీరు కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది. వీరి వద్ద నుంచి రూ.15,000 విలువైన మోనో గోల్డ్‌ సింథటిక్‌ నైలాన్‌ కోటెడ్‌ చైనీస్‌ మంజా 20 బీబీన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం


షేరాభాను (ఫైల్‌)

రహమత్‌నగర్‌: మతిస్థిమితం లేని ఓ మహిళ అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎస్‌ఆర్‌ఆర్‌పురానికి చెందిన షేక్‌ షేరాభాను (56)కు కొంతకాలంగా మానసిక స్థితి బాగాలేదు. ఈ క్రమంలోనే ఆదివారం ఎవరికి చెప్పకుండా ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. షేరాభాను బంధువులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు బోరబండ పీఎస్‌ సంప్రదించాలని కోరారు.

ఎంజేసీఈటీలో ఉత్సాహంగా హ్యాకథాన్‌


హ్యాకథాన్‌లో విద్యార్థుల సందడి

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌-3లోని ముఫకంజా కాలేజీ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ (ఎంజేసీఈటీ) ప్రాంగణంలో ఆదివారం 'హాక్‌ రివాల్యూషన్‌' పేరుతో 15 గంటల పాటు వార్షిక హ్యాకథాన్‌ను నిర్వహించారు. ఎంజేసీఈడీ కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇంజినీరింగ్‌ విభాగం సీఎస్‌ఐ చాప్టర్, ఎంటర్‌ ప్రెన్యూర్‌షిప్‌ సెల్, ఎంహెచ్‌ఆర్‌డీకి చెందిన ఇనిస్టిట్యూషన్‌ ఇన్నోవేషన్‌ కౌన్సిల్‌ (ఐఐసీ)ల సహకారంతో జరిగిన ఈ హ్యాకథాన్‌ను అడ్వాన్స్‌ కమ్యూనికేషన్‌ అండ్‌ ఎలక్ట్రానిక్‌ సిస్టమ్స్‌ స్పాన్సర్‌ చేసింది. ప్రధానంగా హెల్త్‌కేర్, గ్రామీణాభివృద్ధి, వ్యర్థాల నిర్వహణ, ఓపెన్‌ ఇన్నోవేషన్‌ సాఫ్ట్‌వేర్, ఓపెన్‌ ఇన్నోవేషన్‌ హార్డ్‌వేర్‌ అనే అంశాలపై హ్యాకథాన్‌ కొనసాగింది. రాష్ట్రంలోని సీబీఐటీ, సీఎంఆర్, వీజేఐటీ, సీవీఆర్, కేఎంఐటీ, ఎన్‌జీఐటీ, నారాయణమ్మ, వీఎన్‌ఆర్‌ విజ్ఞాన జ్యోతి, మాతృశ్రీ, డెక్కన్, ఐఎస్‌ఎల్, లార్డ్స్‌ తదితర కళాశాలల నుంచి మొత్తం 224 జట్లు పాల్గొన్నాయి. ఇందులో ఉత్తమ 60 జట్లకు చెందిన ప్రాజెక్టులు, ఉత్పత్తులను ఎంపిక చేసి రెండో దశకు ఆహ్వానించారు. దాదాపు 300 మంది పాల్గొన్నారు. సృజనాత్మకత, సాంకేతిక ఆవిష్కరణలను సాధించడమే లక్ష్యంగా ఈ హ్యాక్‌థాన్‌లో విద్యార్థులు పోటీ పడ్డారు. స్మార్ట్‌ ఇండియా హ్యాకథాన్‌-20024లో ఎంజేసీఈటీ విద్యార్థులు అవార్డులను కైవసం చేసుకున్నారు. ఐఐటీ గౌహతి, చెన్నై కేసీజీలు సాఫ్ట్‌వేర్‌ ఎడిషన్‌లో విజేతలుగా నిలిచాయి. వీరు లక్ష రూపాయల చొప్పున నగదు బహుమతి గెలుచుకున్నారు. ఈ హ్యాకథాన్‌లో మైక్రోసాఫ్ట్‌ సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ సయ్యద్‌ నిసార్‌ ఉల్‌ హక్, డెలాయిట్‌ సీనియర్‌ కన్సల్టెంట్‌ ఇమ్రాన్‌ఖాన్, ఏఎండీ టెక్నికల్‌ స్టాఫ్‌ మహ్మద్‌ నయీముద్దీన్, బాష్‌ లీడ్‌ ఇంజనీర్‌ షాదాబ్‌ ఆలం, శ్రీనిధి విశ్వవిద్యాలయం అసోసియేట్‌ ప్రొఫెసర్‌ మహ్మద్‌ రియాజుద్దీన్, సుల్తాన్‌ ఉల్‌ ఉలూమ్‌ ఎడ్యుకేషన్‌ సొసైటీ కార్యదర్శి జాఫర్‌ జావీద్, ఎంజేసీఈటీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ మహిపాల్‌ సింగ్‌ రావత్, హ్యాకథాన్‌ డీన్‌ డాక్టర్‌ సయ్యద్‌ పెర్వతుల్లా హుస్సేనీ తదితరులు హాజరై సమీక్షలు జరిపారు.

సాక్షి సోమవారం । 6 । జనవరి । 2025

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



పారిశుద్ధ్య కార్మికులకు కిట్‌లు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. 'కేర్ ఫర్ దోస్, వూ కేర్ ఫర్ అస్' అనే పేరిట కంటోన్మెంట్ కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సోహైల్ ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య కార్మికులకు కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో కలిసి కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు తగిన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు.

బోర్డు స్థలాల్లో పేదలకు ఇళ్లు..

కంటోన్మెంట్‌కు సంబంధించి ట్రెంచింగ్ గ్రౌండ్‌ల కోసం గతంలో కేటాయించిన విలువైన స్థలాలు వివిధ కారణాల వల్ల వృథాగా ఉన్నాయని ఎమ్మెల్యే అన్నారు. తుర్కపల్లి, హస్మత్‌పేటలోని స్థలాలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తే పేదలకు ఇళ్లు కట్టించే విధంగా ముఖ్యమంత్రిని ఒప్పిస్తామన్నారు. పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రతి నెలా తాను వ్యక్తిగతంగా హెల్త్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విలీనంపై సందిగ్ధం

రెండేళ్లుగా అదే తంతు కమిటీలతో కేంద్రం కాలయాపన

- నూతన చట్టంపైనా స్పష్టత లేని వైనం
- బోర్డు ఎన్నికలు జరిగి నాలుగేళ్లు..



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. బ్రిటీష్ పాలనావశేషంగా కొనసాగుతున్న కంటోన్మెంట్‌లలో నేటికీ బ్రిటీష్ కాలంనాటి చట్టాలకు లోబడే పాలన సాగుతోంది. వందేళ్లకు పైబడి పాత చట్టాలను సవరిస్తూ, కంటోన్మెంట్‌లను మరింత ప్రజాస్వామ్యయుతంగా తీర్చిదిద్దుతామన్న కేంద్రం 2020లో నూతన బిల్లుకు శ్రీకారం చుట్టింది. ఇంతలోనే కంటోన్మెంట్‌లను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తామంటూ కేంద్రం ప్రకటన చేసింది. పార్లమెంట్ సమావేశాల ఎజెండాలో చేరిన సదరు బిల్లును రెండేళ్లుగా పూర్తిగా పక్కన పెట్టేశారు. దేశంలోనే అతి పెద్దదైన సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తోనే విలీన ప్రక్రియకు శ్రీకారం చుట్టిన కేంద్రం 2023 జనవరి 4న ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఒక్కసారి మాత్రమే ఈ కమిటీ భేటీ జరగ్గా, ఆ సమావేశం మినిట్స్ ఏమిటో కూడా ఇప్పటి వరకూ బహిర్గతం కాలేదు. ఇదిలా ఉండగా కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరిగి వచ్చే వారానికి (జనవరి 11, 2015) సరిగ్గా పదేళ్లు పూర్తవుతుంది. ఐదేళ్ల సాధారణ పదవీకాలంతో పాటు ఏడాది పొడిగింపుతో సాధారణ బోర్డు పదవీ కాలం పూర్తయి నాలుగేళ్లు అవుతోంది. ప్రజా ప్రతినిధులు లేకండానే నాలుగేళ్లుగా బోర్డులో అధికారుల పాలనే కొనసాగుతోంది. బోర్డులో ప్రజాస్వామ్యానికి పాతరేస్తూ, ప్రత్యేక పాలన కొనసాగించడం ఎంతవరకు సమంజసమంటూ స్థానిక ఎమ్మెల్యే నిలదీసినా పట్టించుకునేవారు కరువయ్యారు. నిరంకుశత్వానికి పరాకాష్టగా కేంద్రం రెండు రోజుల క్రితమే వేరీడ్ బోర్డును మరో ఏడాది పాటు పొడిగిస్తూ గెజిట్ జారీ చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ జాయింట్ కమిటీ పేరిట కంటోన్మెంట్ వ్యాప్తంగా నిరసనలకు రంగం సిద్ధమైంది.

ఎన్నికలు జరిగి పదేళ్లు..

రెండు వందల ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన కంటోన్మెంట్‌లో ది కంటోన్మెంట్స్ యాక్ట్ -1924 పేరిట బ్రిటీష్ హయాంలోనే ప్రత్యేక పాలన మొదలైంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక దేశ వ్యాప్తంగా స్థానిక సంస్థలకు సంబంధించి అనేక చట్టాలు అమల్లోకి వచ్చినప్పటికీ, కంటోన్మెంట్‌లలో మాత్రం ఎలాంటి మార్పుల్లేవు. దాదాపు 60 ఏళ్ల తర్వాత 2006లో పురాతన చట్టంలో కొద్దిపాటి మార్పులతో నూతన చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. 1987 వరకు కంటోన్మెంట్ బోర్డుకు మూడేళ్లకు ఒకసారి ఎన్నికలు జరగ్గా, 1992 నుంచి ఐదేళ్లకోసారి నిర్వహిస్తూ వచ్చారు. 2015 జనవరి 11న చివరిసారిగా కంటోన్మెంట్‌కు ఎన్నికలు జరిగాయి. అయితే చట్టాల్లో మార్పులు చేపట్టిన మోదీ సర్కారు, కంటోన్మెంట్ చట్టంలోనూ మార్పులు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ది కంటోన్మెంట్ బిల్ -2020 పేరిట ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి, పార్లమెంట్ ఆమోదం కోసం ఎజెండాలో చేర్చారు. రెండేళ్లపాటు ఎజెండాకే పరిమితమైన ఈ బిల్లు పేరు మార్పు మినహా నేటికీ ఆమోదానికి నోచుకోలేదు.

విలీనం పేరిట కాలయాపన

దేశవ్యాప్తంగా కంటోన్మెంట్‌లను సమీప స్థానిక సంస్థల్లో విలీనం చేయాలని మూడేళ్ల క్రితమే కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు లేఖలు రాయగా, తెలంగాణ ప్రభుత్వం భేషరతుగా అంగీకరిస్తూ తక్షణమే స్పందించింది. దీంతో 2023 జనవరి 4న ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి విధి, విధానాలపై చర్చించింది. వివిధ రాష్ట్రాల్లోనే కంటోన్మెంట్‌ల విలీనానికి సంబంధించి ప్రక్రియ వేగంగా సాగుతున్నప్పటికీ, సికింద్రాబాద్ కంటోన్మెంట్ విలీనం ఊసే లేకుండా పోయింది. గతేడాది జూన్‌లో కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మరోసారి అభిప్రాయ సేకరణ చేపట్టింది. ఇదిలా ఉండగా, 2023 ఫిబ్రవరిలో కంటోన్మెంట్‌లకు ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం, అర్థంతరంగా ఉపసంహరించుకుంది.

తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి



కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేస్తామన్న కేంద్రం ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉంది. అయినా ఎందుకు జాప్యం చేస్తున్నారో వారికే తెలియాలి. ఇక విలీనం పేరిట బోర్డులో ప్రజాప్రతిధులు లేకండా కేవలం అధికారులతో పాలన సాగించడం సరికాదు. తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాం.

-శ్రీగణేశ్, ఎమ్మెల్యే

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి



సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఎన్నికలు నిర్వహించకుండా కేంద్రం ఇక్కడి ప్రజలను తీవ్రంగా అవమానిస్తోంది. పదేళ్లపాటు ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేయడం మరీ దారుణం. జనవరి 11 నాటికి ఎన్నికలు జరిగి పదేళ్లు పూర్తి కావస్తున్న నేపథ్యంలో, ప్రజాస్వామ్య పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు పిలుపునిస్తున్నాం. కేంద్రం స్పందించేంత వరకు నిరసనలు కొనసాగిస్తాం.

-సతీష్ గుప్తా, ప్రజాస్వామ్య పరిరక్షణ జేఏసీ కన్వీనర్

నగరంలో నేడు

- బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో కొనసాగుతున్న ఉద్యాన్ ఉత్సవ్ కార్యక్రమాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయి.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళామేళా ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఆలయాలను కాపాడుకుంటూ
ఐక్యత పెంపొందించాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి



కేలండర్‌ను ఆవిష్కరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి

బంజారాహిల్స్: ఆలయాలను కాపాడుకుంటూ ఐక్యతను పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తంగిరాల మాధవీదేవి అన్నారు. ఆదివారం ఆమె జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నాగర్‌కర్నూల్ జిల్లా, శ్రీ రంగాపురంలోని శ్రీ రంగనాయక ఆలయ నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలోనే అన్ని మతాలను గౌరవిస్తూనే తమ మతాన్ని పాటించాలనే సిద్ధాంతం ఉందన్నారు. పురాతన ఆలయాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. జనవరి 13న ఆలయంలో నిర్వహించనున్న గోదా కల్యాణానికి హాజరుకావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు జస్టిస్ మాధవీదేవిని కోరారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది హనుమంతరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు బండారు మల్లికార్జున్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమెన్ టీచర్స్ డే



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో ఉమెన్ టీచర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఆదివారం వర్సిటీలోని మెకాస్టార్ ఆడిటోరియంలో విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే 194వ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో సావిత్రీ బాయి పూలేకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్, తులసీదాసు, డా.ప్రతిభ లక్ష్మీ, సూర్య, శ్రీతేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిపై
బురద చల్లడం తగదు

లక్డీకాపూల్ : ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు బురద చల్లడం తగదని ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య అన్నారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో ఎన్నో ప్రజా సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ప్రజల కష్టాలు విని, వారి నుంచి అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరిస్తున్న ప్రజావాణి కార్యక్రమంపై హరీష్ రావు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వీలు చేసుకుని ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి స్వయంగా పరిశీలించాలని సూచించారు. ఇప్పటి వరకు 92 సార్లు నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా 92,115 అర్జీలను స్వీకరించామని, వాటిలో 63 శాతం సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. 2023 డిసెంబర్ 8న ప్రజావాణి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని, ఈ ప్రాంగణాన్ని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ అని నామకరణం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

సావిత్రిబాయి పూలే జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



చెరుకు లక్ష్మిని సన్మానిస్తున్న సముద్రాల వేణుగోపాలచారి తదితరులు

చిక్కడపల్లి: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. ఆదివారం సాయంత్రం చిక్కడపల్లిలో త్యాగరాయ గానసభలో సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన హూప్ స్వచ్ఛంద సేవా సమితి , సింధు ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి దైద వెంకన్న ,అనిత ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 194 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, తెలంగాణ రాష్ట్ర ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణుగోపాలచారి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, సంఘసంస్కర్తగా కవయిత్రిగా అందించిన సేవలు ఎనలేనివన్నారు. ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తన భర్త అడుగుజాడలో నడుస్తూ మహిళా విద్య కోసం సేవ చేశారన్నారు. కార్యక్రమంలో సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు అనుమండ్ల శోభారాణి, సినీ నటుడు డాక్టర్ చింతకుంట మాణిక్‌రావు, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు డాక్టర్ ఎస్.శంకరం పాల్గొని ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ శాంతాబాయి, హంస ఫౌండేషన్ చైర్‌పర్సన్ చెరుకు లక్ష్మి, తిరుమల కుమారి, రమేష్‌కుమార్, అనిల్‌కుమార్, బోడ సునీల్, నీరుడు విజయ్, పిడమర్తి ప్రవీణ్, పుట్టల మల్లేష్, సృజన, వల్లూరి శ్రీనివాస్‌రావు, గుగ్గెళ్ల పేరయ్య, దైద భద్రయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 62 మందికి సావిత్రీబాయి పూలే ఎక్సలెన్స్ జాతీయ అవార్డులను ప్రదానం చేశారు.

ఓయూలో ఆదర్శ వివాహాలు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ప్రేమ జంటలకు కులాంతర వివాహాలు జరిగాయి. ఆదివారం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో మూఢ నమ్మకాలు, కుల నిర్మూలన సంఘం (ఎంఎస్ఎస్) ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎంఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బైరి నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. అనంతరం పలు జంటలకు వేదికపై సామూహిక వివాహాలు చేశారు. అనంతరం ఎంఎస్ఎస్ రాష్ట్ర నూతన కమిటీ, యూత్ కమిటీలను ప్రకటించారు.

డయాబెటిక్ రెటినో థెరపీపై
అవగాహన కల్పించాలి



గన్‌ఫౌండ్రీ: డయాబెటిక్ రెటినో థెరపీపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందని ఎంపీ మల్లు రవి అన్నారు. ఆదివారం అబిడ్స్‌లోని నియో రెటినా ఆసుపత్రి ఆధ్వర్యంలో డయాబెటిక్ రెటీనా పై అవగాహన వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాబెటిక్ అనగానే బరువు తగ్గాలి, షుగర్ లెవల్స్ వంటి వాటిపై మాత్రమే పరీక్షలు చేయించుకుంటారన్నారు. రెటీనాకు సంబంధించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదన్నారు. రెటీనా ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ రాజా రాంరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు డయాబెటిక్ పై అవగాహన కల్పించేందుకు ఈ వాక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా, వ్యాయామం, ఉదయం వేళల్లో వాకింగ్ చేయాలని సూచించారు. అనంతరం అబిడ్స్ చాపల్‌రోడ్డు, బషీర్‌బాగ్, ట్యాంక్‌బండ్ మీదుగా అవగాహన వాక్ నిర్వహించారు. కార్యక్రమంలో నియో రెటీనా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

సాక్షి , సిటీ బ్యూరో: రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ (ఆర్‌సీఎల్‌డీ) మొయినాబాద్ ఆధ్వర్యంలో పేద ప్రజలు అనగారిన వర్గాల వారి కోసం అతిపెద్ద దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్‌తో పాటు రోటరీ డిస్ట్రిక్ట్ 3150లోని అన్ని క్లబ్‌ల సహకారంతో నగరంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది. నగరంతో పాటుగా ఆదిలాబాద్‌లోని గిరిజన కుటుంబాలకు 4,000 దుప్పట్లను పంపిణీ చేశారు. ఆదిలాబాద్ గిరిజన ప్రాంతాల్లో మొదటి దశ కార్యక్రమాన్ని నిర్వహించగా తదుపరి ఆదిలాబాద్ హామ్లెట్స్‌లో పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా రోటేరియన్ చిరంజీవ్ సింగ్ సలుజా మాట్లాడుతూ... ఈ దుప్పట్ల పంపిణీ కార్యక్రమం స్వచ్ఛంద సేవ కన్నా మించినదని, ఇది వెనుకబడిన వర్గాల పట్ల తమ నిబద్ధత, సేవా తత్పరతకు నిదర్శనమన్నారు. గిఫ్ట్ ఆఫ్ వార్మ్త్ ఇనిషియేటివ్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆర్‌సీ లేక్ డిస్ట్రిక్ట్, ఆర్సీ హైదరాబాద్ దక్కన్, ఆర్సీ స్మార్ట్ హైదరాబాద్, ఆర్సీ హైదరాబాద్ మిడ్ టౌన్, ఆర్ సి హైదరాబాద్ మెర్వారిక్స్, ఆర్సీ హైదరాబాద్ ముత్యాలు, ఆర్సీ హైదరాబాద్ మెగాసిటీ, ఆర్సీ సికింద్రాబాద్ సైనికపురి, ఆర్సీ గ్రేటర్ హైదరాబాద్, ఆర్సీ మియాపూర్, ఆర్‌సీ గ్లోబల్ విజార్డ్స్, ఆర్సీ కోకాపేట్ ఎకామ్ తదితర క్లబ్‌లు సహకారం అందించినట్లు తెలిపారు. ఈ చొరవ రోటరీ సామూహిక శక్తిని, సామాజిక బాధ్యతను నిర్వర్తించడంలో తమ నిబద్ధతను ప్రదర్శిస్తుందన్నారు.



జర్నలిజానికి గౌరవం తెచ్చిన వ్యక్తి మానికొండ



మాట్లాడుతున్న పాశం యాదగిరి, వేదికపై వినయ్‌కుమార్, వల్లీశ్వర్, అమరయ్య తదితరులు

పంజగుట్ట: జర్నలిస్టులు మరోమారు పాత్రికేయ ఉద్యమ పితామహుడు మానికొండ చలపతిరావు చూపిన దారిలో సంఘటితమై తమ గళాన్ని వినిపించాల్సిన అవసరం ఉందని పలువురు సీనియర్ పాత్రికేయులు, వక్తలు అన్నారు. నేషనల్ ఎలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఏజే), హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు ఆకుల అమరయ్య రచించిన 'భారతీయ జర్నలిజం ధ్రువతార మానికొండ చలపతిరావు' పుస్తక పరిచయ సభ ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఎన్ఏజే సెక్రటరీ జనరల్ ఎన్.కొండయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఎస్. వినయ్ కుమార్, వల్లీశ్వర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎల్. వేణుగోపాల్ నాయుడు, పాశం యాదగిరి, నందిరాజు రాధాకృష్ణ, గోపిచంద్, జి.ఆంజనేయులు, ఎం.సాగర్ కుమార్, గాంధీ, తాడి ప్రకాష్, రామ్మోహన్ నాయుడు, మామిడి సోమయ్య తదితరులు పాల్గొన్నారు. మొదటితరంలోనే జర్నలిస్టులకు అపారమైన గౌరవం తీసుకువచ్చిన వ్యక్తి చలపతి రావు అని కొనియాడారు. ఆయన పోరాటంతోనే జర్నలిస్టులకు వేతనాలు, భద్రత వచ్చిందన్నారు. 30 ఏళ్ల పాటు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏర్పాటు చేసిన నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించారని గుర్తుచేశారు.

అత్యుత్తమ సేవలకు సత్కారం

పారిశ్రామికవేత్త సూర్యరాజ్‌కు 'అంబాసిడర్ ఆఫ్ గుడ్ విల్' అవార్డు

కుత్బుల్లాపూర్: ప్రముఖ పారిశ్రామికవేత్త లయన్ జి.ఆర్. సూర్యరాజ్ చేస్తున్న సేవాకార్యక్రమాలకు గాను ఆయనకు అత్యున్నత 'అంబాసిడర్ ఆఫ్ గుడ్ విల్' పురస్కారం లభించింది. నగరంలోని నోవాటెల్ హైటెక్స్‌లో జరిగిన ఇండియా సౌత్ ఆసియా మిడిల్ ఈస్ట్' దేశాల సదస్సులో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ పాటి హిల్, వైస్ ప్రెసిడెంట్ ఏ.పీ. సింగ్ చేతులమీదుగా ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా కొంపల్లిలోని కేవీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో సూర్యరాజ్‌ను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఘట్టమనేని బాబురావు మాట్లాడుతూ... సూర్యరాజ్ చేపట్టిన పలు సేవా కార్యక్రమాలను వివరిస్తూ ఆయన సేవానిరతిని కొనియాడారు. యువతకు ఆయన సేవలు.. ఆశయాలు ఆదర్శం కావాలన్నారు. ఈ సందర్భంగా సూర్యరాజ్ మాట్లాడుతూ... తన ఆఖరి శ్వాస వరకు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉంటానన్నారు. పేదలకు సేవ చేయడంలో ఎంతో మానసిక తృప్తి ఉంటుందన్నారు. తనను సన్మానించిన లయన్స్ అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ ప్రముఖులు సునిల్‌కుమార్, నరేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, నగేష్ పంపాటి, బద్రి విశాల్ బన్సల్ వివిధ జిల్లాల గవర్నర్లు, వైస్ గవర్నర్లు, మాజీ గవర్నర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.



'వాయిస్ ఆఫ్ హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ



మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలోని చైతన్య స్పందన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాయిస్ ఆఫ్ హైదరాబాద్-2025, పాటల పోటీలు, నిధుల సమీకరణ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ల డాక్టర్ వాణి, డాక్టర్ కౌస్తుభ, పీఆర్ఓ డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఒక మంచి కార్యక్రమానికి మద్దతు ఇవ్వడంతో పాటు సంగీతంలో ప్రతిభను గుర్తిస్తూ, సమాజ సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఈ కార్యక్రమం ద్వారా నిధులను సమీకరిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ప్రైజ్ మనీగా రూ. 40 వేలు ఇస్తామని, ఎంట్రీ ఫీజుగా రూ. 350 నిర్ణయించినట్లు తెలిపారు. నాలుగు రౌండ్‌లలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

కష్టాల్లో ఉన్న పిల్లలకు అండగా నిలుద్దాం..



మాట్లాడుతున్న అభిలాష బిస్త్

బండ్లగూడ: కష్టాల్లో ఉన్న చిన్నారులకు అండగా ఉంటూ వారి భవిష్యత్తును మార్చేందుకు వారికి విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులను శక్తివంతం చేసేందుకు తెలంగాణ పోలీస్ అకాడమీ అక్షయ విద్య ఫౌండేషన్ (ఏవీఎఫ్)తో కలిసి పనిచేస్తుందని పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ అన్నారు. ఆదివారం ఉపాధ్యాయులకు వివిధ రంగాల నిపుణులతో శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏవీఎఫ్ సంస్థ 120 అధ్యయన కేంద్రాలను నిర్వహిస్తుందని, పేద విద్యార్థుల లోపాలను పూడ్చటంతో పాటు స్ఫూర్తి దాయకంగా పనిచేస్తుందన్నారు. వారికి అండగా నిలిచి విద్యార్థులను ఉన్నత చదువులు చదివించేందుకు పోలీస్ అకాడమీ అన్ని విధాల సహరిస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మరిన్ని సంస్థలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సీఈఓ వరప్రసాద్, అకడమిక్ హెడ్ శ్రీదేవి, అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ నర్మద తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు, కాపులు సంఘటితం కావాలి



'ఆప్త' గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నాయకులు

కాచిగూడ: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మున్నూరు కాపులందరినీ ఏకం చేస్తూ సంఘ అభివృద్ధికి కృషి చేయడమే తమ లక్ష్యమని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, భారతీయ కాపు ఐక్యవేదిక జాతీయ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్, ఉపాధ్యక్షుడు జల్లేపల్లి వెంకటేశ్వర్‌రావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి. మహేందర్ కుమార్ అన్నారు. అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) కాటలిస్ట్ అధ్యక్షుడు తినాధ్ ముద్రగడ అధ్యక్షతన నగరంలో గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆదివారం బర్కత్‌పుర లోని మున్నూరుకాపు సంఘం కార్యాలయంలో వారు మీడియాకు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కాపు, మున్నూరు కాపు వ్యాపారులు పాల్గొని ఐక్యతను చాటారని వారు తెలిపారు. గ్లోబల్ బిజినెస్ సదస్సును హైదరాబాద్‌లో జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కాపులు, మున్నూరు కాపులు సంఘటితమై వ్యాపార మెలకువలు, ఉద్యోగ మెలకువలు తెలుసుకుని మరింత అభివృద్ధి చెందేందుకు దోహద పడాలన్నారు. హైదరాబాద్ నగరంలో అనువైన వాతావరణం ఉన్నందున కాపులు, మున్నూరుకాపులు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టి తమ సామాజిక వర్గాలకు తోడ్పాటును అందించాలని కోరారు.

సంక్రాంతి పండుగలో డూడూ బసవన్నలు, రంగవల్లులు, హరిదాసులు, భోగిమంటలు, పిండివంటలు ఎంత ప్రాధాన్యత కలిగినవో.. కోడి పందేలకు కూడా అంతే ప్రాధాన్యత ఉంటుంది.. గట్టిగా చెప్పాలంటే.. సంక్రాంతి సందడిలో కోడిపందేలే కీలకంగా మారాయి కూడా.. ఆంధ్రలో సంక్రాంతికి కోడిపందేలకు మహిళలు సైతం వెళ్లి పందేలు కాస్తారంటే ఎంతటి క్రేజ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.. అలాంటి ఆంధ్రా సంక్రాంతి కోడి పందేలకు నగరం నుంచి పందెం రాయుళ్లతో పాటు కోళ్లు కూడా వెళుతున్నాయి.. అంతే కాదు పందేల్లో ప్రత్యర్థి కోళ్లను ఢీ కొట్టేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ సారి పందేల బరిలోకి దిగేందుకు పాతబస్తీలోని కోళ్లు కాలుదువ్వుతున్నాయి. పాతబస్తీలో పందెపు కోళ్ల పెంపకంతోపాటు వాటికి బరిలో పడే విధంగా శిక్షణ కూడా ఇస్తున్నారు. దీంతో ఇక్కడ పెంచుతున్న కోళ్లకు భారీ డిమాండ్ ఏర్పడుతుంది. మరికొన్ని రోజుల్లో సంక్రాంతి నేపథ్యంలో దీనిపైనే ప్రత్యేక కథనం... - సాక్షి, సిటీబ్యూరో



- ప్రత్యర్థి కోళ్లను ఢీ కొట్టేందుకు సిద్ధం
- నగరంలోనూ జోరుగా అమ్మకాలు
- ఇప్పటికే కొనుగోలు చేసిన ఔత్సాహికులు
- పందెం కోళ్లకు ప్రత్యేక ఆహారం, శిక్షణ
- రంగు, జాతిని బట్టి పలుకుతున్న ధరలు
- నెలకు ఐదు నుంచి ఆరు వేల వరకూ ఖర్చు

కొక్కొరొకో ఢీ

ఆంధ్ర దంగల్‌కు.. తెలంగాణ కోళ్లు..

సంక్రాంతి కోడి పందేలకు ఇప్పటికే సర్వం సిద్ధమవుతోంది. బరిలో నిలిచే కోళ్లను ఇప్పటికే పందెంరాయుళ్లు జల్లెడపట్టేశారు. మరికొందరు ఆ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. దీంతో ఒక్కో కోడి ధర పదివేల నుంచి లక్ష రూపాయల వరకూ పలుకుతోంది. జాతి, రంగును బట్టి కూడా ధరలను నిర్ణయిస్తారు. బరిలో దిగితే చావో రేవో తేల్చుకునేలా వాటికి శిక్షణ ఇస్తున్నారు. కొన్ని రకాల జాతి పుంజులైతే రూ.70 వేల నుంచి లక్ష వరకూ పలుకుతాయి.. అత్యంత ఖరీదుగా ఉండేవి సీతువ జాతి కోడి పుంజులు. ఆ తరువాతి స్థానాల్లో పర్ల, పచ్చకాకి, డేగ, కాకిపుంజు, పెట్టమారు రకాలున్నాయి.

మెనూ చాలా ముఖ్యం..

అట్లపెనంపై గుడ్డును వేడిచేసి బాదం, నిమ్మ నూనెతో మసాజ్ చేస్తారు. చికెన్, ఎండు చేప ముక్కలు ధాన్యంలో కలిపి ఇస్తారు. ఇవేకాకుండా జీడి పప్పు, బాదం, పిస్తా, ఎండు ఖర్జూరం, కిస్మిస్, మేకపాలు, వీటితోపాటు బలవర్ధకమైన పోషకాలు ఉండే ఆహారం తినిపిస్తారు. గంట్లు, బొబ్బ, బియ్యం, రాగులు మినప, శనగపప్పు, గోధుమ మిశ్రమాన్ని రోజూ తినిపిస్తారు. దీంతో పాటు మధ్యాహ్నం మటన్ కీమా, సాయంత్రం స్నాక్స్‌గా జొన్నలు, కోడిగుడ్లు పెడతారు. ప్రతి మూడు గంటలకూ ఓ సారి జీడిపప్పు, బాదం పిస్తా మిశ్రమాన్ని వడ్డిస్తారు. పుంజులకు బలమైన ఆహారం ఇస్తూనే కఠినమైన వ్యాయామం శిక్షణ ఇస్తారు.

పోటీకి ప్రత్యేక శిక్షణ..

ప్రత్యర్థి దెబ్బలు తట్టుకుని సత్తా చాటేలా కోడి పుంజులకు తర్ఫీదు ఇస్తున్నారు. కోడి బలిష్టంగా తయారు కావడానికి పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. పిల్లగా ఉన్నప్పటి నుంచే పందెం కోళ్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. రోజువారీ మెనూ, కసరత్తు, మసాజ్‌తో వాటిని కుస్తీకి సిద్ధం చేస్తారు. నాలుగు నెలల శిక్షణా కాలాన్ని విభజించి పోటీకి తీర్చిదిద్దుతారు. ఉదయాన్నే వాటికి మౌత్ వాష్ చేయిస్తారు. ట్రైనర్ నోటిలో నీళ్లు పోసుకుని కోళ్ల ముఖంపై స్ప్రే చేస్తాడు. ఈ ప్రక్రియను కల్లె కొట్టడం అంటారు. పుంజు కండరాలు బిగుతుగా ఉండేందుకు వాకింగ్ చేయిస్తారు. వేడి నీళ్లు, స్పెషల్ షాంపూతో కోడికి స్నానం చేయిస్తారు. రెండు గంటల సమయం తర్వాత మళ్లీ శిక్షణ మొదలవుతుంది. మరో పుంజును బరిలో దించడం ద్వారా పోటీకి రెచ్చగొట్టేలా ట్రిక్స్ ఉపయోగిస్తారు. తద్వారా రెండు పుంజులూ పోటాపోటీగా పోరాడేలా చేస్తారు. ఈ పోటీ తర్వాత పుంజులకు మసాజ్ సెషన్ ఉంటుంది. అంతేకాదు.. తిన్నది ఒంటబట్టేవిధంగా కసరత్తులు ఉంటాయి. చెరువులో ఈత కొట్టిస్తారు. పందెం కోడి నిర్వహణకు నెలకు ఐదు నుంచి ఆరు వేల వరకూ ఖర్చు అవుతుంది.





ఎంపికే కీలకం...

కోడిపుంజు ఎంపిక నుంచి దానికి ఇచ్చే ఆహారం వరకూ అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. కోడిపందెం కోసం అన్ని రకాల జాతులూ పనికిరావు. ప్రత్యేకంగా సూచించిన వాటినే కోడిపందేలకు ఉపయోగిస్తారు. వీటిలో డేగా, నల్లకాకి, తెల్లపర్ల, నెమలి కాకి, కాకిడేగ, కత్తిరాయి, జుమర్, నూరీ, కగర్, డుమర్, యాకూద్, కాకిడేగ, అబ్రాస్, పచ్చ కాకి, సీతువా, అసీల్ ప్రధానమైనవి. సాధారణ కోడిపుంజుల కంటే పందెంకోళ్లు భిన్నంగా ఉంటాయి. 24 గంటలు వాటిపై ప్రత్యేక నిఘా పెడతారు.



భారీ డిమాండ్ ఉంది..

గత కొన్నేళ్లుగా ఆంధ్ర ప్రాంతానికి మా కోళ్ల పెందేలకు తీసుకెళుతున్నారు. దీంతో భారీ డిమాండ్ ఏర్పడింది. అప్పటి నుంచి మేము పందెం కోళ్లను పెంచుతున్నాం.. వాటికి ప్రత్యేక ఆహారంతో పాటు, శిక్షణ కూడా ఇస్తాం. కోడి బ్రీడ్, జీవనశైలిని బట్టి వాటి ఆహారం, శిక్షణ ఉంటుంది. ఇప్పటికే పలువురు మా కోళ్లను కొనుగోలు చేశారు. అల్ బొగ్దాది అండ్ స్కోర్ అసీల్ పేరుతో ఇన్‌స్టా అకౌంట్ నిర్వహిస్తున్నాము. దీని ద్వారా కోళ్లు కావాల్సిన వారు మమ్మల్ని సంప్రదించవచ్చు.

– హబీబ్ జైన్, పందెం కోళ్ల ఫామ్ యజమాని





పిల్లల అలవాట్లు, ఆరోగ్యంపై

శ్రద్ధ అవసరం

టెన్నిస్ క్రీడాకారిణి సానియామీర్జా

సాక్షి, సిటీబ్యూరో: పిల్లల అలవాట్లు, ఆరోగ్యంపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి సానియామీర్జా అన్నారు. సీసా స్పేస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 'మొబైల్ ఫోన్, ట్యాబ్, ఐపాడ్‌లకు పిల్లలు అతుక్కుపోతున్నారు. అన్నం తినే సమయంలోనూ చేతిలో డివైస్ లేకపోతే ముద్ద దిగడం లేదు. ఒక తల్లిగా నేనూ బాధితురాలినే.. పిల్లలకు ఆరోగ్యం, ప్రశాంతమైన వాతావరణంలో చదువు అనేది ముఖ్యం. అందుకు స్పేస్‌లో భాగస్వామిని కావాలని నిర్ణయించుకున్నాను' అని ఆమె పేర్కొన్నారు. చిన్నారులకు సరైన దిశానిర్దేశం చేసినపుడే అద్భుతమైన భవిష్యత్తును అందుకుంటారన్నారు. ఆటలు, ఆరోగ్యం కోసం కుటుంబ సభ్యులతో వచ్చి ఉండేలా ఇక్కడ సౌకర్యాలు ఉన్నాయని సీసా స్పేస్ కో-ఫౌండర్ కొణిదెల శ్రీజ పేర్కొన్నారు. స్వాతి గునుపాటి ఏడాది వయసున్న పిల్లల నుంచి టీనేజర్ల వరకూ అవకాశం కల్పిస్తున్నామన్నారు.

అలరించిన హాసిని

- కర్ణాటక సంగీతంలో 15 ఏళ్ల ఎన్ఆర్ఐ అద్భుత ప్రదర్శన
- అమెరికాలో పుట్టి, భారతీయ సంస్కృతిపై పట్టు
- అభినందించిన మంత్రి శ్రీధర్‌బాబు

రాయదుర్గం: అమెరికాలో జన్మించినా.. జన్మభూమిపై ఉన్న మమకారంతో నగరంలో మొదటి సారిగా తన కర్ణాటక సంగీత ప్రదర్శనతో అందరినీ రంజింపజేసింది కళాకారిణి హాసిని భట్టిప్రోలు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్ హోటల్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ప్రదర్శన ఇచ్చారు. 15 ఏళ్ల వయసులోనే తనదైన శైలిలో కర్ణాటక సంగీత ప్రదర్శనతో అందరి మనసులనూ దోచుకుంది. అమెరికాలోని సాన్ డియాగో, కాలిఫోర్నియాలో నివాసముండే పద్మజ, పవన్ భట్టిప్రోలు దంపతుల కుమార్తె. ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. చిన్నతనం నుంచి కర్ణాటక సంగీతంపై కనబర్చిన ఆసక్తిని గమనించి ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఈ మేరకు అవకాశం వచ్చినప్పుడల్లా ప్రదర్శనలను ఇచ్చేందుకు ముందుకొచ్చింది. చెన్నైలో, గురువాయూర్ శ్రీకృష్ణ దేవాలయంలో ఇలా మొత్తం 8 ప్రదర్శనలను ఇవ్వగా హైదరాబాద్‌పై ఉన్న మమకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. హాసిని మాట్లాడుతూ బమ్మెర పోతన రచించిన భాగవతం తెలుగుశ్లోకాలను ప్రచారం చేయడంలో అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.



భారతీయ సంస్కృతిని మరవొద్దు..

ఎన్ఆర్ఐలైనా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను మరవరాదని, భట్టిప్రోలు కుటుంబం దీనికి నిదర్శనమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా హాసినిని అభినందించారు. భగవద్గీత పద్యాలు అనర్గళంగా హాసిని పాడటం చూస్తే మా పిల్లలు కూడా ఇంత చక్కగా తెలుగులో మాట్లాడుతారో..లేదో..? అని వ్యాఖ్యానించారు. తమ కుటుంబానికి, తండ్రి శ్రీపాదరావు, తనకు ఈ కుటుంబంతో విడదీయరాని బంధం ఉందని గుర్తుచేశారు..అనంతరం హాసిని కుటుంబ సభ్యులను అభినందించారు. పెద్ద సంఖ్యలో సంగీతప్రియులు, కుటుంబసభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

ఓపెన్ ఎయిర్ థియేటర్..

జేవీఆర్ పార్కులో సుందరంగా నిర్మితమైన వేదిక



బంజారాహిల్స్: చుట్టూ పచ్చటి లాన్.. విరబూసిన పూల మొక్కలు.. ఏపుగా పెరిగిన చెట్ల నుంచి వచ్చే చల్లటి గాలి.. ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణం..వీటన్నింటి మధ్య ఓపెన్ ఎయిర్ థియేటర్. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని జలగం వెంగళరావుపార్కులో జీహెచ్ఎంసీ సరికొత్త థీమ్‌తో రూ.20 లక్షలు వెచ్చించి ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను నిర్మించింది. శిల్పారామం తరహాలోనే ఇక్కడ 60 మంది కూర్చునేందుకు వీలుగా సీటింగ్ కెపాసిటీతో నిర్మించిన ఈ వేదిక కనువిందు చేస్తున్నది. ఎవరైనా శాస్త్రీయ నృత్యాల అరంగేట్రం చేయాలన్నా, నృత్య ప్రదర్శనలు ఇవ్వాలన్నా, సంగీత కార్యక్రమాలు ఏర్పాటుచేయాలన్నా, పుట్టినరోజు, వివాహాది వార్షికోత్సవాలు, ఇతరత్రా గెట్ టు గెథర్‌లకు ఈ ఓపెన్ థియేటర్‌ను అతి తక్కువ ధరకే అద్దెకు ఇవ్వనున్నారు. చుట్టూ పరచుకున్న పచ్చదనం మధ్య నిర్మించిన ఓపెన్ ఎయిర్ థియేటర్ కొత్త అనుభూతిని పంచనుంది.

మంచిరేవులలో ఆకట్టుకుంటున్న ఫారెస్ట్ ట్రెక్ పార్క్

నేచర్ క్యాంప్‌లో ఔత్సాహికుల ఎకో టూరిజం ఫొటోగ్రఫీ

నేచర్.. అదిరే ఫీచర్..







మణికొండ: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డెక్కన్ వుడ్స్, ట్రెయిల్స్ బ్రాండ్ పేరుతో మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో శనివారం రాత్రి రాక్ బే నేచర్ క్యాంప్ నిర్వహించారు. క్యాంప్‌లో పాల్గొన్న 20 మంది ఔత్సాహికులకు ఎకో టూరిజం ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్, ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్, హెడ్ నేచురలిస్ట్ అఖిల్ ఫారెస్ట్ ట్రెక్ పార్కు విశిష్టతలను వివరించారు. ఇందులో నేచర్ వాక్, చెట్ల ఉపయోగాలు, విశిష్టతలు, రాక్ క్లైంబింగ్, రాపెల్లింగ్, కమాండోనెట్, స్కై వాక్, అడ్వెంచర్ కార్యక్రమాలను చూయించారు. అనంతరం క్యాంపింగ్ టెంట్‌లో వారికి బస ఏర్పాటు చేశారు.

ఆకట్టుకుంటున్న బర్డ్‌వాక్..

రాత్రికి క్యాంప్‌ఫైర్, వైల్డ్ లైఫ్ కథలు, అడవుల్లో జంతువులు ఎదురైతే ఎలా ప్రతిస్పందించాలో వివరించారు. పాములపై అవగాహన, అడవుల ప్రాముఖ్యత వివరించారు. ఆదివారం ఉదయం బర్డ్‌వాక్‌లో పక్షులను గుర్తించటం, వాటి వీక్షణలో 18 రకాల పక్షలను చూయించి వాటి విశిష్టతలను వివరించారు. అనంతరం ట్రెక్కింగ్ చేయించి పెద్ద చెరువు వద్ద అల్పాహారం అందించారు. ఇలాంటి నేచర్ క్యాంప్‌లను ప్రతి శని, ఆదివారాల్లో నిర్వహిస్తామని, పర్యావరణం, సహజ నిర్మిత వనరులపై అవగాహన కల్పిస్తామని, ఇందులో పాల్గొనాలనుకునే వారు 9493549399, 9885298980 నెంబర్లను సంప్రదించాలన్నారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్, సహాయ డైరెక్టర్ వి తనూజ, మల్లారెడ్డి, ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముజిగల్ ఆధ్వర్యంలో

మీట్ మింగిల్

సాక్షి, సిటీబ్యూరో: సంగీత విద్యలో శిక్షణను అందించే నగరానికి చెందిన హైబ్రిడ్ ప్లాట్‌ఫార్మ్ ముజిగల్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ మీట్ అండ్ మింగిల్ వేడుకలను నిర్వహిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ లక్ష్మీనారాయణ ఏలూరి తెలిపారు. నగరంతో పాటు దేశవ్యాప్తంగా 100కుపైగా భాగస్వామ్యాలను 8,000 మంది విద్యార్థుల మైలురాయిని చేరుకున్న నేపథ్యంలో మీట్ మింగిల్ పేరిట వేడుకలను నిర్వహిస్తున్నామని, వీటిలో కార్పొరేట్ ఉద్యోగులు, మ్యూజిక్ టీచర్లు.. తదితరులను భాగస్వాముల్ని చేస్తున్నామని వివరించారు.

విజేతలకు బహుమతులు అందజేసిన వైస్ ఛాన్స్‌లర్ బీజే రావు

హెచ్‌సీయూలో

'మిల్లెట్-యుటోపియా-2025'



రాయదుర్గం: నేర్చుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ మెరుగైన భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని హెచ్‌సీయూ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు అన్నారు. హెచ్‌సీయూలో 'మిల్లెట్ యుటోపియా-2025' పేరిట పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. 50 పాఠశాలల నుంచి 1,358 మంది విద్యార్థులు, 168 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో పోటీ పడేందుకు ఆసక్తి కనబర్చాలని బీజే రావు సూచించారు. మిల్లెట్ యుటోపియా-2025 కన్వీనర్ డాక్టర్ ముత్తమిలరసన్ మాట్లాడుతూ మూడోసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. ఆహారభద్రత, పోషకాహారం కోసం మిల్లెట్‌ల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించే లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. 2023లో జరుపుకున్న అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరపు వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. క్విజ్, డిబేట్, డ్రాయింట్, స్కిట్, రైటింగ్ ఎలక్యూషన్ తోపాటు ఆరుపోటీలను నిర్వహించగా విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్లాంట్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని మాజీవైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ పొదిలె అప్పారావు, ప్లాంట్‌సైన్సెస్ హెడ్ ప్రొఫెసర్ ఎస్ రాజగోపాల్, పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అడుగడుగునా కమీషన్లు..

స్కామ్‌ల పరం.. అమరావతి పురం!

ఏపీ సర్కారు రియల్ ఎస్టేట్ వెంచర్ 'హ్యాపీ నెస్ట్' టెండర్లలో అక్రమాలు

- రాజధాని అమరావతిలో గెజిటెడ్ ఆఫీసర్ల కోసం జీ+12 అంతస్తులతో 14 టవర్లలో 1,440 ఫ్లాట్ల నిర్మాణానికి రూ.492.04 కోట్లతో సీఆర్‌డీఏ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో చదరపు అడుగు నిర్మాణ వ్యయం రూ.1,806.29 మాత్రమే. ఇక హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టులో జీ+18 అంతస్తులతో 12 టవర్లలో 1,200 ఫ్లాట్లు నిర్మిస్తున్నారు. ఇక్కడ మాత్రం నిర్మాణ వ్యయం ఏకంగా రూ.4,511.76 చొప్పున నిర్దేశించారు. నిజానికి అంతస్తులు పెరిగే కొద్దీ నిర్మాణ వ్యయం తగ్గాల్సింది పోయి ఇక్కడ అమాంతం పెరిగి పోయింది. హ్యాపీ నెస్ట్.. గెజిటెడ్ ఆఫీసర్ల క్వార్టర్లు.. ఇవి రెండూ షీర్ వాల్ టెక్నాలజీతోనే నిర్మాణాలు చేపడతారు. వాటి డిజైన్లు, నిర్మాణ రీతి, సౌకర్యాలు ఒకటే. కానీ నిర్మాణ వ్యయం మాత్రం వేర్వేరు.
- అధునాతన సదుపాయాలు, నాణ్యమైన నిర్మాణ సామగ్రి వినియోగించి కట్టే బహుళ అంతస్తుల భవనాల్లోనూ (టవర్స్) నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.1,800 నుంచి రూ.2 వేలకు మించదని (జీఎస్టీ, సీనరేజీ లాంటి అన్ని పన్నులతో కలిపి) విజయవాడ–గుంటూరు, హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు తదితర ప్రాంతాల్లో అత్యంత ప్రతిష్టాత్మక రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసిన పేరు మోసిన బిల్డర్లు చెబుతున్నారు. కానీ.. ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారి రాజధాని అమరావతిలో చేపట్టిన హ్యాపి నెస్ట్ రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టులో మాత్రం చదరపు అడుగు నిర్మాణ వ్యయం ఏకంగా రూ.4,511.76 ఉంది. దీన్ని బట్టి ఒక్కో చ.అడుగుకు రూ.2,500కిపైగా అంచనా వ్యయాన్ని పెంచేసినట్లు స్పష్టమవుతోందని బిల్డర్లు చెబుతున్నారు.
- రెండు మూడు సంస్థలు జాయింట్ వెంచర్(జేవీ)గా ఏర్పడి షెడ్యూలు దాఖలు చేయడానికి వీల్లేదని హ్యాపీనెస్ట్ టెండర్ నోటిఫికేషన్‌లో సీఆర్‌డీఏ నిబంధన విధించింది. కానీ ఆ ప్రాజెక్టు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ 25 శాతం పనులను సబ్ కాంట్రాక్టు కింద అప్పగించే వెసులుబాటు కల్పించింది. దీన్ని బట్టి ముందే ఎంపిక చేసిన బడా కాంట్రాక్టు సంస్థకు హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టును అధిక ధరలకు కట్టబెట్టి కమీషన్లు వసూలు చేసుకునే వ్యూహంతో 'ముఖ్య'నేత చక్రం తిప్పినట్లు వెల్లడవుతోంది.

సాక్షి, అమరావతి: రాజధాని నిర్మాణం ముసుగులో అమరావతిని కూటమి ప్రభుత్వం కుంభకోణాల మయంగా మార్చేస్తోంది. అడుగడుగునా కమీషన్ల దందాతో ఖజానాకు చిల్లు పెడుతూ అమరావతిని అక్రమాల పురంగా తీర్చిదిద్దుతోంది. హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని పెంచేసిన ప్రభుత్వం ఆ భారాన్ని ఇప్పటికే అడ్వాన్సు చెల్లించి ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారిపై మోపితే వ్యతిరేకత వస్తుందని పసిగట్టి దాన్ని రాష్ట్ర ఖజానా నుంచే సర్దుబాటు చేస్తోంది. అంటే.. ప్రభుత్వ ఖజానా నుంచి కాంట్రాక్టు సంస్థకు దోచి పెట్టి, వాటినే కమీషన్ల రూపంలో వసూలు చేసుకునేందుకు 'ముఖ్య'నేత చక్రం తిప్పినట్లు స్పష్టమవుతోందని బిల్డర్లు చెబుతున్నారు. ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారి అవతారం ఎత్తి చేపట్టిన హ్యాపీ నెస్ట్ రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టు టెండర్లలో భారీ ఎత్తున జరిగిన అక్రమాలను గెజిటెడ్ ఆఫీసర్ల హౌసింగ్ ప్రాజెక్టు బహిర్గతం చేసిందని వ్యాఖ్యానిస్తున్నారు. షీర్ వాల్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ రెండింటి డిజైన్లు, నిర్మాణ రీతి, సౌకర్యాలు ఒకటే అయినా హ్యాపీ నెస్ట్ నిర్మాణ వ్యయం చ.అడుగుకు రూ.2,500కిపైగా అదనంగా ఉండటమే అక్రమాలకు నిదర్శనమని ఉదహరిస్తున్నారు.

షెడ్యూళ్లకు 8వతేదీ తుది గడువు

అమరావతిలో 2018లో నాటి టీడీపీ సర్కార్ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర తీసింది. నేలపాడు వద్ద 14.46 ఎకరాల్లో జీ+18 అంతస్తుల్లో 1,200 ఫ్లాట్లతో హ్యాపీ నెస్ట్ రెసిడెన్షియల్ ప్రాజెక్టు నిర్మాణానికి ఎన్నారైలు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజల నుంచి అడ్వాన్సులు సేకరించింది. హ్యాపీ నెస్ట్ పనులను అప్పట్లో రూ.658 కోట్లకు సీఆర్‌డీఏ కాంట్రాక్టు సంస్థకు అప్పగించింది. అయితే అది ముందుకు కదల్లేదు. ఇప్పుడు అదే ప్రాజెక్టును టీడీపీ కూటమి ప్రభుత్వం చేపట్టింది. గత టెండర్‌ను రద్దు చేసింది. తాజాగా రూ.818.03 కోట్ల వ్యయంతో 24 నెలల్లో పూర్తి చేయాలని గడువు నిర్దేశించింది. మూడేళ్ల పాటు నిర్వహించాలనే నిబంధనతో ఎల్ఎస్ (లంప్సమ్ ఓపెన్) విధానంలో టెండర్లు పిలిచింది. టెండర్ల షెడ్యూళ్ల దాఖలుకు ఈనెల 8వ తేదీని తుది గడువుగా పేర్కొంది. అదే రోజు టెక్నికల్ బిడ్ తెరుస్తారు. ఆర్థిక బిడ్‌లను పదో తేదిన తెరిచి తక్కువ ధరకు కోట్ చేసి ఎల్–1గా నిలిచిన సంస్థకు పనులు అప్పగించే దిశగా సీఆర్‌డీఏ అడుగులు వేస్తోంది. జీఎస్టీ, ఎన్ఏసీ, సీనరేజీ లాంటి పన్నులు రూ.153.05 కోట్లు రీయింబర్స్‌మెంట్ చేస్తామని పేర్కొంది. షీర్ వాల్ టెక్నాలజీతో అల్యూమినియం ఫ్రేమ్‌వర్క్, పోడియం, ఆర్కిటెక్చరల్ ఫినిషెస్.. బయట, లోపల విద్యుదీకరణ, ఎల్పీజీ లాంటి సౌకర్యాలతో హ్యాపీ నెస్ట్ ఫ్లాట్లను నిర్మించాలని టెండర్లలో పేర్కొంది.



తగ్గిన ధరలు.. అంచనాల్లో వంచన

హ్యాపి నెస్ట్ ప్రాజెక్టుకు 2018లో తెరతీసిన ప్రభుత్వం.. అప్పట్లో పనులను కాంట్రాక్టర్‌కు రూ.658 కోట్లకు అప్పగించింది. కానీ.. ఆ ప్రాజెక్టు అప్పట్లో ముందుకు కదల్లేదు. ఇప్పుడు ఆ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. భవన నిర్మాణాల్లో వినియోగించే స్టీల్, సిమెంట్, కంకర తదితరాలతోపాటు విద్యుత్, శానిటరీ ఉపకరణాల దగ్గర నుంచి లిఫ్ట్‌ల వరకూ గతంతో పోలిస్తే ధరలలో పెద్దగా వ్యత్యాసం లేదు. నిజానికి 2018తో పోలిస్తే కొన్నిటి ధరలు ఇప్పుడు బాగా తగ్గాయి. ఇక ఇసుక పూర్తి ఉచితమని ప్రభుత్వమే చెబుతోంది. అలాంటప్పుడు హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టు అంచనా వ్యయం పెరగడానికి ఆస్కారమే ఉండదని ప్రముఖ బిల్డర్లు స్పష్టం చేస్తున్నారు. అలాంటిది హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు కాంట్రాక్టు విలువను రూ.818.03 కోట్లుగా నిర్ణయించి తాజాగా సీఆర్‌డీఏ టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడం, రూ.153.05 కోట్లను పన్నుల రూపంలో రీయింబర్స్‌మెంట్ చేస్తామని పేర్కొనడంపై బిల్డర్లు విస్తుపోతున్నారు. వీటిని పరిగణలోకి తీసుకుంటే హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.971.08 కోట్లకు చేరుతోంది. ప్రాజెక్టులో మొత్తం నిర్మిత ప్రాంతం 21,52,349 చదరపు అడుగులు. ఈ లెక్కన చదరపు అడుగు నిర్మాణానికి రూ.4,511.76 చొప్పున వ్యయం చేస్తున్నారు. ప్రభుత్వం రూపొందించిన డిజైన్ కంటే మరిన్ని అధునాతన సదుపాయాలతో నిర్మాణం చేపట్టినా చదరపు అడుగుకు అన్ని పన్నులతో కలిపినా రూ.1,800 నుంచి రూ.2 వేల లోపే నిర్మాణ వ్యయం అవుతుందని బిల్డర్లు తేల్చి చెబుతున్నారు. ప్రాజెక్టు అంచనాల్లో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని పేర్కొంటున్నారు.

అక్రమాలు ఇలా బహిర్గతం..

హ్యాపీ నెస్ట్ రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టు నిర్మాణ రీతిలోనే.. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో గెజిటెడ్ ఆఫీసర్లకు టైప్–1, టైప్–2 విధానంలో జీ+12 అంతస్తులతో 14 టవర్లలో 1,440 ఫ్లాట్ల నిర్మాణానికి రూ.492.04 కోట్లను కాంట్రాక్టు విలువగా నిర్ణయించి సీఆర్‌డీఏ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. గెజిటెడ్ ఆఫీసర్ల హౌసింగ్ ప్రాజెక్టు మొత్తం నిర్మిత ప్రాంతం 27,24,080 చదరపు అడుగులు. దీన్ని పరిగణలోకి తీసుకుంటే చదరపు అడుగు నిర్మాణ వ్యయం రూ.1,806.29 అవుతుంది. ఇక సీనరేజీ, ఎన్ఏసీ, జీఎస్టీ పన్నుల రూపంలో రూ.93.2 కోట్లను రీయింబర్స్ చేస్తామని సీఆర్‌డీఏ పేర్కొంది. ఇవన్నీ కలిపినా గెజిటెడ్ ఆఫీసర్ల హౌసింగ్ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.2,148.45 దాటదు. దీన్ని బట్టి హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టులో అక్రమాలు జరిగినట్లు సీఆర్‌డీఏ పిలిచిన టెండర్ల సాక్షిగా బట్టబయలైందని బిల్డర్లు చెబుతున్నారు.


టెండర్ ప్రకారం కాంట్రాక్టు విలువ	రూ.818,03,27,113
జీఎస్టీ(కాంట్రాక్టు విలువలో 18 శాతం)	రూ.148,13,28,664
ఎన్ఏసీ(కాంట్రాక్టు విలువలో 0.10 శాతం)	రూ.81,80,327
సీనరేజీ, కన్సిడరేషన్, డీఎంఎఫ్, మెరిట్ ఛార్జీలు	రూ.4,10,55,091
మొత్తం	రూ.971,08,91,195
మొత్తం నిర్మిత ప్రాంతం	21,52,349 చదరపు అడుగులు
ఈ లెక్కన ఒక చదరపు అడుగు నిర్మాణ వ్యయం	రూ.4,511.76

వాంగ్మూలాలు మార్చేసి..

'సుప్రీం'ను ఏమార్చాలి

ఇదీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ బరితెగింపు

- చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై 21న సుప్రీంకోర్టులో విచారణ
- ఇప్పటికే మూడుసార్లు విచారణకు ప్రభుత్వ న్యాయవాది గైర్హాజరు
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు
- 21లోగా గుంటూరు కోర్టులో అబద్ధపు వాంగ్మూలాల నమోదుకు పన్నాగం
- 164 సీఆర్‌పీసీ వాంగ్మూలాలు ఇచ్చిన అధికారులను ఆనాడే బెదిరించిన లోకేశ్
- ప్రస్తుతం వేధింపులతో అబద్ధపు వాంగ్మూలాల నమోదుకు కుతంత్రం
- చంద్రబాబు అవినీతి కేసులను నీరుగార్చే పన్నాగానికి పదును



సాక్షి, అమరావతి: సీఆర్‌పీసీ 164 వాంగ్మూలాలు మార్చాలి.. సుప్రీంకోర్టును ఏమార్చాలి.. ఏం చేసినా ఈ నెల 21లోగా చేసేయాలి.. అందుకు ఎంతకైనా బరితెగించాలన్నది టీడీపీ కూటమి ప్రభుత్వ కుట్రగా స్పష్టమవుతోంది. సీఐడీని అడ్డుపెట్టుకుని ఈ కుతంత్రానికి పాల్పడుతోంది. చంద్రబాబుపై అవినీతి కేసులను నీరుగార్చడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. న్యాయస్థానంలో 164 వాంగ్మూలాలు ఇచ్చిన అధికారుల సంగతి తేలుస్తామని ఎన్నికల ముందు లోకేశ్ హెచ్చరించినట్టుగానే.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం న్యాయస్థానాల్లో ఉన్న కేసులను ప్రభావితం చేసేలా అక్రమాలకు పాల్పడుతోంది. అబద్ధపు వాంగ్మూలాలు ఇప్పించి ఏకంగా సుప్రీంకోర్టునే ఏమార్చేందుకు బరితెగిస్తోంది. చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై ప్రస్తుతం సీఐడీ వరుసగా వాయిదాలు కోరుతుండటంపై సుప్రీంకోర్టు ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేయడంతో టీడీపీ కూటమి ప్రభుత్వం హడలిపోతోంది. స్కిల్ డెవలప్మెంట్ కుంభకోణంలో అరెస్టు అయిన చంద్రబాబు.. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న విషయం తెలిసిందే. ఆయనకు హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని గతంలోనే సీఐడీ దాఖలు చేసిన పిటిషన్, సుప్రీంకోర్టులో విచారణలో ఉంది. కాగా, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పిటిషన్ అంశంలో సీఐడీ ప్లేటు ఫిరాయించింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణకు ప్రభుత్వ న్యాయవాది ముకుల్ రోహత్గీ వరుసగా వాయిదాలు కోరుతుండటం గమనార్హం. గత విచారణకు కూడా ఆయన నేరుగా హాజరు కాకుండా వర్చువల్‌గా పాల్గొని వాదనలు వినిపించకుండా మరోసారి వాయిదా కోరారు. వరుస వాయిదాలు కోరడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోసారి వాయిదా ఇవ్వమని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. దాంతో ఈ నెల 21న సుప్రీంకోర్టు విచారణకు హాజరై చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై సీఐడీ తరపు న్యాయవాది తప్పనిసరిగా తన వాదనలు వినిపించాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. ఆ బెయిల్ రద్దు చేయాలని కోరుతూ సీఐడీ దాఖలు చేసిన కేసునే ఆయన వాదిస్తున్నారు. అంటే నిబంధనల ప్రకారం చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని ఆయన వాదనలు వినిపించాలి. కానీ ఈ పిటిషన్ వీగిపోయేలా చేసేందుకే ప్రస్తుత సీఐడీ ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు కుట్రలకు పదును పెడుతున్నారు. ఈ నెల 21లోగా తిమ్మిని బమ్మి చేసేందుకు బరితెగిస్తున్నారు.

అబద్ధపు వాంగ్మూలాలతో 'సుప్రీం'ను ఏమార్చే కుట్ర

2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో కుంభకోణాలకు చంద్రబాబే ప్రధాన కుట్రదారు అని ఐఏఎస్ అధికారులు చెరుకూరి శ్రీధర్, అజయ్ జైన్, కాంతిలాల్ దండే స్పష్టం చేశారు. ఆమేరకు 164 సీఆర్‌పీసీ కింద న్యాయస్థానంలో వాంగ్మూలాలు నమోదు చేశారు. ఈ కేసులో ఆ వాంగ్మూలాలు కీలక సాక్ష్యంగా నిలుస్తున్నాయి. అందుకే వారిపై టీడీపీ కూటమి ప్రభుత్వం గురి పెట్టింది. గతంలో ఇచ్చిన వాంగ్మూలాలకు పూర్తి విరుద్ధంగా అబద్ధపు వాంగ్మూలాలను సీఆర్‌పీసీ 164 కింద మరోసారి నమోదు చేయించేందుకు కుతంత్రం పన్నుతోంది. సీఆర్‌పీసీ 164 కింద ఓసారి ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మరో వాంగ్మూలం ఇవ్వడం తీవ్రమైన నేరంగా పరిగణిస్తారని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అయినా సరే ఈ నెల 8న ఆ అధికారులతో అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేయించాలని సీఐడీ పట్టుబడుతోంది. ఈ నెల 21లోగా అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేయించి, ఆ విషయాన్ని ప్రస్తావించడం ద్వారా సుప్రీంకోర్టును ఏమార్చేందుకు పన్నాగం పన్నింది.

అప్పుడే హెచ్చరించిన లోకేశ్

సీఆర్‌పీసీ 164 కింద న్యాయస్థానంలో వాంగ్మూలం ఇవ్వడమన్నది రాజ్యాంగం కల్పించిన అవకాశం. ప్రమాణ పూర్తిగా ఇచ్చే ఆ వాంగ్మూలాలకు న్యాయస్థానం రక్షణ కల్పిస్తోంది. కానీ అంతటి కీలకమైన 164 వాంగ్మూలాలను కూడా నారా లోకేశ్ ప్రశ్నించడం విభ్రాంతికరం. ఎన్నికల ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు అవినీతిని బట్టబయలు చేస్తూ ఐఏఎస్ అధికారులు 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలాలు ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. అందుకే రెడ్‌బుక్ రాస్తున్నామని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ అధికారుల సంగతి తేలుస్తామని హెచ్చరించారు. అప్పటికే న్యాయస్థానంలో విచారణలో ఉన్న అంశంపై ఆయన మాట్లాడటం, సాక్షులను బెదిరించడం న్యాయ ధిక్కారమేనని పరిశీలకులు స్పష్టం చేశారు. లోకేశ్ ముందుగా చెప్పినట్టుగానే టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. గతంలో 164 సీఆర్‌పీసీ వాంగ్మూలాలు ఇచ్చిన అధికారులను ప్రభుత్వం వేధిస్తోంది. వారితో అబద్ధపు వాంగ్మూలాలు ఇప్పించేందుకు సీఐడీ ద్వారా బరితెగిస్తోంది. ఇది కచ్చితంగా చంద్రబాబుపై అవినీతి కేసుల విచారణను ప్రభావితం చేయడమేనని పరిశీలకులు తేల్చి చెబుతున్నారు. దీన్ని న్యాయస్థానాలు తీవ్రంగా పరిగణించాలని కోరుతున్నారు.

హైడ్రా మళ్లీ వీకెండ్ ఆపరేషన్

▶ మొదటి పేజీ తరువాయి

ఏవీ రంగనాథ్ శనివారం అక్కడ పర్యటించి పూర్వాపరాలు తెలుసుకున్నారు. హైడ్రా ఏర్పాటైన తొలినాళ్లలో దాదాపు ప్రతి వీకెండ్‌లోనూ ఓ అక్రమ నిర్మాణం కూల్చివేత ఉండేది.

అక్రమ నిర్మాణాలెన్నో..

శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో అనేక అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. 100 ఫీట్ల రోడ్డులో ఉన్న 684 చదరపు గజాల ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఐదు అంతస్తుల్లో ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇది అక్రమ నిర్మాణమని గుర్తించిన జీహెచ్ఎంసీ అధికారులు.. గత ఏడాది ఫిబ్రవరి 14న షోకాజ్ నోటీసులు, 26న స్పీకింగ్ ఉత్తర్వులు ఇచ్చింది. వీటిని భవన యజమాని హైకోర్టులో సవాల్ చేశారు. ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం అది అక్రమ నిర్మాణమని తేల్చి, కూల్చివేయాలని గత ఏడాది ఏప్రిల్ 19న ఆదేశాలు జారీ చేసింది. జీహెచ్ఎంసీ అధికారులు.. గత ఏడాది జూన్ 13న ఆ భవనం స్లాబ్‌కు అనేక చోట్ల పెద్ద పెద్ద రంధ్రాలు చేసి విడిచిపెట్టారు. వాటిని పూడ్చేసిన యజమానికి నిర్మాణం కొనసాగిస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం దీనిపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఇటీవల సదరు అక్రమ నిర్మాణంపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

రాత్రి 8 గంటల వరకు..

క్షేత్రస్థాయిలో పర్యటించిన ఏవీ రంగనాథ్, భవనాన్ని కూల్చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం ఉదయం ఆ భవనం వద్దకు చేరుకున్న 'బాహుబలి క్రేన్'కూల్చివేత మొదలు పెట్టింది. రాత్రి 8 గంటల వరకు కూల్చివేత కొనసాగింది. అక్కడ పోలీసులు, హైడ్రా అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భవనం ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో విద్యుత్ సరఫరా ఆపేయడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ ప్రాంతంలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన కట్టడాలన్నింటినీ కూల్చివేస్తామని హైడ్రా అధికారులు తెలిపారు.

అనుమతిచ్చిన అధికారుల వివరాలపై ఆరా తీస్తున్నాం..

హైకోర్టు అక్రమం అని తేల్చినా భవన నిర్మాణం కొనసాగడానికి కారణమైన అధికారుల వివరాలు ఆరా తీస్తున్నాం. బాధ్యులపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాం. అయ్యప్ప సొసైటీలో దాదాపు అన్నీ అక్రమ నిర్మాణాలే. ఆ భవనాలకు ఫైర్ ఎన్ఓసీ, భవన నిర్మాణ అనుమతి కూడా లేదు. అయ్యప్ప సొసైటీలో ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీతో కలిసి సమీక్షిస్తాం. హైకోర్టు నుంచి స్పష్టమైన కూల్చివేత ఉత్తర్వులు ఉన్న వాటిని తొలి దశలో కూల్చేస్తాం.

– ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

కుల వ్యవస్థను అంతం చేస్తేనే దేశాభివృద్ధి

- ఏఐడీఆర్ఎం బహిరంగసభలో సీపీఐ ప్రధానకార్యదర్శి డి.రాజా



బహిరంగ సభలో మాట్లాడుతున్న డి.రాజా. చిత్రంలో కూనంనేని తదితరులు

కవాడిగూడ(హైదరాబాద్): కులవ్యవస్థను అంతం చేస్తేనే..అన్నిరంగాల్లో దేశం అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉందని సీపీఐ ప్రధానకార్యదర్శి డి.రాజా అన్నారు. డిజిటల్ ఇండియా, వికసిత్ భారత్ అంటూ గొప్పగొప్ప మాటలు చెబుతున్న ప్రధాని మోదీ సామాజిక రుగ్మతలను రూపుమాపే కులవ్యవస్థ నిర్మూలన గురించి మాట్లాడకపోవడం దురదృష్టకరమని చెప్పారు. కారల్‌మార్క్స్ అయినా, అంబేడ్కర్ అయినా కుల, వర్గ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యమని చెప్పారని, ఇందు కోసం లాల్ నీల్ జెండాలు ఏకం కావాలన్నారు. ఆర్ఎస్ఎస్ శక్తుల నుంచి దేశాన్ని రక్షించుకునేందుకు సంఘటితంగా ఉద్యమించాలని రాజా పిలుపునిచ్చారు. ఆదివారం అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఏఐడీఆర్ఎం) రెండో మహాసభల ప్రారంభం సందర్భంగా ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఏసురత్నం అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. డి.రాజాతోపాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐడీఆర్ఎం జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్, డీకేఎంయూ జాతీయ ప్రధానకార్యదర్శి బోరియా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ కుల వ్యవస్థను రూపుమాపేందుకు మార్గం చూపుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌ను కేంద్రమంత్రి అమిత్‌షా చట్టసభల సాక్షిగా అవమానించడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండించిందన్నారు. రాజ్యాంగ పరమైన పదవుల్లో.. ఉండి రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడిన అమిత్‌షా తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహ, ఎం.బాలనర్సింహ, ఏఐడీఆర్ఎం జాతీయ నేతలు సుబ్బారావు, వీరపాండియన్ మనూజ్, శివకుమార్, రవీంద్రాచారి, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరయ్యారు.



వంగ మహేందర్ రెడ్డికి మద్దతు తెలుపుతున్న రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సభ్యులు

పీఆర్‌టీయూటీఎస్‌కు హెచ్‌ఎంల సంఘం మద్దతు

సాక్షి, హైదరాబాద్ : కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్–మెదక్ ఉపాధ్యాయ శాసనమండలి స్థానం నుంచి పీఆర్‌టీయూటీఎస్ తరపున పోటీ చేస్తున్న వంగ మహేందర్ రెడ్డికి రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం మద్దతు తెలిపింది. సంఘం అధ్యక్షుడు రాజగంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరిధర్ ఆదివారం పీఆర్‌టీయూటీఎస్ కార్యాలయంలో మద్దతు ప్రకటించారు. ఖమ్మం–వరంగల్, నల్లగొండ స్థానం నుంచి పోటీచేస్తున్న పింగిలి శ్రీపాల్ రెడ్డి విజయానికి హెచ్‌ఎంల సంఘం కృషి చేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు.

పీఏకు పీఏ.. బాస్‌లకు బాస్ అయ్యే..!



కుప్పంలో సీఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్‌కు సహాయకుడైన టీడీపీ కార్యకర్త చలపతి ఆదేశాలు ఇస్తుండగా.. చేతులు కట్టుకొని శ్రద్ధగా ఆలకిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ. ఈ చిత్రం సోషల్ మీడియాలో వైరలవ్వగా.. రాష్ట్రంలో పాలనకు ఇది నిదర్శనమంటూ నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు.

– సాక్షి, టాస్క్‌ఫోర్స్

పెట్టుబడులు రూ.1.98 లక్షల కోట్లు ఉద్యోగాలు 1.14 లక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశాలు సృష్టించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ పాలసీ–2025ని రాష్ట్ర మంత్రివర్గం శనివారం ఆమోదించింది. పదేళ్లపాటు ఈ పాలసీ అమల్లో ఉంటుంది.

బిడ్డింగ్ ద్వారా డెవలపర్లకు ఆహ్వానం

విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు టారిఫ్ ఆధారిత కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా కొత్త సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్లు, పవన విద్యుత్ కేంద్రాలు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం, జియో థర్మల్, మినీ హైడల్, వేస్ట్ టూ ఎనర్జీ కేంద్రాల స్థాపనకు డెవలపర్ల నుంచి బిడ్లను ఆహ్వానించనున్నాయి. వీటిని గ్రిడ్‌కు అనుసంధానం చేసి, ప్లాంట్ల నుంచి వచ్చే విద్యుత్‌ను కొనుగోలు చేయనున్నాయి.

చౌకగా లీజుకు సర్కారీ భూములు..

డెవలపర్లకు ప్రభుత్వ స్థలాలను నామమాత్రపు అద్దెతో లీజుకు ఇస్తారు. బిడ్డింగ్‌లో గెలిచిన సంస్థకు మార్కెట్ రేటులో 10 శాతం లీజు రేటుగా నిర్ణయించి భూములను కేటాయిస్తారు. అనంతరం ప్రతి రెండేళ్లకోసారి 5 శాతం లీజు ధరను ప్రభుత్వం పెంచనుంది. విద్యుత్ కొనుగోలు ఒప్పంద (పీపీఏ) జరిగాక జిల్లా కలెక్టర్లతో లీజు ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది.

కరెంటు ప్రైవేటుకూ అమ్ముకోవచ్చు

డెవలపర్లు రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని ప్రైవేటు సంస్థలకు ఓపెన్ యాక్సెస్ ద్వారా విద్యుత్ అమ్ముకోవచ్చు. సొంత అవసరాలకూ వాడుకోవచ్చు. ఎకరాకు రూ.లక్ష ధరతో ఇలాంటి ప్రాజెక్టులకు ప్రభుత్వం 25 ఏళ్లు లేదా ప్రాజెక్టు జీవిత కాలానికి స్థలాలను కేటాయిస్తుంది.

ముందు వచ్చిన వారికే ప్రాధాన్యత

సబ్ స్టేషన్ పరిధిలో కొత్త విద్యుదుత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు ఎంత సామర్థ్యం లభ్యత ఉందో.. ఆ మేరకు మాత్రమే అనుమతిస్తారు. ముందు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత లభించనుంది. సౌర, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్లను రెండేళ్లలో, పవన విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం మూడేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది.

జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు

నీటిపారుదల శాఖ భాగస్వామ్యంతో జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహించనుంది. వీటి ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు జలాశయాలను నామినేషన్ విధానంలో కేటాయించనున్నారు.

మహిళా సంఘాలతో సౌర విద్యుత్ కేంద్రాల స్థాపన

500 కిలోవాట్ నుంచి 2 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) నుంచి ఆసక్తి వ్యక్తీకరణను డిస్కంలు విడతలవారీగా ఆహ్వానించనున్నాయి. వారి నుంచి నిర్ణీత ధరకు విద్యుత్‌ను డిస్కంలు కొనుగోలు చేస్తాయి.

2029-30, 2034-35 నాటికి పునరుత్పాదక విద్యుత్ పెంపు లక్ష్యం (మెగావాట్లలో)			
విద్యుత్ రకం	ప్రస్తుత సామర్థ్యం	(2029-30 లక్ష్యం)	(20234-35 లక్ష్యం)
సౌర విద్యుత్	7,900	19,800	26,000
డిస్ట్రిబ్యూటెడ్ రెన్యూవల్ ఎనర్జీ	467	4,300	8,000
పవన విద్యుత్	128	2,500	4,500
ఎనర్జీ స్టోరేజీ (పంప్డ్+ బ్యాటరీ)	1,600	3,800	8,000
జియో థర్మల్	(20 కేడబ్ల్యూ)	1,000	3,000
మొత్తం	10,095.20	31,400	49,500

పీఎస్పీ ప్రాజెక్టులకు 45 ఏళ్ల లీజుకు స్థలాలు

పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టులకు ప్రభుత్వ భూములను 45 ఏళ్ల లీజుకు కేటాయిస్తారు. వీటి స్థాపన కోసం ప్రైవేటు డెవలపర్లను టెండర్ల ద్వారా ఎంపిక చేస్తే, ప్రభుత్వ రంగ సంస్థలకు నామినేషన్ ద్వారా ఎంపిక చేస్తారు. 6 ఏళ్లలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలి. 45 ఏళ్ల తర్వాత ప్రాజెక్టును ప్రభుత్వానికి బదిలీ చేయాల్సి ఉంటుంది. పీఎస్పీ విద్యుత్‌లో 80 శాతం తొలి హక్కు రాష్ట్రమే కలిగి ఉంటుంది.

హైబ్రిడ్ పవర్‌కు ప్రాధాన్యత..

ఒకే ప్రాంతంలో సౌర+పవన, పవన+ఫ్లోటింగ్ సోలార్, విండ్+ స్టోరేజీ, హైబ్రిడ్+స్టోరేజీ వంటి పునరుత్పాదక ఇంధన స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటును సైతం ఈ పాలసీ ద్వారా ప్రోత్సహించనున్నారు.

- పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు వినియోగించే భూములకు నాలా కన్వర్షన్ నుంచి మినహాయింపు.
- టీజీ–ఐపాస్ ద్వారా సింగిల్ విండో విధానంలో అన్ని అనుమతులను సత్వరం జారీ చేస్తారు.
- పారిశ్రామిక హోదా కల్పించి రాష్ట్ర పారిశ్రామిక విధానం కింద అందించే అన్ని రకాల ప్రోత్సాహకాలను వర్తింపజేస్తారు.
- ప్రతి మెగావాట్‌కు 4 ఎకరాలు చొప్పున భూగరిష్ఠ పరిమితి చట్టం నుంచి మినహాయింపు కల్పిస్తారు.

భారీ ప్రోత్సాహకాలు..

- భూముల కొనుగోళ్లపై స్టాంప్ డ్యూటీ 100 శాతం తిరిగి చెల్లిస్తారు.
- వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులకు 100 శాతం రాష్ట్ర జీఎస్టీని తిరిగి చెల్లిస్తారు.
- కేంద్ర మార్గదర్శకాల ప్రకారం పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులకు లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ఫండ్ చెల్లింపుల నుంచి మినహాయింపు ఇస్తారు. ఇతర కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లుఅందుతాయి. జెన్‌కో, ట్రాన్స్‌కో సాంకేతిక సహకారం అందిస్తాయి.
- పీసీబీ నుంచి ఎన్ఓసీ మినహాయింపు.
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సౌర, పవన విద్యుత్ వాడుకుంటే 8 ఏళ్ల పాటు విద్యుత్ సుంకం మినహాయింపు కల్పిస్తారు.
- పీఎస్పీ ప్రాజెక్టులకు నీటి సుంకాన్ని తిరిగి చెల్లిస్తారు.

డిస్కంలకు విక్రయిస్తే ప్రత్యేక ప్రోత్సాహకాలు

- సూపర్‌వైజేషన్ చార్జీల మినహాయింపు.
- ఇతర సౌర, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ, ఇతర ప్రాజెక్టులకు 50 శాతం రాష్ట్ర జీఎస్టీని తిరిగి చెల్లిస్తారు.
- ఎస్‌హెచ్‌జీలు/గ్రామ సమాఖ్యలు ఏర్పాటు చేసే సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులతో పాటు వ్యక్తిగత గృహాలు, ఇందిరమ్మ గృహాలు, ప్రభుత్వ స్కూల్స్, కార్యాలయాలపై ఏర్పాటు చేసే రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులకు 100 శాతం స్టేట్ జీఎస్టీని తిరిగి చెల్లిస్తారు.

మంచిమాట



త్రికరణశుద్ధితో జీవనసిద్ధి

మనం ఎన్నో గొప్ప కార్యాలను మదిలో సంకల్పిస్తాం. తీరా, ఆ పనులను గురించి నలుగురిలో విడమరచి చెప్పాలంటే ఎందుకో బిడియం, ఎవరు ఏమనుకుంటారో..? అనే సందేహం. మనం సాధించగలమో లేదో అని అనుమానం. ఒకవేళ, మరీ సాహసం చేసి కొంతవరకు చెప్పగలిగినా, మళ్ళీ ఆచరించే సమయంలో మనకున్న సందేహాలతో ముందుకు సాగకుండా ఆగిపోతాం, దానికితోడు అనుకోకుండా ఎదురయ్యే అవాంతరాలు..!! ఈ విధంగా చేసే కార్యాలు నిరర్థకమైన రీతిలోనే సాగుతాయి.

మన మనసు అత్యంత పవిత్రమైనదనీ, సమస్త పుణ్యాలు అగణ్యమైన రీతిలో ఈ ధరిత్రిలో జరిగింది కేవలం మనసువల్ల నేనని పెద్దల ఉవాచ. ఇహ వాక్కు సాక్షాత్తూ సర్వాంతర్యామి మనకు ప్రసాదించిందే. అందుకని తలచిన పనులు సఫలం అవాలంటే, మనం భావించిన విషయాన్ని స్పష్టంగా వ్యక్తపరచగలగాలి. ఇది అత్యంత ముఖ్యమైన విషయం. ఎందుకంటే ఏ పనిలోనైనా కార్యసిద్ధి అనేది ఒక్కరి వల్ల జరగదు. అది సమిష్టిగా, నలుగురితో కలిసి కృషి చేయడం వల్ల జరుగుతుంది లేదా కొంతమంది వ్యక్తుల సమన్వయంతో జరుగుతుంది. అధికశాతం పనులు రకరకాల వ్యక్తుల సమన్వయంతోనే జరుగుతాయి. ఈ కార్యక్రమంలో కొంతమంది విద్యాధికులు, కొంతమంది ఎక్కువగా చదువుకోనివారు కూడా భాగం కావచ్చు. వీరందరి మధ్యా జరిగే సమన్వయమే త్రికరణాలతో కూడుకుని తలపెట్టిన పనిలో కార్యసిద్ధిని కలిగిస్తుంది.

త్రికరణశుద్ధిగా చరించే మనిషి తనను తాను మూర్తిమంతంగా నడుపుకుంటూ, విజయాలను అవలీలగా సొంతం చేసుకోవడం జరుగుతుంది.

త్రికరణశుద్ధిగా వుండడమే సిసలైన జీవనానికి ఆనందసూత్రం..!!

త్రికరణశుద్ధి లేనివాడికి ఆనందం ఆమడ దూరం. త్రికరణశుద్ధి ఉన్నవాళ్ళకే మకరంద భరితమైన జీవనం అమితంగా లభ్యమవుతుంది. అందుకని ప్రతివాడు పాటించవలసింది ఒక్కటే.. ''ఆనందంగా, స్థితప్రజ్ఞునిగా ఉండాలంటే త్రికరణశుద్ధిని తప్పనిసరిగా కలిగి వుండాలి. తెలియనిది మాట్లాడకుండా, తనకు అవగాహన ఉన్న విషయాలనే మాట్లాడడం. మాట్లాడిందే ఆచరించడం ప్రధానంగా పాటించవలసిన అంశాలు. ఇవి మొక్కుబడిగా కాకుండా, మక్కువతో పాటిస్తే, జగతిలో గొప్ప విజయాలు నిత్యమూ ఆవిష్కృతమవుతాయి.

''త్రికరణ శుద్ధిగా చేసిన పనులకు దేవుడు మెచ్చును.. లోకము మెచ్చును'' అన్న సంకీర్తనాచార్యుని వాక్కులు అక్షరసత్యం. త్రికరణశుద్ధితోనే జీవనానికి నిజమైన సత్వం, పసకలిగిన పటుత్వం కలుగుతాయి.

బుద్ధిమతుల ఆలోచనా సరళికి ఆధారమూలం జీవనగమనంలో వారు కలిగి ఉండే త్రికరణశుద్ధి..!! ఈ లక్షణం కలిగిన వారికి తప్పక ఒనగూడుతుంది అన్నిటా కార్యసిద్ధి..

– వ్యాఖ్యాన విశారద
వెంకట్ గరికపాటి

మనం ఏ కార్యాన్ని ఆచరించినా త్రికరణశుద్ధితో ఆచరించాలి. మనస్సుకు, మాటకు, చేతకు తేడా లేకుండా ఉండటమనే నిజాయితీనే త్రికరణశుద్ధిగా వ్యవహరించవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే, మనోవాక్కాయాల శుద్ధి. కార్యాన్ని మనసా వాచా, కర్మణా అన్నిటా ఏకీభావ స్థితిలో మలచుకోవడమే త్రికరణ శుద్ధి. మనసులో ఏ విధంగా కార్యాన్ని చేయాలని మనం సంకల్పిస్తామో, వచస్సులో, అంటే మన మాటల్లోనూ అదే ప్రతిఫలించాలి. కర్మణా అంటే కార్యాన్ని ఆచరించే విధానమూ మనం తలచిన విధంలో, చెప్పిన సంవిధానంలో పూర్తి చేయాలి. అప్పుడే ఆ కార్యం త్రికరణశుద్ధి కలిగినదై, లోకాన రాణింపుకు వస్తుంది.



వ్యక్తిగతంగా తాము చేసే పనులు కూడా శుద్ధమైన మనసుతో ఆచరిస్తే, విజయాలు సాధించవచ్చు. మధ్యయుగం కాలంలోని ఒక చిన్న భారతీయ కథ ద్వారా ఈ సందేశాన్ని తెలుసుకుందాం.

ఒక గురువుగారు నదికి అవతలి ఒడ్డున తన శిష్యులతో నిలిచి ఉన్నారు. నదిలో వారిని దాటించే పడవవాడు వెళ్ళిపోయాడు. కానీ గట్టుకు రెండోవేపు ఒక శిష్యుడు నిలిచిపోయాడు. గురువుగారు వేగంగా రమ్మని ఆ శిష్యుని ఆజ్ఞాపించారు. వెంటనే, ఆ శిష్యుడు నీటిమీద వేగంగా నడుచుకుని అవతలి గట్టుకు వెళ్ళిపోయాడు. గురువుగారు, శిష్యునికేసి ఆశ్చర్యంగా చూస్తూ, "నాయనా.. ఏ విద్యతో అంత వేగంగా నీటిమీద నడుచుకుంటూ రాగలిగావు" అంటూ ఆశ్చర్యాన్ని ప్రకటించగా, శిష్యుడు "భలేవారే.. గురువుగారు... మీకు తెలియని విద్యలేవి ఉన్నాయి నా దగ్గర..!! మీరు తొందరగా రమ్మని ఆజ్ఞాపించారు. నేను మదిలో నది ఒడ్డుకు రావాలన్న తలపును త్రికరణశుద్ధిగా ఆచరించాను. విజయవంతంగా మీ దగ్గరకు చేరుకున్నాను" అంటూ వినయంగా సెలవిచ్చాడు. ఇందులో శిష్యుడు చూపిన అగణితమైన ప్రతిభకన్నా, అతని అంకితభావం, నదిని విజయవంతంగా దాటే సమయాన మనసా, వాచా, కర్మణా ఒకే పద్ధతిలో ముందుకు సాగడం పెద్ద పెద్ద లక్ష్యాలను తలపోసే అందరికీ అనుసరణీయం.

ముగ్గు ముచ్చట





17 చుక్కల నుండి
9 చుక్కల వరకు

సి. రాజ్యలక్ష్మి
హైదరాబాద్





15 చుక్కలు
సందు 8 వరకు

ఎస్. అరుణ కుమారి
కడప

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

అమృత బిందువులు

- 'ఎప్పుడు సంతోషంగా ఉండాలనే కోరిక కంటే ఉన్నంతలో సంతృప్తిగా బతకాలనే ఆలోచన చాలా విలువైనది.'
- ధనికుడైన లోభి కన్న దానశీలి అయిన పేదవాడు గొప్పవాడు.
- సముద్రంలో ఉన్న అపారమైన క్షారజలంతో దాహార్తి తీరదు. కానీ, చెలమలోని గుక్కెడు నీరు దాహం తీర్చి ప్రాణం నిలబెట్టగలదు.

ఆత్మ బోధనం

దృఢ సంకల్పమే మీ బలం



ఎత్తైన పర్వతాల నడుమ ఒక సుందరమైన లోయ వద్ద ఒక చిన్న ప్రవాహం ఉండేది. అది మహా సముద్రాన్ని చేరాలని కలలు కంటూ ఉండేది. తన ప్రయాణాన్ని ప్రారంభించిన ప్రతిసారీ దారిలో రాళ్ల, దట్టమైన అడవులు, ఎత్తైన కొండ చరియలు ఎదురవడంతో ఆ చిన్న ప్రవాహం వెనుదిరిగి వెనకకు వెళ్లిపోయేది.''నీకు ఇది సాధ్యం కాదు,'' అని దారిలోని పెద్ద రాళ్లు చెప్పేవి.''నువ్వు చాలా చిన్నగా, బలహీనంగా ఉన్నావు నువ్వు చేయలేవు'' అని ఆ చిట్టి ప్రవాహాన్ని నిరుత్సాహ పరిచేవి.

ఒకనాడు చిట్టి ప్రవాహం చాలా దిగులుగా, ఇక ఎప్పటికీ తన కలను నెరవేర్చుకోలేనన్న బాధతో, సందేహంతో ఉండటాన్ని వృక్ష మాత గమనించింది. వృక్ష మాత ప్రవాహంతో ఇలా చెప్పింది, ''ఇలా బాధ పడినంత మాత్రాన నీ లక్ష్యాన్ని నీవు చేరగలవా..?? నువ్వు బాధ పడటం వల్ల ఏ ఉపయోగం లేదు! మహా సముద్రాన్ని చేరాలనే నీ తపననే నీ శక్తిగా మలుచుకో..నీ సంకల్పాన్ని బలపరుచుకో.. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనుదిరగననే వజ్ర సంకల్పం చేసుకో!'' అని చిట్టి ప్రవాహానికి కొండంత ధైర్యమిచ్చి, విజయోస్తు! అని దీవించి పంపింది వృక్ష మాత.

ఆ ధైర్యంతో, ప్రవాహం తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అది ముందుకు వెళ్లాలని సంకల్పించుకుంది. పెద్ద రాళ్ళు ఎదురైనప్పుడు వాటి మధ్యనున్న చిన్న సందులనే మార్గంగా చేసుకుంది. ఎండ తీవ్రతకు ఆవిరైపోయే పరిస్థితి వచ్చినప్పుడు, మేఘాలకెగసి అక్కడి నుండి నదిగా భువికి తిరిగి వచ్చింది. ఒకప్పటి చిట్టి ప్రవాహమే ఇప్పుడు మహా ప్రవాహమై చివరికి మహాసముద్రంలో లీనమైంది. ''నీ లక్ష్యాన్ని నీవు సంకల్ప శక్తితో సాధించావు'' అని వృక్ష మాత హర్షించింది.

నూతన సంవత్సరంలో చాలా మంది ఎన్నో గొప్ప లక్ష్యాలను పెట్టుకుంటారు. కానీ ఆ లక్ష్యాలను సాధించేందుకు కావాల్సినంత సంకల్ప బలం వారిలో ఉండదు. అందుకే మధ్యలోనే ఆ లక్ష్యాలను వదిలిపెడతారు. కొన్నిసార్లు మీ మనసే ఎన్నో సాకులను వెతుకుతుంది. మీ లక్ష్యాన్ని ఓడించాలని చూస్తుంది. అందుకే మీ మనసును చెదరని సంకల్ప బలంతో నింపండి. నేను ఎన్ని అడ్డంకులు ఉన్నా విజయాన్ని సాధిస్తాను! నేను లక్ష్యాన్ని చేరతాను అని పదే పదే మనసులో అనుకోండి! అనుకుందే ఆచరణలో పెట్టండి. మీరు చేయాల్సిన కృషితో పాటు దృఢమైన సంకల్ప శక్తి కూడా ఉండాలి.




ఎన్ని అడ్డంకులు వచ్చినా చెదరని సంకల్ప బలంతో ముందుకు సాగండి. లక్ష్యాన్ని సాధించడంలో ఇటువంటి మనఃస్థితి ఉంటే ఏ పనిలోనైనా నిస్సందేహంగా విజయాన్ని సాధించవచ్చు. ఈ యావత్ విశ్వంలో మీరు సాధించలేనిది ఏదీ లేదు!

– మాతా ఆత్మానందమయి
ఆధ్యాత్మిక గురువు

సినిమా


'అనగనగ ఒక రాజు ఉండేవాడు... చెడ్డవాళ్లంతా ఆయన్ను డాకు అనేవారు. మాకు మాత్రం మహారాజు...' అంటూ మొదలవుతుంది 'డాకు మహారాజ్' సినిమా ట్రైలర్. బాలకృష్ణ హీరోగా నటించిన తాజా చిత్రం 'డాకు మహారాజ్'. ఈ చిత్రంలో బాబీ డియోల్, మకరంద్ దేశ్‌పాండే, ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, చాందినీ చౌదరి, ఊర్వశి రౌతేలా ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. బాబీ కొల్లి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా అమెరికాలోని డల్లాస్‌లో 'డాకు మహారాజ్' సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు.

ఎవర్నువ్వు..!



● బాలకృష్ణ

'ఎవర్నువ్వు... నానాజీ అమ్మా.., నీకు నువ్వే జీ అని పెట్టుకుంటే... నేను నీకు రెస్పెక్ట్ ఇవ్వాలా...', 'చెప్పింది వినాలి... ఇచ్చింది తీసుకోవాలి', 'వాడి ముందు నువ్వు కాదు... నేనుండాలి', 'అసలు ఎవడ్రా నువ్వు... మైఖేల్ జాక్సన్' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ట్రైలర్‌లోని సన్నివేశాలను బట్టి 'డాకు మహారాజ్' చిత్రంలోని బాలకృష్ణ క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉన్నట్లుగా తెలుస్తోంది. ''యాక్షన్, వినోదం, భావోద్వేగాల మేళవింపుతో రూపొందిన 'డాకు మహారాజ్' చిత్రం ఆడియన్స్‌ను అలరిస్తుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: తమన్.



● సారా అలీఖాన్, అక్షయ్ కుమార్

యుద్ధం మొదలైంది

అక్షయ్ కుమార్ హీరోగా నటించిన తాజా చిత్రం 'స్కై ఫోర్స్'. వీర్ పహారియా, సారా అలీఖాన్, నిమ్రత్ కౌర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన ఈ యాక్షన్ మూవీని దర్శక ద్వయం సందీప్ కెవ్లానీ– అభిషేక్ అనిల్ కపూర్ తెరకెక్కించారు. 1965లో జరిగిన ఇండియా–పాకిస్తాన్ వార్ నేపథ్యంలో భారతదేశపు మొదటి వైమానిక దాడి సంఘటనల ఆధారంగా 'స్కై ఫోర్స్' సినిమాను తీశారని బాలీవుడ్ సమాచారం. ఈ చిత్రంలో కమాండర్ కేవో అహూజా పాత్రలో అక్షయ్ కుమార్, టి. విజయ పాత్రలో వీర్ పహారియా నటించారు. దినేష్ విజయ్, జ్యోతీ దేశ్ పాండే, అమర్ కౌశిక్, సాహిల్ ఖాన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఆదివారం 'స్కై ఫోర్స్' సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'యుద్ధం మొదలైంది', '..అండ్ ది మిషన్ ఈజ్ కాల్డ్ మిషన్ స్కై ఫోర్స్', 'కౌన్ జనాబ్... కౌన్ జనాబ్... తేరా బాప్... హిందూస్తాన్', 'విజయ రూల్స్‌ని బ్రేక్ చేశాడు...', 'సార్... అతడ్ని కనిపెట్టడంలో మనం పాకిస్తాన్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి', 'మీరందరూ అతను ఓ పిచ్చివాడిలా ప్రవర్తించాడు అన్నారు. కానీ అతనికి ఉన్న ఆ పిచ్చి దేశభక్తి' అనే డైలాగ్స్ విడుదలైన ట్రైలర్‌లో ఉన్నాయి.




● కీర్తి సురేష్

హిందీ భాషను విమర్శించలేదు

ఒక సినిమాలో హిందీ భాషను విమర్శించి, మళ్లీ హిందీ సినిమా చేయడమా? ఇది కరెక్టేనా? అంటూ కీర్తి సురేష్‌ని కొందరు విమర్శిస్తున్నారు. ఈ విమర్శలకు కారణం తమిళ చిత్రం 'రఘు తాత', హిందీ చిత్రం 'బేబీ జాన్'. 'రఘు తాత' గత ఏడాది ఆగస్టులో విడుదల కాగా, 'బేబీ జాన్' డిసెంబరులో విడుదలైంది. హిందీ భాషను కచ్చితంగా జోడించాల్సిందే అనే పాయింట్‌ని వ్యతిరేకిస్తూ 'రఘు తాత'ను రూపొందించారు. దాంతో హిందీ భాషను వ్యతిరేకించి, హిందీ సినిమాలో ఎలా నటించావ్? అంటూ బాలీవుడ్ ప్రేక్షకులు కొందరు కీర్తి సురేష్ పై విమర్శలు గుప్పించారు. ఈ విషయంపై కీర్తి సురేష్ స్పందిస్తూ – ''ఇలాంటి విమర్శ వస్తుందని ముందే ఊహించి ఉంటే అసలు నేను 'బేబీ జాన్'లో నటించి ఉండేదాన్నే కాదు. 'రఘు తాత' చేస్తున్నప్పుడే ఒక హిందీ సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తానని ఊహించి ఉంటే ఈ సినిమా ఒప్పుకుని ఉండేదాన్ని కాదు. పైగా 'బేబీ జాన్' హిందీ భాషను వ్యతిరేకించే సినిమా కాదు. హిందీ భాషను కచ్చితంగా చొప్పించాలనే విషయంపై తీసిన సినిమా. ఈ సినిమా టీజర్ రిలీజైనప్పుడు లోకల్స్ చాలామంది సపోర్టివ్‌గా మాట్లాడారు. అదే విధంగా హిందీలో పరిచయం అవుతూ మా భాష గురించి ఎందుకు ఇలా మాట్లాడుతున్నారు? అని కొందరన్నారు. 'దేవుడా... ఎందుకిలా జరిగింది' అని అప్పుడనిపించింది. ఇది హిందీ భాషని వ్యతిరేకించే సినిమా కాదని స్పష్టంగా చెప్పాలనిపించింది. పలు సందర్భాల్లో చెప్పాను కూడా. ఏది ఏమైనా ఇలాంటి ఓ విమర్శ వస్తుందని ఊహించి ఉంటే 'బేబీ జాన్'లో నటించేదాన్ని కాదు'' అని పేర్కొన్నారు.

వన్ అండ్ ఓన్లీ దేవా



● షాహిద్ కపూర్

షాహిద్ కపూర్ టైటిల్ రోల్‌లో నటించిన తాజా యాక్షన్ ఫిల్మ్ 'దేవా'. ఈ చిత్రంలో పోలీసాఫీసర్ దేవా పాత్రలో షాహిద్ కపూర్ నటించారు. పూజాహెగ్డే హీరోయిన్‌గా నటించిన ఈ మూవీతో మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రూ హిందీ చిత్ర పరిశ్రమకు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సిద్ధార్థ్ రాయ్ కపూర్, ఉమేష్ కేఆర్ బన్సల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా 'దేవా' సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. టీజర్‌లో షాహిద్ మాసీ విజువల్స్ మాత్రమే కనిపించాయి. కానీ చివర్లో వన్ అండ్ ఓన్లీ దేవా వస్తున్నాడు అని చూపించారు. పావైల్ గులాటి, ప్రవేశ్ రాణా, కుబ్రా సైట్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీకి విశాల్ మిశ్రా స్వరకర్త.

మా ఇద్దరి సీన్స్ కిక్ ఇస్తాయి

– ఎస్‌జే సూర్య



''నిజాయితీపరుడైన ఓ ఐఏఎస్ ఆఫీసర్‌కి, అవినీతిపరుడైన రాజకీయ నాయకుడికి మధ్య జరిగే వార్‌ను ఆడియన్స్ 'గేమ్ చేంజర్' మూవీలో చూస్తారు. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలు ఈ మూవీలో ఉన్నాయి'' అన్నారు నటుడు ఎస్‌జే సూర్య. రామ్‌చరణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించారు. అంజలి మరో హీరోయిన్‌గా చేశారు. అనిత సమర్పణలో జీ స్టూడియోస్, 'దిల్' రాజు ప్రొడక్షన్స్ పతాకాలపై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ నెల 10న విడుదల కానుంది. ఈ చిత్రంలో ఓ లీడ్ రోల్ చేసిన ఎస్‌జే సూర్య ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ – ''గేమ్ చేంజర్' మూవీ కోసం శంకర్‌గారు నన్ను పిలిచారు. ఆయన చెప్పింది చెప్పినట్లుగా చేస్తే స్క్రీన్‌పై మ్యాజిక్‌లా కనిపిస్తుంది. ఈ చిత్రంలో మోపిదేవి అనే పాత్రలో నటించాను. నా క్యారెక్టర్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. నా నటన చూసి శంకర్‌గారు ఇంప్రెస్ అయ్యారు. అందుకే నాకు 'ఇండియన్ 2'లోనూ అవకాశం కల్పించారు. రామ్‌చరణ్‌గారు అద్భుతమైన నటుడు. 'గేమ్ చేంజర్' మూవీలో రామ్‌చరణ్ క్యారెక్టర్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. ఐఏఎస్ ఆఫీసర్‌గా ఆయన ఎంతో హుందాగా నటించారు. ఇక అప్పన్న పాత్ర అయితే ప్రేక్షకులకు లైఫ్ టైమ్ గుర్తుండిపోయేలా ఉంటుంది. ఆ పాత్రలో రామ్‌చరణ్ అంత అద్భుతంగా నటించారు. మా ఇద్దరి (రామ్‌చరణ్, ఎస్‌జే సూర్య) సన్నివేశాలు ఆడియన్స్‌కు కిక్ ఇస్తాయి. ఇక ఈ చిత్రంలోని నా పాత్రకు డబ్బింగ్ చెప్పుకోవడం సవాల్‌గా అనిపించింది. కానీ నా పాత్రను ఎంతో ఎంజాయ్ చేస్తూ, చేశాను. దీంతో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో నేనే డబ్బింగ్ చెప్పాను. నిజానికి నాకు హిందీ అంతగా రాదు. కానీ డబ్బింగ్ మాత్రం అద్భుతంగా చెప్పాను. నా హిందీ డబ్బింగ్ కోసమైనా మీరందరూ (ఆడియన్స్‌ను ఉద్దేశిస్తూ..) 'గేమ్ చేంజర్' మూవీని మరోసారి చూడాలి. కేవలం డబ్బు పెట్టి, సినిమాలు తీస్తేనే నిర్మాతలని అనలేం. 'దిల్' రాజుగారు సెట్స్‌కు వచ్చి అన్ని క్రాఫ్ట్స్‌ను పరిశీలించేవారు. కథలపై ఆయనకు మంచి పట్టుంది. సెట్స్‌లోని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారు. అందుకే నా దృష్టిలో ఆయన ఆల్ రౌండర్. ప్రస్తుతం నటుడిగా ఓ కంఫర్ట్ జోన్‌లో ఉన్నాను. అందుకే దర్శకత్వం గురించి ఆలోచించడం లేదు'' అన్నారు.

సస్పెన్స్... థ్రిల్



● వరుణ్ సందేశ్

వరుణ్ సందేశ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కానిస్టేబుల్'. ఎస్‌కే ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై బలగం జగదీష్ నిర్మిస్తున్న క్రైమ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ ఇది. ఈ చిత్రంతో మధులిక వారణాసి హీరోయిన్. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన దర్శకుడు నక్కిన త్రినాథరావు మాట్లాడుతూ– ''టీజర్ ఉత్కంఠభరితంగా ఉంది. డిఫరెంట్ కాన్సెప్ట్ అని అర్థం అవుతోంది. 'కానిస్టేబుల్' చిత్రం హిట్ కావాలి'' అన్నారు. ''ఈ మూవీ ఆడియన్స్‌ను అలరిస్తుంది'' అని పేర్కొన్నారు వరుణ్ సందేశ్. ''కానిస్టేబుల్' వరుణ్ సందేశ్‌కి మంచి కమ్ బ్యాక్ ఫిల్మ్ అవుతుంది'' అని తెలిపారు బలగం జగదీష్. ''ఈ చిత్రానికి అవకాశం కల్పించిన నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు దర్శకుడు ఆర్యన్. ఈ సినిమాకు సంగీతం: సుభాష్ ఆనంద్.

రాజుగారి దొంగలు వస్తున్నారు

లోహిత్ కల్యాణ్, రాజేశ్ కుంచాడా, జోషిత్ రాజ్ కుమార్, కైలాష్ వేలాయుధన్, పూజా విశ్వేశ్వర్, టీవీ రామన్, ఆర్కే నాయుడు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాజుగారి దొంగలు'. లోకేశ్ రనల్ హిటాసో దర్శకత్వంలో నడిమింటి లిఖిత సమర్పణలో నడిమింటి బంగారు నాయుడు నిర్మించిన ఈ మూవీ త్వరలో విడుదల కానుంది. ఈ మూవీ టీజర్ లాంచ్ వేడుకకి ప్రొడ్యూసర్ కౌన్సిల్ ప్రెసిడెంట్ దామోదర ప్రసాద్, నిర్మాత బెక్కెం వేణుగోపాల్, నటుడు సురేష్ అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. లోహిత్ రనల్ మాట్లాడుతూ– ''డైరెక్టర్ కావాలనే నా కలను, నన్ను నమ్మి మా నాన్న బంగారు నాయుడుగారు ఈ మూవీని నిర్మించారు. మా మూవీకి ప్రేక్షకాదరణ దక్కుతుందని నమ్ముతున్నాం'' అన్నారు. ''టీజర్ ఎంత బాగుందో సినిమా కూడా అంతే బాగుంటుంది'' అని నడిమింటి బంగారు నాయుడు చెప్పారు.



● కైలాష్, జోషిత్, రాజేశ్, లోహిత్ కల్యాణ్

చివరి ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయలేకపోయినందుకు ఒకింత అసహనానికి గురయ్యాను. కానీ మన శరీరాన్ని కూడా గౌరవించాలి. సిరీస్ మొత్తంలోనే బౌలర్లను ఊరించిన పిచ్‌పై బౌలింగ్ చేసే అవకాశాన్ని కోల్పోయాను. తొలి ఇన్నింగ్స్‌లో రెండో స్పెల్ వేస్తున్న సమయంలో అసౌకర్యంగా అనిపించింది. దీంతో వైద్య సహాయం తీసుకోవాల్సి వచ్చింది. మొత్తంగా సిరీస్ బాగా సాగింది. మావంతు ప్రయత్నం చేయడంతో పాటు గట్టిపోటీనిచ్చాం... టెస్టు క్రికెట్‌లో అసలు మజా ఇదే. యువ ఆటగాళ్లు మంచి ప్రదర్శన కనబర్చారు. అనుభవం గడిస్తున్న కొద్దీ వారు మరింత రాటుదేలుతారు. సిరీస్ నెగ్గిన ఆస్ట్రేలియాకు అభినందనలు.

-జస్‌ప్రీత్ బుమ్రా, 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'

'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ' తిరిగి చేజిక్కించుకోవడం ఆనందంగా ఉంది. మా జట్టులో చాలా మంది ఇంతవరకు ఈ ట్రోఫీ నెగ్గలేదు. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చ లేకపోయాం. ఆ తర్వాత కలిసికట్టుగా రాణించడం బాగుంది. జట్టులోని ప్లేయర్ల మధ్య మంచి అనుబంధం ఉంది. ఈ సిరీస్ ద్వారానే అరంగేట్రం చేసిన ముగ్గురు కొత్త ఆటగాళ్లు విభిన్న పరిస్థితుల్లో మెరుగైన ఆటతీరు కనబర్చారు. నా కెరీర్‌లో ఇది చాలా ఇష్టమైన ట్రోఫీ. సిరీస్ కోసం బాగా సన్నద్ధమయ్యా. భారత్ వంటి ప్రత్యర్థితో తలపడటం ఎప్పుడూ సవాలే.

-ప్యాట్ కమిన్స్, ఆస్ట్రేలియా కెప్టెన్

సిరీస్ సమర్పయామి

హతవిధి! భారత్ ఆఖరి టెస్టులోనూ ఓడింది. పదేళ్ల తర్వాత 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ' సిరీస్‌నూ కోల్పోయింది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కూ తొలిసారి అర్హత సాధించలేకపోయింది. రెండేళ్ల సైకిల్ చొప్పున ఆరేళ్ల క్రితం సంప్రదాయ ఫార్మాట్‌లో మొదలైన డబ్ల్యూటీసీ రెండు దఫాలుగా భారతే ఫైనల్‌కు అర్హత సాధించింది. తొలిసారి న్యూజిలాండ్‌తో, రెండోసారి ఆస్ట్రేలియాతో తలపడింది. ఫలితం ఓడిపోయి ఉండొచ్చు. కానీ గత ఆరేళ్లుగా టెస్టు చాంపియన్‌షిప్‌లో తమదైన ముద్ర చూపించిన టీమిండియా ఈసారి మాత్రం నిరాశపరిచింది.

ఆఖరి టెస్టులోనూ ఓడిన భారత్

- 6 వికెట్లతో గెలిచిన ఆస్ట్రేలియా
- 3-1తో 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ' సిరీస్ సొంతం
- ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లోకి కమిన్స్ బృందం


'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'తో ఆస్ట్రేలియా జట్టు


ఓటమి అనంతరం బహుమతి ప్రదానోత్సవం సందర్భంగా నిరాశలో భారత ఆటగాళ్లు

సిడ్నీ: ఆరంభంలో మన బౌలర్లు శ్రమించినా... అవతలి జట్టు బ్యాటర్లు తెగించారు. టెస్టు ఫార్మాట్‌లో లక్ష్యాన్ని 6 పరుగుల రన్‌రేట్‌తో ఛేదించారు. గాయం వల్ల భారత తురుపుముక్క బుమ్రా ఆదివారం బరిలోకి దిగకపోవడం కూడా ఆతిథ్య జట్టుకు 'కంగారూ' లేకుండా చేసింది. ఆస్ట్రేలియాను చకచకా లక్ష్యంవైపు నడిపించింది. మూడు రోజుల్లో ముగిసిన చివరిదైన ఐదో టెస్టులో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో టీమిండియాను ఓడించింది. ఐదు టెస్టుల సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకుంది. ఒకవేళ ఈ ఆఖరి పోరులో భారత్ గెలిచి సిరీస్ 2-2తో సమమై ఉండి ఉంటే... మరో రెండేళ్లు ఈ 'ట్రోఫీ' మన దగ్గరే పదిలంగా ఉండేది. దశాబ్దం తర్వాత కంగారూ జట్టు ఈ 'ట్రోఫీ'ని సాధించింది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌ల మధ్య జరిగే 'యాషెస్' ప్రభను మించిన 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'ని గత పదేళ్లుగా (2014-15 సీజన్ నుంచి) టీమిండియానే నిలబెట్టుకుంటూ వచ్చింది. కానీ ఈసారి కాలం కలిసి రాలేదు. టాపార్డర్ బాధ్యత కనబరచలేదు. పోరాటం గాడితప్పి వైఫల్యం వెన్నుతట్టింది. దీంతో గెలుపు మరచి ఓటమికి తలుపులు తెరిచింది. ఈ సిరీస్‌లో ఏకైక మెరుపు, భారత శిబిరానికి ఊపు, ఊరట ఏదైనా ఉందటే... అది బుమ్రాకు లభించిన 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డే. అద్భుతమైన పేస్ బౌలింగ్‌తో అదరగొట్టిన బుమ్రా ఐదు టెస్టుల్లో 32 వికెట్లు పడగొట్టడం విశేషం.

141/6తో మొదలై 157కే ఆలౌటై...

ఈ పర్యటనలోనే బాగా ఆడిన యశస్వి జైస్వాల్ (టాపార్డర్), నితీశ్ కుమార్ రెడ్డి (మిడిలార్డర్) ముందురోజే అవుటవడంతో ఆదివారం జట్టు ఆలౌటయ్యేందుకు ఎంతోసేపు పట్టనే లేదు. మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 141/6తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 39.5 ఓవర్లలోనే 157 పరుగులకే కుప్పకూలింది. ఇలా తొలి సెషన్ మొదలైందో లేదో... కనీసం ఓ పది ఓవర్లయినా ఆడలేదు. ఇంకో 7.5 ఓవర్లు మాత్రమే ఆడి, కష్టంగా ఓ 16 పరుగులు చేసి, మిగిలిన 4 వికెట్లను కోల్పోయింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో రవీంద్ర జడేజా (13) తన స్కోరుకు ఐదు పరుగులు జత చేయగా, వాషింగ్టన్ సుందర్ (12) మరో 6 పరుగులు చేసి అవుటయ్యారు. వీరిద్దరిని కమిన్స్ పెవిలియన్ చేర్చాక, సిరాజ్ (4), బుమ్రా (0)లను అవుట్ చేసేందుకు బోలండ్‌కు ఎంతో సమయం పట్టలేదు. రెండో ఇన్నింగ్స్‌లో బోలండ్‌కు 6 వికెట్లు దక్కాయి. ఈ మ్యాచ్‌లో అతను మొత్తం 10 వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెల్చుకున్నాడు.

ప్రసిధ్ ప్రభావం కాసేపే...

ఆస్ట్రేలియా ముందున్న 162 పరుగులు లక్ష్యం ఛేదించేందుకు ఏమాత్రం శ్రమించలేదు. ఉస్మాన్ ఖ్వాజా (45 బంతుల్లో 41; 4 ఫోర్లు), కొన్‌స్టాస్ (17 బంతుల్లో 22; 3 ఫోర్లు) ఈ ఇద్దరు ఓపెనర్లే 3.5 ఓవర్లలో టి20లాంటి వేగంతో 39 పరుగులు చేశారు. అక్కడ కొన్‌స్టాస్ దూకుడుకు ప్రసిధ్ కృష్ణ అడ్డుకట్ట వేశాడు. జట్టు స్కోరు 50 పరుగులు దాటాక స్వల్పవ్యవధిలో లబుషేన్ (6), స్మిత్ (4)లను వరుస ఓవర్లలో ప్రసిధ్ (3/65) అవుట్ చేశాడు. కానీ ఈ ప్రభావం ఆ కాసేపే కనిపించింది. ఆ తర్వాత అంతా ట్రవిస్ హెడ్ (38 బంతుల్లో 34 నాటౌట్; 4 ఫోర్లు), వెబ్‌స్టర్ (34 బంతుల్లో 39 నాటౌట్; 6 ఫోర్లు)ల దూకుడే కష్టం లేకుండా కంగారూ జట్టును గెలిపించింది. దీంతో 27 ఓవర్లలోనే 4 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసి ఆసీస్ జయభేరి మోగించింది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 185; ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 181; భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి (బి) బోలండ్ 22; రాహుల్ (బి) బోలండ్ 13; గిల్ (సి) కేరీ (బి) వెబ్‌స్టర్ 13; కోహ్లి (సి) స్మిత్ (బి) బోలండ్ 6; పంత్ (సి) కేరీ (బి) కమిన్స్ 61; జడేజా (సి) కేరీ (బి) కమిన్స్ 13; నితీశ్ కుమార్ రెడ్డి (సి) కమిన్స్ (బి) బోలండ్ 4; సుందర్ (బి) కమిన్స్ 12; సిరాజ్ (సి) ఖ్వాజా (బి) బోలండ్ 4; బుమ్రా (బి) బోలండ్ 0; ప్రసిధ్ కృష్ణ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (39.5 ఓవర్లలో ఆలౌట్)** 157. **వికెట్ల పతనం:** 1-42, 2-47, 3-59, 4-78, 5-124, 6-129, 7-147, 8-156, 9-156, 10-157. **బౌలింగ్:** స్టార్క్ 4-0-36-0, కమిన్స్ 15-4-44-3, బోలండ్ 16.5-5-45-6, వెబ్‌స్టర్ 4-1-24-1.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: కొన్‌స్టాస్ (సి) సుందర్ (బి) ప్రసిధ్ కృష్ణ 22; ఖ్వాజా (సి) పంత్ (బి) సిరాజ్ 41; లబుషేన్ (సి) యశస్వి (బి) ప్రసిధ్ కృష్ణ 6; స్మిత్ (సి) యశస్వి (బి) ప్రసిధ్ కృష్ణ 4; హెడ్ (నాటౌట్) 34; వెబ్‌స్టర్ (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (27 ఓవర్లలో 4 వికెట్లకు)** 162. **వికెట్ల పతనం:** 1-39, 2-52, 3-58, 4-104. **బౌలింగ్:** సిరాజ్ 12-1-69-1, ప్రసిధ్ కృష్ణ 12-0-65-3, నితీశ్ రెడ్డి 2-0-10-0, వాషింగ్టన్ సుందర్ 1-0-11-0.

'స్టార్స్ ఫ్లాప్ షో'

బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భారత జట్టు ప్రదర్శనపై కథనం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ప్రతి ఒక్క ఆటగాడు దేశవాళీ క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నా. అందుబాటులో ఉన్నప్పుడు తప్పకుండా రంజీ మ్యాచ్‌లు ఆడాల్సిందే. దేశవాళీ మ్యాచ్‌లకు ప్రాధాన్యత ఇవ్వకపోతే జాతీయ జట్టు తరఫున టెస్టు క్రికెట్ ఆడే ఆసక్తి లేనట్లే. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ఇంకా చాలా సమయం ఉంది. జట్టులోని ఏ ఒక్కరి భవిష్యత్ గురించి నేను మాట్లాడలేను. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి భవితవ్యం గురించి కూడా ఏమీ చెప్పలేను. అయితే వారిలో పరుగులు సాధించాలనే కసి ఇంకా ఉంది. జట్టులో అందరూ సమానమే. అందరితో ఒకే రీతిన వ్యవహరిస్తా. చివరి టెస్టు నుంచి తప్పుకోవాలని రోహితే నిర్ణయించుకున్నాడు. దీంతో జట్టులో ప్రతి ఒక్కరికీ జవాబుదారీతనం ఉండాలని రోహిత్ చాటాడు.


-గంభీర్, టీమిండియా హెడ్ కోచ్

భారత క్రికెటర్లు రంజీ ట్రోఫీలో ఆడాల్సిందే: గావస్కర్



సిడ్నీ: ఇంటా బయట పరాజయాలతో సతమతమవుతున్న టీమిండియా ప్లేయర్లకు... క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ చురకలు అంటించారు. భారత ఆటగాళ్లందరూ దేశవాళీల్లో ఆడాలని, ఏ ఒక్కరికీ మినహాయింపు ఇవ్వకుండా అందరూ రంజీ ట్రోఫీలో ఆడేలా చూడాలని సన్నీ సూచించారు. 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో భారత జట్టు ఓటమి అనంతరం ఆయన మాట్లాడారు. 'ఈ నెల 23 నుంచి రంజీ ట్రోఫీ తదుపరి రౌండ్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుత భారత జట్టులో నుంచి ఎంతమంది ఆటగాళ్లు అందులో పాల్గొంటారో చూడాలి. ఏ ఒక్కరికీ మినహాయింపు లేకుండా అందరూ దేశవాళీ టోర్నీలో పాల్గొనాలి. రంజీ ట్రోఫీకి అందుబాటులో లేని ఆటగాళ్ల విషయంలో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. తాజా ఆస్ట్రేలియా సిరీస్‌తో పాటు న్యూజిలాండ్‌పై కూడా భారత ఆటగాళ్ల ప్రదర్శన గొప్పగా లేదు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరే అవకాశాలు ఎలాగూ లేవు. ఈ సమయంలో తదుపరి టోర్నీ కోసం అయినా ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించాలి. తమను తాము నిరూపించుకోవాలనే తపన ఉన్న ఆటగాళ్లు ముఖ్యం. రంజీ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌ల సమయంలోనే ఇంగ్లండ్‌తో భారత జట్టు టి20 సిరీస్ ఆడనుంది. మరి దానికి ఎంపిక కాని వారిలో ఎంతమంది దేశవాళీ ట్రోఫీలో పాల్గొంటారో చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా' అని గావస్కర్ వ్యాఖ్యానించారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ డియోఘర్‌లో 107 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

డియోఘర్(జార్ఖండ్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 107.
» **వేతనం:** నెలకు రూ.67,700.
» **విభాగాలు:** అనెస్తీషియాలజీ అండ్ క్రిటికల్ కేర్, అనాటమీ, బయోకెమిస్ట్రీ, డెర్మటాలజీ, కార్డియాలజీ, డెంటల్ సర్జరీ, మైక్రో బయాలజీ, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, న్యూరాలజీ, నెఫ్రాలజీ, మైక్రోబయాలజీ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ/రాతపరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్ ఆఫీస్, నాలుగో ఫ్లోర్, ఎయిమ్స్, దేవిపూర్(అకడమిక్ బ్లాక్), డియోఘర్-814152(జార్ఖండ్) చిరునామకు స్పీడ్ పోస్ట్ ద్వారా పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
» **నోటిఫికేషన్ వెలువడిన తేది:** 26.12.2024.
» **వెబ్‌సైట్:** https://www.aiimsdeoghar.edu.in

ఎయిమ్స్ గువాహటిలో 77 ఫ్యాకల్టీ పోస్టులు

గువాహటి(అస్సాం)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. వివిధ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 77.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-17, అడిషనల్ ప్రొఫెసర్-17, అసోసియేట్ ప్రొఫెసర్-18, అసిస్టెంట్ ప్రొఫెసర్-25.
» **విభాగాలు:** అనెస్తీషియా, అనాటమీ, బయోకెమిస్ట్రీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పాథాలజీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్/ఎంసీహెచ్/డీఎం, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రొఫెసర్ పోస్టులకు రూ.1,68,900, అడిషనల్ ప్రొఫెసర్ పోస్టులకు రూ.1,48,200, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు రూ.1,38,300, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు రూ.1,01,500.
» **వయసు:** 58 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.01.2025.
» **వెబ్‌సైట్:** https://aiimsguwahati.ac.in

క్రేజీ కొలువు.. బ్యాంక్ పీవో!



బ్యాంక్ ఉద్యోగాల్లో అత్యంత క్రేజీ కొలువు.. ప్రొబేషనరీ ఆఫీసర్(పీవో)! దేశంలోని ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. జూనియర్ మేనేజ్‌మెంట్ స్కేల్-1 హోదాలో మొత్తం 600 పీవో పోస్ట్‌లకు నియామక ప్రక్రియ చేపట్టనుంది. బ్యాచిలర్ డిగ్రీ మొదలు, ప్రొఫెషనల్, టెక్నికల్ ఇలా.. అన్ని డిగ్రీల అభ్యర్థులు పోటీ పడేందుకు అర్హులే!! ఈ నేపథ్యంలో... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన పీఓ నోటిఫికేషన్ వివరాలు.. ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 600 పీఓ పోస్ట్‌లకు ఎస్‌బీఐ నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీతో పోటీపడొచ్చు
» మూడు దశల ఎంపిక ప్రక్రియ
» ఎంపికైతే ప్రారంభంలోనే బేసిక్ పే రూ.48,480

మొత్తం 600 పోస్ట్‌లు

ఎస్‌బీఐ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం -జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-1 హోదాలో 600 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్ట్‌ల భర్తీకినోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో 586 పోస్ట్‌లను రెగ్యులర్ పోస్ట్‌లుగా.. మరో 14 పోస్ట్‌లను బ్యాక్‌లాగ్ పోస్ట్‌లుగా పేర్కొంది.

అర్హతలు

- 2025,ఏప్రిల్ 30నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 2024, ఏప్రిల్ 1 నాటికి 21-30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ వర్గాలకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

మూడు దశల ఎంపిక

ఎస్‌బీఐ పీఓ నియామక ప్రక్రియ ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-3 పేరిట.. మూడంచెల విధానంలో కొనసాగుతుంది. ఫేజ్-1 (ప్రిలిమినరీ పరీక్ష), ఫేజ్-2(మెయిన్ ఎగ్జామినేషన్), ఫేజ్-3 (ఇంటర్వ్యూ/గ్రూప్ ఎక్సర్‌సైజెస్).

వంద మార్కులకు ప్రిలిమ్స్

ఎంపిక ప్రక్రియలో తొలిదశ ఫేజ్-1గా పేర్కొనే ప్రిలిమినరీ పరీక్షను 100 మార్కులకు మూడు విభాగాల్లో నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 30 ప్రశ్నలు-30 మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ 30 ప్రశ్నలు-30 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం ఒక గంట. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతుంది.

మెయిన్ ఎగ్జామినేషన్

ఎంపిక ప్రక్రియలో రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్. ఈ పరీక్ష కూడా ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా జరుగుతుంది. ఫేజ్-1 ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. మొత్తం ఖాళీలను పరిగణనలోకి తీసుకుని ఒక్కో పోస్టుకు పది మంది(1:10 నిష్పత్తిలో)ని రెండో దశ మెయిన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్ష మొత్తం 170 ప్రశ్నలు-200 మార్కులకు జరుగుతుంది. ఇందులో రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలు-60 మార్కులకు, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ 30 ప్రశ్నలు-60 మార్కులకు, జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ నాలెడ్జ్ 60 ప్రశ్నలు-60 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-20 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

ఫేజ్-2లోనే డిస్క్రిప్టివ్ టెస్ట్

ఫేజ్-2 మెయిన్‌లో భాగంగానే ఆబ్జెక్టివ్ టెస్ట్‌తోపాటు మరో 50 మార్కులకు డిస్క్రిప్టివ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఇందులో కమ్యూనికేషన్ స్కిల్స్ (ఈమెయిల్, రిపోర్ట్స్, సిట్యువేషన్ అనాలసిస్ అండ్ ప్రిసైజ్ రైటింగ్) అంశాలు ఉంటాయి. అభ్యర్థులు ఇచ్చిన అంశంపై 30 నిమిషాల వ్యవధిలో కంప్యూటర్ ఆధారంగా తమ సమాధానాన్ని రాయాల్సి ఉంటుంది.

తుదిదశ.. సైకోమెట్రిక్ టెస్ట్

ఎంపిక ప్రక్రియలో తుది దశ (ఫేజ్-3).. సైకో మెట్రిక్ టెస్ట్. ఇందులో గ్రూప్ ఎక్సర్‌సైజ్, ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. మెయిన్‌లో పొందిన మార్కుల ఆధారంగా.. ఒక్కో పోస్టుకు ముగ్గురిని చొప్పున (1:3 నిష్పత్తిలో) తుది దశకు ఎంపిక చేస్తారు. మొత్తం 50 మార్కులకు నిర్వహించే చివరి దశ ఎంపిక ప్రక్రియలో గ్రూప్ ఎక్సర్‌సైజ్‌కు 20 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 మార్కులు ఉంటాయి.

- **గ్రూప్ ఎక్సర్‌సైజ్:** ఈ దశకు ఎంపికైన అభ్యర్థులను బృందాలుగా ఏర్పాటు చేస్తారు. ఒక్కో బృందంలో గరిష్ఠంగా అయిదుగురు అభ్యర్థులు ఉండేలా చూస్తారు. వీరికి నిర్దిష్టంగా ఒక అంశాన్ని పేర్కొని దానికి అభ్యర్థుల అభిప్రాయం లేదా సమాధానాన్ని అడుగుతారు. అభ్యర్థుల్లోని సామాజిక అంశాలపై అవగాహన, టీమ్ స్కిల్స్ వంటి వాటిని పరిశీలిస్తారు.
- **పర్సనల్ ఇంటర్వ్యూ:** గ్రూప్ ఎక్సర్‌సైజ్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా.. పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులో అభ్యర్థులకు ఉన్న బ్యాంకింగ్ నాలెడ్జ్, బ్యాంకింగ్ రంగంలో కెరీర్‌పై ఉన్న ఆసక్తి, నాయకత్వ లక్షణాలను పరిశీలిస్తారు.

తుది ఎంపికలో వెయిటేజీ విధానం

రెండో దశ మెయిన్,చివరి దశ(ఫేజ్-3) పర్సనల్ ఇంటర్వ్యూ, గ్రూప్ ఎక్సర్‌సైజెస్‌ల్లో చూపిన ప్రతిభ ఆధారంగా.. నిర్దిష్ట అర్హత మార్కులను, ఖాళీలను, రిజర్వేషన్, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది విజేతలను నిర్ణయిస్తారు. ఈ జాబితాలో నిలిస్తే ఎస్‌బీఐలో పీఓగా కొలువు దీరినట్లే. తుది విజేతల ఎంపికలో ఎస్‌బీఐ వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తోంది. మెయిన్‌లో పొందిన మార్కులకు 75 శాతం, చివరి దశలోని గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభకు 25 శాతం వెయిటేజీ ఇస్తోంది. ఇలా మొత్తం వంద శాతానికి అభ్యర్థులు పొందిన మార్కులను క్రోడీకరించి తుది విజేతలను నిర్ణయిస్తుంది.

సీజీఎం, చైర్ పర్సన్ స్థాయికి

ఎస్‌బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించిన వారు పనితీరు, ప్రతిభ ఆధారంగా సీజీఎం, చైర్ పర్సన్ స్థాయిలకు సైతం చేరుకోవచ్చు. తొలుత పీఓగా ఎంపికైన వారికి రెండేళ్ల శిక్షణ తర్వాత స్కేల్-1 హోదా లభిస్తుంది. రెండేళ్ల శిక్షణ తర్వాత నిర్వహించే పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపితే నేరుగా స్కేల్-2 కేడర్‌లో డిప్యూటీ మేనేజర్ హోదా లభిస్తుంది. పదోన్నతి ఇచ్చే క్రమంలో ఎస్‌బీఐ అంతర్గత పరీక్షలు నిర్వహిస్తుంది. సాధారణంగా పీఓగా ఎంపికైన వారందరూ స్కేల్-7 స్థాయికి చేరుకుంటారు. ఆ క్రమంలో పనితీరు, ప్రతిభ ఆధారంగా మేనేజింగ్ డైరెక్టర్, చైర్ పర్సన్ హోదాకు కూడా చేరుకునే అవకాశముంది.

రాత పరీక్షలో రాణించేలా

పీఓ పోస్ట్‌ల ఎంపిక ప్రక్రియలో విజయం సాధించాలంటే.. దరఖాస్తు సమయం నుంచే ప్రిపరేషన్‌ను వ్యూహాత్మకంగా సాగించాలి. ప్రిలిమ్స్, మెయిన్స్‌లో ఉన్న ఉమ్మడి అంశాలను గుర్తించి.. వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. తద్వారా ఒకే సమయంలో రెండు దశలకు సన్నద్ధత లభిస్తుంది. ముఖ్యంగా రెండు దశల్లోనూ ఉన్న ఇంగ్లిష్, రీజనింగ్‌లకు ఉమ్మడి ప్రిపరేషన్ మేలు చేస్తుంది. మెయిన్‌లో క్లిష్టత స్థాయి కొంత ఎక్కువగా ఉంటుంది.

రీజనింగ్

ఈ విభాగంలో రాణించేందుకు ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. విశ్లేషణ సామర్థ్యం, తార్కికత్వం పెంచుకునే విధంగా కృషి చేయాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్ అంశాలపై పట్టు సాధించాలి.

డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్

అభ్యర్థులు ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన మరో విభాగం.. డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్. ఇందులో రాణించడానికి కాలిక్యులేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలి. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్/ఎకనామీ/బ్యాంకింగ్ నాలెడ్జ్

జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ నాలెడ్జ్ విభాగాంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇటీవల కాలంలో జాతీయ ఆర్థిక రంగంలో మార్పులు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగంలో రాణించేందుకు.. బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్,టైం అండ్ డిస్టెన్స్,టైం అండ్ వర్క్,ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

గ్రూప్ ఎక్సర్‌సైజ్, పర్సనల్ ఇంటర్వ్యూ

గ్రూప్ ఎక్సర్‌సైజెస్, పర్సనల్ ఇంటర్వ్యూలో రాణించడానికి ఇంగ్లిష్ వ్యాకరణం, వాక్య నిర్మాణంపై పూర్తి పట్టు సాధించాలి. గ్రూప్ ఎక్సర్‌సైజెస్ విషయంలో సామాజిక అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. ఇందుకోసం దిన పత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర జనరల్ ఎస్సే పుస్తకాలు అభ్యసించడం ఉపయుక్తంగా ఉంటుంది. ఇలా ప్రతి అంశంలోనూ నిర్దిష్ట వ్యూహంతో అడుగులు వేస్తూ ప్రిపరేషన్ సాగిస్తే విజయావకాశాలను మెరుగు పరచుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2025, జనవరి 16
- ప్రిలిమినరీ పరీక్ష (ఆన్‌లైన్): 2025 మార్చి 8, 15 తేదీల్లో
- మెయిన్ ఎగ్జామినేషన్ తేదీలు: ఏప్రిల్/మేలో
- సైకో మెట్రిక్ టెస్ట్: మే/జూన్‌లో
- వెబ్‌సైట్: https://bank.sbi/web/careers/current-openings

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	721	79,223
నిఫ్టీ ▽	184	24,005

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	19,619	△	338
డోజోన్స్	42,739	△	346
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,224	▽	36
డాక్స్	19,906	▽	119
షాంఘై	3,211	▽	51
నికాయ్ (సోమవారం మధ్యాహ్నం)	39,895	▽	387

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.38	86.40
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.36	109.63
€	యూరో	ఎస్‌బీఐ	86.93	89.55
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.91	55.25
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.27	54.45
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.93	65.00
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.92	23.46
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.41	24.17
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.84	12.66



- ఈక్విటీలది లాభాల బాటే..
- బంగారం, వెండి ర్యాలీ ముందుకే
- రీట్‌లు, ఇన్విట్‌లలో రాబడుల స్థిరత్వం
- డెట్‌లో లాంగ్ డ్యురేషన్ ఫండ్స్ అనుకూలం
- 2025పై నిపుణులు, విశ్లేషకుల అంచనాలు

ఈ ఏడాదికి పెట్టుబడి అస్త్రాలు!



'ఈ రోజు గడిస్తే చాలులే.. రేపటి రోజు గురించి ఇప్పుడు ఎందుకు?'.. ఈ తరహా ధోరణి ఆర్థిక విజయాలకు పెద్ద అడ్డంకి. ఆర్థిక స్వేచ్ఛ కోరుకునే ప్రతి ఒక్కరూ రేపటి రోజు కోసం కచ్చితమైన ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాల్సిందే. ఎందుకంటే పిల్లల విద్య, వివాహాలు, రిటైర్మెంట్, సొంతిల్లు లక్ష్యాలు ఒక నెల సంపాదనతో సాధించేవి కావు. వీటి కోసం దీర్ఘకాలం పాటు పొదుపు, మదుపు చేయాల్సిందే. ఎంత సంపాదించామన్నది కాకుండా, ఎంత పొదుపు చేశామన్నది కీలకం. పొదుపును మెరుగైన సాధనంలో పెట్టుబడిగా మార్చి, క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లిన వారే ఆకాంక్షలను నెరవేర్చుకోగలరు. వివిధ సాధనాల మధ్య చక్కని పెట్టుబడుల కేటాయింపులతో ముందుకు వెళ్లడం ద్వారా జీవిత లక్ష్యాలను త్వరగా సాకారం చేసుకోవచ్చు. ఈ ఏడాది పెట్టుబడుల కోసం ఏ సాధనాలను ఎంపిక చేసుకోవచ్చు? వాటి పనితీరు ఎలా ఉంటుందన్న దానిపై నిపుణుల సూచనలను ఓ సారి పరిశీలిద్దాం. **– సాక్షి, బిజినెస్‌డెస్క్**

రూ.5 వేలతో కోటి..

గతంతో పోల్చితే నేడు ఆదాయ స్థాయిల్లో ఎంతో మార్పు వచ్చింది. నెలకు రూ.5 వేలు పొదుపు చేయడం చాలా మందికి సాధ్యమే. రూ.5 వేలను ప్రతి నెలా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా 15 శాతం రాబడులను ఇచ్చే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో 25 ఏళ్ల పాటు ఇన్వెస్ట్ చేశారనుకోండి. అప్పుడు రూ.1,64,20,369 సమకూరుతుంది. ఇందులో పెట్టుబడి రూ.15 లక్షలే. మిగిలిన రూ.కోటిన్నర కాంపౌండింగ్ మాయతో సమకూరిన సంపద. ఒకవేళ రాబడి ఇంకాస్త అధికంగా ఏటా 18 శాతం వచ్చిందని అనుకుంటే సమకూరే సంపద రూ.2.91 కోట్లు. అందుకే ఎన్ని ఆటంకాలు ఎదురైనా, ఎన్ని ఖర్చులు ఎదురైనా పెట్టుబడిని విస్మరించకూడదు. అలాగే, మొత్తం పెట్టుబడిని ఈక్విటీల్లో పెట్టేయకూడదు. వివిధ సాధనాల మధ్య పెట్టుబడిని వైవిధ్యం చేసుకోవడం ద్వారా రిస్కును అధిగమించొచ్చు. పెట్టుబడిని కాపాడుకోవచ్చు. రాబడులను పెంచుకోవచ్చు. ఈక్విటీలతోపాటు డెట్ సెక్యూరిటీలు, బంగారం, రియల్ ఎస్టేట్ సాధనాలను పోర్ట్‌ఫోలియోలో చేర్చుకోవాలి. ఈక్విటీలు అధిక రాబడులను ఇస్తాయి. కానీ అస్థిరతలు ఎక్కువ. డెట్‌లో అస్థిరతలు తక్కువ, రాబడులూ తక్కువే. బంగారం, రియల్ ఎస్టేట్‌లో అస్థిరతలు తక్కువగా, రాబడులు మోస్తరుగా ఉంటాయి.



ఈక్విటీలు..

ఈక్విటీల విలువలు గరిష్ఠ స్థాయిల్లో ఉన్నాయి. ముఖ్యంగా మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ విభాగంలో, ఇటీవలి దిద్దుబాటు తర్వాత కూడా షేర్ల ధరలు కొంత అధికంగా ఉన్నాయి. కనుక ఇన్వెస్టర్లు అప్రమత్త ధోరణి అనుసరించాలని, రాబడుల అంచనాలు తగ్గించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఏడాది లార్జ్‌క్యాప్ స్టాక్స్ మెరుగైన పనితీరు చూపిస్తాయన్నది విశ్లేషకుల అంచనా. నాణ్యమైన, పటిష్ఠ వృద్ధి అవకాశాలతో, సహేతుక విలువల వద్దనున్న స్టాక్స్‌ను పరిశీలించొచ్చు. టాప్–50 కంపెనీల విలువ మొత్తం మార్కెట్ విలువలో ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిల వద్ద ఉండడాన్ని గమనించొచ్చు. అదే సమయంలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్ ఐదేళ్ల కాలానికి మెరుగైన రాబడులను ఇస్తాయని, వీటి నుంచి ఏటా సగటున 20 శాతం రాబడిని ఆశించొచ్చని అవెండస్ వెల్త్ మేనేజ్‌మెంట్ ఎండీ, సీఈవో సౌరభ్ రుంగ్తా సూచించారు. ''2025 లార్జ్‌క్యాప్ స్టాక్స్ వంతు. ప్రైవేటు బ్యాంక్‌లు, టెలికం, ఎఫ్‌ఎంసీజీ మెరుగైన పనితీరు చూపించొచ్చు. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ కూడా రాబడులను ఇస్తాయి. కానీ అంచనాలు తగ్గించుకోవాలి. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేవారు ఫ్లెక్సీక్యాప్ వైపు చూడొచ్చు'' అని నువమా వెల్త్ ప్రెసిడెంట్ రాహుల్‌జైన్ వివరించారు. ''పెట్టుబడులను వివిధ అసెట్ క్లాస్‌ల మధ్య విస్తరించుకోవడం చక్కని అవకాశాలను సొంతం చేసుకోవడానికి ఉన్న మెరుగైన మార్గం'' అని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ సీఐవో శంకరన్ నరేన్ సూచించారు. హైబ్రిడ్ ఫండ్స్, మల్టీ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్, డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ''ఇటీవలి మార్కెట్ కరెక్షన్‌తో లార్జ్‌క్యాప్‌లో విలువలు దిగొచ్చాయి. కానీ, మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ విలువలు చారిత్రక సగటు కంటే ఎగువన ట్రేడ్ అవుతున్నాయి. కనుక సమీప కాలానికి లార్జ్‌క్యాప్ స్టాక్స్‌పై అధిక వెయిటేజీ ఇవ్వొచ్చు. మిడ్, స్మాల్ క్యాప్‌లో ఎంపిక ఆచితూచి ఉండాలి'' అని మోతీలాల్ ఓస్వాల్ వెల్త్ మేనేజ్‌మెంట్ సూచించింది. నేరుగా స్టాక్స్ కంటే నిపుణుల ఆధ్వర్యంలో నడిచే మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవడం మంచి నిర్ణయం అవుతుంది. నిఫ్టీ 2024లో 9 శాతం లాభాలతో ముగిసింది. 2025లో 28,800 వరకు ర్యాలీ చేయొచ్చని ఐసీఐసీఐ డైరెక్ట్ అంచనా వేస్తోంది.



బంగారమాయే..

అనిశ్చిత పరిస్థితుల్లో, ఈక్విటీ తదితర సాధనాల్లో ప్రతికూలతలు నెలకొన్నప్పుడు పోర్ట్‌ఫోలియోకి బంగారం కొంత స్థిరత్వాన్ని తెస్తుంది. బంగారం 2024లో 24–26 శాతం మేర రాబడులు కురిపించింది. సామాన్యుడి నుంచి సెంట్రల్ బ్యాంకుల వరకు అందరికీ బంగారం ఆకర్షణీయంగా మారిపోయింది. పసిడికి డిమాండ్ ఈ ఏడాది కూడా కొనసాగొచ్చన్నది అంచనా. డాలర్‌కు బదులు సెంట్రల్ బ్యాంక్‌లు బంగారం రూపంలో నిల్వలకు ప్రాధాన్యం ఇవ్వడం డిమాండ్‌కు ప్రేరణనిస్తోంది. రూపాయి విలువ క్షీణత రూపంలోనూ బంగారం పెట్టుబడులపై అదనపు ప్రయోజనం లభిస్తుంది. కనీసం 18–24 నెలల కాలానికి బంగారాన్ని కొనుగోలు చేసుకోవచ్చన్నది నిపుణుల సూచన. ఒకరు తమ మొత్తం పెట్టుబడుల్లో 5–10 శాతం బంగారానికి కేటాయించుకోవచ్చు. ''2025లో ఈక్విటీలు తదితర రిస్కీ అసెట్స్‌లో అస్థిరతలు కొనసాగితే, ద్రవ్యోల్బణం ఒత్తిళ్లు ఉంటే, సురక్షిత సాధనమైన బంగారంలో పనితీరు ఇతర సాధనాలతో పోల్చితే స్థిరంగా ఉండొచ్చు'' అని నిప్పన్ ఇండియా ఏఎంసీ కమోడిటీస్ హెడ్ విక్రమ్ ధావన్ అభిప్రాయపడ్డారు. బంగారంలో రాబడులు ఈ ఏడాది మోస్తరుగా ఉండొచ్చని ఆనంద్‌రాఠి కమోడిటీస్, కరెన్సీస్ డైరెక్టర్ నవీన్ మాథుర్ తెలిపారు. పన్ను ప్రయోజనాల దృష్ట్యా గోల్డ్ ఈటీఎఫ్‌లు మెరుగైన ఎంపికగా పేర్కొన్నారు. వచ్చే రెండేళ్లలో తులం బంగారం ధర రూ.86,000కు చేరుకోవచ్చని, తగ్గినప్పుడు కొనుగోలు చేయడమనే విధానాన్ని అనుసరించొచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనలిస్టులు సూచిస్తున్నారు. బంగారం ఈ ఏడాది రూ.82,000–85,000 శ్రేణిలో ట్రేడ్ కావొచ్చని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది అంచనా. వెండి సైతం రూ.1.1 లక్షల నుంచి రూ.1.25 లక్షల వరకు ర్యాలీ చేయొచ్చని అంచనా వ్యక్తీకరించారు. మిరే అసెట్ షేర్‌ఖాన్‌కు చెందిన సీనియర్ ఎగ్జిక్యూటివ్ ప్రవీణ్ సింగ్ మాత్రం ఈ ఏడాది చివరికి బంగారం 10 గ్రాములు రూ.90,000–93,000కు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు.



డెట్‌లో అవకాశాలు..

స్థిరాదాయ (డెట్) సాధనాల్లో రాబడులు వడ్డీ రేట్ల గమనంపై ఆధారపడి ఉంటాయి. ఈక్విటీ పెట్టుబడులకు స్టాక్స్ విలువలను ఎలా అయితే పరిశీలిస్తామో.. డెట్‌లో పెట్టుబడులకు సమీప కాలంలో వడ్డీ రేట్ల తీరు ఎలా ఉంటుందో తెలుసుకోవాలి. యూఎస్ ఫెడ్ ఇప్పటికే రెండు విడతలుగా వడ్డీ రేట్ల కోత నిర్ణయాలు తీసుకుంది. వచ్చే ఏడాదికి రెండు కోతలు చేపట్టనున్నట్టు ప్రకటించింది. ఆర్‌బీఐ వేచి చూసే ధోరణితో ఉంది. వచ్చే ఫిబ్రవరి, ఏప్రిల్‌లో ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపును చేపట్టొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయిల్లోనే ఉన్నందున ఈ దశలో లాంగ్ డ్యురేషన్ ఫండ్స్ అనుకూలంగా ఉంటాయన్నది నిపుణుల సూచన. ''రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నియంత్రిత బ్యాండ్‌లోనే ఉంది. వృద్ధి నిదానించింది. వడ్డీ రేట్లు గరిష్ఠాలకు చేరాయని మేము భావిస్తున్నాం. ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు), ఎన్‌సీడీలు, బాండ్లలో ఇన్వెస్ట్ చేసే వారు తమ పెట్టుబడులను అధిక రాబడుల (రేట్లు) వద్ద లాకిన్ చేసుకోవాలి. సంప్రదాయ సాధనాలకు వెలుపల క్రెడిట్ ఫండ్స్, వెంచర్ డెట్ ఫండ్స్, స్పెషల్ సిచ్యుయేషన్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. ఈ ఫండ్స్ రిస్కును మించి రాబడులను ఇస్తాయి. దీంతో మొత్తం మీద డెట్ పోర్ట్‌ఫోలియో రాబడులను పెంచుకోవచ్చు'' అని నువమా వెల్త్ ఎండీ రాహుల్‌జైన్ సూచించారు.



రియల్టీ / ఏఐఎఫ్‌లు

పట్టణీకరణ విస్తరిస్తూ ఉంది. మెరుగైన ఉపాధి కల్పనతో ఆదాయ స్థాయిల్లో మార్పు వస్తోంది. ఆఫీస్ స్పేస్ మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. కనుక రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ సాధనాల్లో ఇన్వెస్ట్‌చేసుకోవాలని నిపుణుల సూచన. కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు కేటాయిస్తోంది. వికసిత్ భారత్ లక్ష్యానికి మౌలిక వసతులు కీలకం. కనుక ఇన్వెస్టర్లు రీట్‌లతోపాటు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)ల్లోనూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చని ఐసీఐసీఐ ఏఎంసీ సూచిస్తోంది. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో ఇన్వెస్ట్ చేసే ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఆర్‌ఈ ఏఐఎఫ్‌లు) కూడా ఉన్నాయి. ''ప్రత్యేకమైన ఆర్‌ఈ ఏఐఎఫ్‌లు అత్యున్నత గ్రేడ్ కమర్షియల్ ఆఫీస్, లగ్జరీ నివాస గృహాల పోర్ట్‌ఫోలియోల్లో పెట్టుబడుల అవకాశాలను కల్పిస్తాయి. వీటిపై అధిక రాబడులకుతోడు, మెచ్యూరిటీ సమయంలో మూలధన లాభాలను సైతం పొందొచ్చు'' అని అవెండస్ వెల్త్ మేనేజ్‌మెంట్ ఎండీ, సీఈవో సౌరభ్ రుంగ్తా సూచించారు. రియల్ ఎస్టేట్‌లో ఒకరు విడిగా ఇన్వెస్ట్ చేయాలంటే పెద్ద మొత్తం అవసరం పడుతుంది. రీట్‌లు, ఏఐఎఫ్‌ల ద్వారా అయితే రూ.100–500 నుంచి కూడా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. భౌతిక ప్రాపర్టీకి బదులు వీటిల్లో పెట్టుబడులు కలిగి ఉంటే, అవసరం వచ్చినప్పుడు వేగంగా వెనక్కి తీసుకోవచ్చు. వీటిల్లో అస్థిరతలు తక్కువ.




ఎఫ్అండ్‌వో/ క్రిప్టోలు

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో), క్రిప్టో ట్రేడింగ్‌కు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎఫ్అండ్‌వోలో ట్రేడ్ చేసే 1.13 కోట్ల మందిలో 92.8 శాతం మంది 2021–22 నుంచి 2023–24 మధ్య ఒక్కొక్కరు సగటున రూ.2 లక్షలు నష్టపోయినట్టు సెబీ డేటా తెలియజేస్తోంది. అంతా కలిపి పోగొట్టుకున్న మొత్తం ఈ కాలంలో రూ.1.81 లక్షల కోట్లు. టాప్ 3.5 శాతం ట్రేడర్లు అయితే విడిగా ఒక్కొక్కరు రూ.28 లక్షల చొప్పున నష్టపోయారు. ''ఎఫ్అండ్‌వో ట్రేడింగ్ మీ లాభాలను రెట్టింపు చేయడమే కాదు, నష్టాలను రెట్టింపు చేస్తుంది. దాంతో ఏళ్ల పాటు చేసిన పొదుపు అంతా తుడిచిపెట్టుకుపోతుంది'' అని ఈక్విరస్ వెల్త్ ఎండీ, సీఈవో అభిజిత్ భవే హెచ్చరించారు. క్రిప్టో అసెట్స్ కూడా ఒకరి నియంత్రణలో నడిచేవి కావు. ఫండమెంటల్స్‌తో సంబంధం లేకుండా.. డిమాండ్–సరఫరా, స్పెక్యులేషన్ ఆధారంగా వీటి విలువలు భారీ అస్థిరతలకు లోనవుతుంటాయి. దీంతో వీటిల్లో పెట్టుబడికి రక్షణ తక్కువ. కనుక రిస్క్ తీసుకునే వారు క్రిప్టోల కంటే పటిష్ఠమైన నియంత్రణల మధ్య నడిచే స్టాక్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. భారీ లాభాల కంటే పెట్టుబడిని కాపాడుకోవడం ముఖ్యమని 5నాన్స్ ఫౌండర్ దినేష్ రోహిరా సూచించారు



సైబర్ రక్షణ

2023–24లో సైబర్ మోసాలు 300 శాతం (2,92,800 ఘటనలు) పెరిగాయి. 2024లో మొదటి తొమ్మిది నెలల్లోనే 11,333 కోట్ల నష్టం వాటిల్లింది. ''మన దేశ వాసులు ఒక్కొక్కరు సగటున ఒక రోజులో 194 నిమిషాలు సోషల్ మీడియాపై గడుపుతున్నారు. టీనేజర్లు సైతం 3–6 గంటలు వెచ్చిస్తున్నారు. ఫిషింగ్, గుర్తింపు చోరీతోపాటు సైబర్ దాడులు పెరిగాయి'' అని టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నజీమ్ బిల్‌గ్రామి తెలిపారు. నేడు చాలా మంది స్మార్ట్ ఫోన్ నుంచే స్టాక్స్, ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. చెల్లింపులు, నగదు బదిలీ లావాదేవీలు నిర్వహిస్తున్నారు. అదే స్మార్ట్ ఫోన్ నుంచి సోషల్ మీడియా బ్రౌజింగ్ చేస్తున్నారు. ఇలాంటి వారు సైబర్ దాడుల రూపంలో పెద్ద మొత్తంలో నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. కనుక సైబర్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి. ''సైబర్ సెక్యూరిటీ ఇన్సూరెన్స్ అన్నది ఆన్‌లైన్ మోసాలు, అనధికారిక లావాదేవీలు, డేటా లీకేజీ రూపంలో వ్యక్తులకు కలిగే ఆర్థిక నష్టం, చట్టబద్ధమైన బాధ్యతల నుంచి రక్షణనిస్తుంది'' అని ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ ఎస్.బ్రహ్మజోస్యుల వెల్లడించారు. సైబర్ సెక్యూరిటీ ఇన్సూరెన్స్ రూ.10,000 నుంచి రూ.కోటి వరకు తీసుకోవచ్చు. వ్యక్తులు, కుటుంబ సభ్యులకూ కలిపి తీసుకునే వెసులుబాటు ఉంది. సైబర్ ఇన్సూరెన్స్‌తోపాటు, ఎవరూ ఊహించని విధంగా పాస్‌వర్డ్‌లు, మొబైల్‌లో సైబర్ సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్ ఉండేలా చూసుకోవాలి. ఓటీపీ, వ్యక్తిగత బ్యాంక్ ఖాతా, ఆధార్, చిరునామా వివరాలను ఎవరితోనూ పంచుకోరాదు.



ఏవి.. ఎందుకు..?

- **ఈక్విటీ ఫండ్స్:** అధిక వృద్ధి అవకాశాలతో దీర్ఘకాల లక్ష్యాలకు అనుకూలం.
- **డెట్ ఫండ్స్:** స్థిరమైన, ఊహించదగిన రాబడులు ఇచ్చేవి.
- **హైబ్రిడ్ ఫండ్స్:** ఈక్విటీ, డెట్ కలసినవి. పెట్టుబడుల వృద్ధి, రిస్క్‌ను సమతుల్యం చేసేవి.
- **ఈఎల్‌ఎస్‌ఎస్:** ఈక్విటీ పెట్టుబడికి అదనంగా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలు ఆఫర్ చేసేవి.
- **ఎన్‌పీఎస్:** చాలా చౌక చార్జీలకే ఈక్విటీ, డెట్ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెడుతూ, రిటైర్మెంట్ నిధిని సమకూర్చుకునేందుకు ఉద్దేశించిన మెరుగైన సాధనం. పన్ను ప్రయోజనాలతో కూడినది.
- **రీట్‌లు/ఇన్విట్‌లు:** కార్యకలాపాలు నిర్వహించే ఆఫీస్, రిటైల్ ప్రాపర్టీలు.. ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల్లో యూనిట్ల రూపంలో పెట్టుబడికి వీలు కల్పించేవి.
- **గోల్డ్ ఈటీఎఫ్:** స్టాక్ ఎక్ఛేంజ్ ద్వారా బంగారంలో పెట్టుబడులకు వీలు కల్పించే ఎలక్ట్రానిక్ సాధనం.




ఫండ్ స్ట్రీట్...

యూటీఐ క్వాంట్ ఫండ్

యూటీఐ మ్యూచువల్ ఫండ్ తాజాగా క్వాంట్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది జనవరి 16 వరకు అందుబాటులో ఉంటుంది. కనీసం రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ఫండమెంటల్ రీసెర్చ్‌కి క్వాంటిటేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ విధానాన్ని కూడా జోడించి ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత సాధనాల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. తద్వారా దీర్ఘకాలంలో మూలధన వృద్ధిని సాధించడం దీని లక్ష్యం. నాణ్యత, విలువ తదితర నాలుగు కీలకాంశాలకు వెయిటేజీనిస్తూ, మార్కెట్లో ఒడిదుడుకులను అధిగమించి, ప్రామాణిక సూచీల కన్నా అధిక రాబడులు అందించేందుకు ప్రాధాన్యమిస్తుంది. దీనికి బీఎస్‌ఈ 200 టీఆర్‌ఐ ప్రామాణికంగా ఉంటుంది. 2022 నుంచి యూటీఐ మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్ తమ ఈక్విటీ పోర్ట్‌ఫోలియో నిర్వహణలో ఈ ప్రక్రియను ఉపయోగిస్తూ మెరుగైన ఫలితాలు సాధిస్తోందని యూటీఐ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ వెట్రి సుబ్రమణియం తెలిపారు.

బజాజ్ ఫిన్‌సర్వ్ గిల్ట్ ఫండ్



ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసే బజాజ్ ఫిన్‌సర్వ్ గిల్ట్ ఫండ్‌ను ఆవిష్కరించింది బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ. జనవరి 13తో ఈ న్యూ ఫండ్ ఆఫర్ ముగుస్తుంది. ఇందులో వడ్డీరేట్లపరంగా కాస్త ఎక్కువ రిస్కు, మిగతా సాధనాలతో పోలిస్తే తక్కువ క్రెడిట్ రిస్కు ఉంటుంది. మధ్యకాలికం నుంచి దీర్ఘకాలికంగా తక్కువ క్రెడిట్ రిస్కుతో ఒక మోస్తరు రాబడులను కోరుకునే ఇన్వెస్టర్లకు ఇది అనువైనదిగా ఉంటుంది. దీనికి క్రిసిల్ డైనమిక్ గిల్ట్ ఇండెక్స్ ప్రామాణికంగా ఉంటుంది. కనీసం, రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు.

స్టైలమ్ ఇండస్ట్రీస్ | బ్రోకరేజ్: ఎస్‌బీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,315 టార్గెట్: రూ. 2,963

ఎందుకంటే: ల్యామినేట్స్, ప్లైబోర్డుల తయారీ కంపెనీ స్టైలమ్ ఇండస్ట్రీస్ ఈ ఏడాది జులై–సెప్టెంబర్(క్యూ2)లో పటిష్ఠ ఫలితాలు సాధించింది. వార్షిక ప్రాతిపదికన ఆదాయం 12.3 శాతం బలపడి రూ. 263 కోట్లకు చేరగా, నిర్వహణ లాభం(ఇబిటా) 15 శాతం వృద్ధితో రూ. 54 కోట్లను అధిగమించింది. నికర లాభం 7.5 శాతం పుంజుకుని రూ. 34 కోట్లను తాకింది. తొలి అర్ధభాగం(ఏప్రిల్–సెప్టెంబర్)లోనూ ఆదాయం 10 శాతం వృద్ధితో రూ. 505 కోట్లను దాటగా.. ఇబిటా 8 శాతం బలపడి రూ. 96 కోట్లను తాకింది. నికర లాభం సైతం 5 శాతం పెరిగి దాదాపు రూ. 63 కోట్లకు చేరింది. పరిశ్రమతోపాటు ఇతర దేశీ కంపెనీలతో పోలిస్తే మెరుగైన పనితీరును ప్రదర్శించింది. క్యూ2లో అన్ని విభాగాలలోనూ పటిష్ఠ ఫలితాలు అందుకుంది. ఇందుకు ప్రధానంగా అమ్మకాల పరిమాణం, మెరుగైన ధరలు సహకరించాయి. ప్రస్తుతం కొనసాగుతున్న తయారీ యూనిట్ విస్తరణ కార్యకలాపాలకు మద్దతుగా యాజమాన్యం రూ. 200– 220 కోట్లవరకూ పెట్టుబడి వ్యయాలను కేటాయించింది. ఇందుకు స్వల్ప ఆలస్యమైనప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరాని(2024–25)కల్లా విస్తరణ పనులు పూర్తికానున్నాయి. కొత్త ప్లాంటు సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే రూ. 800 కోట్ల అదనపు ఆదాయానికి వీలున్నట్లు అంచనా. వెరసి కంపెనీ ఆదాయం 20 శాతం సాలుసరి వృద్ధిని అందుకోనున్నట్లు భావిస్తున్నాం. ఇందుకు కొత్త సామర్థ్యాలు జత కలవడం, విలువజోడింపు ప్రొడక్టుల వాటా పెరగడం, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి దోహదపడనున్నాయి. వృద్ధిలో నున్న విదేశీ మార్కెట్లలో కీలక క్లయింట్లను పొందడం ద్వారా ఎగుమతులను భారీగా పెంచుకోనున్నట్లు అంచనా వేస్తున్నాం.



ఆస్టర్ డీఎం హెల్త్ | బ్రోకరేజ్: బీఎన్‌పీ పారిబా | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 522 టార్గెట్: రూ. 665

ఎందుకంటే: ఆరోగ్య పరిరక్షణ రంగ సంస్థ ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ గత నెలాఖరున క్వాలిటీ కేర్ ఇండియా(క్యూసీఐఎల్)ను విలీనం చేసుకోనున్నట్లు ప్రకటించింది. పీఈ దిగ్గజం బ్లాక్‌స్టోన్‌కు మెజారిటీ వాటా గల ఆసుపత్రుల ప్లాట్‌ఫామ్(సంస్థ) ఇది. కేర్ హాస్పిటల్స్, కిమ్స్ హెల్త్ పేరిట రెండు బ్రాండ్లతో సంస్థ ఆసుపత్రులను నిర్వహిస్తోంది. క్యూసీఐఎల్‌లో బ్లాక్‌స్టోన్ 2023లో ప్రధాన వాటాను పొందింది. క్యూసీఐఎల్‌తో విలీన ప్రతిపాదనను ఆస్టర్ డీఎం నవంబర్ 29న తెరమీదకు తీసుకువచ్చింది. ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ పేరిట విలీన సంస్థ కార్యకలాపాలను నిర్వహించనున్నట్లు పేర్కొంది. తద్వారా మొత్తం 10,150 పడకల సౌకర్యాలతో సేవలు అందించనున్నట్లు తెలియజేసింది. విలీన సంస్థ కీలక ప్రాంతాలలో ఆసుపత్రులను కలిగి ఉండటం అదనపు లబ్ధిని చేకూర్చనుంది. కాగా.. క్యూసీఐఎల్ విలువను 25 రెట్లుపైగా ఎకనమిక్ విలువ/నిర్వహణ లాభం ఆధారంగా ఆస్టర్ డీఎం మదింపు చేసింది. హెల్త్‌కేర్ రంగంలోని లిస్టెడ్ కంపెనీలు, కొనుగోళ్లు, విలీన సగటు విలువతో పోలిస్తే క్యూసీఐఎల్‌ను తగిన విలువలోనే కొనుగోలు చేసినట్లు భావిస్తున్నాం. దీనికితోడు ఆసుపత్రుల రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐలు) రికార్డ్ స్థాయికి చేరాయి. మరోపక్క పీఈ దిగ్గజాలు దేశీయంగా ఆసుపత్రుల చైన్‌ను సొంతం చేసుకునేందుకు ఆసక్తిని చూపుతున్నాయి. వెరసి హెల్త్‌కేర్ రంగంలో వేల్యుయేషన్లు అత్యధిక స్థాయిలో నిలవనున్నాయి. 2026–27కల్లా 13,250 ఆసుపత్రులు, 12,700 ఏపీహెచ్‌లతో విలీన సంస్థ ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ దేశీయంగా అతిపెద్ద ఆసుపత్రుల చైన్ కలిగిన సంస్థగా ఆవిర్భవించనుంది. దీంతో ఇతర చిన్న, మధ్యతరహా ఆసుపత్రుల సంస్థలతో పోలిస్తే ప్రీమియం విలువను పొందనుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
క్యూ3 ఫలితాలే మార్కెట్‌కు దిక్సూచి | ఫండ్ రివ్యూ.. రాబడులకు స్థిరత్వం

ఫండ్స్ కటాఫ్ సమయం ఎప్పుడు?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



లిక్విడ్ ఫండ్‌లో ఉన్న నా పెట్టుబడులను శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు విక్రయించినట్టయితే, అదే రోజు ఎన్‌ఏవీ వర్తిస్తుందా? – అజయ్ కుమార్

ఏ తరహా మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడులు ఉన్నాయి, ఏ సమయంలో అభ్యర్థన (కొనుగోలు/విక్రయం) పంపించారన్న దానిపై ఇది ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు మీరు లిక్విడ్ ఫండ్ పెట్టుబడులను శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు విక్రయించేందుకు ఆర్డర్ చేశారని అనుకుందాం. లిక్విడ్ ఫండ్స్‌కు కటాఫ్ సమయం మధ్యాహ్నం 3 గంటలు. మీ అభ్యర్థన ఈ సమయానికి ముందే చేశారు కనుక, విక్రయించిన యూనిట్లకు శుక్రవారం నాటి ఎన్‌ఏవీ వర్తిస్తుంది. ఇలా విక్రయించిన పెట్టుబడులు బ్యాంక్ అకౌంట్‌లోకి వచ్చేందుకు ఎంత సమయం పడుతుంది? అన్నది తెలుసుకుందాం. ఈ విషయంలోనూ ఏ ఫండ్‌లో పెట్టుబడులు విక్రయించారన్నది కీలకం అవుతుంది. లిక్విడ్ ఫండ్, ఓవర్‌నైట్ ఫండ్‌లో పెట్టుబడులను విక్రయించినప్పుడు ఆ మొత్తం ఇన్వెస్టర్ బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేందుకు ఒక పనిదినం పడుతుంది. ఇతర డెట్ ఫండ్స్ అయితే, రెండు రోజుల సమయం తీసుకుంటుంది. అదే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు వెనక్కి వచ్చేందుకు మూడు పనిదినాలు పడుతుంది. టీప్లస్ రూపంలో ఈ విషయాన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు ఇన్వెస్టర్లకు తెలియజేస్తాయి. ఉదాహరణకు సోమవారం నాడు ఈక్విటీ ఫండ్స్‌లో పెట్టుబడులు విక్రయించారని అనుకుంటే, ఈ మొత్తం గురువారం నాడు బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతుంది. రియలైజింగ్ మనీ అంటే.. ఇన్వెస్టర్ కొనుగోలు ఆర్డర్‌కు సంబంధించిన మొత్తం మ్యూచువల్ ఫండ్స్ సంస్థ (ఏఎంసీ) అందుకోవడం. బ్యాంక్ నుంచి పంపించారనుకుంటే ఆ మొత్తం ఏఎంసీ చేరేందుకు కొన్ని గంటలు లేదా రోజు సమయం తీసుకోవచ్చు. కొనుగోలు ఏ రోజు చేశారన్న దానితో సంబంధం లేకుండా, ఏఎంసీకి ఆ మొత్తం అందిన రోజు ఎన్‌ఏవీనే పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు లిక్విడ్ ఫండ్‌లో పెట్టుబడులను కటాఫ్ సమయం 3 గంటలు దాటిన తర్వాత విక్రయించారని అనుకుంటే, అప్పుడు తర్వాతి రోజు ఎన్‌ఏవీ పెట్టుబడులకు వర్తిస్తుంది. ఎందుకంటే తర్వాతి రోజునే ఫండ్స్ సంస్థలు ఆ మేరకు విక్రయాలు చేస్తాయి.

నాకు ఒక ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ రెగ్యులర్ ప్లాన్‌లో పెట్టుబడులు ఉన్నాయి. వాటిని ఇటీవలే విక్రయించి అదే పథకం డైరెక్ట్ ప్లాన్‌లో ఇన్వెస్ట్ చేశాను. కనుక లాభాలపై నేను పన్ను చెల్లించాలా? లేక భవిష్యత్తులో పెట్టుబడులు విక్రయించినప్పుడు పన్ను చెల్లించాల్సి వస్తుందా? – రాజన్ పీ.ఏ

ఒక మ్యూచువల్ ఫండ్ ప్లాన్ నుంచి మరో ప్లాన్‌లోకి మారినప్పుడు, అది రెగ్యులర్ నుంచి డైరెక్ట్ ప్లాన్ అయినా సరే దాన్ని పెట్టుబడి ఉపసంహరణగానే చూస్తారు. ఆదాయపన్ను చట్టం కింద పెట్టుబడుల విక్రయమే అవుతుంది. దీనర్థం.. మూలధన లాభాలపై మీరు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని మరో ప్లాన్‌లో ఇన్వెస్ట్ చేసి, భవిష్యత్తులో విక్రయించినట్టయితే.. హోల్డింగ్ పీరియడ్ (ఎంత కాలం పాటు పెట్టుబడులు కొనసాగించారు), వచ్చిన మూలధన లాభాల ఆధారంగా తిరిగి అప్పుడు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పెట్టుబడి నుంచి విక్రయం మధ్య కాలానికి పన్ను వర్తిస్తుందని అర్థం చేసుకోవాలి.



మెట్రో @1000 km

దేశంలో అత్యాధునిక మెట్రో వ్యవస్థకు దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజపేయి బీజం వేశారని, దాన్ని ప్రధాని నరేంద్ర మోదీ రికార్డు స్థాయికి తీసుకెళ్లారని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2002లో ఢిల్లీలో మెట్రోను ప్రారంభిస్తే ప్రస్తుతం అది 1000 కి.మీ. మైలురాయిని చేరుకుంది. దీంతో ప్రపంచంలో అత్యంత పొడవైన మెట్రో నెట్‌వర్క్ ఉన్న దేశాల్లో మనదేశం మూడో స్థానానికి చేరింది.

2014-2024 మధ్య మెట్రో గణాంకాలు

	2014	2024
కిలోమీటర్లు	248	1,000
మెట్రో నగరాలు	5 (5 రాష్ట్రాల్లో)	23 (11 రాష్ట్రాల్లో)
రోజూ ప్రయాణికులు	28 లక్షలు	1 కోటి పైగా
మెట్రో రైళ్లు ప్రతిరోజు ప్రయాణించే దూరం (కి.మీ.)	86,000	2.75 లక్షలు

అనుమతి లేకుండా కిమ్స్‌కు వెళ్లొద్దు

అల్లు అర్జున్‌కు నోటీసుల్లో పోలీసులు

- అవాంఛనీయ ఘటన జరిగితే బాధ్యత వహించాలని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించడానికి తమ అను మతి లేకుండా వెళ్లొద్దని సినీహీరో అల్లు అర్జున్‌కు రాంగోపాల్‌పేట పోలీసులు తేల్చిచెప్పా రు. ఈ పరామర్శ నేపథ్యంలో ఎలాంటి అ వాంఛనీయ ఘటన జరిగినా బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు అల్లు అర్జున్‌కు (ఆయన మేనేజర్ ద్వారా) ఆదివారం నోటీసులు జారీ చేశారు. తొక్కిసలాట కేసులో అల్లు అర్జున్‌కు పూర్తిస్థాయి బెయిల్ మంజూరు చేసిన నాంపల్లి కోర్టు.. బెయిల్ షరతుల్లో భాగంగా ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌కు వెళ్లి సంతకం చేయాలని ఆదేశించడం తెలిసిందే. దీంతో అల్లు అర్జున్ ఆదివారం ఉదయం 10:30 గంటలకు మామ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి స్టేషన్‌కు వెళ్లి సంతకం చేశారు. అనంతరం అక్కడి నుంచి కిమ్స్‌కు వెళ్లి శ్రీతేజ్‌ను పరామర్శించాలని భావించారు. ఈ విషయాన్ని ఆస్పత్రి వర్గాలకు చెప్పగా వారి నుంచి పోలీసులకు మౌఖికంగా సమాచారం అందింది. దీనిపై వెంటనే స్పందించిన రాంగోపాల్‌పేట పోలీసులు.. అల్లు అర్జున్ ఉన్నపళంగా వస్తే ఆస్పత్రిలోని రోగులు, సహాయకుల తాకిడి నేపథ్యంలో ఇబ్బందులు తప్పవని భావించారు. కిమ్స్ ఆస్పత్రికి రావాలనుకుంటే యాజమాన్యంతో పాటు తమకు సమాచారం ఇచ్చి ఏర్పాట్లు చేశాకే వెళ్లాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు.

ఆయుధ 'సంపద' పెరుగుతోంది

ఆయుధాలు తయారుచేసే ప్రపంచంలోని టాప్ – 100 కంపెనీలు, సైనిక సేవల సంస్థల ఆదాయం 2023లో 632 బిలియన్ డాలర్లకు.. అంటే సుమారు రూ.54 లక్షల కోట్లకు చేరింది. ఇందులో దాదాపు సగం ఆదాయం అమెరికాలో ఉన్న 41 కంపెనీలూ, సంస్థలదే. 2015తో పోలిస్తే మొత్తం ఆదాయం 19 శాతం పెరిగింది. అన్నింటికంటే ఎక్కువగా రష్యా దేశంలో కంపెనీలు, సైనిక సేవా సంస్థల ఆదాయాలు 40 శాతం పెరిగాయి. అత్యధిక శాతం ఆదాయం పెరిగిన టాప్ – 10 దేశాల జాబితాలో.. 5.8 శాతంతో మనదేశం కూడా ఉంది. టాప్ – 100 జాబితాలో మనదేశానికి చెందిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ (43), భారత్ ఎలక్ట్రానిక్స్ (67), మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ (94) ఉన్నాయి.

ఆయుధాల ఆదాయాల్లో ప్రధాన దేశాల వాటా

దేశం	శాతం
అమెరికా	50
చైనా	16
యూకే	7.5
ఫ్రాన్స్	4
రష్యా	4
ఇటలీ	2.4
ఇజ్రాయెల్	2.2
భారత్	1.1

ఆధారం: స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్



పక్షి ఎదురొచ్చినా.. పక్షికి ఎదురెళ్లినా.. ముప్పు విమానాలకే!

విమాన ప్రమాదాలకు కారణమవుతున్న పక్షుల కదలికలు

- ఒక్క ఢిల్లీలోనే 2023లో 169 విమానాల్ని ఢీకొట్టిన విహంగాలు
- కొరియా ప్రమాదంతో అప్రమత్తమైన డీజీసీఏ
- ఎయిర్‌పోర్టుకు 10 కి.మీ. పరిధిలో పక్షుల కదలికలపై ప్రత్యేక నిఘా
- ఎయిర్‌ఫీల్డ్ పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా చర్యలు
- దేశంలోని అన్ని విమానాశ్రయాల్ని అప్రమత్తం చేసిన డీజీసీఏ


'ఒకడు నాకు ఎదురొచ్చినా వాడికే రిస్కు.. నేనింకొకడికి ఎదురెళ్లినా వాడికే రిస్కు'.. ఇదో సినిమాలోని పాపులర్ డైలాగు. ప్రస్తుతం విమానాల విషయంలో ఇదే పరిస్థితి ఎదురవుతోంది. ఎయిర్‌పోర్టుల సమీపంలో పక్షుల కదలికలు విమాన ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దక్షిణ కొరియాలో విమాన ఘోర ప్రమాదంలో 179 మృత్యువాత పడటానికి పక్షులే ప్రధాన కారణమైన నేపథ్యంలో మన డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) మరింత అప్రమత్తమైంది. దేశంలో ఇప్పటికే పక్షుల కారణంగా టేకాఫ్ తీసుకున్న కొన్ని నిమిషాలకే విమానాలు తిరిగి ల్యాండ్ అవుతున్న ఘటనలు పెరుగుతున్న తరుణంలో.. ఎయిర్ ఫీల్డ్ పరిసర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసే దిశగా డీజీసీఏ అడుగులు వేస్తోంది. ఓ వైపు వన్యప్రాణి సంరక్షణకు చర్యలు తీసుకుంటూ.. మరోవైపు విమాన ప్రమాదాలు జరగకుండా రక్షణ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

అప్రమత్తమైన డీజీసీఏ

భారత్‌లోనూ ఇటీవల పక్షుల కారణంగా విమానాలను అత్యవసర ల్యాండింగ్ చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. గతేడాది ఆగస్టులో గోవాలోని దబోలి ఎయిర్‌పోర్ట్‌లో పక్షి ఢీకొన్న తర్వాత విమానం ఇంజన్ నుంచి పొగలు రావడంతో ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్‌ను హఠాత్తుగా నిలిపేసింది. ఒక్క ఢిల్లీ ఎయిర్‌పోర్టులోనే 2023లో 169 విమానాలకు పక్షుల కారణంగా స్వల్ప ప్రమాదాలు సంభవించడం గమనార్హం. విహంగాలతో లోహపు విహంగాలకు ప్రమాదాలు పెరుగుతుండటంతో డీజీసీఏ అప్రమత్తమైంది. ఎయిర్‌పోర్టు సమీపంలో ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో విహంగాల ఉనికిని తప్పించే మార్గాలపై దృష్టి సారించింది. రన్‌వేల వెంట బిగ్గరగా శబ్దాలు వచ్చే బాణసంచా కాల్చడం, జోన్ గన్స్ ద్వారా భారీ శబ్దాలతో పక్షుల రాకను నియంత్రించడం, ఎయిర్ ఫీల్డ్ సమీపంలో వేప నూనె స్ప్రే చేయడం వంటి భిన్నమైన విధానాలను వినియోగించడంపై చర్చలు జరుపుతోంది. అంతేకాకుండా ఎయిర్‌పోర్టుకి 10 కి.మీ. పరిధిలో పక్షులు, వన్యప్రాణుల్ని ఆకర్షించే చెత్తా చెదారాలతో కూడిన ఆహారం, జంతు కళేబరాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎయిర్‌పోర్టు వర్గాలకు డీజీసీఏ ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా కోళ్లు, మేకలు, ఇతర జంతు వధ జరగకుండా దృష్టి సారించాలని కూడా సూచించింది. అంతేకాకుండా ఈ సమస్యని శాస్త్రీయంగా పరిష్కరించేందుకు ఎయిర్‌పోర్టులు ప్రయత్నిస్తున్నాయి.

పే..ద్ద విమానానికి పక్షితో ముప్పా?

విమానం భారీగా ఉంటుంది. కానీ.. పక్షి మాత్రం చిన్నగా ఉంటుంది. అంతపెద్ద విమానానికి దీనివల్ల ఎందుకు ముప్పు వస్తుందని అంతా అనుకుంటారు. కానీ.. ఒక్కసారి విమానానికి పక్షి తగిలితే ఊహించని ఘోర ప్రమాదాలు సంభవిస్తాయి. విమానాల ల్యాండింగ్, టేకాఫ్ సమయాల్లో పక్షుల కారణంగా అధిక ప్రమాదాలు జరుగుతుంటాయి. విమాన క్యాబిన్, ఇంజన్‌ను పక్షులు ఢీకొడితే అత్యంత ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతాయి. విమానం పైకి ఎగిరినప్పుడు లేదా దిగుతున్నప్పుడు దాని ఇంజన్లు బలంగా లోపలికి గాలిని తీసుకుని బయటికి వదులుతుంటాయి. ఈ ప్రక్రియ జరుగుతున్న సమయంలో ఆ గాలికి సమీపంలోకి పక్షులు వస్తే అత్యంత వేగంగా తిరిగే ఎయిర్ క్రాఫ్ట్ ఇంజన్లు లోపలికి లాగేసుకుంటాయి. దాంతో ఇంజన్లు పాడైపోతుంటాయి. విమానం ఎగిరే సమయంలో ఇంజన్ లోపలికి పక్షులు వెళ్లిపోతే ఇంజన్ తిరగడం కొన్నిసార్లు ఆగిపోయి ఊహకందని ప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఫ్యాన్ థ్రస్ట్ ఆగిపోయినట్టు గుర్తిస్తే పైలట్ వెంటనే సమీపంలోని ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేసేస్తుంటారు. అంతేకాదు.. ఫ్లైట్ క్యాబిన్‌లో ఉన్న పైలట్ విండ్ షీల్డ్‌ను బలంగా పక్షులు ఢీ కొట్టినప్పుడు కూడా ప్రమాదాల తీవ్రత అధికంగా ఉంటుందని విమానాశ్రయ అధికారులు చెబుతున్నారు. బలంగా కొట్టినప్పుడు పొరపాటున విండ్ షీల్డ్‌కి పగుళ్లు ఏర్పడితే విమానం ప్రమాదంలో పడినట్టేనని అంటున్నారు.



సాక్షి, విశాఖపట్నం



ఎరక్కపోయి... ఇరుక్కుపోయిన గజరాజు

ఆహారం వెతుక్కుంటూ అడవిలో నుంచి వచ్చిన ఏనుగు రైలు పట్టాల వద్ద ఏర్పాటు చేసిన స్తంభాల మధ్య ఇరుక్కుని నానా హైరానా పడింది. మైసూరు జిల్లా, హుణసూరు తాలూకా, వీరనహోసహళ్ళి అటవీ ప్రాంతంలోని హోసకట్టె వద్ద ఆదివారం ఈ ఘటన జరిగింది. మదగనూరు వద్ద ఏనుగు రైలు పట్టాలను దాటాలని వచ్చింది. అయితే భారీకాయం ఉన్న జంతువులు పట్టాల మీదకు రాకుండా రైల్వేశాఖ ఏర్పాటు చేసిన పెద్ద స్తంభాల మధ్య చిక్కుకుపోయింది. మూడు గంటల పాటు ఎంత పెనుగులాడినా ఫలితం లేకపోయింది. చివరకు స్థానికులు అటవీ సిబ్బందికి చెప్పగా, వారు జేసీబీ తీసుకొచ్చి ఏనుగును స్తంభాల మధ్య నుంచి తప్పించారు. అనంతరం గజరాజు నెమ్మదిగా అడవిలోకి వెళ్లిపోయింది. – మైసూరు



మెరిసిన పక్షులు.. మురిసిన పక్షి ప్రేమికులు

కవ్వాల్ టైగర్ జోన్‌లో బర్డ్ వాక్..

జన్నారం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ టైగర్ జోన్‌లో అటవీశాఖ అధికారులు నిర్వహించిన బర్డ్‌వాక్‌లో వివిధ రకాల పక్షులు కనువిందు చేశాయి. అరుదైన, అందమైన పక్షులను ఫొటోగ్రాఫర్లు కెమెరాల్లో బంధించారు. అటవీ రేంజ్ అధికారులు కారం శ్రీనివాస్, సుష్మారావు ఆధ్వర్యంలో ఆదివారం ఇందన్‌పల్లి అటవీ రేంజ్ ఘనిషెట్టి కుంట, మైసమ్మ కుంట, కామన్‌పల్లి వాచ్‌టవర్ల ప్రాంతాల్లో బర్డ్‌వాక్ నిర్వహించారు. నిర్మల్, ఆసిఫాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి బర్డ్‌వాచర్లు వచ్చారు. ఆసిఫాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి కూడా కుటుంబ సభ్యులతో వచ్చి పక్షులను వీక్షించారు. పలు రకాల పక్షులను వీక్షించినట్లు పక్షి ప్రేమికులు తెలిపారు. ఇలాంటి బర్డ్‌వాక్ కార్యక్రమం ద్వారా వివిధ ప్రాంతాల నేచర్ లవర్స్ మధ్య స్నేహ బంధం ఏర్పడటమే కాకుండా అడవులు, పర్యావరణంపై అవగాహన ఏర్పడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. వీకెండ్ పేరుతో సుదూర ప్రాంతాలకు వెళ్తున్నామని, అయితే ఇంత సమీపంలో ఉన్న అందమైన అడవులను, చక్కటి వాతావరణాన్ని గుర్తించలేకపోయామని తెలిపారు. ఇక్కడికి వచ్చిన పక్షి ప్రేమికులకు సెక్షన్ అధికారి హన్మంతరావు, బీట్ అధికారులు అవసరమైన సౌకర్యాలు కల్పించారు.

ఎక్సైజ్‌శాఖలోనూ నార్కోటిక్ టీం

సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ కట్టడిలో భాగంగా ఎక్సైజ్‌శాఖ మరో కీలక అడుగు ముందుకేసింది. యువత పాలిట శాపంగా మారుతున్న డ్రగ్స్‌ను తుద ముట్టించేందుకు ప్రత్యేకంగా నార్కోటిక్ టీమ్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ.కమలాసన్‌రెడ్డి ఆదేశించారు. సాధారణ పోలీస్ విభాగంలోని టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఓటీతోపాటు టీజీన్యాబ్ రీతిలో ఈ నార్కోటిక్ టీమ్ పనిచేయనుంది. ఇందుకోసం ఎక్సైజ్ శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ బృందాల్లో చురుగ్గా పనిచేసే వారిని ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఇది డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో పనిచేస్తుంది. ఈ బృందంలో ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు కలిసి మొత్తంగా 15 నుంచి 20 మంది సిబ్బంది ఉంటారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రత్యేకంగా డ్రగ్స్‌పై నిఘా పెట్టడానికి ఈ టీం పనిచేస్తుంది.

డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా కోసమే



నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, గంజాయి, కొకైన్, హషిష్ ఆయిల్ తదితర డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా కోసం ఈ నార్కోటిక్ టీంను ఏర్పాటు చేశాం. ప్రభుత్వం డ్రగ్స్‌పై మరింత కఠినంగా వ్యవహరించాలని ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ టీం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ టీం త్వరలో రంగంలోకి దిగుతుంది.

– కమలాసన్‌రెడ్డి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

ఈ నెల 11 నుంచి సంక్రాంతి సెలవులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్టు విద్యాశాఖ తెలిపింది. జూనియర్ కాలేజీలకు 11 నుంచి 16 వరకు సెలవులు ఉంటాయి. పాఠశాలలు తిరిగి 18న, కాలేజీలు 17వ తేదీన ప్రారంభమవుతాయి. ఇందుకు సంబంధించిన సమాచారం అన్ని స్కూళ్లు, కాలేజీలకు పంపాలని విద్యా శాఖ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించింది.

అప్పట్లో ఐరన్ లెగ్ అని పేరొస్తుందని భయపడ్డా

- పరిస్థితుల్ని మనకు అనుకూలంగా మార్చుకోవాలని అనుకున్నా
- మన సానుకూల దృక్పథమే మన బలం
- ఎన్టీఆర్ తర్వాత నేనే టాప్‌లో నిలిచా
- 'ఆప్టా కేటలిస్ట్'సదస్సులో సినీ నటుడు చిరంజీవి



కార్యక్రమంలో మాట్లాడుతున్న చిరంజీవి

సాక్షి, హైదరాబాద్: 'ఆంత్రప్రెన్యూర్‌షిప్' అంటే స్పెల్లింగ్ కూడా నాకు తెలీదు. దాని గురించి పెద్దగా మాట్లాడలేను. నా గురించి చెప్తా. తిరుగులేని మనిషి అనే సినిమా ఎన్టీఆర్‌తో చేస్తే ఫ్లాప్ అయ్యింది. తర్వాత డేట్లు చెప్పిన వ్యక్తి సినిమా నుంచి నన్ను తీసేశారు. ఏమైందంటే సినిమా పోయింది కదా అన్నారు. ఆ పరిస్థితుల్లో కుంగిపోయాను. ఐరన్ లెగ్ అనే పేరొస్తుందని భయపడ్డా. ఆకాశంలో గద్ద గుర్తొచ్చింది. అది కొంతవరకే కష్టపడి ఎగరాలి. తర్వాత గాలితో పాటు సునాయాసంగా పైకి ఎగరగలుగుతుంది. నన్ను నేను అలా మార్చుకోవాలని అనుకున్నా. నన్ను వద్దు అనుకున్న వ్యక్తితోనే ఎన్టీఆర్ కంటే ఎక్కువ చిత్రాలు తీసేలా మలచుకున్నా. పరిస్థితులు ఎలా ఉన్నా మనకు అనుకూలంగా మార్చుకోవాలి. మన సానుకూల దృక్పథమే మనకు బలం..'అని ప్రముఖ నటుడు చిరంజీవి చెప్పారు. ఆదివారం హైటెక్స్‌లో ఆప్టా (అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్) కేటలిస్ట్ గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

దక్షిణాది రాజ్‌కపూర్ ఫ్యామిలీగా పేరు తెచ్చుకున్నాం

'విమర్శించే వారు మన గురించి ఆలోచన చేసే విధంగా మనం ఉండాలి. సినిమాల్లోకి కొత్త వారు వస్తారు. టాలెంట్ ఉంటే నడిచిపోతుందనుకుంటారు. అది సెకెండరీ. ప్రవర్తన బాగుండాలి. నైపుణ్యంతో పాటు వ్యక్తిత్వం ఉండాలి. ఎన్టీఆర్ తర్వాత నేనే టాప్‌లో నిలిచా. కానీ స్థానం కోసం ఏనాడూ ఆరాట పడలేదు. మన కుటుంబంలో 9 మంది నటులు ఉన్నారు. రాజ్‌కపూర్ కుటుంబంలా మన కుటుంబం ఉండాలని పవన్ అన్నాడు. అన్నట్టుగానే దక్షిణ భారత దేశపు రాజ్‌కపూర్ ఫ్యామిలీగా పేరు తెచ్చుకున్నాం..'అని చిరంజీవి చెప్పారు. అంతకుముందు జరిగిన ప్యానల్ చర్చలో పలువురు సభ్యులు మాట్లాడారు. ప్రతి ఒక్కరిలోనూ ఒక పారిశ్రామికవేత్త ఉంటాడని అన్నారు. వ్యాపారాన్ని ప్రారంభించడం, దాన్ని విజయవంతం చేయడానికి విశ్వాసం, దూర దృష్టి, సహనం, స్వీయ క్రమశిక్షణ, సంకల్పం ఉండాలన్నారు. పోటీతత్వం లాంటి వాటిని ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. ఉద్యోగులకు టీం, యాజమాన్య బాధ్యతలు అప్పగించడం వల్ల మరింత అంకితాభావంతో పనిచేస్తారని తెలిపారు. చిత్ర పరిశ్రమలో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉందని ప్యానలిస్టులు అభిప్రాయపడ్డారు. కేటలిస్ట్ బిజినెస్ పిచ్ పోటీలో టాప్ 5 స్టార్టప్‌లు ఫైనల్‌కు చేరుకున్నాయి. అందులో ముగ్గురిని విజేతలుగా ప్రకటించి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో ఆప్టా చైర్మన్ సుబ్బు కోట, బిజినెస్ ఫోరం చైర్మన్ రమేష్, కన్వీనర్ సాగర్, కమిటీ సభ్యులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

సీఎంకు 317 జీవో బాధితుల గోడు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన డిస్‌లొకేటెడ్ ఎంప్లాయీస్, టీచర్లు. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

కవాడిగూడ (హైదరాబాద్): 317 జీవో వల్ల సొంత జిల్లాలు, సొంత జోన్‌లు కాకుండా.. దూరప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలంటూ ఆదివారం 317 డిస్‌లొకేటెడ్ ఎంప్లాయీస్, టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రత్నమాల మాట్లాడుతూ.. దూరప్రాంతాల్లో ఉద్యోగాల వల్ల సమయానికి హాజరుకాలేక ఉద్యోగానికి న్యాయం చేయలేకపోతున్నామన్నారు. ఈ ప్రయాణంలో 3 రోజుల వ్యవధిలో ఇద్దరు ఉద్యోగులు రోడ్డు ప్రమాదాలకు గురై మరణించారని చెప్పారు. ఇప్పటివరకు రోడ్డు ప్రమాదాలలో 47 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు మరణించినట్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రివర్గ ఉపసంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక చొరవ తీసుకొని జీవో నంబర్ 317 వల్ల జిల్లాలు మారిన ఉద్యోగ ఉపాధ్యాయులను.. సొంత జిల్లాలకు కేటాయించాలని విన్నవించారు. తమ వినతిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో రాష్ట్ర బాధ్యులు సుతార్‌పల్లి శ్రీనివాస్, సలీమొద్దీన్, విశ్వరూపాచారి తదితరులు ఉన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
సోమవారం। 6-1-2025

అందాల రాచకొండ

పర్యాటకులను ఆకర్షిస్తున్న ప్రకృతి అందాలు • పురాతన కట్టడాలు, ఆలయాలకు ప్రసిద్ధి

పలు సినిమాల షూటింగ్ • ఫిలింసిటీ ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన • రాచకొండ అభివృద్ధితో ఉపాధి, ఉద్యోగావకాశాలు

సంస్థాన్ నారాయణపురం: ప్రకృతి అందాలు.. ప్రాచీన కట్టడాలు, పురాతన దేవాలయాలకు పెట్టింది పేరు రాచకొండ ప్రాంతం. ఎత్తయిన కొండలు, ప్రకృతి సోయగాలు, పక్షుల కిలకిలా రావాలు, మయూరాల నాట్యం, సెలయేళ్లు, జలపాతాలు.. అంతులేని ఈ ప్రకృతి అందాలకు చిరునామా రాచకొండ. ఆనాడు తెలంగాణ ప్రాంతానికి రాజధానిగా వెలసిన గొప్ప నగరం. ఇప్పటి తెలంగాణ ప్రాంతం అంతటికీ పద్మనాయక వంశీయుల ఏలుబడిలో రాజధానిగా చరిత్ర పుటల్లో నిలిచింది. యాద్రాది భువనగిరి, రంగారెడ్డి జిల్లాల సరిహద్దులోని సంస్థాన్ నారాయణపురం మండలంలో రాచకొండ అటవీ ప్రాంతం 35 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇది హైదరాబాద్ నగరానికి దగ్గరగా ఉంది. గతంలో మాజీ సీఎం కేసీఆర్ ఫిలింసిటీ ఏర్పాటు కోసం ఏరియల్ సర్వే నిర్వహించి, అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. రాచకొండలో ఫిలింసిటీ ఏర్పాటు చేస్తానని గత సంవత్సరం జూలైలో సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రకటించారు. దేశంలోనే అతిపెద్ద రెండో సైబరాబాద్ ఈస్ట్ కమిషనరేట్‌కు.. గత ప్రభుత్వం రాచకొండ పోలీస్ కమిషనరేట్‌గా నామకరణం చేసింది.



రాచకొండలోని ప్రకృతి దృశ్యాలు

రాచకొండలో చూడదగ్గ ప్రదేశాలు..

రాచకొండలో కట్టడాలు, నిర్మాణాలతో పాటు గుహలు, వందల సంఖ్యలో దేవాలయాలు, శిల్ప కళాఖండాలు, చిత్రాలు ఉన్నాయి. ప్రధానంగా కచేరి ప్రదర్శన శాల, ఉత్సవ విగ్రహాల మందిరం, సన్యాసుల దొన, సంకెళ్ల బావి, **మెట్ల బావులు, కోనేర్లు, కోట చుట్టూ ఉన్న రాతి కట్టడాలు, కొం**డలు, గుహలు, గొలుసు కట్టు చెరువులు, దేవలమ్మ నాగారంలోని నాగాంబిక శిలాశాసనం, గొలుసు కట్టు చెరువులు, గన్నేర్లలోని జాలువారు సెలయేళ్లు, మొల్కచెర్వు ప్రాంతంలోని ఎత్తయిన జలపాతాలు, అంతకు మించి పచ్చటి కొండలు, చిట్టడవిలో నెమళ్లు కనువిందు చేస్తాయి. నక్షత్ర తాబేళ్లకు ఈప్రాంతం ప్రత్యేకం. ప్రకృతి ప్రేమికులు వర్షాలు కురిసిన తర్వాత జూలై, ఆగస్టు నెలల్లో రాచకొండకు ఎక్కువగా వస్తుంటారు. చారిత్రక కట్టాడాలు, దేవాలయ సందర్శనకు రోజూ వస్తుంటారు.

దేవాలయాలకు ప్రసిద్ధి

రాచకొండలో వందల సంఖ్యలో దేవాలయాలున్నాయి. ఎంతో ప్రాధాన్యమున్న పురాతన రామాలయం ఉంది. ఆ రామాలయంలో సహజ పాండిత్య బమ్మెర పోతన పూజలు చేశాడని చరిత్ర చెబుతోంది. గుప్త నిధుల తవ్వకాల్లో బయటపడిన స్వయంభూ లింగేశ్వర శివలింగానికి నిత్యం పూజలు నిర్వహిస్తారు. ఇటీవల పునర్నిర్మించిన సరళమైసమ్మ, శ్రీ లక్ష్మీ నర్సింహ దేవాలయంలో నిత్య పూజలు జరుగుతున్నాయి. సరళ మైసమ్మ దేవాలయం వద్ద ప్రతి ఆదివారం జాతరలా జరుగుతుండటంతో.. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వస్తున్నారు. వీరభద్రస్వామి దేవాలయం, త్రికుటేశ్వర ఆలయం, అమ్మవారి దేవాలయాలు, పురాతన శివాలయంతో పాటు ఆళ్వారుల దేవాలయాలు.. ఇలా రాచకొండ అంతటా విస్తరించి ఉన్నాయి. మహాశివరాత్రికి స్వయంభూ లింగేశ్వర శివలింగం ఉత్సవాలు, గాలిబ్ షాహెద్ హజరత్ ఉర్సు ఒకేరోజు నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. చౌటుప్పల్ మండలంలోని ఆదిమహావిష్ణువు దేవాలయల సందర్శనకు భక్తులు వస్తుంటారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్ల శివాలయంలో ఏకశిల ధ్వజస్తంభంతో పాటు ఇతర శాసనాలు, కట్టడాలు అనేకం ఉన్నాయి. మొల్కచెర్వు ప్రాంతంలో జలపాతాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి.


రాచకొండ కోట పైన చెరువు


రాచకొండ కోట ప్రవేశ ద్వారం

పర్యాటకులను ఆకర్షించేలా..

రాచకొండ చారిత్రక నేపథ్యం ప్రతిబింబించేలా ప్రణాళికలు రూపొందించారు. రాచకొండ అటవీ శాఖ బీట్‌లో 657 ఎకరాల్లో ఎకో టూరిజం అర్బన్ పార్క్ అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే వివిధ రకాల 2500 మొక్కలు నాటారు. పురాతన మెట్ల బావిని అభివృద్ధి చేశారు. రాచకొండ ప్రకృతి అందాలను తిలకించే విధంగా అతి పెద్ద వ్యూ పాయింట్, ప్రధాన ద్వారం అభివృద్ధి. దర్గా నుంచి రాచకొండ కోట వరకు రోడ్డు నిర్మాణం, రోడ్డు వెంట ఉన్న చెరువుల మరమ్మతులు చేశారు. వివిధ రకాల పూల, గడ్డి జాతి మొక్కలతో పాటు విభిన్న రకాల వృక్షాలను పెంచుతున్నారు

ఫిలింసిటీకి అనువైన ప్రాంతం..

హైదరాబాద్‌కు రాచకొండ అతి సమీపంలోని ప్రాంతం. గతంలో అప్పటి సీఎం కేసీఆర్ రెండు వేల ఎకరాల్లో ఫిలిం సిటీ నిర్మించాలని ఈ ప్రాంతంలో ఏరియల్ సర్వే నిర్వహించారు. గత సంవత్సరం జూలైలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఫిలింసిటీ ఏర్పాటుపై ప్రకటన చేశారు. రాచకొండ గుట్టల్లో ఇప్పటికే పలు సినిమాలను చిత్రీకరించారు. మల్కాపురం ఘాట్ కంచె భూముల్లో 'రెబల్'చిత్రం, పవన్‌కల్యాణ్ నటించిన 'గబ్బర్‌సింగ్'సినిమాలో క్లైమాక్స్ సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు. మహేశ్‌బాబు హీరోగా 'ఆగడు'చిత్రం క్లైమాక్స్ ఫైట్‌ను కూడా ఇక్కడే చిత్రీకరించారు. రాచకొండలో శ్రీకాంత్ హీరోగా నటించిన 'విరోధి', 'సీ తారాముల కల్యాణం' సినిమాలో సుమన్‌పై క్లైమాక్స్ ఫైట్లను చిత్రీకరించారు. 'జానకిరామా'హిందీ సీరియల్ నిర్మాణంతో పాటు అనేక షార్ట్ ఫిల్మ్‌లు చిత్రీకరించారు.


పురాతన మెట్ల బావి

పర్యాటకాభివృద్ధి చేయాలి



"రాచకొండ ప్రాంతాన్ని ఫిలింసిటీతో పాటు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. టెంపుల్ సిటీగా తీర్చిదిద్దాలి. మౌలిక వసతులు కల్పించాలి. చారిత్రక కట్టడాలను పరిరక్షించి గోల్కొండ ఖిల్లాను అభివృద్ధి చేయాలి. హైదరాబాద్‌కు అతి సమీపంలోని రాచకొండను అభివృద్ధి చేస్తే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

– సూరపల్లి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి, రాచప్ప సమితి

ప్రగతి.. ప్రతిపాదనలకే పరిమితం..

కొత్త ప్రభుత్వాలు వచ్చినప్పుడు రాచకొండ అభివృద్ధి ప్రతిపాదనలపై ప్రకటనలు చేస్తూ వస్తున్నారు. కానీ ఆ తర్వాత వాటి ఊసే ఎత్తడం లేదు. అభివృద్ధి ప్రతిపాదనల్లో భాగంగా రాచకొండలో ఐటీ పార్కు, కృషి విజ్ఞాన కేంద్రం, నెమళ్ల పార్కు, టెంపుల్ సిటీ, ఫిలింసిటీ, పర్వతారోహణం, రోప్‌వే, స్పోర్ట్స్‌సిటీ, ఎడ్యుకేషన్ హబ్, స్మార్ట్‌సిటీ, రైలుబోగీల పరిశ్రమ, ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి తదితర ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల ఏర్పాటుపై ప్రతిపాదనలు వచ్చాయి. రాచకొండకు హైదరాబాద్ నుంచి, శంషాబాద్ నుంచి, హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి నుంచి నాలుగు లేన్ల రోడ్లను అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన ఉంది. ఇవన్నీ ప్రతిపాదనల దశల్లోనే ఉన్నాయి. రాచకొండ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే ఇక్కడి ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

రాచప్ప సమితి సేవలు అమోఘం..

రాచకొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్న అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో స్థానిక యువత రాచకొండ చారిత్రక పర్యావరణ పర్యాటక పరిరక్షణ సమితి (రాచప్ప) అనే సంస్థను ఏర్పాటు చేశారు. రాచకొండ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. కొన్ని దేవాలయాలను ఎంపిక చేసుకొని, నిత్య దీపారాధన, స్వయంభూ లింగేశ్వర శివలింగం వద్ద సోమవారం అన్నదానం చేస్తున్నారు. రాచకొండ చరిత్రపై ప్రచారం నిర్వహిస్తున్నారు. రాచకొండ పర్యాటక ఉత్సవాలను కూడా రాచప్ప సమితి ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు.



రాచకొండలో ప్రభాస్ సినిమా షూటింగ్

ది కోవ్ రిసార్ట్‌లో రూంల ధరలు ఇలా..

- ఈ రిసార్ట్‌లో 21 కాటేజీలు ఉన్నాయి. వీటిలో బస చేయాలంటే పర్యాటక శాఖకు చెందిన వెబ్ సైట్‌లో ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకోవాలి.
- 21 కాటేజీలను 7 రకాలుగా విభజించి అద్దెలు నిర్ణయించారు.

అద్దెకు 18 శాతం ట్యాక్స్ అదనం.

- **శేయాన్స్ రౌండ్ హౌస్:** ఇది ఒక రూమ్ మాత్రమే. ఏసీ ఉంటుంది. దీని అద్దె 15 వేలు. ఇద్దరు పెద్దలు, ఒక చిన్నవారికి (5 ఏళ్ల లోపు) మాత్రమే అవకాశం ఉంటుంది. అదనంగా ఎవరైనా ఉంటే రూ.5 వేలు చెల్లించాలి.
- **పూల్ హెవెన్ కాటేజీలు:** మూడు ఏసీ గదులు ఉంటాయి. అద్దె రూ.12 వేలు. ఇద్దరు పెద్దలు, ఒకరు చిన్న వారికి (5 ఏళ్ల లోపు) మాత్రమే అవకాశం ఉంటుంది. అదనంగా ఉండేవారికి రూ.4 వేలు చెల్లించాలి. 5 నుంచి 12 ఏళ్లలోపు వారు అయితే అదనంగా రూ.3 వేలు చెల్లించాలి.
- **గ్లాంప్ విల్లా:** రెండు ఏసీ గదులు ఉంటాయి. ధర రూ.13 వేలు. ఇద్దరు పెద్దలు, ఒకరు చిన్న వారికి అవకాశం ఉంటుంది. అదనంగా ఉంటే రూ.2,500. 5 ఏళ్ల నుంచి 12 ఏళ్లలోపు ఉన్న వారికి అదనంగా రూ.1500 చెల్లించాలి.
- **ట్విన్ బెడ్ కాటేజెస్:** ఒక రూమ్. ఏసీ ఉంటుంది. నలుగురు పెద్దవారు, ఒకరు చిన్నారి ఉండేందుకు రూ.13 వేలు చెల్లించాలి. అదనంగా ఉండే వారికి రూ.2,500. అలాగే 12 ఏళ్ల పిల్లలకు రూ.1,500 అదనంగా చెల్లించాలి.
- **ఫ్లోటింగ్ క్యాబిన్స్:** రెండు ఏసీ గదులు ఉంటాయి. రూ.8,500 చెల్లించాలి. ఇద్దరు పెద్ద వారికి, ఒక చిన్నారికి అవకాశం ఉంటుంది. అదనంగా ఉండే వారికి రూ.2 వేలు, ట్యాక్స్ వేస్తారు. 12 ఏళ్లలోపు వారికి రూ.1500, పన్ను అదనం. పై రూంలలో ఉండే సదుపాయాలు టీవీ, ఫ్రిజ్, అడ్వెంచర్ యాక్టివిటీస్, బ్రేక్‌ఫాస్ట్.
- **ఫ్లోటింగ్ క్యాబిన్స్:** ఒక రూం. నాన్ ఏసీ. రూ.7 వేలు, ట్యాక్స్ అదనం. ఇద్దరు పెద్దలు, ఒక చిన్నారికి అవకాశం ఉంటుంది. అదనంగా ఉంటే రూ.2 వేలు, ట్యాక్స్ ఉంటుంది. 12 ఏళ్లలోపు వారికి రూ.1,500, ట్యాక్స్ అదనం.
- **విల్లా బ్రాంచ్ కాటేజెస్:** మూడు ఏసీ రూంలు ఉంటాయి. ధర రూ.7,500, ట్యాక్స్ అదనం. ఇద్దరు పెద్దలు, ఒకరు చిన్నారికి అవకాశం. అదనంగా ఉంటే రూ.2 వేలు, ట్యాక్స్ చెల్లించాలి. 12 ఏళ్లలోపు వారికి రూ.1,500, ట్యాక్స్ అదనం.
- **విల్లా బ్రాంచ్ కాటేజెస్:** ఒక రూం, నాన్ ఏసీ. రూ.6 వేలు, ట్యాక్స్ అదనం. ఇద్దరు పెద్దలు, ఒక చిన్నారికి అవకాశం. అదనంగా ఉంటే రూ.2 వేలు, ట్యాక్స్ చెల్లించాలి. 12 ఏళ్లలోపు వారికి రూ.1,500, ట్యాక్స్ అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.
- **ప్రీమియం రూమ్స్:** రెండు ఏసీ రూంలు. రూ.7,500, ట్యాక్స్ అదనం. ఇద్దరు పెద్దలు, ఒకరు చిన్నారికి అవకాశం. అదనంగా ఉంటే రూ.2 వేలు, ట్యాక్స్ చెల్లించాలి. 12 ఏళ్లలోపు వారికి రూ.1,500, ట్యాక్స్ అదనం.
- **ప్రీమియం రూమ్స్:** నాలుగు రూంలు. నాన్ ఏసీ. రూ.6 వేలు, ట్యాక్స్ అదనం. ఇద్దరు పెద్దలు, ఒక చిన్నారికి అవకాశం. అదనంగా ఉంటే రూ.2 వేలు, ట్యాక్స్ చెల్లించాలి. అదనపు చిన్నవారికి 1,500, ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ రూంలల్లో అడ్వెంచర్ యాక్టివిటీస్‌తోపాటు బ్రేక్‌ఫాస్ట్ ఉంటుంది.

కాంగ్రెస్ అంటేనే రైతు నేస్తం

టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్

సాక్షి, హైదరాబాద్: రైతు సంక్షేమం కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ స్పష్టం చేశారు. పెట్టుబడి సాయం కోసం ఎకరానికి రూ.12 వేలు రైతు భరోసా ఇస్తామని సీఎం రేవంత్ చేసిన ప్రకటనతో.. కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు నేస్తం అని మరోమారు రుజువైందని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన అభిప్రాయపడ్డారు. ఇది తెలంగాణ రైతులకు పండుగ రోజని, రైతులు, రైతు కూలీలపై కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఎప్పుడూ సానుకూల అభిప్రాయం ఉంటుందని ఆ ప్రకటనలో దయాకర్ వెల్లడించారు.

అందరికీ మీరు ఆదర్శం

గోలి శ్యామలకు గవర్నర్ దత్తాత్రేయ అభినందన

సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ స్విమ్మర్ గోలి శ్యామల అన్ని వయసుల వారికి ఆదర్శంగా నిలుస్తున్నారని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రశంసించారు. శ్యామల వారం రోజులపాటు విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు దాదాపు 150 కిలోమీటర్ల దూరం బంగాళాఖాతంలో ఈదిన ఘనతను సాధించడం తెలిసిందే. ఈ సందర్భంగా ఆదివారం దత్తాత్రేయ గోలి శ్యామలకు ఫోన్ చేసి అభినందించారు. సాహస కృత్యాలకు వయసుతో సంబంధం లేదని నిరూపించారని కొనియాడారు. గతంలో రామసేతు, శ్రీలంక, లక్షద్వీప్‌ల వద్ద కూడా శ్యామల ప్రతిభను చాటారని అభినందిస్తూ.. భవిష్యత్‌లో మరిన్ని సాహస యాత్రలు కొనసాగించాలని దత్తాత్రేయ ఆకాంక్షించారు.

సర్కారు విద్యార్థులకు నైటా కెరీర్ గైడెన్స్

వివిధ ప్రభుత్వ పాఠశాలలు, అనాథ శరణాలయాలను సందర్శించిన నైటా ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: ఉన్నత చదువుల కొనసాగింపు, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడంలో నిర్లక్ష్యం చేయొద్దని న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం (నైటా) అధ్యక్షురాలు వాణి ఏనుగు సూచించారు. నైటా ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సేవ కార్యక్రమాన్ని ఇతర ప్రవాస భారతీయ ప్రముఖులతో కలిసి వాణి ప్రారంభించారు. భువనగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు, హైదరాబాద్‌లోని అనాథ పిల్లల వసతి గృహం, ఎయిడ్స్ బాధితుల పిల్లల సంరక్షణ చేపట్టే డిజైర్ సొసైటీలను నైటా ప్రతినిధి బృందం సందర్శించింది. సంకల్పం, సా మాజిక స్పృహ, సముచిత సేవ పేరుతో నైటా సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టింది.

• తొలుత భువనగిరి గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఈ బృందం విద్యార్థులకు ఉన్నత చదువులు, సాంకేతిక పట్టు అవసరాలపై అవగాహన కల్పించింది. అమెరికాలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా విద్య, సాంకేతిక జ్ఞానం పెంచుకునే మార్గాల విషయంలో వెనుకడుగు వేయొద్దని, ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని పట్టువిడవకుండా కష్టపడాలని వాణి సూచించారు. సోషల్ మీడియాలో సమయం వెచ్చించినా అది వ్యక్తిగత ప్రతిభకు పదును పెట్టేలా ఉండాలన్నారు. ప్రస్తుతం అమెరికాలో స్థిరపడినా, చిన్నతనంలో ఇలాంటి ప్రభుత్వ స్కూళ్లలోనే చదువుకున్నామని గుర్తు చేసుకున్నారు. కంప్యూటర్ విద్య, సాంకేతికతపై పట్టు పెంచుకోవాలని, అయితే ఐటీ ఆధారిత ఉద్యోగాలేకాకుండా అమెరికాలో విభిన్న రంగాల్లో మంచి భవిష్యత్ ఉందని ప్రొఫెసర్ రాజశేఖర్ అన్నారు. • భువనగిరిలోని శ్రీ వాణి విద్యాలయాన్ని కూడా ఈ బృందం సందర్శించింది. స్కూల్ పునర్ నిర్మాణం కోసం సహకారం అందిస్తామన్నారు. • తర్వాత బొల్లారంలో డిజైర్ సొసైటీని, మరికొన్ని స్కూళ్లను సందర్శించారు.





యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు శ్రీస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధికంగా శ్రీవారిని దర్శించుకునేందుకు రావడంతో.. ధర్మ దర్శనానికి 3 గంటలకు పైగా సమయం.. వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తుల రద్దీ కారణంగా ఆలయ పరిసరాలు, ప్రసాద విక్రయశాల, క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట, శ్రీసత్య నారాయణస్వామి వ్రత మండపాల్లో సందడి నెలకొంది. సుమారు 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.52,90,951 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



ఔరా ఓరియోన్!

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ అడవుల్లో అందమైన, అరుదైన గోల్డెన్ ఓరియోన్ పక్షి కనిపించింది. దీనిని తెలంగాణ ప్రాంతంలో పచ్చ పిట్ట అని, ఆంధ్రప్రదేశ్‌లో వంగపండు పక్షి అంటారు. ఈ పిట్ట పసుపు రంగులో ఉండి, రెక్కలపై నలుపు, తెలుపు రంగు చారలు ఉంటాయి. పెదవులకు లిప్‌స్టిక్, కళ్లకు కాటుక పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. కనువిందు చేస్తున్న ఈ పక్షి ఫొటోను కవ్వాల్ అడవుల్లో వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ఆదివారం తీశారు.

క్లుప్తంగా...

ఉద్యోగుల సమస్యలపై స్పందించేదెప్పుడు?

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయి శ్రీనివాస్



అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా రాష్ట్రంలోని 11 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో మీనమేషాలు లెక్కిస్తోందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఎస్టీయూ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ, 12వ పీఆర్సీ నియమించి పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.25 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్య పళ్ళంరాజు మాట్లాడుతూ, ఈహెచ్ఎస్ కార్డులు పూర్తి స్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఎస్టీయూ ఆర్థిక కార్యదర్శి నేరేడిమిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మను దర్శించుకున్న డీజీపీ



డీజీపీ ద్వారకా తిరుమలరావు కుటుంబసభ్యులను ఆశీర్వదించి అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

భీమవరం (ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ మావుళ్లమ్మ అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రసాదాలు, శేష వస్త్రం శ్రీ అమ్మవారి చిత్రపటం అందించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, అడిషనల్ ఎస్పీ భీమారావు, జనసేన ప్రొటోకాల్ చైర్మన్ తిరుమలరావు తదితరులు ఉన్నారు. అనంతరం పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర స్వామి వారిని డీజీపీ ద్వారకా తిరుమలరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుడిమల్లం ఆలయాభివృద్ధికి పురావస్తుశాఖ పరిశీలన



ఆలయాన్ని పరిశీలిస్తున్న పురావస్తుశాఖ అధికారులు

రేణిగుంట(ఏర్పేడు): తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరాలయాన్ని ఆదివారం పురావస్తు శాఖ అధికారులు పరిశీలించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపురాతన శైవక్షేత్రమైన ఈ ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను ఆలయ ప్రాంగణంలో పరిశీలించి ప్రతిపాదనలను సిద్ధం చేయనున్నట్లు పురావస్తుశాఖ సౌత్ జోన్ రీజనల్ డైరెక్టర్ ఎన్‌కే.పతాక్ తెలిపారు. ఆలయ ప్రతిష్ఠ, ప్రాశస్త్యం భక్తులకు మరింత చేరువయ్యే దిశగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు అడుగులు వేస్తున్నట్లు వివరించారు. ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి శాలువాలతో సత్కరించారు.

గుబ్బల మంగమ్మ తల్లి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు



బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలోని కాపవరం సమీపంలో అటవీ ప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలి వచ్చి మంగమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, మినీ బస్సుల్లో పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆత్మీయ నేస్తాలు.. పుంగనూరు పొట్టి దూడలు

మూడడుగుల ఎత్తుంటాయి.. చూడముచ్చటగా కనిపిస్తాయి. మార్కెట్‌లో ధర మాత్రం లక్షల్లో పలుకుతాయి. ప్రపంచంలోనే అరుదైన ఈ పుంగనూరు పొట్టి దూడలను పోటీపడి మరీ కొనుగోలు చేస్తుంటారు. అదృష్ట చిహ్నంగా భావించే ఈ దూడలను పెంచుకునేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఈక్రమంలో ఔత్సాహిక రైతులు చిట్టి 'పొట్టి' నేస్తాలను ప్రత్యేకంగా ఉత్పత్తి చేయిస్తున్నారు. అపురూప దూడలను విక్రయించి లాభాలను ఆర్జిస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఈ విశిష్ట జాతిని మరింతగా పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా పలమనేరులోని పశు పరిశోధన కేంద్రంలో పొట్టి దూడల సంరక్షణకు ఏర్పాట్లు చేశారు.



రూ.లక్షలు పలికే పుంగనూరు పొట్టి దూడలు





యజమానులపై ప్రేమ.. విశ్వాసం వీటి సొంతం
రూ.లక్షల ధర పలుకుతున్న అరుదైన జాతి
దేశవ్యాప్తంగా పెరిగిన డిమాండ్

పలమనేరు : పుంగనూరు పొట్టిరకం దూడల పేరు ఇప్పుడు దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. పుట్టిన సమయంలో ఈ దూడ కేవలం అడుగు ఎత్తు మాత్రమే ఉంటుంది. జీవితకాలంలో కేవలం మూడడుగులు మాత్రమే పెరుగుతుంది. తోక నేలను తాకేలా ఉండే ఈ రకం దూడలకు ప్రస్తుతం భలే డిమాండ్ వచ్చింది. ఫస్ట్ క్వాలిటీ రకం దూడలు రూ.2 నుంచి 4 లక్షలు పలుకుతున్నాయి. రెండో క్వాలిటీ దూడలు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు రేటుకు అమ్ముడవుతున్నాయి. ఈ దూడలు ఇంట్లో ఇంటే ఆరోగ్యంతో పాటు అదృష్టం వరిస్తుందనే మాట వినిపిస్తోంది. వీటిని కొనేందుకు వందలాదిమంది నిత్యం పశువుల సంతలు, రైతుల వద్దకు తిరుగుతున్నారు. సాధారణంగా ఇళ్లలో పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లుల జాబితాలో ఇప్పుడు పొట్టిదూడలు సైతం చేరిపోయాయి. వీటికి పేరు పెట్టి ఆ పేరుతో పిలిస్తే వెంటనే వచ్చేస్తాయి. 15 సెం.మీ నుంచి 50 సెం.మీ మాత్రమే ఎత్తు కలిగిన ఈ దూడలు ముద్దులొలుకుతుంటాయి. పొట్టి ఆవులు 85 సెం.మీ నుంచి 110 సెం.మీ ఎత్తు పెరుగుతాయి. పలమనేరు ప్రాంతంలో కొందరు రైతులు వీటిని ఫామ్స్‌లో మేపి పొట్టి జాతిని ఉత్పత్తి చేయిస్తూ వాటిని రూ.లక్షలకు విక్రయిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ పొట్టి రకం దూడల వ్యాపారం ఊపందుకోవడం విశేషం.

తక్కువ మేత.. అధిక పాల దిగుబడి

పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫామ్ వద్ద 1953లో సంకర జాతి ఆవుల ఉత్పత్తి, పరిశోధన కేంద్రం ప్రారంభమైంది. ఇది 1995 నుంచి పుంగనూరు పొట్టి రకం పశువుల ఉత్పత్తి కేంద్రంగా మారింది. మేలైన పుంగనూరు ఎద్దుల వీర్యాన్ని పుంగనూరు రకం పొట్టి ఆవులను పెంచుతున్న రైతులకు అందిస్తోంది. వీటిని మరింత ఉత్పత్తి చేసేందుకు ఆర్‌కేవీపై కృషి చేస్తోంది. ప్రస్తుతం దేశంలో ఇలాంటి పశువులు 700 దాకా ఉండగా, ఇందులో 277 వరకు పలమనేరులోని పశు పరిశోధన కేంద్రంలోనే ఉన్నాయి. ఈ పశువులు తక్కువ మేతతో ఎక్కువ వెన్నశాతం కలిగిన పాల దిగుబడినిస్తాయి. వీటి మూత్రంలో సైతం ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి.

రైతులకు అందిస్తున్నాం



పలమనేరు పరిశోధన కేంద్రంతో పాటు ఏపీ ఎల్‌డీఏ ద్వారా కూడా ఈ జాతి వీర్యాన్ని రైతులు పొందవచ్చు. ఆవు ఎదకొచ్చిన తర్వాత స్థానిక వెటర్నరీ వైద్యుడి పర్యవేక్షణలో సెమన్ అందిస్తున్నాం. పుంగనూరు పొట్టిజాతిని అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఈ వీర్యం అవసరమైన రైతులు క్యాటిల్‌ఫామ్‌లో కూడా తీసుకోవచ్చు.

– వేణు, శాస్త్రవేత్త, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, తిరుపతి

మూడేళ్లుగా పెంచుతున్నా



మూడేళ్లుగా పుంగనూరు రకం పొట్టి దూడలు పెంచుతున్నా. దేశవాళీ రకం పుంగనూరు ఆవుల ద్వారా దూడలను ఉత్పత్తి చేయిస్తున్నాం. ఈ ప్రాంతంలో చాలామంది పొట్టి దూడలు పెంచుతున్నారు. వీటికి భారీ డిమాండ్ ఉంది. ఆసక్తి ఉంటే రైతులకు ఇది ఎంతో లాభదాయకం. – మణి, రైతు, మారేడుపల్లి, గంగవరం మండలం

ఇందుకే అంత డిమాండ్

పుంగనూరు పశువులు ఆకర్షణీయంగా ఉంటాయి. ఇంటి యజమానులపై విశ్వాసం ప్రదర్శిస్తాయి. పొట్టి దూడలు ఇంట్లో తిరుగుతుంటే చాలా మంచిదని జనం నమ్ముతారు. పొట్టి ఆవులు ఇచ్చే పాలలో రోగనిరోధకశక్తి అధికంగా ఉంటుంది. ఈ పాలను సేవిస్తే అనారోగ్యం దరిచేరదని విశ్వాసం.

చిన్నోడే.. దోపిడీలో చాలా పెద్దోడు



రాప్తాడు నియోజకవర్గంలో ముఖ్యనేత కుమారుడి దందా

- పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య వర్గాల నుంచి మామూళ్లు
- రూ. 2 కోట్లు ఇవ్వాలని ఓ బిల్డర్‌కు బెదిరింపులు
- రూ. 3 కోట్లు ఇవ్వాలని ఇంకో రియల్టర్‌కు డిమాండ్
- తాము టీడీపీ వాళ్లమన్నా కుదరదని తెగేసి చెప్పిన వైనం
- బెంబేలెత్తున్న రియల్టర్లు
- రాప్తాడు నియోజకవర్గంలో పెట్టుబడులు పెట్టేందుకు వెనకడుగు
- ఇప్పటికే మట్టి, గ్రావెల్ మాటున యథేచ్ఛగా దోపిడీ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాప్తాడు నియోజకవర్గంలో ఓ ముఖ్య నేత కుమారుడు ఓ డాన్‌లా వ్యవహరిస్తూ దోపిడీ రాజ్యానికి తెరతీశాడు. రాప్తాడుకు చెందిన కీలక నేత చిన్న కుమారుడు కూటమి సర్కారు కొలువుదీరిన రోజు నుంచే పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య వర్గాలపై పడ్డాడు. ప్రతి వారినీ పిలిపించుకొని ఎంత ఇవ్వాలో చెబుతున్నాడు. ఇవ్వని వారి వ్యాపారం మూతపడినట్లే. ఎదురు తిరిగిన వారిని తొక్కుకుంటూ వెళతామని బెదిరిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని సహజ సంపద ఇతని కనుసన్నల్లో తరలిపోతోంది. ముఖ్యంగా కృష్ణంరెడ్డి పల్లి సమీపంలోని గుట్టలు కొల్లగొట్టారు. గ్రావెల్, మట్టిని వందల లోళ్ల తరలించి సొమ్ము చేసుకున్నా మైనింగ్ అధికారులు కిమ్మనలేదు. తాజాగా రియల్ ఎస్టేట్ పెట్టుబడిదారులపై వసూళ్ల దందాకు దిగారు.

డబ్బులిస్తారా.. పనులు ఆపేయాలా?

'ఇక్కడ మాదే రాజ్యం. మేము ఎంత చెబితే అంత. రూల్సు గీల్సు ఉండవు. అధికారుల నుంచి అన్ని అనుమతులున్నా మా అనుమతి ఉండాల్సిందే' అంటూ ఆయన దందా చేస్తున్నారు. అనంతపురం శివారులోని ఓ బిల్డర్ రెండు చోట్ల అపార్ట్‌మెంట్లు కట్టాడు. ఇటీవల ఆయన్ని పిలిపించి రూ.2 కోట్లు డిమాండ్ చేసినట్టు తెలిసింది. 'ఫ్లాట్‌లు అమ్ముడుపోక ఇబ్బందుల్లో ఉన్నా'నని బిల్డర్ చెప్పినా వినలేదు. డబ్బు ఇవ్వకపోతే ఫ్లాట్‌లు అమ్ముకోలేరని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. దీంతో చివరకు రూ. కోటి ముట్టజెప్పి సెటిల్ చేసుకున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అనంతపురం నగరానికి 15 కిలోమీటర్ల దూరంలోని హంపాపురం వద్ద ఐదుగురు కలిసి 9 ఎకరాల్లో విల్లాస్ కోసం వెంచర్ వేశారు. వీరిని కొన్ని రోజుల క్రితం ఇతను పిలిపించి రూ.3 కోట్లు డిమాండ్ చేసినట్టు బాధితులు వాపోయారు. మూడు దఫాలు తన మనుషులను పంపించి జేసీబీ పనులను ఆపించడంతో చివరకు వారు వచ్చి కలిశారు. 'మేం గతంలో మీ నాన్న దగ్గర పనిచేశాం. మేం కూడా టీడీపీకి చెందిన వారమే' అని వారు చెప్పుకున్నా.. 'అది అదే, ఇది ఇదే..' అనడంతో కంగుతిన్నారు. ఇప్పటివరకూ ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదని, డబ్బులు ఇవ్వలేమని చెప్పగా.. వెంటనే అతని అనుచరులు తమ వద్ద ఉన్న డైరీ తీసి 9 రిజిస్ట్రేషన్‌లు జరిగాయని, ఆ విల్లాలు కొన్న వారి పేర్లతో సహా చెప్పడంతో వారికి మతిపోయినంత పనైంది. దీన్నిబట్టి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజూ ఎక్కడెక్కడ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయనే సమాచారం ఎప్పటికప్పుడు వారికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. వారు కూడా కొంత ముట్టజెప్పడంతో శాంతించారు.

పెట్టుబడులకు వెనకడుగు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం తర్వాత పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉన్న నియోజకవర్గాల్లో రాప్తాడు ఒకటి. బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారికి సమీపంలో ఉండటంతో గతంలో పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక టీడీపీ నేత కుమారుల దెబ్బకు పెట్టుబడులు పెట్టే నాథుడే కరువయ్యాడు. వచ్చిన వారు కూడా ఆమడ దూరం పారిపోయారు. గడిచిన ఏడు నెలల్లో ఒక్క చిన్న పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 'చిన్న రేకుల షెడ్డు వేసుకుని, ఏదైనా వ్యాపారం పెట్టుకున్నా వసూళ్లకు వస్తుంటే ఇక ఇక్కడ ఎందుకు పెట్టుబడి పెట్టాలి' అని జిల్లాకు చెందిన ఓ పారిశ్రామికవేత్త వాపోయారు. దీనికితోడు నియోజకవర్గంలో ప్రత్యర్థి పార్టీ నాయకులపై దాడులు, భూ ఆక్రమణలు షరా మామూలుగా మారడంతో సామాన్యులు కూడా భయకంపితులవుతున్నారు.

అట్టహాసంగా క్యారమ్ పోటీలు ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జోసఫ్ మేయర్ (స్విట్జర్లాండ్), రఖిబుల్‌హుస్సేన్ తదితరులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా క్యారమ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 29వ ఆల్ ఇండియా ఫెడరేషన్ కప్ టోర్నమెంట్– 2025 మహిళల, పురుషుల పోటీలు నెల్లూరులో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నెల్లూరు నగరంలోని నెల్లూరు క్లబ్‌లో జరిగిన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇంటర్నేషనల్ క్యారమ్ ఫెడరేషన్ (ఐసీఎఫ్) అధ్యక్షుడు, జోసఫ్ మేయర్ (స్విట్జర్లాండ్) మాట్లాడుతూ క్రీడలు జీవితాలను మారుస్తాయన్నారు. భారతదేశంలో పలు ప్రాంతాల్లో ఈ క్రీడ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇటీవల జరిగిన ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారిణి ఖాజీమా విజేతగా నిలవడం దీనికి నిదర్శనమన్నారు. ఆల్ ఇండియా క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, అసోం ఎంపీ రఖిబుల్‌హుస్సేన్ మాట్లాడుతూ దేశంలో క్యారమ్ క్రీడను ఆడే రాష్ట్రాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందన్నారు. నెల్లూరు నగరంలో ఆల్ ఇండియా టోర్నమెంట్ జరపడం అభినందనీయమన్నారు. పురుషుల విభాగంలో వరల్డ్‌కప్ విజేతగా తెలంగాణకు చెందిన కె.శ్రీనివాస్ నిలవడం తెలుగుజాతి క్యారమ్ క్రీడలో సాధిస్తున్న ప్రగతికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా వరల్డ్ కప్ విజేతలు శ్రీనివాస్ (తెలంగాణ), ఖాజీమా (తమిళనాడు) జట్టు సభ్యులను, క్యారమ్ క్రీడలో ఏకైక అర్జున్ అవార్డు గ్రహీత ఆంథోని మరియ ఇరుదయమ్‌లను ఘనంగా సన్మానించారు.

రాయలసీమ డిక్లరేషన్‌పై స్పందించాలి


సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ. గఫూర్



కడప వైఎస్ఆర్ సర్కిల్: రాయలసీమ డిక్లరేషన్‌పై బీజేపీ ప్రజా ప్రతినిధులు స్పందించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ. గఫూర్ డిమాండ్ చేశారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా కడపలోని సీపీఎం 12వ జిల్లా మహాసభల సందర్భంగా సీతారాం ఏచూరి (అజ్మత్ ఫంక్షన్ హాల్) ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలో ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, కర్నూలుకు చెందిన పార్థసారథి, మంత్రి సత్య కుమార్ రాయలసీమ డిక్లరేషన్ అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని చెప్పారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ప్రయత్నించాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం నిధులు తేవాలని తెలిపారు. రాయలసీమ సమస్యలు పట్టించుకోకపోతే ప్రజలు క్షమించరని అన్నారు. భూస్వాములు లక్షలాది ఎకరాలను పేదలకు దక్కకుండా ఆక్రమించుకొని ఉన్నారని, వాటిపై విచారణకు ఎందుకు ఆదేశించరని నిలదీశారు. ఎటువంటి వివాదం లేని పేదల అనుభవంలో ఉన్న భూములకు ఎందుకు పట్టాలు ఇవ్వరని ప్రశ్నించారు. నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో అన్యాయం కొనసాగుతోందన్నారు. వైఎస్ మరణం తరువాత సాగునీటి ప్రాజెక్టులపై శీతకన్ను వేశారని విమర్శించారు. రూ. 1500 కోట్లు కేటాయిస్తే బ్రహ్మం సాగర్ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు. మైలవరం ఆయకట్టు 90 వేల ఎకరాలకు కేవలం 15 నుంచి 20,000 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందడంపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆర్టీసీ సేవలు అధ్వానంగా ఉన్నాయని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎన్నికల వరకు వాయిదా పడుతూనే ఉంటుందన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం టు శేషాచలం

పులుల కదలికలపై నిఘా







- శ్రీశైలం బయోల్యాబ్‌లో విశ్లేషణ ప్రక్రియ
- డేటాలోని చిత్రాలు పరిశీలన
- 45రోజుల పాటుఅడవిలో లెక్కింపు

రాజంపేట: నాగార్జునసాగర్–శ్రీశైలం అభయారణ్యంలో పులుల కారిడార్ విస్తరిస్తోంది. నల్లమల నుంచి శేషాచలం అడవుల వరకు పులుల సంచారం ఉన్నట్లు అటవీశాఖ గుర్తించిన సంగతి విధితమే. గతంలో పులులు తిరిగే ప్రాంతం గుంటూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల పరిధిలో మాత్రమే ఉండేది. ఆ మూడు జిల్లాలోని నల్లమల్ల అడవుల్లో పులులు సంచరించేవి. కొన్నేళ్లుగా ఇవి తిరిగే కారిడార్ నల్లమల్ల నుంచి వైఎస్సార్, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలో శేషాచలం అడవుల వరకు విస్తరించి ఉంది. తరుచూ నిర్వహిస్తున్న పులుల గణనలో ఈ విషయం స్పష్టమైంది. నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు (ఎన్ఎస్‌టీఆర్)వారి ఆధ్వర్యంలో పులులు గణన చేపడుతున్నారు. పులులు గణన రెండు బ్లాకులో జరుగుతోంది. నాలుగేళ్లకొకసారి చేసే గణన బ్లాక్–3లోకి వస్తుండగా , ప్రతి ఏడాది జరిపే గణన బ్లాక్–4 కిందికి వస్తుంది. ఇటీవల బ్లాక్–4లోని వార్షిక గణనలో టైగర్ కారిడార్ ప్రాంతంలో గత యేడాదిలో ఫిబ్రవరి 20 నుంచి అటవీశాఖాధికారులు గణన ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే.

ఎక్కడెక్కడా..

టైగర్ కారిడార్ నంద్యాల, గిద్దలూరు, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి డివిజన్లలో నిర్వహించారు. నంద్యాల డివిజన్‌లోని చలమరుద్రవరం (రేంజ్), గిద్దలూరులో గుండ్లకమ్మ, వైఎస్సార్ జిల్లాలో ప్రొద్దుటూరు, వనిపెంట, పోరుమామిళ్ల, బద్వేలు, సిద్ధవటం, ఒంటిమిట్ట, ముద్దనూరు, అన్నమయ్య జిల్లాలో చిట్వేలు, రాయచోటి , బాలపల్లె తిరుపతి జిల్లాలో భాకరాపేట, తిరుపతి రేంజిలోని అటవీ ప్రాంతాల్లోని సాంకేతిక డిజిటల్ కెమెరాలు అమర్చిసర్వే చేశారు. ప్రతి రెండు చదరుపు అడుగులకు రెండు కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఆయా రేంజిలలో గత యేడాది 188 లోకేషన్లకు మొత్తం 376 కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 127 కెమెరాలు అమర్చారు. 40రోజుల పాటు జరిగిన గణనలో 20 రోజులకొక సారి కెమెరాలు తీసి వాటిలోని చిత్రాలను సేకరించారు. అదే ప్రదేశాలలో మళ్లీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నట్లు అటవీవర్గాల సమాచారం. కెమెరాల్లోని డేటాను ఆయా అటవీశాఖాధికారులు శ్రీశైలంలోని టైగర్ బయోల్యాబ్‌కు పంపనున్నారు. వాటిలోని చిత్రాలను బయోల్యాబ్ ప్రతినిధులు క్షుణ్ణంగా విశ్లేషించనున్నారు. గత ఏడాది పోరుమామిళ్ల, వనిపెంట అడవుల్లో ఆరు పలులు కెమెరాలకు చిక్కినట్లుగా అటవీ అధికారుల నుంచి అందని ప్రాథమిక సమాచారం.

పెరుగుతున్న పులులు సంఖ్య

2021లో ఆరుపులులు ఉండగా, 2022లో వాటి సంఖ్య తొమ్మిదికి చేరినట్లు అటవీ వర్గాల సమాచారం. 2019లో బద్వేలు, సిద్ధవటం అటవీ ప్రాంతాల్లో కూడా పులులు ఉండేవని అప్పటి సమాచారం. ఈ సారి గణనలో అవి కెమెరాలకు చిక్కలేదు. అయితే పెనుశిల అభయారణ్యం, శేషాచలం అటవీ ప్రాంతాల వైపు వెళ్లినట్లు అటవీవర్గాలు భావిస్తున్నాయి. చిరుతలు మాత్రం కెమెరాకు చిక్కుతున్నాయి. పెనుశిల అభయారణ్యానికి సోమశిల వెనుకజలాలు అడ్డుగా ఉండటం వల్ల రాలేకున్నాయి.



పెనుశిల లక్ష్మీనరసింహ అభయారణ్యంలో చిరుత

అభయారణ్యాలు

- శేషాచలం (బయోస్ఫియర్)
- లంకామల్లేశ్వర వన్యప్రాణి అభయారణ్యం
- పెనుశిల లక్ష్మీనరసింహా అభయారణ్యం

ప్రాథమికంగా 8 నుంచి 10 పులులు సంచారం

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని టైగర్ కారిడార్ చేపట్టిన పులుల గణనలో ప్రాథమికంగా 8 నుంచి 10 లోపు పులులను అధికారులు గతంలో గుర్తించారు. వాటి సంఖ్య ఈ ఏడాది పెరిగి ఉంటుందని అటవీశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అడవుల్లో అమర్చిన విదేశీ సాంకేతిక డిజిటల్ కెమెరాల ద్వారా వాటి సంఖ్యను కొనుగొన్నారు.

- శ్రీశైలంలోని టైగర్ బయోట్యాబ్‌లో శాస్త్రవేత్తలు కెమెరాల్లో లభ్యమైన చిత్రాలపై విశ్లేషణ ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

అడవిలో చెట్లకు కెమెరాలు అమర్చాం



శేషాచలం అటవీ ప్రాంతంలో చెట్ల కెమెరాలు అమర్చాము. పులి, చిరుత కెమెరాలో పడితే వివరాలు వెల్లడిస్తాము. సర్వే జరుగుతోంది. టైగర్ కారిడార్ పరిధిలో పులల గణన జరుగుతుంది. –జగన్నాథ్‌సింగ్, జిల్లా అటవీశాఖాధికారి, రాజంపేట



పెనుశిల అభయారణ్యంలో చెట్టుకి అమర్చిన కెమెరా

సాక్షి ప్లస్
సోమవారం ॥ 6-1-2025
ట్రావెల్ ఆర్ట్ & కల్చర్

సంక్రాంతి వస్తోందంటే వాకిట రంగవల్లులు, తెల్లవారు జామున హరిదాసులు, తెల్లవారిన తర్వాత గొబ్బియల్లో పాటలు, మధ్యాహ్నానికి పతంగులు గాల్లో ఎగురుతాయి. ఇవన్నీ పండుగ రాకను సూచించే ఉల్లాసాలు. సంక్రాంతి పండుగకు ఇంతే ఉల్లాసంగా ఉత్సవాలు కూడా జరుపుకుంటాం. సంక్రాంతి పండుగకు మనదేశంలో, గుజరాత్‌లో జరిగే పతంగుల ఉత్సవం అంటే విదేశాల నుంచి కూడా పర్యాటకులు ఉరకలు వేస్తూ వస్తారు. అహ్మదాబాద్ వేదికగా జరిగే ఈ వేడుకలకు నవంబర్ నుంచే ఏర్పాట్లు మొదలవుతాయి. నగరం డిసెంబర్ నాటికే పూర్తి స్థాయిలో ముస్తాబవుతుంది.

పతంగుల పండుగ



తోకలేని గాలిపటాలు

అహ్మదాబాద్‌లో 'ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ 2025'ను ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ అహ్మదాబాద్‌లో ప్రారంభమవుతుంది. కేవాడియా, రాజ్‌కోట్, వడోదరా, శివరాజ్ పూర్, ధోర్డో, సూరత్‌లలో కూడా వేడుకలు నిర్వహిస్తారు. గాలిపటం అంటే తోక ప్రధానం, కానీ తోకలేని గాలిపటాలు కూడా ఈ వేడుకల్లో కనిపిస్తాయి. నక్షత్ర పతంగులు, చేపలు, పులుల ఆకారంలో ప్రత్యేకమైన కాన్సెప్ట్‌లతో రూపొందిన గాలిపటాలను చూడవచ్చు. దేశవిదేశాల నుంచి పర్యాటకులు ఈ ఫెస్టివల్‌కి వస్తారు. అహ్మదాబాద్, కచ్, సూరత్, సాఉతారా, రాజ్‌కోట్, పోర్‌బందర్, గాంధీధామ్, అమ్రేలి, భావ్‌నగర్‌లలో గతంలో నిర్వహించిన ఫెస్టివల్‌లో పాల్గొన్న గాలిపటాల ఫొటో గ్యాలరీ స్టాల్ కూడా ఉంటుంది. ఏకకాలంలో ఐదు వందల పతంగులు గాల్లో ఎగురుతుంటే చూడడానికి రెండు కళ్లు చాలవనే మాట చాలా చిన్నది. అహ్మదాబాద్ లో1989 నుంచి ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ జరుగుతోంది. సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించే సమయంలో ముందు ఒకటి రెండు రోజుల నుంచి తర్వాత మరో రోజు వరకు మొత్తం నాలుగు రోజులు నిర్వహిస్తారు. ఈ ఫెస్టివల్‌కి పతంగి తయారీదారులు ప్రత్యేకంగా నెల రోజుల ముందు నుంచే చేరుకుంటారు. మలేషియా, ఇండోనేషియా, యూఎస్, జపాన్, చైనా, ఇటలీ వంటి అనేక దేశాల నుంచి పతంగులు చేసే నిపుణులు, పతంగులను ఎగురవేసే ఉత్సాహవంతులు నగరానికి చేరుకుంటారు. ప్రత్యేకమైన పతంగులను తయారు చేసే పెద్ద పెద్ద కంపెనీలు కూడా వేడుకలో పాల్గొంటాయి.





కాంతులీనే పతంగులు

రంగురంగుల పతంగులను పగలంతా ఎగురవేస్తారు. వెలుగులు విరజిమ్మే తెల్లటి పతంగులను రాత్రి పూట ఎగురవేస్తారు. అవి ఆకాశంలో చంద్రుడికి పోటీగా విహరిస్తుంటాయి. ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్‌ని సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్నప్పటికీ ఇందులో మతపరమైన ధార్మిక నియమాలేవీ ఉండవు. వేడుకలో అన్ని మతాల వాళ్లూ సంతోషంగా పాల్గొంటారు. బంధువులు, స్నేహితులు కుటుంబాలతోపాటుగా కలిసి వేడుకలకు హాజరవుతుంటారు. ఇది ఊరంతా కలిసి నిర్వహించుకునే వేడుకన్నమాట. రంజాన్ సమయంలో చార్మినార్ నైట్ బజార్‌లాగ అహ్మదాబాద్ నగరంలోని పతంగిబజార్ డిసెంబర్ మూడోవారం నుంచి జనవరి రెండు వారాల వరకు మొత్తం నెలరోజుల పాటు రోజూ 24 గంటలూ తెరిచే ఉంటుంది. ఎన్నివేల పతంగులు అమ్ముడవుతాయో లెక్క అందదు. మాంజాకు గాజుపొడి అద్దే దుష్టసంప్రదాయాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈ నియమాన్ని కచ్చితంగా పాటించేటట్లు గట్టి నిఘా కూడా ఉంటుంది.

పెద్దల కేరింతలు

మన తెలుగువాళ్లు సంక్రాంతికి ప్రతి ఇంట్లో పతంగులు ఎగురవేస్తారు. హైదరాబాద్ ఆకాశం కూడా పతంగులతో కనువిందు చేస్తుంది. కానీ ఇక్కడ పిల్లలు పతంగులతో ఆనందిస్తుంటే పెద్దవాళ్లు పిల్లలను చూసి ఆనందిస్తుంటారు. ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్‌లో పెద్దవాళ్లు చిన్న పిల్లలైపోతారు. పరుగులు తీస్తూ మాంజాను జాడిస్తూ పతంగి పైకి ఎగిరే కొద్దీ కెవ్వున కేరింతలు కొడుతూ ఉంటే వాళ్లను చూసి పిల్లలు చప్పట్లు కొడుతూ ఈ వేడుకను ఎంజాయ్ చేస్తారు.

నృత్యం



శాస్త్రీయ నృత్యానికి అమితమైన ఆరాధకురాలు రామా వైద్యనాథన్. ఢిల్లీ వాసి అయిన ఈ నృత్యకారిణి భారతీయ శాస్త్రీయ కళా ప్రపంచంలో ట్రెండ్‌సెటర్‌గా నిలిచిన కళాకారులలో ఒకరు.

నా నుదుటి రాతలోనే నృత్యం ఉంది

\- రామా వైద్యనాథన్

రామా వైద్యనాథన్ గురువు సరోజ్ వైద్యనాథన్. 'నా నుదుటిరాతలోనే నాట్యం రాసి ఉంది..' అంటారు ఈ నృత్యకారిణి. యామినీ కృష్ణమూర్తి వేదికపైన నృత్యాన్ని ప్రదర్శిస్తుంటే తల్లి పొట్టలో ఉన్నప్పుడే అమితంగా స్పందించేదానినట అని గర్వంగా చెబుతారు ఈ నృత్యకారిణి. ఈ మాటలతో నాట్యంపై ఉండే మక్కువను మన కళ్లకు కడతారు.

రామా వైద్యనాథన్ తల్లికి నృత్యం అంటే ఎంతో మక్కువగా ఉండేది. బాల్యంలో వేసే రామా తొలి అడుగులే నృత్యపు అడుగులుగా మారాయి. తల్లే తన తొలి గురువుగా నృత్య అడుగులను ప్రారంభించింది. అలా ఆమె తన మొదటి మాటలను ఉచ్చరించకముందే గురువు ఎంపిక జరిగింది. తల్లి మార్గదర్శకత్వంలో రామా భరత నాట్య ప్రయాణాన్ని ప్రారంభించింది. అలా డ్యాన్స్ స్టూడియో ఆమెకు రెండవ ఇల్లుగా మారింది. తన నైపుణ్యంతో తల్లి రామాను అద్భుతమైన నర్తకిగా తీర్చిదిద్దింది.

ఎదిరిస్తూ నిలుస్తూ..

పశ్చిమ ఢిల్లీలో నివసిస్తూ, డ్యాన్స్ క్లాసుల కోసం సెంట్రల్ ఢిల్లీలోని చాణక్యపురికి చేరుకోవడం అంటే సంక్లిష్టమైన ప్రయాణాన్ని కొనసాగించడమే. ఆ రోజుల్లో వాహన సదుపాయం లేకపోవడంతో రామా, ఆమె తల్లి ప్రతి రోజూ సవాల్‌ను ఎదుర్కొనేవారు. ఇంటి నుంచి నృత్య అకాడమీకి చేరుకోవడానికి రోజూ రెండు మూడు బస్సులు, రిక్షాలు మారుతూ ప్రయాణించేవారు. యువ నర్తకిగా రామా ప్రదర్శనలు సంప్రదాయం, ఆవిష్కరణల సామరస్య సమ్మేళనానికి నిదర్శనగా మారాయి. సామాజిక కుల అడ్డంకులను తొలగించిన నృత్యకారిణిగా కూడా రామా తన విశిష్టతను ప్రదర్శించింది. ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకోవడానికి నృత్యం, కులం అడ్డంకులుగా నిలిచాయి. నర్తకితో తన కుమారుడి వివాహం కుల హద్దులు దాటిందని అత్తగారు, ఆమె బంధుగణం అడ్డంకిగా నిలిచింది. ఆమె దృష్టిలో నృత్యం దైవిక భాష. కళాకారులందరిదీ ఒకే 'కులం'గా ఐక్యపరిచింది. సామాజిక అడ్డంకులను ఎదిరించడంలోనే కాదు, దేశ విదేశాల్లో వేలాది ప్రదర్శనలు ఇస్తూ భారతీయ ప్రముఖ నృత్యకారిణిగా నిలిచింది.

ఆర్ట్

ఆ నగరాల వీధులు కళాఖండాలకు వేదికలు

పబ్లిక్ స్పేస్‌లకు స్ట్రీట్ ఆర్ట్ కొత్త జీవనాన్ని తీసుకువస్తోంది. భారతదేశంలోని నగరాల్లో శక్తివంతమైన కుడ్యచిత్రాల నుండి చమత్కారమైన గ్రాఫిటీల వరకు ప్రతి మూలను ఒక కళాఖండంగా మార్చేస్తున్నాయి.

చిత్రకళ అనగానే ఫ్రేమ్డ్ పెయింటింగ్‌లు లేదా మ్యూజియంల నిశ్శబ్ద మూలల్లో ఉంచిన కుడ్యచిత్రాల గురించి మాత్రమే కాదు. ఈ రోజుల్లో ఇది సాంప్రదాయ సరిహద్దుల నుండి విముక్తి పొందింది. అన్ని వర్గాల ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని సృష్టిస్తోంది. అత్యంత శక్తివంతమైన స్ట్రీట్ ఆర్ట్ దృశ్యాలను కలిగి ఉన్న నగరాలు ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి.





న్యూఢిల్లీ లోధి ఆర్ట్ డిస్ట్రిక్ట్‌ను దాటి షికారు చేస్తే దాదాపు ప్రతి గోడపై చిత్రీకరించిన ఆలోచనాత్మక, నాటకీయ కళాకృతులు మనల్ని ఆకర్షిస్తాయి. స్ట్రీట్ ఆర్ట్ ఇండియా వంటి సంస్థలు దేశ వ్యాప్తంగా, ప్రత్యేకించి రాజధానిలో అనేక ముఖ్యమైన మూలలను మార్చడానికి గణనీయమైన కృషి చేశాయి. లోధి కాలనీ, హౌజ్ ఖాస్, ఖాన్ మార్కెట్, కన్నాట్ ప్లేస్, షాపూర్ జాట్ వీధులు, గోవింద్ పురి, అర్జన్ ఘర్, నెహ్రూ ప్లేస్ వంటి మెట్రో స్టేషన్‌లలో గోడలు క్లిష్టమైన గ్రాఫిటీతో పునరుద్ధరించబడ్డాయి.

కొచ్చి: కుడ్యచిత్రాలు, గ్రాఫిటీలతో గోడలు కొచ్చిలో చిందులు వేస్తున్నట్టు ఉంటాయి. బాబ్ మార్లే, మోనాలిసా చేగువేరా, బ్యాంక్సీ తరహా చిత్రాల నుండి ప్రసిద్ధ స్థానికులు, సూపర్ స్టార్‌ల ముఖాల వరకు, ఫోర్ట్ కొచ్చి సృజనాత్మకతతో ఉంది.

చెన్నై: వెలసిన గోడల నుండి శక్తివంతమైన కళాకృతులతో చెన్నై అద్భుతమైన మార్పుకు గురైంది. కేథడ్రల్ రోడ్, కన్నగి నగర్, ఎగ్మోర్ స్టేషన్, హారింగ్టన్ రోడ్‌లలో స్ప్రే చేసిన రంగుల నగర మ్యాప్‌లను కనుక్కుంటారు.

గోవా: గోవా ఇప్పటికే స్థానికులను, ప్రయాణికులను ఒకేలా ఆకర్షిస్తుంది. ఇక వైవిధ్యమైన గ్రాఫిటీతో అక్కడి గోడలు ప్రత్యేక ఆకర్షణను జోడిస్తున్నాయి. పంజిమ్, మార్గోవ్, బార్ హోపింగ్, బీచ్ లాంగింగ్ లలో గోవా జీవితం, సంస్కృతి వైబ్రెంట్ స్ట్రీట్ ఆర్ట్‌తో అందంగా తీర్చిదిద్దారు.

కశ్మీర్ టూర్

మంచు తోటలో ఆటలు



కశ్మీర్ టూర్‌కి వేసవి సరైన సమయం అనుకుంటాం. కానీ స్నో గేమ్స్ ఆడాలంటే శీతాకాలంలోనే వెళ్లాలి. డిసెంబర్ నుంచి మార్చి వరకు కశ్మీర్ గడ్డకట్టిపోతుంది. శ్రీనగర్‌లోని దాల్ సరస్సు కూడా మంచు ఘనీభవించడంతో ప్లే గ్రౌండ్‌గా మారిపోతుంది. ఎండాకాలంలో శికార్ రైడ్‌లతో అలరించిన దాల్ లేక్ శీతాకాలంలో స్కేటింగ్ రింక్‌గా మారుతుంది. గుల్‌మార్గ్, పహల్‌గావ్‌లలో గడ్డకట్టిన నదులు స్నో స్కీయింగ్‌కి అనువైన ప్రదేశాలు. ఇంకా స్నో స్లెడ్జింగ్, ఐస్ హాకీలు కూడా ఆడుకోవచ్చు. కశ్మీర్ వాసులకు ఐస్ స్కేటింగ్, ఐస్ స్కీయింగ్ ఆటలు బ్రిటిష్ పాలన కాలంలో పరిచయమయ్యాయి. బ్రిటిష్ ఆర్మీ ఆఫీసర్ మేజర్ మెట్‌కార్ఫ్, మేజర్ హాడోలు 1927లో ఇక్కడ స్కీ క్లబ్ స్థాపించారు. వారి ఆహ్లాదం కోసం మొదలైన ఈ ఆటల పరంపర కశ్మీర్ టూరిజానికి కూడా ఉపయోగపడుతోంది.

చుట్టూ మంచు టోపీలు పెట్టుకున్న పర్వతసానువులు, చెట్లు కూడా తెల్లదనంతో ఘనీభవించి సూర్యుడి కిరణాల కోసం ఎదురు చూస్తుంటాయి. 18 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన దాల్ లేక్‌ని కశ్మీర్ కిరీటంలో ఆణిముత్యంగా చెబుతారు. వీలయితే ఈ నెలలో గుల్‌మార్గ్‌లో జరిగే స్నో ఫెస్టివల్‌కు వెళ్లేలా ప్లాన్ చేసుకోవచ్చు.

మధుర పర్యాటకం

తమిళనాడు టూరిజమ్ డిపార్ట్‌మెంట్ సంక్రాంతి (పొంగల్) సందర్భంగా ఈ నెల 16, 17 తేదీల్లో కల్చరల్‌టూర్ నిర్వహిస్తోంది. మధురై కేంద్రంగా నిర్వహిస్తున్న ఈ వేడుకలకు స్థానికులతోపాటు విదేశీయులు, విదేశాల్లో నివసిస్తున్న తమిళులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. ఈ వేడుకల్లో స్థానికులు తమిళ సంప్రదాయ ఆహ్వానం పలుకుతారు. గ్రామాన్ని తలపించే తాటాకు ఇళ్లు, సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు, మగవాళ్లు, పిల్లలు అలరిస్తారు. రోట్లో గింజలు పోసి రోకలితో దంచుతూ కనిపిస్తారు. మట్టి నేల మీద రంగురంగుల ముగ్గులతో రంగవల్లులు దిద్ది, ఇటుకలతో పొయ్యి పెట్టి కొత్త కుండకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి మహిళలు తలంటుకుని, చక్కగా పూలు పెట్టుకుని, పట్టు చీరలు కట్టుకుని పొంగలి వండుతారు. చేతులు జోడించిన మహిళ విగ్రహాలు పర్యాటకులకు ఆహ్వానం పలుకుతుంటాయి. ఈ దృశ్యాలకు నేపథ్యంలో దేవతల భారీ విగ్రహాలు ఊరిని కాపలా కాస్తున్నట్లుంటాయి. దక్షిణ భారత సంప్రదాయానికి నిలువుటద్దం ఈ వేడుకలు. సాంస్కృతిక పర్యటన పూర్తయిన తర్వాత మధురై మీనాక్షి అమ్మవారిని దర్శించుకుంటే పర్యటనకు పరిపూర్ణత వస్తుంది. అర్జున్ సినిమాలో అమ్మవారి ఆలయం సెట్టింగ్ చూశాం. అసలైన ఆలయాన్ని కనులారా వీక్షించవచ్చు. మధురై ఆలయంలోకి కెమెరాలు, సెల్‌ఫోన్‌లను అనుమతించరు.



సంస్కృతి

గిరి 'గడబ'

ప్రకృతితో మమేకం

ఆధునిక ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న గిరిజన తెగ 'గడబ' ఇప్పుడిప్పుడే తన రూపు మార్చుకుంటోంది. అయితే, వీరి అరుదైన సంస్కృతి అంతరించిపోకుండా కాపాడుకుంటోంది.

ప్రాచీన కాలం నుంచి ఈ తెగ గోదావరి పరివాహక ప్రాంతానికి దాపుగా ఉంటోంది. 'గ' అంటే గొప్పతనం అని, 'డ' అంటే నీటికి సూచిక అని అర్థం. 'గడ' అంటే గొప్పదైనా నీరు అని, గోదావరి అనే పేరు ఉంది. ఒరియాలో 'గడబ' అంటే సహనం గలవాడు అని అర్థం. గడబ తెగలు ఒరిస్సా వింధ్య పర్వత ప్రాంతాల్లో స్థిరపడ్డాయి. మధ్యప్రదేశ్‌లోనూ ఈ తెగ ఉంది. ఈ తెగను భాష గుటబ్! వీరిలో అక్షరాస్యులు, నిరక్షరాస్యులూ ఉన్నారు. మన రాష్ట్రంలో గడబలు విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల్లో ప్రముఖంగా కనిపిస్తారు.

అటవీ ఉత్పత్తులే ఆధారంగా!

వీరు గడ్డి, మట్టి, కలపను ఉపయోగించి ఇండ్లను నిర్మించుకుంటారు. ఈ గుడెసెలు త్రికోణాకారంలోనూ, మరికొన్నింటికి కింది భాగం గుండ్రంగా ఉండి పైకప్పు కోన్ ఆకారంలో ఉంటుంది. మహిళలు కుట్టని రెండు వస్త్రాల ముక్కలను ధరిస్తారు. అలాగే, రెండు వలయాలుగా ఉండే నెక్‌పీస్‌ను ధరిస్తారు. వీటిలో అల్యూమినియమ్, వెండి లోహం ప్రధానమైంది. తృణధాన్యాలు, వరి పండిస్తారు. అటవీ ఉత్పత్తుల మీద ఆధారపడే వీరంతా సహజ పద్ధతుల్లో తయారుచేసుకున్న సారాయి, కల్లు పానీయాలను సేవిస్తారు.

థింసా నృత్యం

మహిళలు అర్ధచంద్రాకారంలో నిలబడి, ఒకరి మీద ఒకరు చేతులు వేసి, ఒక వైపుకు లయబద్ధంగా కాళ్లు కదుపుతూ నృత్యం చేస్తారు. వీరు నృత్యం చేస్తున్నప్పుడు పురుషులు సంగీతవాయిద్యాలను వాయిస్తారు. ఈ థింసా నృత్యం ఆధునిక ప్రపంచాన్ని విశేషంగా ఆకట్టుకుంటుంది.


సులువైన జీవనం

ఇంటిపేర్లను బట్టి వావివరసలను లెక్కించుకుంటారు. మేనబావ, మేనమరదలు వరసలు గలవారు వీరిలో ఎక్కువగా పెళ్లి చేసుకుంటారు. పెళ్లి వద్దని అమ్మాయి అనుకుంటే కుల పెద్దలతో పంచాయితీ నిర్వహించి వారి సమక్షంలో ఓలి ఖర్చు పెట్టుకుంటే చాలు విడిపోవచ్చు. అబ్బాయి కూడా ఇదే పద్ధతి పాటిస్తాడు.

అన్నీ చిన్న కుటుంబాలే!

గడబలో ఎక్కువగా చిన్నకుటుంబాలే. వీరికి ఇటికుల, కొత్త అమావాస్య, తొలకరి, కులదేవత పండగలు ప్రధానమైనవి. వీరిని గద్బా అని మధ్య ప్రదేశ్‌లో, గడబాస్ అని ఆంధ్రప్రదేశ్‌లో పేరుంది.





నాణ్యత అనేది హఠాత్తుగా సంభవించేది కాదు...
అది అందరి కృషి వల్ల వచ్చే ఫలితం..
- జాన్ రస్కిన్, ప్రముఖ అమెరికన్ రచయిత

వేగంగా పెరుగుతున్న విదేశీ పెట్టుబడులు

- ఇన్వెస్టర్లను ఆకర్షిస్తున్న భారత మార్కెట్
- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ: దేశంలోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో గణనీయమైన పెరుగుదల ఉన్నట్టు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. భారత్‌ను పెట్టుబడులకు గొప్ప కేంద్రంగా మధ్య ప్రాచ్యం, జపాన్, ఐరోపా యూనియన్ (ఈయూ), యూఎస్ గుర్తిస్తున్నట్టు చెప్పారు. ఇది లక్షలాది కొత్త ఉద్యోగాలకు దారితీస్తున్నట్టు తెలిపారు. వేగవంతమైన ఆర్థిక వృద్ధి ఇందుకు మద్దతుగా నిలుస్తున్నట్టు పేర్కొన్నారు. దేశీ మార్కెట్ బలంగా ఉండడం, నైపుణ్య, మేధో వనరుల లభ్యత, చట్టాలకు కట్టుబడి ఉండడం, స్పష్టమైన నియంత్రణలు సానుకూల వ్యాపార వాతావరణం, వ్యాపార సులభ నిర్వహణకు వీలైన ప్రగతిశీల విధానాలు.. అంతర్జాతీయ ఇన్వెస్టర్లను ఆకర్షిస్తున్నట్టు మంత్రి గోయల్ చెప్పారు. ''ప్రపంచంలోనే ఒకానొక పెద్ద ఫండ్ నిర్వహణ సంస్థ సీఈవోతో గత నెలలో యూఎస్‌లో భేటీ అయ్యాను. అదే సంస్థ భారత్‌లోనూ భారీ పెట్టుబడులు కలిగి ఉంది. గడిచిన పదేళ్ల కాలంలో భారత్‌లోని తమ పెట్టుబడులు తమ ఫండ్స్ చేసిన పెట్టుబడుల్లో అత్యుత్తమ పనితీరు చూపించినట్టు నాతో పంచుకున్నారు. గత 20 ఏళ్ల నుంచి భారత్‌లో ఇన్వెస్టర్లుగా ఉన్నప్పటికీ, 80 శాతం పెట్టుబడులు ఇటీవలి సంవత్సరాల్లోనే పెట్టినట్టు చెప్పారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టి 20 ఏళ్ల అయిన సందర్భాన్ని పురస్కరించుకుని, భారత్‌కు వచ్చి మరో విడత పెట్టుబడుల ప్రణాళికలను ప్రకటించనున్నట్టు ప్రకటించారు'' అని గోయల్ తను అనుభవాలను వెల్లడించారు. భారత స్టాక్ మార్కెట్ చక్కని పనితీరు భారీగా ఫ్‌ఐఐ పెట్టుబడులను ఆకర్షిస్తున్నట్టు చెప్పారు.

ప్రతి నెలా రూ.38వేల కోట్లు..

అంతర్జాతీయంగా ఎన్నో సవాళ్లు నెలకొన్నప్పటికీ ప్రతి నెలా సగటున 4.5 బిలియన్ డాలర్ల (రూ.38,000 కోట్లు) ఎఫ్‌డీఐలు గడిచిన ఏడాది కాలంగా భారత్‌లోకి వస్తుండడం గమనార్హం. గతేడాది జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య ఎఫ్‌డీఐ 42 శాతం పెరిగి 42 బిలియన్ డాలర్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబర్)నూ ఎఫ్‌డీఐలు 45 శాతం పెరిగి 29.79 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 71.28 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐని భారత్ ఆకర్షించింది. సేవల రంగాలు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, టెలికం, ట్రేడింగ్, నిర్మాణం, ఆటోమొబైల్, కెమికల్స్, ఫార్మాస్యూటికల్స్ రంగాలు ఎక్కువ ఎఫ్‌డీఐలను రాబడుతున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)


6-1-2025

విశాఖ	510-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	475-00
వరంగల్	477-00
రిటైల్ ధర	5.35

క్యూ3 ఫలితాలే దిక్సూచి

ఈ వారం మార్కెట్ల ట్రెండ్‌పై అంచనాలు

- టీసీఎస్, టాటా ఎలక్సీ రెడీ
- పారిశ్రామికోత్పత్తి గణాంకాలు కీలకం
- విదేశీ అంశాలకూ ప్రాధాన్యం



ముంబై: దేశీ స్టాక్ మార్కెట్లను ఈ వారం ప్రధానంగా కార్పొరేట్ ఫలితాలు నడిపించనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సర(2024-25) మూడో త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభంకానుంది. దీనికితోడు పారిశ్రామికోత్పత్తి గణాంకాలు సైతం విడుదలకానున్నాయి. దీంతో ఇన్వెస్టర్లు అక్టోబర్-డిసెంబర్(క్యూ3) ఫలితాలు, ఆర్థిక గణాంకాలపై దృష్టి పెట్టనున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ఇవికాకుండా ప్రపంచ రాజకీయ, భౌగోళిక అంశాలకూ ప్రాధాన్యత ఉన్నట్లు తెలియజేశారు. వివరాలు చూద్దాం..

9న షురూ

సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టీసీఎస్‌తోపాటు టాటా గ్రూప్ కంపెనీ టాటా ఎలక్సీ, ఫైనాన్షియల్ పీఎస్‌యూ ఇండియన్ రెనెవబుల్ ఎనర్జీ(ఇరెడా) గురువారం(9న) క్యూ3 పనితీరును వెల్లడించనున్నాయి. తద్వారా ఫలితాల సీజన్‌కు శ్రీకారం చుట్టనున్నాయి. ఇటీవలే స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన ఫిన్‌టెక్ సంస్థ వన్ మొబిక్విక్ సిస్టమ్స్ మంగళవారం తొలిసారి త్రైమాసిక ఫలితాలు ప్రకటించనుంది. టీసీఎస్ పటిష్ట పనితీరు సాధిస్తే ఇటీవల అమ్మకాల బాటలో సాగుతున్న విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులవైపు దృష్టి పెట్టవచ్చని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు.

దేశీ అంశాలు

వారాంతాన(10న) ప్రభుత్వం నవంబర్ నెలకు పారిశ్రామికోత్పత్తి ఇండెక్స్(ఐఐపీ) గణాంకాలు వెల్లడించనుంది. అక్టోబర్‌లో ఐఐపీ వార్షికంగా 3.5 శాతం పుంజుకుంది. అంతేకాకుండా డిసెంబర్ నెలకు హెచ్‌ఎస్‌బీసీ సర్వీసెస్ పీఎంఐ గణాంకాలు విడుదలకానున్నాయి. వచ్చే నెల మొదట్లో కేంద్ర ప్రభుత్వం సార్వత్రిక బడ్జెట్‌ను ప్రకటించనుంది. దీంతో ఇన్వెస్టర్లు బడ్జెట్ ప్రతిపాదలపైనా దృష్టి పెట్టనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ ప్రవేశ్ గౌర్ అభిప్రాయపడ్డారు.

ఎఫ్‌పీఐలు వెనక్కి

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) కొత్త ఏడాది తొలి మూడు(1-3) ట్రేడింగ్ రోజుల్లో నికర అమ్మకందారులుగా నిలిచారు. వెరసి రూ. 4,285 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అయితే డిసెంబర్‌లో తొలుత అమ్మకాలకే పరిమితమైనప్పటికీ చివరి రెండు వారాల్లో పెట్టుబడులకు ఆసక్తి చూపిన సంగతి తెలిసిందే. వెరసి గత నెలలో నికరంగా రూ. 15,446 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు. యూఎస్ బాండ్ల ఈల్డ్స్ ఆకర్షణీయంగా మారడం, డాలరు బలపడటంతో ఎఫ్‌పీఐలు అమ్మకాలకే కట్టుబడవచ్చని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ అభిప్రాయపడ్డారు.

ట్రంప్ ఎఫెక్ట్

ఈ నెల మూడో వారంలో రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో గత వారాంతాన ముడిచమురు ధరలు బలపడ్డాయి. బ్రెంట్ బ్యారల్ 75 డాలర్లను తాకింది. మరోపక్క డాలరుతో మారకంలో రూపాయి సరికొత్త కనిష్టం 85.79కు చేరింది. ఇక ఫెడ్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) గత పాలసీ నిర్ణయాలకు సంబంధించిన వివరాలు(మినిట్స్) 9న వెల్లడికానున్నాయి. ఈ అంశాలు సైతం సెంటిమెంటును ప్రభావితం చేయగలవని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ అంచనా వేశారు. కాగా.. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు దేశీ స్టాక్స్‌లో అమ్మకాలకే మొగ్గు చూపుతున్నారు. అయితే దేశీ ఫండ్స్ భారీ స్థాయిలో ఇన్వెస్ట్ చేస్తున్నాయి. ఈ అంశాలన్నీ ట్రెండ్ నిర్ణయంలో కీలకంగా నిలవనున్నట్లు మెహతా ఈక్విటీస్ రీసెర్చ్ సీనియర్ వీపీ ప్రశాంత్ తాప్సే తెలియజేశారు.

గత వారమిలా

శుక్రవారం(3)తో ముగిసిన గత వారం తీవ్ర ఆటుపోట్ల మధ్య మార్కెట్లు బలపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ నికరంగా 524 పాయింట్లు(0.7 శాతం) పుంజుకుని 79,223 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 191 పాయింట్లు(0.8 శాతం) ఎగసి 24,000 పాయింట్లకు ఎగువన 24,005 వద్ద నిలిచింది. ఈ బాటలో బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.3 శాతం , స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2 శాతం జంప్‌చేసింది.

మానసిక ఆరోగ్యానికీ బీమా ధీమా



విక్రాస్ శర్మ
చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్, స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్

ప్రస్తుతం మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడమనేది శారీరక ఆరోగ్యాన్ని చూసుకోవాల్సినంతగా ముఖ్యమైన అంశంగా ఉంటోంది. ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలపై అవగాహన పెరుగుతుండటంతో వీటిని సైతం ఇప్పుడు తీవ్రమైన ఆరోగ్య సమస్యలుగా గుర్తిస్తున్నారు. అయితే, అవసరమైన సహాయాన్ని పొందడానికి ఆర్థిక సమస్యలు అడ్డంకిగా ఉంటున్నాయి.

ఆరోగ్య బీమా సంస్థలు తమ పథకాల్లో మానసిక ఆరోగ్య కవరేజీని చేర్చడం ప్రారంభించాయి. దీనితో కౌన్సిలింగ్, థెరపీ మరియు ప్రివెంటివ్ కేర్ వంటి ముఖ్యమైన సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. దీర్ఘ కాలంలో ప్రజల శారీరక, మానసిక ఆరోగ్యానికి సహాయకరంగా ఉంటున్నాయి.

ఆరోగ్య బీమా పాలసీల్లో చూసుకోవాల్సిన కవరేజీలు, ప్రయోజనాలు ..

ఆరోగ్య బీమా ప్లాన్ను ఎంపిక చేసుకునేటప్పుడు, అది అందించే కవరేజీ, ప్రయోజనాల గురించి ఆలోచించడం చాలా ముఖ్యం. అలా పరిశీలించతగిన కొన్ని ముఖ్యాంశాలు ఏమిటంటే:

సమగ్ర కవరేజీ: కౌన్సిలింగ్, థెరపీ సెషన్లు వంటి మానసిక ఆరోగ్య సేవలను కవర్ చేసేవిగా పథకాలు ఉండాలి. సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులను కలిసే అవకాశాన్ని కల్పించాలి. టెలిమెడిసిన్ వంటి సౌకర్యాలు కూడా ఉండాలి. దీంతో దూర ప్రాంతాలలో ఉన్నవారు కూడా డాక్టర్లతో ఆన్‌లైన్‌లో సంప్రదించేందుకు వీలవుతుంది. అదనంగా, ఔట్‌పేషంట్ డిపార్ట్‌మెంట్ (ఓపీడీ) కవరేజీ ఉంటే ఆసుపత్రిలో చేరే అవసరం లేకుండా డాక్టర్ను సందర్శించవచ్చు, ఇది సమయంతో పాటు డబ్బును కూడా ఆదా చేస్తుంది.

వెల్‌నెస్ ప్రోగ్రాంలు: అనేక బీమా కంపెనీలు ఇప్పుడు తమ పథకాలలో వెల్‌నెస్ ప్రోగ్రాంలను చేరుస్తున్నాయి. ఇవి మైండ్‌ఫుల్‌నెస్ సెషన్లు, ఒత్తిడిని అధిగమించేందుకు వర్క్‌షాప్‌లు నిర్వహించడం లేదా ఫిట్నెస్‌పరమైన ప్రోత్సాహకాలను అందించడం ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపర్చేవిగా ఉంటున్నాయి. ఉచిత యోగా తరగతులు, జిమ్ మెంబర్‌షిప్‌లు లేదా వెల్‌నెస్ యాప్‌లకు యాక్సెస్ వంటి ప్రయోజనాలను కూడా కొన్ని పథకాలు అందిస్తున్నాయి.

హోమ్ హెల్త్‌కేర్ సేవలు: దీర్ఘకాలిక సమస్యలు లేదా మానసిక ఆరోగ్య సమస్యలతో పోరాడుతున్నవారికి క్లినిక్‌లకు ప్రయాణించడం కష్టంగా ఉంటుంది. అలాంటి వారికి హోమ్ హెల్త్‌కేర్ ప్రయోజనాలు ఉన్న పాలసీలు ఉపయోగకరంగా ఉంటాయి. ఇంటి వద్దే సంరక్షణ సేవలను సౌకర్యవంతంగా అందుకునేందుకు ఈ పాలసీలు సహాయపడతాయి.

ఇన్సెంటివ్‌లు, రివార్డులు: కొన్ని బీమా పథకాలు ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహిస్తూ రివార్డులు అందిస్తాయి. ఉదాహరణకు, మీరు రెగ్యులర్ హెల్త్ చెక్-అప్స్ చేయడం లేదా ఫిట్నెస్ లక్ష్యాలను చేరుకోవడం ద్వారా రెన్యువల్‌పై డిస్కౌంట్ పొందవచ్చు. కొన్ని పథకాలు వాకింగ్ లేదా వ్యాయామం మొదలైన వాటికి పాయింట్లు అందిస్తాయి. వీటిని తరువాత రిడీమ్ చేసుకోవచ్చు.

ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించేందుకు తోడ్పడే వెల్నెస్ ప్రోగ్రాంలు, ప్రివెంటివ్ కేర్‌లాంటివి అందించే పాలసీలను ఎంచుకోవాలి. డిస్కౌంట్లు, రివార్డులు మొదలైనవి ఇచ్చే పాలసీల వల్ల బీమా వ్యయం తగ్గడంతో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లు కూడా అలవడతాయి. డబ్బూ ఆదా అవుతుంది. ఇక టెలిమెడిసిన్, హోమ్ హెల్త్ కేర్ ఫీచర్లు సత్వరం సేవలను పొందడాన్ని సులభతరం చేస్తాయి.

మానసిక ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడనేది మరింత పెద్ద సమస్యలకు దారితీయొచ్చు. చికిత్స చేయకపోవడం వల్ల పలు రకాల పరిస్థితులు రోజువారీ జీవితానికి అడ్డంకులుగా మారతాయి. సంబంధాలను నాశనం చేస్తాయి. అలాగే, ఇతర ఆరోగ్య సమస్యలను మరింత తీవ్రం చేస్తాయి. డాక్టర్లను పదే పదే కలవాల్సి రావడం వల్ల, అలాగే ఎమర్జెన్సీ కవరేజీ అవసరాల వల్ల ఆర్థికంగా కూడా ఇది మరిన్ని ఖర్చులకు దారితీస్తుంది. కాబట్టి తగినంత కవరేజీ ఉండే పాలసీని ఎంచుకోవడం వల్ల భావోద్వేగాలపరంగానూ, ఆర్థికంగాను సవాళ్లను అధిగమించేందుకు సహాయకరంగా ఉంటుంది.

హోండా అమ్మకాలు 58.01 లక్షల యూనిట్లు



న్యూఢిల్లీ: హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్‌ఎంఎస్‌ఐ) హోల్‌సేల్ అమ్మకాలు 2024లో 32% పెరిగి 58.01 లక్షల యూనిట్లకు చేరుకున్నాయి. ఇందులో దేశీయంగా విక్రయాలు 52.92 లక్షల యూనిట్లు, ఇతర దేశాల ఎగుమతులు 5.08 లక్షల యూనిట్లు ఉన్నాయని కంపెనీ తెలిపింది. డిసెంబర్‌లో కంపెనీ మొత్తం 3,08,083 వాహనాలను విక్రయించింది. ఇందులో దేశీయ వాటా 2,70,919 యూనిట్లు.

తాళి కట్టు శుభవేళ..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

అందరికీ ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఇక ఈ వారం విషయంలోకి వెళ్తే.. తాళి కట్టు శుభవేళ.. అంతా మంచే జరగాలని కోరుకుంటాం. వధూవరులను ఆశీర్వదిస్తాం. అంతా మంగళప్రదంగా జరగాలని.. కలకాలం కొత్త జంట చల్లగా ఉండాలని కోరుకుంటాం. పెళ్లి సందర్భంలో వధూవరులకు వచ్చే బహుమతులపై పన్ను భారం లేదు. అటువంటి వాటిని ఆదాయంగా పరిగణించరు. ఇప్పుడు ముందు రిసెప్షన్.. తర్వాత పెళ్లి... కాబోయే జంట పందిరిలో నిలబడటం.. మిగతా అందరూ లైన్లో వెళ్లి, వారికి బహుమతులివ్వడం .. తాళి కట్టిన తర్వాత కూడా కొందరు ఇస్తారు. ఏది ఏమైనా సందర్భం 'పెళ్లి' ఒక రోజు అటూ ఇటూ.. పెళ్లి పేరు చెప్పి ఎప్పుడు ఇచ్చినా ఏ ఇబ్బందీ లేదు.

ఎటువంటి బహుమతులు ఇవ్వొచ్చు ...

నగదు ఇవ్వొచ్చు. దగ్గరి బంధువైతే ఎటువంటి ఆంక్షలు లేవు. బీరకాయ .. బెండకాయ సంబంధం కాదండి. బాదరాయణ సంబంధమూ కాదు. చట్టంలో పొందుపర్చిన నిర్వచనాన్ని గుర్తు పెట్టుకోండి. అలా అని రూ. 2,00,000 దాటకండి. పేటీఎంలు, గూగుల్ పేమెంట్లు, చెక్కులు, డీడీలు, ఆర్టీజీఎస్, బదిలీలు, నగ, నట్రా, వెండి, బంగారం, ఆభరణాలు, కుక్కర్లు, వంట సామగ్రి, టీవీలు, ఫ్రిజ్జులు, భూములు, ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్లు, స్థిరాస్తి, షేర్లు, బాండ్లు.. ఎలాగైనా మీ ప్రేమ, అభిమానాన్ని ప్రకటించుకోండి. పుచ్చుకున్న వారికి ఆదాయంగా పరిగణించరు. పన్నుభారం పడదు. పన్ను చెల్లించనక్కర్లేదు. అయితే, కొన్ని ముఖ్యమైన విషయాలు గుర్తుంచుకోవాలి.

- వధూవరులకు వచ్చే వాటికి మినహాయింపు ఉంది లేదా ఆదాయంగా పరిగణించరు.
- అత్తగారి లాంఛనం, ఆడపడుచు కట్నం మొదలైన వాటి మీద ఎటువంటి మినహాయింపు లేదు. కొన్ని పెళ్లిళ్లలో ఈ లాంఛనాలు భారీగా ఉంటాయి. తస్మాత్ జాగ్రత్త.
- పూర్వకాలంలో పురోహితుడు నలుగురికి వినపడేలా అరిచేవారు. ఫలానా వారింత కట్నం అని.. కొంత మంది తమ పేరు నలుగురికి వినబడేలా చదివించుకునే వారు.. వారికదో 'తుత్తి'.
- ఇప్పుడు బాహాటంగా చదివింపులు లేవు. కవర్లో ఎంతో కొంత పెట్టి .. అది వారి చేతిలో పెట్టి, ఫొటోగ్రాఫర్ వైపు మొగం చూపెట్టి.. భోజనం దిశగా అడుగెట్టి.. ఇంటి దారి పట్టి.. వెళ్లిపోతున్నారు.
- ఇవి చిన్న చిన్న మొత్తాలయితేనేం.. అధిక విలువగలవైతేనేం.. పంతులు గారికి ఒక వెయ్యి నూటపదహార్లు ఇచ్చి ఒక పుస్తకం.. పెళ్లి పుస్తకం తెరిపించండి.
- ఆ పుస్తకానికి పసుపు, కుంకుమ బాగా దట్టించండి.
- తారీఖు, టైం వేసి.. అందరి పేర్లూ రాయండి. పింకీ, సుబ్బు, పక్కింటి ఆంటీ అని కాకుండా వీలైతే పూర్తి పేరు రాయండి. ఇచ్చిన మొత్తం రాయండి. అలాగే ఫోన్ పేమెంట్లు, గూగుల్ పేమెంట్లు, బ్యాంకులో జమలు, ప్రత్యేక జాబితా రాయండి. బ్యాంకు స్టేట్మెంట్లో ఈ 'జవాబు'ను హైలైట్ చేయండి. మీరు మీ పెళ్లి పుస్తకంలో వారి పేరు, వీలైతే, సెల్ నంబరు రాయండి. బ్యాంకు స్టేట్మెంట్లు భద్రపరచండి.
- నగదు చదివింపులను వీలైతే బ్యాంకులో జమ చేయండి. ఆ పేయింగ్ స్లిప్పు మీ పుస్తకంలో అతికించండి.
- ఇలా రాయటం వల్ల రెండు ప్రయోజనాలు. ఒకటి ముందు ముందు ఇన్కంట్యాక్స్ డిపార్టుమెంట్ వారికి 'సోర్స్' వివరణ రెడీగా ఉంటుంది. రెండోది మీరు అటువంటి వారికి కట్నం ఇచ్చేటప్పుడు ఇదొక కొలబద్దగా ఉంటుంది.
- నగదు ఖర్చుపెట్టే అవసరం అయితే.. దేనీ నిమిత్తం ఖర్చు పెట్టారో రాయండి.
- భారీ కంచాలు, ప్లేట్లు, సీనరీలు, దేవుడి బొమ్మలు మొదలైనవి రాయకపోయినా 'విలువైనవి' అనిపించిన వస్తువుల జాబితా రాయండి.
- స్థిరాస్తులు మొదలైన అన్ని కాగితాలు తీసుకోండి. బదిలీ పత్రాలు తీసుకోండి. మరీ చాదస్తం అని కొట్టిపడేయకండి. దేనికైనా దస్త్రం కావాలి. అదీ మనమే సమకూర్చుకోవాలి. సకాలంలో సర్దుకోండి.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

రాబడులకు స్థిరత్వం

కెనరా రొబెకో ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్



దీర్ఘకాల పెట్టుబడులకు ఈక్విటీలు మెరుగైన సాధనాలు. స్వల్ప కాలంలో ఉన్న రిస్క్ ప్రభావం దీర్ఘకాలంలో పెట్టుబడులపై సమసిపోతుంది. ఈక్విటీల్లోనూ నూరు శాతం పెట్టుబడులు పెట్టుకోవడాన్ని నిపుణులు సైతం సమర్థించరు. కనుక ఏకకాలంలో ఈక్విటీలు, డెట్‌తో కూడిన హైబ్రిడ్ ఫండ్స్‌ను పెట్టుబడులకు పరిగణనలోకి తీసుకోవచ్చు. ముఖ్యంగా ఈక్విటీల్లో రిస్క్ తగ్గించుకోవాలని చూసే వారు వీటిని ఎంపిక చేసుకోవచ్చు. ఈ విభాగంలో కెనరా రొబెకో ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్ స్థిరమైన పనితీరు చూపిస్తోంది.

రాబడులు

గడిచిన ఏడాది కాలంలో ఈ పథకం పెట్టుబడులపై 18 శాతం రాబడులను అందించింది. మూడేళ్లలో చూసుకుంటే ఏటా 13.16 శాతం రాబడిని అందించింది. ఐదేళ్లలో 17 శాతం, ఏడేళ్లలో 14.42 శాతం, పదేళ్లలో 13.57 శాతం చొప్పున వార్షిక రాబడుల చరిత్ర ఈ పథకానికి ఉంది. అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ విభాగం సగటు రాబడులతో పోల్చి చూసినప్పుడు ఈ పథకమే, ఏడాది, ఐదేళ్లు, ఏడేళ్లు, పదేళ్ల కాలాల్లో అధిక ప్రతిఫలాన్ని అందించింది. ఈ విభాగంలో ఈ పథకం మెరుగైన పనితీరుకు ఇది నిదర్శనం. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవడం వల్ల రిస్క్‌ను మరింత తగ్గించుకోవచ్చు.

పెట్టుబడుల విధానం..




ఈక్విటీల్లో అధిక భాగం పెట్టుబడులు పెట్టే వాటిని అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఈక్విటీ ఫండ్స్ అంటారు. ఈక్విటీలకు తక్కువ కేటాయింపులు చేసే వాటిని కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్ అని చెబుతారు. అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ మొత్తం పెట్టుబడుల్లో 65-80 శాతం వరకు ఈక్విటీలకు కేటాయిస్తాయి. మిగిలినవి డెట్‌కు కేటాయిస్తుంటాయి. కనుక ఈక్విటీల అస్థిరతల ప్రభావం వీటిపై కచ్చితంగా ఉంటుంది. దీన్ని దీర్ఘకాలంలోనే అధిగమించగలరు. అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఈక్విటీ పథకాలు ఈక్విటీల వ్యాల్యుయేషన్స్ (స్టాక్స్ విలువలు) ఆకర్షణీయంగా ఉన్న సందర్భాల్లో మొత్తం పెట్టుబడుల్లో 80 శాతం వరకు వాటికి కేటాయిస్తాయి. అదే విధంగా ఈక్విటీ వ్యాల్యూషన్లు ఖరీదుగా మారిన సందర్భాల్లో ఈక్విటీ కేటాయింపులను 65 శాతానికి పరిమితం చేసి, మిగిలిన మేర డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెంచుకుంటాయి. కరెక్షన్‌తో ఈక్విటీ విలువలు దిగొచ్చినప్పుడు డెట్ నుంచి కొంత పెట్టుబడులను ఈక్విటీలకు మళ్లిస్తాయి. ఇలా పరిస్థితులకు తగినట్టు మార్పులు చేస్తూ అధిక రాబడులను ఇచ్చే విధంగా ఈ పథకాలు పనిచేస్తాయి.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	4.93
ఐసీఐసీఐ బ్యాంక్	4.85
ఇన్ఫోసిస్	3.31
పవర్ ఫైనాన్స్	2.63
ఎస్‌బీఐ	2.35
రిలయన్స్ ఇండస్ట్రీస్	2.19
భారతీ ఎయిర్‌టెల్	2.09
ఎల్‌అండ్‌టీ	1.96
ఎన్‌టీపీసీ	1.86
యాక్సిస్ బ్యాంక్	1.41

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.10,905 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 71 శాతం మేర ఈక్విటీలకు కేటాయించగా, 25 శాతం మేర డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసింది. మిగిలిన మేర నగదు నిల్వలు కలిగి ఉంది. మొత్తం ఈక్విటీ పెట్టుబడుల్లో 75 శాతం మేర లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్‌లో 25 శాతం మేర పెట్టుబడులు కలిగి ఉంది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 67 స్టాక్స్ ఉన్నాయి. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో 23.5 శాతం పెట్టుబడులు పెట్టింది. ఆ తర్వాత టెక్నాలజీ రంగ కంపెనీలకు 10.51 శాతం, ఇండస్ట్రియల్స్ కంపెనీలకు 8.38 శాతం , కన్జ్యూమర్ డిస్క్రీషనరీ కంపెనీలకు 7 శాతానికి పైనే పెట్టుబడులు కేటాయించింది. ఇక డెట్ పెట్టుబడులను పరిశీలించగా, రిస్క్ అతి తక్కువగా ఉండే ఏఏఏ రేటెడ్ సెక్యూరిటీల్లో 13.4 శాతం, రిస్క్ లేని ఎస్‌వోవీల్లో 12 శాతం మేర పెట్టుబడులు ఉన్నాయి. మిగిలిన మేర నగదు నిల్వలు కలిగి ఉంది.



'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో నితీశ్ ప్రదర్శన

ఆడిన టెస్టులు	5
ఆడిన ఇన్నింగ్స్‌లు	9
ఆడిన బంతులు	464
చేసిన పరుగులు	298
అత్యధిక స్కోరు	114
స్ట్రయిక్‌రేట్	64.22
ఫోర్లు	30
సిక్స్‌లు	8
తీసిన వికెట్లు	5


నితీశ్ కుమార్ రెడ్డి

స్టార్స్ ఫ్లాప్ షో...

రోహిత్, కోహ్లి, కేఎల్ రాహుల్, జడేజా విఫలం

భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయిన సీనియర్లు ● బుమ్రా పోరాటానికి దక్కని ఫలితం

భవిష్యత్‌కు భరోసానిచ్చిన నితీశ్ కుమార్ రెడ్డి, యశస్వి జైస్వాల్


కోహ్లి


రోహిత్


రాహుల్


జడేజా


యశస్వి జైస్వాల్

ఆఫ్‌స్టంప్ అవతల పడ్డ బంతులను ఆడే విషయంలో తీరు మార్చుకోని విరాట్ కోహ్లి... బ్యాటింగ్ ఆర్డర్‌లో ఏ స్థానంలో బరిలోకి దిగినా వైఫల్యాల బాట వీడని రోహిత్ శర్మ... అడపా దడపా మెరుపులు తప్ప నిలకడగా ఆకట్టుకోలేక ఇబ్బంది పడ్డ కేఎల్ రాహుల్... ఆల్‌రౌండరే అయినా అటు బ్యాట్‌తో, ఇటు బంతితోతనదైన ముద్ర వేయలేకపోయిన రవీంద్ర జడేజా... పేరుకు ప్రధాన పేసరే అయినా ఏమాత్రం ప్రభావం చూపలేకపోయిన మొహమ్మద్ సిరాజ్... ఇలా ఒకరిని మించి మరొకరు పేలవ ప్రదర్శన కనబరిస్తే ఫలితం ఇలా కాక మరెలా ఉంటుంది! స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో అనూహ్య 'వైట్‌వాష్' నుంచి గుణపాఠాలు నేర్చుకోకుండానే... ఆస్ట్రేలియాలో అడుగు పెట్టిన భారత జట్టు 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో కనీస ప్రదర్శన కనబర్చలేకపోయింది. గత రెండు పర్యాయాలు అద్వితీయ ఆటతీరుతో కంగారూలను మట్టికరిపించి ప్రతిష్టాత్మక సిరీస్ చేజిక్కించుకున్న టీమిండియా... ముచ్చటగా మూడోసారి అదే మ్యాజిక్ చేయాలని ప్రయత్నించినా సాధ్యంకాలేదు. 'కర్ణుడి చావుకు కారణాలు అనేకం' అన్నట్లు... భారత జట్టు సిరీస్ కోల్పోవడానికి కూడా చాలా కారణాలు ఉన్నాయి. వాటిని ఓసారి పరిశీలిస్తే...

–సాక్షి క్రీడావిభాగం

ప్రతిష్టాత్మక 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో భారత జట్టు పరాజయానికి ప్రధాన కారణం బ్యాటింగే అనడంలో సందేహం లేదు. గత రెండు పర్యటనల్లో ఆస్ట్రేలియాపై భారత జట్టు పైచేయి సాధించడంలో అటు బౌలర్లతో పాటు బ్యాట్‌తో చతేశ్వర్ పుజారా, అజింక్యా రహానే కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా గంటల తరబడి క్రీజులో పాతుకుపోయి కంగారూ బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టిన పుజారా వంటి ఆటగాడు తాజా జట్టులో లేకపోవడం జట్టు విజయావకాశాలను దెబ్బ కొట్టింది. అంతర్జాతీయ స్థాయిలో సుదీర్ఘ అనుభవం ఉన్న సీనియర్ ప్లేయర్లు.. స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోవడంతో సిరీస్‌లో ఏ దశలోనూ భారత జట్టు పూర్తి ఆధిపత్యం కనబర్చలేకపోయింది. వ్యక్తిగత కారణాలతో తొలి టెస్టుకు అందుబాటులో లేకపోయిన రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ ఆ తర్వాత వరుసగా ఐదు ఇన్నింగ్స్‌ల్లో 3, 6, 10, 3, 9 పరుగులు చేశాడు. మిడిలార్డర్ నుంచి ఓపెనర్‌గా ప్రమోషన్ పొందిన తర్వాత నిలకడ పెరగడంతో పాటు విధ్వంసకర బ్యాటర్‌గా గుర్తింపు సాధించిన 'హిట్ మ్యాన్'... వరుస వైఫల్యాలతో చివరి మ్యాచ్ నుంచి తనంతట తానే తప్పుకున్నాడంటే అతడి ఫామ్ ఎంత పేలవంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జట్టులో అందరికంటే సీనియర్ అయిన విరాట్ కోహ్లి తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన తర్వాత వరుసగా 7, 11, 3, 36, 5, 17, 13 స్కోర్లు చేశాడు. విరాట్ అంకెల కన్నా అతడు అవుటైన తీరే సగటు అభిమానులను తీవ్రంగా కలచివేసింది. ఆస్ట్రేలియా బౌలర్లు ఆఫ్‌స్టంప్ అవతల బంతి వేయడం... విరాట్ దాన్ని ఆడాలా వద్దా అనే సంశయంలో బ్యాట్ తాకించడం... వికెట్ల వెనక క్యాచ్ ఇచ్చి వెనుదిరగడం... ఈ సిరీస్ మొత్తం ఇదే తంతు సాగింది. టన్నుల కొద్దీ పరుగులు చేసి 'రన్ మెషిన్' అనిపించుకున్న విరాట్ ఈ సిరీస్‌లో పూర్తిగా విఫలమవడం... జట్టు అవకాశాలపై తీవ్ర ప్రభావం చూపింది.

నిలకడలేమే ప్రధాన సమస్య

రోహిత్ గైర్హాజరీలో ఓపెనర్‌గా బరిలోకి దిగి ఆకట్టుకున్న కేఎల్ రాహుల్ ఆ తర్వాత అదే జోరు కొనసాగించడంలో విఫలమయ్యాడు. 26, 77, 37, 7, 84, 4, 24, 0, 4, 13 ఈ సిరీస్‌లో రాహుల్ గణాంకాలివి. తొలి మూడు మ్యాచ్‌ల్లో ఫర్వాలేదనిపించిన అతడు చివరి రెండు టెస్టుల్లో విఫలం కావడంతో జట్టుకు మెరుగైన ఆరంభాలు లభించలేదు. స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కూడా స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చడంలో విఫలమయ్యాడు. సీనియర్ ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సిరీస్ మధ్యలోనే కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించగా... జడ్డూ తన వంతు బాధ్యత సక్రమంగా నిర్వర్తించలేకపోయాడు. ఆసీస్ పిచ్‌లపై మెరుగైన రికార్డు, మంచి అనుభవం ఉన్న హైదరాబాద్ పేసర్ మొహమ్మద్ సిరాజ్ ఆ స్థాయి ప్రభావం చూపలేకపోయాడు. మరో ఎండ్ నుంచి బుమ్రా కంగారూల వెన్నులో వణుకు పుట్టిస్తుంటే... దాన్ని సొమ్ము చేసుకుంటూ వికెట్లు పడగొట్టాల్సింది పోయి... ప్రత్యర్థికి సులువుగా పరుగులు చేసే అవకాశం ఇచ్చాడు. మొత్తంగా ఐదు మ్యాచ్‌ల్లో కలిపి 20 వికెట్లు తీసినా... ఈ ప్రదర్శన అతడి స్థాయికి తగ్గదని చెప్పలేం. జట్టు పరిస్థితులతో సంబంధం లేకుండా పదే పదే తప్పుడు షాట్ సెలెక్షన్ కారణంగా వికెట్ సమర్పించుకున్న రిషబ్ పంత్ విమర్శల పాలైతే... వచ్చిన కొన్ని అవకాశాలను శుబ్‌మన్ గిల్ ఒడిసి పట్టలేకపోయాడు. టెస్టు ఫార్మాట్‌లో ఇంటా బయట నిలకడైన ఆటతీరు కనబరుస్తూ గత రెండు పర్యాయాలు 'ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్' (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత జట్టు... ఈసారి మాత్రం నిరాశ పరిచింది. చివరగా ఆడిన ఎనిమిది టెస్టుల్లో టీమిండియా కేవలం ఒకే ఒక్క మ్యాచ్ గెలవడంతో డబ్ల్యూటీసీ ఫైనల్ రేసుకు దూరం కాక తప్పలేదు. ముఖ్యంగా స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 0–3తో సిరీస్ కోల్పోవడం టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలను తీవ్రంగా ప్రభావితం చేసింది.

నితీశ్, యశస్వి అదుర్స్

పదేళ్లుగా కాపాడుకుంటూ వస్తున్న 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' చేజారడంతో పాటు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయినప్పటికీ ఈ సిరీస్ ద్వారా భారత జట్టుకు కొంత మేలు కూడా జరిగింది. స్టార్ ఆటగాళ్లు అంచనాలకు అందుకోలేకపోతున్న సమయంలో మేమున్నామంటూ యువ ఆటగాళ్లు బాధ్యతలు తీసుకున్నారు. తొలిసారి ఆస్ట్రేలియాలో పర్యటించిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఆటకట్టుకోగా... ఈ సిరీస్ ద్వారానే అంతర్జాతీయ టెస్టు అరంగేట్రం చేసిన ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి అదరగొట్టాడు. ఐదు మ్యాచ్‌ల్లో 43.44 సగటుతో 391 పరుగులు చేసిన జైస్వాల్ భారత జట్టు తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. స్టార్క్, కమిన్స్, హాజల్‌వుడ్, బోలండ్ వంటి పేసర్లను జైస్వాల్ అలవోకగా ఎదుర్కొన్న తీరు భవిష్యత్తుపై భరోసా పెంచుతోంది. ఇక పేస్ ఆల్‌రౌండర్ కోసం చాన్నాళ్లుగా ఎదురుచూస్తున్న టీమిండియాకు నితీశ్ రెడ్డి రూపంలో జవాబు దొరికింది. మీడియం పేస్‌కు తోడు చక్కటి బ్యాటింగ్‌తో అతడు ఈ సిరీస్‌పై తనదైన ముద్రవేశాడు. 9 ఇన్నింగ్స్‌లు కలిపి నితీశ్ మొత్తం 298 పరుగులు సాధించి సిరీస్‌లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన రెండో ప్లేయర్‌గా నిలిచాడు. టి20 ఫార్మాట్‌లో ధనాధన్ షాట్లు ఆడే నితీశ్... సుదీర్ఘ ఫార్మాట్‌కు పనికిరాడని విమర్శించిన వారికి మెల్‌బోర్న్ సెంచరీతో బదులిచ్చాడు. తనలో దూకుడుగా ఆడే శక్తితో పాటు క్రీజులో సుదీర్ఘ సమయం గడపగల సంయమనం కూడా ఉందని నిరూపించాడు. ఈ ప్రదర్శనతో నితీశ్ రెడ్డి టెస్టు జట్టులో చోటు నిలబెట్టుకోవడం ఖాయం కాగా... బౌలింగ్‌లో అతడు మరింత రాటుదేలితే భారత జట్టుకు అదనపు బలం చేకూరుతుంది. ఇక ఈ సిరీస్‌లో అత్యుత్తమ ప్రదర్శన అంటే అది బుమ్రాదే. తొలి టెస్టులో సారథిగా జట్టును గెలిపించిన బుమ్రా... సిరీస్ ఆసాంతం టీమ్ భారాన్ని భుజాల మీద మోశాడు. 9 ఇన్నింగ్స్‌ల్లో కలిపి 32 వికెట్లు తీసిన బుమ్రా... చివరి ఇన్నింగ్స్‌లో బౌలింగ్‌కు చేయలేకపోవడంతోనే టీమిండియా పరాజయం పాలైందనడంలో అతిశయోక్తిలేదు. 'బుమ్రా ఎడం చేత్తో బౌలింగ్ చేసేలా చట్టం తీసుకొస్తాం' అని ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్ అన్నాడంటే ఈ సిరీస్‌లో జస్‌ప్రీత్ జోరు ఎలా సాగిందో ఊహించుకోవచ్చు.

ట్రోఫీ ప్రదానోత్సవానికి ఆహ్వానించలేదు: గావస్కర్

సిడ్నీ: 'బోర్డర్–గావస్కర్' సిరీస్ విజేతకు ట్రోఫీ అందజేసే సమయంలో తనను ఆహ్వానించకపోవడంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. 1996–97 నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' నిర్వహిస్తుండగా... తాజాగా జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా జట్టు 3–1తో విజయం సాధించింది. ఆదివారం ఆఖరి టెస్టు ముగిసిన అనంతరం విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టుకు ఆస్ట్రేలియా దిగ్గజం అలెన్ బోర్డర్ ట్రోఫీ బహూకరించాడు. దీనిపై గావస్కర్ స్పందిస్తూ... 'ట్రోఫీ ఇచ్చే సమయంలో అక్కడ ఉండటాన్ని ఇష్టపడేవాడిని. భారత్, ఆస్ట్రేలియా మధ్య అదీ బోర్డర్–గావస్కర్ సిరీస్ కదా. ఆ సమయంలో నేను మైదానంలోనే ఉన్నా. మెరుగైన ప్రదర్శన చేయడం వల్లే ఆస్ట్రేలియా గెలిచింది. నా స్నేహితుడు బోర్డర్‌తో కలిసి ట్రోఫీ అందించి ఉంటే ఇంకా ఆనందించేవాడిని' అని అన్నాడు. మరోవైపు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) స్పందన దీనికి భిన్నంగా ఉంది. సిరీస్‌లో ఆస్ట్రేలియా విజేతగా నిలిస్తే అలెన్ బోర్డర్... భారత్ గెలిస్తే సునీల్ గావస్కర్ ట్రోఫీ అందించాలని నిర్ణయించినట్లు సీఏ తెలిపింది. ఈ విషయాన్ని వారిదద్దరికీ గతంలోనే చెప్పినట్లు ఒక ప్రకటనలో తెలిపింది.

తనయ్, అనికేత్ మాయాజాలం

చివరి మ్యాచ్‌లో అరుణాచల్ ప్రదేశ్‌పై హైదరాబాద్ విజయం


అనికేత్ రెడ్డి


తనయ్ త్యాగరాజన్

అహ్మదాబాద్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌ను హైదరాబాద్ జట్టు విజయంతో ముగించింది. ఆదివారం జరిగిన గ్రూప్ 'సి' చివరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో అరుణాచల్ ప్రదేశ్ జట్టును ఓడించింది. టాస్ గెలిచిన హైదరాబాద్ బౌలింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్ ప్రదేశ్ 28.3 ఓవర్లలో 96 పరుగులకే కుప్పకూలింది. హైదరాబాద్ ఎడంచేతి వాటం స్పిన్నర్లు తనయ్ త్యాగరాజన్ 32 పరుగులిచ్చి 5 వికెట్లు... గంగం అనికేత్ రెడ్డి 14 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి అరుణాచల్ ప్రదేశ్‌ను దెబ్బ కొట్టారు. మరో వికెట్ పేసర్ చామా మిలింద్‌కు లభించింది. అరుణాచల్ జట్టుతో సిద్ధార్థ్ బలోడి (29; 5 ఫోర్లు), ధ్రువ్ సోని (20; 3 ఫోర్లు), బిక్కీ కుమార్ (15; 3 ఫోర్లు) మినహా ఇతర బ్యాటర్లు విఫలమయ్యారు. 97 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ 12 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 100 పరుగులు చేసి గెలిచింది. తన్మయ్ అగర్వాల్ (19 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్), కనాలా నితేశ్ రెడ్డి (16 బంతుల్లో 15; 2 ఫోర్లు) అవుటయ్యారు. పట్కూరి నితేశ్ రెడ్డి (31 బంతుల్లో 29 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), హిమతేజ (12 బంతుల్లో 21 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) అజేయంగా నిలిచారు. తనయ్ త్యాగరాజన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

నాలుగో స్థానంతో సరి

ఎనిమిది జట్లున్న గ్రూప్ 'సి'లో హైదరాబాద్ జట్టు ఏడు మ్యాచ్‌లు ఆడింది. నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచి, మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. 16 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించలేకపోయింది. నాగాలాండ్, పుదుచ్చేరి, కర్ణాటక, అరుణాచల్ ప్రదేశ్ జట్లపై నెగ్గిన హైదరాబాద్... ముంబై, సౌరాష్ట్ర, పంజాబ్ జట్ల చేతుల్లో ఓడిపోయింది. ఓవరాల్‌గా ఈ టోర్నీలో హైదరాబాద్ తరఫున బ్యాటింగ్ విభాగంలో అరవెల్లి అవనీశ్ రావు (7 మ్యాచ్‌ల్లో 241 పరుగులు; 1 సెంచరీ, 2 అర్ధ సెంచరీలు), తన్మయ్ అగర్వాల్ (7 మ్యాచ్‌ల్లో 227 పరుగులు; 2 అర్ధ సెంచరీలు), వరుణ్ గౌడ్ (7 మ్యాచ్‌ల్లో 203 పరుగులు; 1 సెంచరీ, 1 అర్ధ సెంచరీ) ఆకట్టుకున్నారు. బౌలింగ్ విషయానికొస్తే చామా మిలింద్ 7 మ్యాచ్‌లు ఆడి 12 వికెట్లు... తనయ్ త్యాగరాజన్ 7 మ్యాచ్‌లు ఆడి 11 వికెట్లు పడగొట్టారు. అనికేత్ రెడ్డి, శరణు నిశాంత్, ముదస్సిర్ 7 వికెట్ల చొప్పున తీశారు.

సూపర్ సబలెంకా

టైటిల్‌తో సీజన్‌ను ప్రారంభించిన బెలారస్ టెన్నిస్ స్టార్



బ్రిస్బేన్: గత ఏడాదిని ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించిన బెలారస్ టెన్నిస్ స్టార్ సబలెంకా కొత్త ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించింది. ఆదివారం ముగిసిన మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) బ్రిస్బేన్ ఓపెన్–500 టోర్నీలో టాప్ సీడ్ సబలెంకా విజేతగా నిలిచింది. హోరాహోరీగా సాగిన సింగిల్స్ ఫైనల్లో సబలెంకా 4–6, 6–3, 6–2తో ప్రపంచ 107వ ర్యాంకర్, క్వాలిఫయర్ పొలీనా కుదెర్‌మెతోవా (రష్యా)పై గెలిచింది. విజేతగా నిలిచిన సబలెంకాకు 1,92,475 డాలర్ల (రూ. 1 కోటీ 65 లక్షలు)ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. కుదెర్‌మెతోవాతో జరిగిన తుది పోరులో సబలెంకా తొలి సెట్‌ను కోల్పోయినా... నెమ్మదిగా తేరుకొని ఆ తర్వాత వరుసగా రెండు సెట్‌లను సొంతం చేసుకుంది. 1 గంట 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఐదు ఏస్‌లు సంధించింది. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి... ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. కుదెర్‌మెతోవా ఆరు ఏస్‌లు సంధించినా... తొమ్మిది డబుల్ ఫాల్ట్‌లు చేసి మూల్యం చెల్లించుకుంది. టోర్నీ మొత్తంలో కేవలం ఒక సెట్‌ను కోల్పోయిన సబలెంకా తాజా విజయంతో కెరీర్‌లో 18వ సింగిల్స్ టైటిల్‌ను దక్కించుకుంది. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సబలెంకా డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది.

ఫాలోఆన్‌లో పాకిస్తాన్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప స్కోరుకే ఆలౌటైన పాకిస్తాన్... రెండో ఇన్నింగ్స్‌లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 64/3తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ 54.2 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (58; 7 ఫోర్లు), రిజ్వాన్ (46; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. సఫారీ బౌలర్లలో రబడ 3 వికెట్లు పడగొట్టాడు. దీంతో ఆతిథ్య దక్షిణాఫ్రికాకు 421 పరుగుల భారీ ఆధిక్యం దక్కడంతో... పాకిస్తాన్‌ను ఫాలోఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్‌లో పట్టుదలగా బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 49 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 213 పరుగులు చేసింది. కెప్టెన్ షాన్ మసూద్ (102 బ్యాటింగ్; 14 ఫోర్లు), బాబర్ ఆజమ్ (81; 10 ఫోర్లు) అదరగొట్టారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 205 పరుగులు జోడించారు.

పరాజయంతో ఆంధ్ర ముగింపు

ముంబై: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు నాకౌట్ దశకు అర్హత సాధించడంలో విఫలమైంది. హిమాచల్ ప్రదేశ్ జట్టుతో ఆదివారం జరిగిన గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఓడిపోయింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు 49.2 ఓవర్లలో 197 పరుగులకు ఆలౌటైంది. వినయ్ (44; 3 ఫోర్లు, 1 సిక్స్), పీవీ సత్యనారాయణ రాజు (37 నాటౌట్; 4 ఫోర్లు) రాణించారు. కెప్టెన్ కోన శ్రీకర్ భరత్ (18 బంతుల్లో 27; 6 ఫోర్లు) ధాటిగా ఆడినా ఎక్కువసేపుక్రీజులో నిలువలేకపోయాడు. అశ్విన్ హెబర్ (10; 1 ఫోర్), షేక్ రషీద్ (12; 1 ఫోర్), యారా సందీప్ (27; 1 సిక్స్), యర్రా పృథ్వీరాజ్ (18; 1 ఫోర్, 1 సిక్స్) నిరాశపరిచారు. అనంతరం హిమాచల్ జట్టు 38.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ అంకిత్ కాల్సి (100 నాటౌట్; 12 ఫోర్లు) అజేయ సెంచరీ సాధించాడు. ఎనిమిది జట్లున్న గ్రూప్ 'బి'లో ఆంధ్ర జట్టు ఏడు మ్యాచ్‌లు ఆడింది. నాలుగు మ్యాచ్‌ల్లో నెగ్గి, మూడు మ్యాచ్‌ల్లో ఓటమి పాలైంది. 16 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి నాకౌట్ దశకు చేరడంలో విఫలమైంది.

క్వార్టర్ ఫైనల్లో గుజరాత్, విదర్భ

ఆదివారంతో మొత్తం లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాయి. ఐదు గ్రూప్‌ల నుంచి ఓవరాల్‌గా 10 జట్లు నాకౌట్ దశకు అర్హత పొందాయి. టాప్–6లో నిలిచిన గుజరాత్, విదర్భ, కర్ణాటక, బరోడా, మహారాష్ట్ర, పంజాబ్ జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు ఆడతాయి. 7 నుంచి 10 స్థానాల్లో నిలిచిన రాజస్తాన్, తమిళనాడు, హరియాణా, బెంగాల్ జట్లు ప్రీక్వార్టర్ ఫైనల్లో పోటీపడతాయి.

ఓటమి దిశగా జింబాబ్వే

బులవాయో: జింబాబ్వే, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య సిరీస్ విజేతను నిర్ణయించే ఆఖరి టెస్టు ఆసక్తికరంగా మారింది. 278 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య జింబాబ్వే 73 పరుగుల దూరంలో నిలువగా, అఫ్గాన్ గెలిచేందుకు 2 వికెట్లు తీస్తే చాలు! తొలి టెస్టు డ్రా కావడంతో ఈ టెస్టే సిరీస్ విజేతను నేడు తేల్చుతుంది. ఓవర్‌నైట్ స్కోరు 291/7తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన అఫ్గాన్ 363 పరుగుల వద్ద ఆలౌటైంది. ఇస్మత్ ఆలమ్ (101; 9 ఫోర్లు) శతక్కొట్టాడు. తర్వాత 278 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే 66 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. రషీద్ ఖాన్ (6/66) మాయాజాలానికి 178 పరుగులకే 8 వికెట్లు కోల్పోయిన జింబాబ్వేను గట్టెక్కించేందుకు కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (53 బ్యాటింగ్; 4 ఫోర్లు, 1 సిక్స్) పోరాడుతున్నాడు.

సింధు లోయ లిపిని పరిష్కరిస్తే
10 లక్షల డాలర్ల నజరానా

తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటన



చెన్నై: శతాబ్ద కాలానికి పైగా అపరిష్కృతంగా మిగిలి పోయిన సింధు నదీ లోయ నాగరికత కాలం నాటి లిపిని పరిష్కరించిన వారికి 10 లక్షల డాలర్ల బహుమానం అందజేస్తామని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ప్రకటించారు. సింధూ నాగరికతను వెలుగులో వచ్చి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటైన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును ఆదివారం ఆయన చెన్నైలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్..ఒకప్పుడు విలసిల్లిన సింధు లోయ నాగరికతకు చెందిన లిపిని ఇప్పటి వరకు స్పష్టంగా ఎవరూ అర్థం చేసుకో లేకపోయారని పేర్కొన్నారు. లిపిని పరిష్కరించేందుకు ఇప్పటికీ పండితులు ప్రయత్ని స్తూనే ఉన్నారన్నారు. ఈ దిశగా కృషి చేసి, విజయం సాధించిన వ్యక్తులు, సంస్థలకు ప్రోత్సా హంగా 10 లక్షల డాలర్ల బహుమానం అందజేస్తామని ప్రకటించారు.

రూ.11 కోట్ల చేప



ఏకంగా రూ.11.28 కోట్ల ధర పలికిన బ్లూఫిన్ ట్యూనా చేప ఇది. జపాన్ రాజధాని టోక్యోలోని టొయోసు చేపల మార్కెట్లో ఆదివారం ఈ సీజన్ తొలి వేలంపాటలో రికార్డు ధరకు అమ్ముడుపోయింది



హోటళ్ల చెక్-ఇన్ తదితరాలకు నూతన నిబంధనలు

పెళ్లి కాని జంటలకు
ఓయో రూమ్ కష్టమే

న్యూఢిల్లీ: ప్రముఖ ప్రయాణ బుకింగ్స్ వ్యాపార సంస్థ ఓయో కొత్తగా తమ భాగస్వామ్య హోటళ్లలో దిగే వినియోగదారులకు నూతన నిబంధనలను అమల్లోకి తెస్తోంది. తొలుత మీరట్ పట్టణంలో మాత్రమే ఈ కొత్త చెక్-ఇన్ నియమావళిని అమలుచేస్తోంది. పెళ్లికాని జంటలకు హోటల్ గది ఇవ్వడం ఇకపై కుదరదని తేల్చిచెప్పింది. సవరించిన నిబంధనావళి ప్రకారం ఎవరైనా జంట హోటల్ గదిని బుక్‌చేయాలనుకుంటే తమ వివాహబంధాన్ని ధృవీకరిస్తూ ఏదైనా గుర్తింపును చూపాల్సి ఉంటుంది. స్థానిక సామాజిక సున్నితాంశాలను పరిగణనలోకి తీసుకుని గదిని ఎవరికి ఇవ్వాలి ఇవ్వకూడదు అనే విచక్షణాధికారం ఆయా హోటళ్లకు ఉందని ఓయో ఒక ప్రకటనలో పేర్కొంది. కొత్త చెక్-ఇన్ నిబంధనలపై ఫీడ్‌బ్యాక్ తీసుకుని తదనుగుణంగా సవరించిన నియామావళిని దేశవ్యాప్తంగా త్వరలో అమలుచేసే యోచన ఉందని ఓయో పేర్కొంది. ''అత్యంత సురక్షితమైన, భద్రమైన, మెరుగైన హోటల్ సేవలు అందించే లక్ష్యంతో కొత్త నిబంధనావళిని తెస్తున్నాం. వ్యక్తుల వ్యక్తిగత స్వేచ్ఛకు విలువ ఇస్తూనే పౌరసమాజాల విజ్ఞప్తులు, వినతులను పరిగణనలోకి తీసుకుని మేం పని చేయాల్సి ఉంటుంది. కుటుంబాలు, విద్యార్థులు, ఒంటరిగా ప్రయాణాలు చేసే పర్యాటకులు, సందర్శకులు, వ్యాపారుల సౌకర్యార్థం కొత్త నియమావళిని తెస్తున్నాం'అని ఓయో నార్త్ ఇండియా రీజియన్ హెడ్ పవాస్ శర్మ చెప్పారు. ''మెరుగైన, పటిష్ట నిబంధనల కారణంగా వినియోగదారుల్లో మా పట్ల విశ్వాసం మరింత పెరుగుతుంది. అప్పుడు ఎక్కువ రోజులు గదులు అద్దెకు తీసుకోవడం, మళ్లీ మళ్లీ బుక్ చేయడం వంటివి చేస్తారు''అని ఆయన అన్నారు. అనైతిక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న హోటళ్లపై చర్యలు తీసుకోవడం, వాటిని నిషేధించడం, తమ బ్రాండ్ పేరును అనధికారికంగా వాడుకోవడం, దుర్వినియోగం చేయడం వంటి వాటిపై ఓయో సంస్థ.. హోటళ్ల భాగస్వాములు, పోలీసులతో కలిసి పనిచేస్తోంది. ఇందుకోసం సంస్థ ఇప్పటికే దేశవ్యాప్తంగా సంయుక్తంగా పలు సెమినార్లను నిర్వహించింది.

సమష్టి తత్వంలో...
చీమలే మిన్న

వాటిముందు మనుషులు బలాదూరే

అధ్యయనంలో ఆసక్తికరమైన విషయాలు

ఎలా కనిపెట్టారు?


ఇజ్రాయెల్‌లోని విజ్‌మ్యాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సంస్థలోని పరిశోధకులు ఈ ప్రయోగం చేశారు. పైనుంచి పియానోలాగా కనిపించే ఆంగ్ల పెద్ద అక్షరం 'టీ' ఆకారంలో ఒక సూక్ష్మ స్థాయి వస్తువును చీమల ముందుంచారు. అది ఆహారమని భ్రమించేలా చేశారు. దంతో చీమలు గుంపులుగా దాన్ని మోసుకెళ్లాయి. మార్గమధ్యంలో అడ్డుగా నిలిపిన రెండు గడపలు, గోడలను గుండా తరలించాల్సిన పరిస్థితి కల్పించారు. ముందు నుంచి, వెనుక నుంచి మార్చి మార్చి ప్రయత్నించాయి. కుదరకపోవడంతో అక్షరాన్ని వంపుగా పక్కకు జరిపి ప్రయత్నించాయి. అయినా కొన అడ్డు తగులుతుండటంతో మరో వైపు నుంచి ప్రయత్నించాయి. చివరికి ఏ కొన నుంచైతే దాన్ని గడప దాటించొచ్చో కనిపెట్టి ఆ వైపుగా ముందుకు జరుపుకుంటూ ఎట్టకేలకు అడ్డంకిని దాటేశాయి. ఈ క్రమంలో కలసికట్టుగా ప్రయత్నించాయి. అంతేగాక చేసిన తప్పును మళ్లీ చేయకుండా ప్రయత్నించడం విశేషం.

మనుషుల కంటే మెరుగ్గా

తర్వాత ఇదే పనిని అచ్చం ఇలాగే కొందరు మనుషులకు అప్పజెప్పారు. త్వరగా ముగించాలన్న తొందరలో వాళ్లు హడావిడిగా ప్రయత్నించారు. ఉమ్మడిగా పని చేస్తున్నా ఒకే నిర్ణయాన్ని కలసికట్టుగా అమలు చేయలేకపోయారు. అదే విడిగా ఒక్కో మనిషి ఆ పనిని చిటికెలో చేయడం విశేషం. అదే ఒక్క చీమ మాత్రం ఈ పని చేయలేకపోయింది. తర్వాత ఏడు చీమలకు ఒక గుంపుగా, 80 చీమలు ఒక గుంపుగా, ఇలా రకరకాలుగా 'టీ' అక్షరాన్ని తరలించే పని ఇచ్చి సమీక్షించారు. మనుషులకు కూడా విడిగా ఒక్కరికి, 6 నుంచి 9 మంది గుంపుకు, 26 మందితో కూడిన గుంపుకు పని అప్పగించారు.

మనుషులను తలదన్నే సమిష్టి నిర్ణయ శక్తి చిట్టి చీమల సొంతమట! ప్రణాళికను వ్యూహాత్మకంగా అమలుచేయడం, చేసిన తప్పును మళ్లీ చేయకుండా జాగ్రత్త పడటం, కొత్త తరహాలో ప్రయత్నించి సమస్యకు పరిష్కారం కనుక్కోవడంలో మనిషితో పోలిస్తే చీమల్లో ఉమ్మడి నిర్ణయ శక్తి చాలా ఎక్కువని తాజా పరిశోధనలో వెల్లడైంది. సంబంధిత ప్రయోగ ఫలితాలు ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

- న్యూఢిల్లీ



మాస్కులు, నల్ల కళ్లద్దాలు...

చీమలు కలిసి పనిచేసేటప్పుడు మాట్లాడుకుంటాయో లేదో తెలీదు. కనుక మనుషులకు అవాంఛిత మొగ్గు ఉండకుండా వారి మధ్య కూడా సమాచార మార్పిడిని నిషేధించారు. మాస్కులు, సైగలు చేసుకోకుండా నల్ల కళ్లద్దాలిచ్చారు. ఎక్కువ చీమలున్న గుంపు అద్భుత పనితీరు ప్రదర్శించింది. చిక్కు ప్రశ్న లాంటి గడుల పజిల్‌ను చీమలు విడివిడిగా అర్థం చేసుకోవడంలో విఫలమైనా ఉమ్మడిగా మాత్రం వేగంగా పరిష్కారం కనుగొన్నాయని విజ్‌మ్యాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కాంప్లెక్స్ సిస్టమ్స్ ముఖ్య పరిశోధకుడు ఓఫెర్ ఫినెర్‌మ్యాన్ వెల్లడించారు. ''మనుషులతో పోలిస్తే చీమల్లో ఇది ఆహారానికి సంబంధించిన కీలకమైన పని. అందుకే అవి మనసు పెట్టి పని చేశాయి. స్వల్పకాలిక జ్ఞాపకశక్తిని అద్భుతంగా వాడుకున్నాయి. మనుషుల్లో మాత్రం సైగల్లేకుండా ప్రయత్నించినప్పుడు ఉమ్మడిగా కూడా ప్రదర్శన పేలవంగా ఉంది'' అని చెప్పుకొచ్చారు.

చీమల కాలనీ... ఒకటే జీవసమూహం

''లక్షల చీమలు నేలలో ఒకే కాలనీగా బతుకుతాయి. ఆ రకంగా అవి అన్నాదమ్ములు, అక్కాచెల్లెళ్ల వంటివి. ఆహారం వేట, తరలింపు, నిల్వే వాటి ప్రధాన లక్ష్యాలు. అందుకు ఉమ్మడిగా పని చేస్తాయి. ఎప్పుడూ కలిసే ఉంటాయి. పోటీతత్వం కంటే సహకార భావన ఎక్కువ. అందుకే చీమలు చూడ్డానికి విడిగా ఉన్నా అవన్నీ ఒకే జీవ సమూహం. ఒక శరీరంలోని అవయవాలు వేర్వేరు పనులు చేసినట్లు ఒక కాలనీలోని చీమలు వేర్వేరు పనులు చేస్తాయంతే'' అని ఓఫెర్ చెప్పారు. హడావిడి, పని ముగించాలన్న తొందర లేకుండా మనసు పెట్టి పని చేస్తే ఉమ్మడి నిర్ణయం విజయవంతమవుతుందని పరిశోధనలో తేలిందని ముక్తాయించారు. పొడవాటి కొమ్ములతో క్రేజీ చీమలుగా పేరొందిన పారాట్రెచీనా లాంగీకార్నీస్ రకాన్ని ఈ పరిశోధనకు వినియోగించారు.

11నుంచి అయోధ్యలో వార్షికోత్సవాలు

అయోధ్య: అయోధ్య ఆలయంలో రామ్ లల్లా ప్రతిష్ఠాపనకు ఏడాది పూర్తవుతున్న సందర్భంగా జనవరి 11వ తేదీన సీఎం యోగి ఆదిత్యనాథ్ అభిషేకం జరిపించనున్నారు. ప్రతిష్ఠా ద్వాదశి వార్షికోత్సవాలు 11 నుంచి 13వ తేదీ వరకు మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. రామాలయం సమీపంలోని 'అంగద్ తిల'లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాన్ని కూడా సీఎం యోగి ప్రారంభించనున్నారు. ప్రముఖ గాయకుల భక్తి గీతాల రికార్డును కూడా ఆయన విడుదల చేస్తారని అధికారులు చెప్పారు. అంతేకాకుండా, అయోధ్యలోని లతా చౌక్, జన్మభూమి పథ్, శ్రింగార్ హాట్, రామ్ కీ పైడీ, సుగ్రీవ ఫోర్ట్, చోటి దేవ్‌కాళి ప్రాంతాల్లో యువ కళాకారులతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, గీతా లాపన వంటివి ఉంటాయని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారు. ఆలయ గర్భగుడి వద్ద 'శ్రీరామ్ రాగ్ సేవ'కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా దేశ వ్యాప్తంగా ఉన్న సాధువులు, భక్తులకు ఆహ్వానాలు పంపామని వెల్లడించారు.

ఓ వ్యాపారవేత్త వేధిస్తున్నాడు

మలయాళ నటి హనీ రోజ్ ఆరోపణలు



తిరువనంతపురం: ఓ వ్యాపారవేత్త తనను వేధిస్తూ, లైంగికపరమైన అనుచిత వ్యాఖ్యలతో అమర్యాదకరంగా వ్యవహరిస్తున్నాడని మలయాళ నటి హనీ రోజ్ ఆరోపించారు. ఆదివారం ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. 'ఆ వ్యక్తి ఓ కార్యక్రమానికి నన్ను అతిథిగా ఆహ్వానిస్తే వెళ్లాను. అక్కడ అతడి తీరుతో ఎంతో ఆవేదన చెందాను. మరో కార్యక్రమానికి ఆహ్వానిస్తే వెళ్లలేదు. అప్పటి నుంచి ప్రత్యక్షంగా పరోక్షంగా సాధించడం మొదలుపెట్టాడు. నేను వెళ్లే కార్యక్రమాలకు వస్తూ అక్కడ కూడా పరోక్షంగా నా పేరును ప్రస్తావిస్తూ మీడియాతో, సామాజిక వేదికలపైనా నన్ను లక్ష్యంగా చేసుకున్నాడు. వీటిని గమనించాక కొందరు పరిచయస్తులు..అతడితో సంబంధముందా అని నన్ను అడుగుతున్నారు. ఇలాంటి నీచ ప్రవర్తనతో వార్తల్లోకి రావాలనే అతడి ఉద్దేశాన్ని కనిపెట్టాను. అందుకే మొదటిసారిగా అతడికి హెచ్చరికగా ఈ పోస్ట్ చేస్తున్నాను. అతడిపై ఎలాంటి చర్యలకు వీలుందో ఇప్పటికే లాయర్లతో చర్చించాను. అతడు తీరు మార్చుకోకుంటే చట్టపరమైన చర్యలు తప్పవు'అని హనీ రోజ్ హెచ్చరించారు. ఆ వ్యక్తి ఎవరనేది మాత్రం ఆమె వెల్లడించలేదు. మలయాళంతోపాటు తెలుగు, తమిళ సినిమాల్లో కూడా హనీ రోజ్ నటించారు.

పాక్‌కు 20 బిలియన్ డాలర్ల సాయం

ప్రపంచ బ్యాంక్ సూచనప్రాయ ఆమోదం

ఇస్లామాబాద్: వచ్చే పదేళ్లలో దేశంలో చేపట్టిన పలు ప్రాజెక్టులను యథా ప్రకారం కొనసాగించేందుకు, ఆరు లక్ష్యాల సాధనపై దృష్టి సారించేందుకు వీలుగా పాకిస్తాన్‌కు 20 బిలియన్ డాలర్ల మేర సాయం అందించేందుకు ప్రపంచ బ్యాంక్ సూచనప్రాయంగా ఆమోదం తెలిపింది. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించడం, పేదరిక నిర్మూలన, ప్రైవేట్ పెట్టుబడుల పెంపు వంటి లక్ష్యాలు ఇందులో ఉన్నాయని'అనే పేరున్న ఈ ప్రాజెక్టుకు పాకిస్తాన్ కంట్రీ పార్ట్‌నర్‌షిప్ ఫ్రేమ్‌వర్క్ 2025–35'అనే పేరు పెట్టారని ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ పత్రిక పేర్కొంది. ఈ నెల 14న జరిగే సమావేశంలో ఈ ప్రాజెక్టుపై చర్చించి ఆమోదం తెలిపే అవకాశాలున్నాయని వివరించింది. ప్రపంచ బ్యాంక్ దక్షిణాసియా ఉపాధ్యక్షుడు ఇస్లామాబాద్ రానున్నారని తెలిపింది. ప్రపంచ బ్యాంక్ పదేళ్ల కార్యక్రమానికి ఎంపికైన మొదటి దేశం పాకిస్తానేనని ఓ అధికారి తెలిపినట్లు కూడా వెల్లడించింది.

ఆ రెండు ప్రాజెక్టులు ఢిల్లీకి కీలకం: కేజ్రీవాల్



న్యూఢిల్లీ: ప్రధాని మోదీ ఆదివారం ఢిల్లీలో ప్రారంభించిన రెండు ప్రాజెక్టులు దేశరాజధానిలో మౌలికరంగానికి మైలు రాళ్ల వంటివని, ఇవి తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని మాజీ సీఎం, ఆప్ చీఫ్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. యూపీలోని సాహిబాబాద్ నుంచి ఢిల్లీలోని న్యూ అశోక్ నగర్ వరకు 13 కిలోమీటర్ల నిడివున్న ఢిల్లీ–మీరట్ రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్(ఆర్ఆర్‌టీఎస్)కారిడార్, ఢిల్లీ మెట్రో నాలుగో దశలో భాగంగా జనక్‌పురి వెస్ట్–కృష్ణా పార్క్ ఎక్స్‌టెన్షన్ మార్గం ప్రాజెక్టులు కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాల జాయింట్ వెంచర్లని కేజ్రీవాల్ మీడియాతో అన్నారు. ఆప్ ఎప్పుడూ కేంద్రంతో పోట్లాడుతూనే ఉంటుందని విమర్శించే వారికి ఇవి రెండూ ఉదాహరణలని ఆయన వ్యాఖ్యానించారు. ఆప్ నేతలను కేంద్రం జైళ్లలో పెట్టి, వేధింపులకు గురి చేసినా పాలనపైనే దృష్టంతా పెట్టామని చెప్పుకున్నారు. గత పదేళ్లలో ఢిల్లీలో జరిగిన అభివృద్ధిని చూస్తే ఈ విషయం అర్థమవుతుందని చెప్పారు.

పార్లమెంటరీ విధానంపై మహిళా ప్రతినిధులకు క్రాష్ కోర్స్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న పంచాయతీ రాజ్ సంస్థలకు చెందిన 502 మంది గిరిజన మహిళా ప్రజాప్రతినిధులకు పార్లమెంటరీ సంప్రదాయాలపై ఏర్పాటైన క్రాష్ కోర్సు 'పంచాయత్ సె పార్లమెంట్ 2.0'ను సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రారంభించనున్నారు. గిరిజనుల ఆరాధ్య దైవం బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసే ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్, చర్చాగోష్టులతోపాటు పార్లమెంట్ హౌస్, సంవిధాన్ సదన్, ప్రధాన్‌మంత్రి సంగ్రహాలయ, రాష్ట్రపతి భవన్‌ల సందర్శన ఉంటాయి. రాజ్యాంగం, పార్లమెంటరీ వ్యవస్థ విధి విధానాలు, ప్రజాస్వామ్య వ్యవస్థలపై మహిళా ప్రతినిధులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించనున్నారు.

రాజీనామాకు సిద్ధపడ్డ ఆస్ట్రియా చాన్సెలర్

తాత్కాలిక నేతగా తెరపైకి క్రిస్టియన్ స్టాకర్ పేరు



కార్ల్ నెహామ్మెర్

వియన్నా: తదుపరి ఆస్ట్రియా చాన్సెలర్‌గా క్రిస్టియన్ స్టాకర్ పేరు ఖరారైంది. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సోషల్ డెమొక్రాట్ పార్టీతో చర్చలు విఫలం కావడంతో అధికారి పీపుల్స్ పార్టీకి చెందిన ప్రస్తుత చాన్సెలర్ కార్ల్ నెహామ్మెర్ త్వరలోనే రాజీనామా చేయనున్నట్లు శనివారం ప్రకటించారు. దీంతో, ఆస్ట్రియన్ పీపుల్స్ పార్టీ సమావేశమై పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉనన క్రిస్టియన్ స్టాకర్‌ను తాత్కాలిక నేతగా ప్రకటించింది. చాన్సెలర్ కార్ల్ ఒకట్రెండు రోజుల్లో అధ్యక్షుడు అలెగ్జాండర్ వాన్ డెర్ బెలెన్‌తో సమావేశం కానున్నారు. తదుపరి నిర్ణయాన్ని అధ్యక్షుడు బెలెన్ ప్రకటించనున్నారు. సోషల్ డెమొక్రాట్స్‌తో సంకీర్ణం ఏర్పాటుపై చర్చలు కొనసాగుతాయని పీపుల్స్ పార్టీ స్పష్టం చేసింది. ఆస్ట్రియా పార్లమెంట్ ఎంపీ, లాయర్ కూడా అయిన స్టాకర్ 2022 నుంచి పీపుల్స్ పార్టీకి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అనుభవశీలి, సంక్షోభాల పరిష్కారంలో సమర్థుడని ఆయనకు పేరుంది. ప్రభుత్వం తీసుకున్న అనేక వివాదాస్పద నిర్ణయాలను ఆయన సమర్థిస్తూ వస్తున్నారు.

బర్డ్ ఫ్లూతో పులులు, చిరుత మృతి

నాగ్‌పూర్ రెస్క్యూ సెంటర్‌లో ఘటన

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ సమీపంలోని గోరేవాడ రెస్క్యూ సెంటర్‌లో మరణించిన మూడు పులులు, ఒక చిరుత మృతికి బర్డ్‌ఫ్లూ కారణమని తేలింది. డిసెంబర్ చివరణ మృతి చెందిన వన్య మృగాలు ఏవియన్ ఫ్లూ హెచ్5ఎన్1 బారిన పడ్డాయని అధికారులు ధ్రువీకరించారు. దీంతో మహారాష్ట్ర అంతటా రెడ్ అలర్ట్ ప్రకటించారు. మనుషుల మీద దాడి నేపథ్యంలో డిసెంబర్‌లో వీటిని చంద్రాపూర్ నుంచి గొరేవాడకు తరలించారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 20న ఒక పులి, 23న రెండు పులులు మృతి చెందాయి. నమూనాలను భోపాల్‌లోని ఐసీఏఆర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ (నిషాద్)కు పంపించారు. ల్యాబ్ ఫలితాల్లో బర్డ్‌ఫ్లూతో జంతువులు మృతి చెందినట్లు నిర్ధారించారు. హెచ్5ఎన్1 వైరస్ మూలాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. బర్డ్ ఫ్లూ సోకిన జంతువులను వేటాడటం లేదా ముడి మాంసం తినడం వల్ల బర్డ్ ఫ్లూ వచ్చి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ మృతుల నేపథ్యంలో కేంద్రంలో ప్రస్తుతం ఉన్న 25 చిరుతలు, 12 పులులకు పరీక్షలు నిర్వహించారు. అన్ని ఆరోగ్యంగా ఉన్నట్లు తేలింది.

సోరోస్‌కు మెడల్ హాస్యాస్పదం: మస్క్

హిల్లరీ సహా 19 మందికి ప్రదానం చేసిన బైడెన్

వాషింగ్టన్ : బిలియనీర్ జార్జ్ సోరోస్‌కు అమెరికా అత్యున్నత పురస్కారాన్ని అందించడాన్ని టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ తప్పుబట్టారు. వివాదాస్పద నేపథ్యమున్న వ్యక్తికి అధ్యక్షుడు బైడెన్ మెడల్ ఆఫ్ ఫ్రీడం ప్రదానం చేయడం హాస్యాస్పదమన్నారు. నిక్కీ హేలీ, సెనేటర్ టిమ్ షీహీ సహా పలువురు రిపబ్లికన్ నేతలు ఈ నిర్ణయంపై మండిపడ్డారు. ప్రధాని మోదీని జార్జ్ సోరోస్ ఇటీవల బహిరంగంగా విమర్శించడం తెలిసిందే. ఆయనతో పాటు 19 మందికి అమెరికా అత్యున్నత పురస్కారమైన మెడల్ ఆఫ్ ఫ్రీడంను బైడెన్ ప్రదానం చేశారు. మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ, ఫుట్‌బాల్ స్టార్ లయొనెల్ మెస్సీ, నటుడు డెంజల్ వాషింగ్టన్ తదితరులు అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు. అవార్డు తీసుకునేందుకు వేదికనెక్కిన హిల్లరీకి స్టాండింగ్ ఒవేషన్ లభించింది. సోరోస్ తరపున ఆయన కుమారుడు అవార్డును స్వీకరించారు. ఈ గౌరవం తననెంతగానో కదిలించిందని సోరోస్ ఒక ప్రకటనలో తెలిపారు. వలసదారునైన తనకు అమెరికాలో స్వేచ్ఛ లభించిందన్నారు.

సిమ్లాలో ఘనంగా భుండా మహాయజ్ఞం

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్, సిమ్లాలోని స్పాల్ లోయలో అరుదైన, పురాతనమైన సంప్రదాయం మళ్లీ ప్రారంభమైంది. దేవంతలందరినీ ఏకం చేస్తుందని నమ్మే సాంస్కృతిక వారసత్వ ప్రదర్శనను పునరుద్ధరించారు. సిమ్లాలోని మారుమూలమైన దల్గావ్‌లో ధార్మిక కార్యక్రమం 'భుండా మహాయజ్ఞం' జరిగింది. ఈనెల 2న ప్రారంభమైన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. నాలుగురోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా స్పాల్ లోయను కలుపుతూ ఉండే రెండు పర్వతాల మధ్య ముంజి(పవిత్రమైన తాడు)పై జారే కార్యక్రమం శనివారం నిర్వహించారు. మరణలోయగా పిలుచుకునే స్పాల్ లోయలో ఒక కొండ నుంచి మరో కొండకు కనీసం ఒక కిలో మీటర్ దూరం ఉంటుంది. రెండు కొండలపైన ఉన్న వ్యక్తులు తాడును బిగ్గరగా పట్టుకోగా.. ఆ తాడును పట్టుకుని జారతారు. ఈ సాహసోపేతమైన కార్యక్రమాన్ని సూరత్ రామ్ అనే 65 ఏళ్ల వృద్ధుడు శనివారం ఆ తాడు గుండా జారాడు. మరో అంచున ఉన్న వ్యక్తుల చేతిలో తాడు చేజారింది. వెంటనే పట్టుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వేలాది మంది తరలివచ్చారు.

ఇజ్రాయెల్ టీనేజర్ బందీ వీడియో...

విడుదల చేసిన హమాస్

గుండె ముక్కలైందన్న తల్లిదండ్రులు ● క్షేమంగా విడుదల చేయించాలని డిమాండ్

జెరూసలేం: ఏడాదికి పైగా బందీగా ఉన్న 19 ఏళ్ల ఇజ్రాయెల్ సైనికురాలి వీడియోను హమాస్ విడుదల చేసింది. మూడున్నర నిమిషాల నిడివి ఉన్న వీడియోలో అల్‌బాగ్ హిబ్రూ భాషలో మాట్లాడారు. తనను 450 రోజులకు పైగా నిర్బంధించారని, ఇజ్రాయెల్‌తనను, ఇతర బందీలను మరిచిపోయిందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు తన వయసు 19 ఏళ్లని, కానీ ఇప్పుడు జీవితం మొత్తం తన కళ్లముందుందని చెప్పారు. వీడియో తమ గుండెను ముక్కలు చేసిందని అల్‌బాగ్ తల్లిదండ్రులు పేర్కొన్నారు. కూతురు వీడియో చూసిన అనంతరం వారు ఓ వీడియో ప్రకటన చేశారు. తమ కూతురు తీవ్ర మానసిక క్షోభను అనుభవించినట్లు కనిపిస్తోందన్నారు. ఆమె క్షేమంగా విడుదలయ్యేలా చూడాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుకు విజ్ఞప్తి చేశారు. బందీల కుటుంబాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో అల్‌బాగ్ కుటుంబ ప్రకటనపై ప్రధాని స్పందించారు. బందీలను స్వదేశానికి రప్పించేందుకు తమ ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని చెప్పారు. బందీలకు హాని తలపెట్టే సాహసం చేసే వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

కుటుంబం అనుమతితో...

సాధారణంగా కుటుంబ సభ్యుల అంగీకారం లేకుండా హమాస్ విడుదల చేసే బందీల ఫొటోలు, వీడియోలను ఇజ్రాయెల్ మీడియా ప్రచురించదు. వీడియోను విడుదల చేయడానికి అల్‌బాగ్ కుటుంబం తొలుత నిరాకరించినా.. తరువాత అంగీకరించింది. బందీల ఫొటోలు, వీడియోలను హమాస్ ప్రచురించడాన్ని ఇజ్రాయెల్ గతంలో ఖండించింది.

హమాస్ చెరలో 96 మంది..

ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి సమయంలో 250 మందిని బందీలుగా గాజాకు తరలించారు. వారిలో కొందరిని రక్షించారు. 34 మంది మరణించారు. ప్రస్తుతం హమాస్ చెరలో 96 మంది మిగిలారు. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్)లో నిఘా సైనికురాలిగా ఉన్న లిరీ అల్‌బాగ్‌ను గాజా సరిహద్దులోని నహల్ ఓజ్ సైనిక స్థావరంలో ఉండగా హమాస్ ఉగ్రవాదులు పట్టుకున్నారు. ఆమెతో పాటు మరో ఆరుగురిని సైతం బంధించారు. వీరిలో ఒకరిని రక్షించగా, మరొకరు హత్యకు గురయ్యారు. అల్‌బాగ్‌తోపాటు నలుగురు బందీలుగా మిగిలారు.

చర్చల నేపథ్యంలో వీడియో..

ఖతార్‌లో ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య ఏడాదిన్నరగా సాగుతున్న యుద్ధాన్ని ఆపేందుకు కాల్పుల విరమణ చర్చలు పునఃప్రారంభమయ్యాయి. చర్చల్లో మధ్యవర్తులుగా ఖతార్, ఈజిప్ట్, అమెరికాలు ఉన్నాయి. ఒప్పందం కోసం నెలల తరబడిగా చేస్తున్న ప్రయత్నాలు ఇంతవరకు ఎలాంటి పురోగతి సాధించలేదు. తాజాగా శుక్రవారం నుంచి గాజాపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 70 మంది మృతి చెందారు. ఈ నేపథ్యంలో హమాస్ లిరీ వీడియోను విడుదల చేసింది.

కుంభమేళాలో ముస్లింల మతమార్పిడి

తీవ్ర ఆరోపణలు చేసిన ఆలిండియా ముస్లిం జమాత్ అధ్యక్షుడు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని త్రివేణి సంగమంలో పుష్కరానికి ఒకసారి జరిగే మహా కుంభమేళా వేడుకలో ముస్లింల మతమార్పిడికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆలిండియా ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా షాహబుద్దీన్ రజ్వీ బరేల్వీ తీవ్ర ఆరోపణలు చేశారు. మహాకుంభమేళా జరిగే ప్రాంతం వైపు ముస్లింలు వెళ్లొద్దని ఇటీవల ఆదేశాలిచ్చిన బరేల్వీ తాజాగా మరో వివాదాస్పద వ్యాఖ్యలుచేశారు. '' హిందూ కార్యక్రమంలో ముస్లింల మతమార్పిడి తంతు జరగబోతున్నట్లు మాకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ విషయాన్ని రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ దృష్టికి తెస్తూ ఒక లేఖ రాశా. ఇక చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర సర్కార్‌దే'' అని బరేల్వీ అన్నారు. సనాతన ధర్మాన్ని పాటించే హిందువులు నడిపే దుకాణాల నుంచి పూజాసామగ్రిని కొనుగోలుచేయాలని రాబోయే భక్తులకు గతంలో అఖిలభారతీయ అఖాడ పరిషత్ పిలుపునిచ్చి తరుణంలో భిన్నమైన ఆరోపణలు వెల్లువెత్తడం గమనార్హం. కుంభమేళా ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13వ తేదీ నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు జరగనుంది. కుంభమేళా జరిగే ప్రాంతాల్లో స్థానిక ముస్లింలు వ్యాపారాలు చేసుకోకుండా అడ్డుకోవాలని ఉద్దేశంతో కొన్ని హిందూ సంస్థలు కుట్రలు పన్నుతున్నాయని ముస్లిం, ఇతర మతాల నేతలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఆలిండియా షియా పర్సనల్ లా బోర్డ్ ప్రధాన కార్యదర్శి మౌలానా యాసూబ్ అబ్బాస్ మరోలా స్పందించారు. ''ముస్లింలు కుంభమేళా పరిసరాలకు వెళ్లినా ముస్లింలకు వచ్చే నష్టమేమీలేదు. ఒక ప్రార్థనా స్థలానికి వెళ్లినంత మాత్రాన ముస్లిం వ్యక్తి తన మత విశ్వాసాన్ని మార్చుకునేంత బలహీన స్థాయిలో ఇస్లాం లేదు'' అని అన్నారు.



నువ్వానేనా అన్నట్లుగా సాగుతున్న ఎడ్ల బండ్ల పోటీని జనం ఆసక్తిగా తిలకిస్తున్న దృశ్యమిది. మహారాష్ట్రలోని సతారా జిల్లా కరాడ్ గ్రామంలో ఆదివారం ఈ పోటీలు జరిగాయి.


సాక్షి ప్లస్
సోమవారం | 6-1-2025

జైన అశోకుడిగా పేరొందిన మౌర్య పాలకుడు ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



మతోద్యమాలు

1. భారతదేశంలో నూతన మతోద్యమాల కాలం ఏది?
   ఎ) క్రీ.పూ. ఆరో శతాబ్దం
   బి) క్రీ.పూ. అయిదో శతాబ్దం
   సి) క్రీ.పూ. నాలుగో శతాబ్దం
   డి) క్రీ.పూ. రెండో శతాబ్దం
2. అజీవక మత స్థాపకుడు ఎవరు?
   ఎ) గోసాలపుత్త బి) అలరకలామ
   సి) ఉద్దక రామపుత్త డి) పార్శ్వనాథ
3. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) జైనమతంలో మొత్తం తీర్థంకరుల సంఖ్య 24
   బి) మొదటి తీర్థంకరుడు రుషభనాథుడు
   సి) చివరి తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడు
   డి) పైవన్నీ
4. చార్వాక మత స్థాపకుడు ఎవరు?
   ఎ) అలరకలామ బి) నేమినాథ
   సి) అజితకేశకంబళిన్ డి) ఆదినాథ
5. జతపరచండి.

గ్రూప్-ఎ	గ్రూప్-బి
1. సల్లేఖన	i. జైనులు ఆచరించే వ్రతం
2. శాద్వాదం	ii. జైనతత్వం
3. విద్యాదేవి	iii. జైనులు ఆరాధించే స్త్రీ దేవత
4. అంగాలు	iv. జైనుల పవిత్ర గ్రంథాలు
5. దిగంబర, శ్వేతాంబర	v. జైనమత శాఖలు

   ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
   బి) 1-iv, 2-v, 3-iii, 4-ii, 5-i
   సి) 1-ii, 2-i, 3-v, 4-iii, 5-iv
   డి) 1-v, 2-iv, 3-i, 4-iii, 5-ii
6. బౌద్ధమతంలో తాంత్రిక శాఖ ఏది?
   ఎ) హీనయానం బి) వజ్రయానం
   సి) మహాయానం డి) ఏదీకాదు
7. బుద్ధుడి తొలి గురువు ఎవరు?
   ఎ) అలరకలామ బి) ఉద్దక రామపుత్త
   సి) ఎ, బి డి) ఎవరూకాదు
8. కింది వాటిలో సరైన వాక్యం ఏది?
   ఎ) బుద్ధుడు ప్రతిపాదించిన సిద్ధాంతం - ప్రతీత్య సముత్పాద
   బి) బౌద్ధమతం ఆచరించేవారు - ఉపాసికులు, భిక్షువులు
   సి) బౌద్ధమత ముఖ్య శాఖలు - హీనయానం, మహాయానం
   డి) పైవన్నీ
9. చారిత్రకంగా జైన మతాన్ని స్థాపించినవారు ఎవరు?
   ఎ) పార్శ్వనాథ బి) సంభవనాథ
   సి) రుషభనాథ డి) వర్ధమాన మహావీర
10. 'తీర్థంకరుడు' అంటే అర్థం ఏమిటి?
   ఎ) మోక్షం ప్రసాదించేవాడు
   బి) సంసార నావ దాటించేవాడు
   సి) మార్గం చూపేవాడు డి) బి, సి
11. క్రీ.పూ. ఆరో శతాబ్దంలో నూతన మతాలు ఏర్పడటానికి కారణం?
   ఎ) హిందూ మతం పవిత్రత కోల్పోవడం
   బి) బ్రాహ్మణుల ఆధిపత్య ధోరణి
   సి) కర్మకాండలకు ప్రాముఖ్యం ఇవ్వడం
   డి) పైవన్నీ
12. మొదటి తీర్థంకరుడైన రుషభనాథుడిని నారాయణుడి అవతారంగా పేర్కొన్న పురాణం ఏది?
   ఎ) విష్ణు పురాణం
   బి) భాగవత పురాణం
   సి) బ్రహ్మవైవర్త పురాణం
   డి) ఎ, బి
13. జైనులను ప్రారంభంలో 'నిగ్రంథులు' అని పిలిచేవారు. నిగ్రంథులు అంటే అర్థం?
   ఎ) మార్గం చూపేవారు
   బి) మోక్షాన్ని ప్రసాదించేవారు
   సి) బంధాల నుంచి బయటపడిన వారు
   డి) ఏదీకాదు
14. తీర్థంకరులు, వారి చిహ్నాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

గ్రూప్-ఎ	గ్రూప్-బి
1. రుషభనాథ	i. సింహం
2. అజితనాథ	ii. పాము
3. అరిష్టనేమి	iii. శంఖం
4. పార్శ్వనాథ	iv. ఏనుగు
5. వర్ధమాన మహావీర	v. వృషభం

   ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
   బి) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
   సి) 1-iv, 2-v, 3-i, 4-iii, 5-ii
   డి) 1-iii, 2-ii, 3-v, 4-i, 5-iv
15. పార్శ్వనాథుడికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
   ఎ) కాశీ రాజ్యానికి చెందినవాడు
   బి) వర్ధమానుడి కంటే 250 ఏళ్ల ముందు జీవించాడు
   సి) పార్శ్వనాథుడి తల్లిదండ్రులు - అశ్వసేనుడు, వామలాదేవి
   డి) పైవన్నీ
16. జైనమత పంచ సూత్రాల్లో నాలిగింటిని పార్శ్వనాథుడు రూపొందించగా, వాటికి బ్రహ్మచర్య సూత్రాన్ని చేర్చింది ఎవరు?
   ఎ) వర్ధమాన మహావీరుడు
   బి) నేమినాథ సి) సంభవనాథ
   డి) అరిష్టనేమి
17. మహావీరుడు ఎవరి అనుమతితో సన్యాసం స్వీకరించాడు?
   ఎ) తల్లి - త్రిసల బి) భార్య - యశోద
   సి) అన్నయ్య - నందివర్ధన
   డి) పైన పేర్కొన్న ఎవరూ కాదు
18. వర్ధమానుడికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) బిరుదులు- జినుడు, మహావీర, కేవలి
   బి) జ్ఞానోదయం పొందిన స్థలం- జృంభిక గ్రామం
   సి) నిర్యాణం చెందిన ప్రాంతం- పావాపురి
   డి) పైవన్నీ
19. జైన పంచ సూత్రాలను సంబంధించి కింది వాటిని జతపరచండి.

గ్రూప్ - ఎ	గ్రూప్ - బి
1. అహింస	i. హింసకు పాల్పడవద్దు
2. అసత్యం పలకరాదు	ii. సత్యం పలకాలి
3. అనస్తేయ	iii. దొంగతనం చేయకూడదు
4. అపరిగ్రహ	iv. ఆస్తులు కలిగి ఉండకూడదు
5. బ్రహ్మచర్యం	v. వివాహం చేసుకోవద్దు

   ఎ) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
   బి) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
   సి) 1-iv, 2-v, 3-ii, 4-iii, 5-i
   డి) 1-v, 2-ii, 3-i, 4-iii, 5-iv
20. గణాధారులు అంటే..?
   ఎ) వర్ధమానుడి ప్రత్యక్ష శిష్యులు
   బి) గౌతమ బుద్ధుడి శిష్యులు
   సి) అజీవక మతాన్ని అవలంబించేవారు
   డి) చార్వాక సిద్ధాంతాన్ని నమ్మినవారు
21. జైన సంఘం మొదటి థేర(అధ్యక్షుడు)ఎవరు?
   ఎ) భద్రబాహు బి) స్థూల భద్ర
   సి) ఆర్య సుదర్శన్ డి) జామాలి
22. ఆరో థేర అయిన భద్రబాహు మగధలో క్షామం వల్ల దక్షిణ భారతదేశానికి వలస వచ్చినట్లు తెలియజేస్తున్న గ్రంథం ఏది?
   ఎ) గాథాకోశ బి) పరిశిష్టపర్వన్
   సి) యశస్థిలక డి) వైరాగ్య తరంగం
23. జైనుల ప్రార్థనా మందిరాలను ఏమంటారు?
   ఎ) బసది బి) విహారం
   సి) చైత్యం డి) పైవేవీకాదు
24. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) మొదటి జైన సంగీతి స్థూలభద్రుడి అధ్యక్షతన పాటలీపుత్రంలో జరిగింది
   బి) మొదటి జైన సంగీతిలో మహావీరుడి బోధనలను 12 అంగాలుగా అర్ధమాగధి భాషలో రచించారు
   సి) రెండో జైన సంగీతి వల్లభి (గుజరాత్)లో దేవర్ధి క్షమశ్రమణుడి అధ్యక్షతన జరిగింది
   డి) పైవన్నీ
25. దక్షిణ భారతదేశానికి వచ్చి సల్లేఖన వ్రతం ఆచరించిన ప్రముఖ మగధ పాలకుడు?
   ఎ) అశోకుడు బి) చంద్రగుప్తమౌర్య
   సి) ఉదయన డి) బిందుసార
26. జైన అశోకుడిగా పేరు పొందిన మౌర్య పాలకుడు ఎవరు?
   ఎ) కునాల బి) బృహద్రథ
   సి) సంప్రతి డి) తివర
27. చాముండరాయ నిర్మించిన గోమతేశ్వర/బాహుబలి విగ్రహం కర్ణాటకలోని ఏప్రాంతంలో ఉంది?
   ఎ) ఐహోల్ బి) శ్రావణ బెళగొళ
   సి) పట్టడకల్ డి) హంపి
28. జైన మతాభిమాని అయిన ప్రముఖ కళింగ పాలకుడు ఎవరు?
   ఎ) ఖారవేలుడు బి) ప్రతాపరుద్రుడు
   సి) నరసింహదేవ డి) అనంతచోడగాంగ
29. జైనమతాన్ని అవలంబించిన రాష్ట్రకూట రాజు?
   ఎ) అమోఘవర్షుడు బి) నాలుగో ఇంద్రుడు
   సి) ఎ, బి డి) ఎవరూ కాదు
30. జతపరచండి.

గ్రూప్-ఎ	గ్రూప్-బి
1. మాయావతి	i. బుద్ధుడి తపస్సు సమయంలో అతడిని వృక్షదేవతగా ఆరాధించిన స్త్రీ
2. ప్రజాపతి గౌతమి	ii. బుద్ధుడి ద్వారా జనన మరణాల జ్ఞానం పొందిన మహిళ
3. యశోధర	iii. బుద్ధుడి భార్య
4. కిసగౌతమి	iv. బుద్ధుడిని పెంచిన తల్లి
5. సుజాత	v. బుద్ధుడికి జన్మనిచ్చిన తల్లి

   ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
   బి) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
   సి) 1-ii, 2-iii, 3-iv, 4-i, 5-v
   డి) 1-iii, 2-v, 3-ii, 4-i, 5-iv
31. బుద్ధుడికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) జ్ఞానోదయం కలిగిన గ్రామం ఉరువేలా
   బి) జ్ఞానోదయం పొందిన రోజు వైశాఖ శుద్ధ పూర్ణిమ
   సి) మహాపరినిర్యాణం చెందిన ప్రాంతం కుశినగరం
   డి) పైవన్నీ
32. బుద్ధుడి కర్మకాండలను ఏ రాజ్యంలో నిర్వహించారు?
   ఎ) వైశాలి బి) మల్ల
   సి) గాంధార డి) విజ్జి
33. బుద్ధుడి జీవితంలో 5 ప్రధాన ఘట్టాలను పంచకల్యాణాలు అంటారు. ఆ సంఘటన వాటికి సంబంధించిన చిహ్నాలను జతపరచండి.

గ్రూప్-ఎ	గ్రూప్-బి
1. జననం	i. తామర పువ్వు
2. మహాభినిష్క్రమణం	ii. గుర్రం
3. జ్ఞానోదయం	iii. రావిచెట్టు
4. ధర్మచక్ర పరివర్తనం	iv. చక్రం
5. మహాపరినిర్యాణం	v. స్తూపం

   ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
   బి) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
   సి) 1-ii, 2-iv, 3-v, 4-i, 5-iii
   డి) 1-iii, 2-i, 3-iv, 4-v, 5-ii
34. ఆర్య సత్యాలు, అష్టాంగ మార్గాలను బోధించింది ఎవరు?
   ఎ) వర్ధమాన మహావీరుడు
   బి) బుద్ధుడు సి) పార్శ్వనాథుడు
   డి) అజితనాథుడు
35. సంస్కృతం స్వీకరించక పూర్వం బౌద్ధమతస్థులు ఉపయోగించిన భాష ఏది?
   ఎ) ప్రాకృతం బి) అర్ధమాగధి
   సి) పాళీ డి) దేశీ
36. కింది వాటిలో సరైన జత?
   ఎ) వినయ పీఠిక - ఉపాలి
   బి) సుత్త పీఠిక - ఆనందుడు
   సి) అభిదమ్మ పీఠిక- వసుబంధు
   డి) పైవన్నీ
37. బుద్ధుడి పూర్వ జన్మలు తెలియజేసే జాతక కథలు ఏ పీఠికలో ఉన్నాయి?
   ఎ) సుత్త పీఠిక బి) వినయ పీఠిక
   సి) అభిదమ్మ పీఠిక డి) పైవేవీ కావు
38. బౌద్ధమతాన్ని స్వీకరించిన మొదటి మహిళ?
   ఎ) యశోధర బి) కిసగౌతమి
   సి) ప్రజాపతి గౌతమి డి) సుజాత
39. బౌద్ధమత ప్రార్థనా మందిరాలను ఏమంటారు?
   ఎ) విహారం బి) చైత్యం
   సి) స్తూపం డి) బసది
40. బౌద్ధ సంగీతులు, అధ్యక్షులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

గ్రూప్ - ఎ	గ్రూప్ - బి
1. మొదటి బౌద్ధ సంగీతి	i. మహాకశ్యప
2. రెండో బౌద్ధ సంగీతి	ii. సభాకామి
3. మూడో బౌద్ధ సంగీతి	iii. మొగలిపుత్త తిస్య
4. నాలుగో బౌద్ధ సంగీతి	iv. వసుమిత్రుడు

   ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv
   బి) 1-iv, 2-iii, 3-ii, 4-i
   సి) 1-ii, 2-i, 3-iv, 4-iii
   డి) 1-iii, 2-iv, 3-i, 4-ii
41. బౌద్ధ సంగీతులు జరిగిన ప్రదేశాలు, నిర్వహించిన రాజులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

గ్రూప్ - ఎ	గ్రూప్ - బి
1. రాజగృహం	i. అజాతశత్రువు
2. వైశాలి	ii. కాలాశోకుడు
3. పాటలీపుత్రం	iii. అశోకుడు
4. కుందలవనం	iv. కనిష్కుడు

   ఎ) 1-iv, 2-iii, 3-ii, 4-i
   బి) 1-i, 2-ii, 3-iii, 4-iv
   సి) 1-iii, 2-iv, 3-i, 4-ii
   డి) 1-ii, 2-iii, 3-iv, 4-i
42. ఎన్నో బౌద్ధ సంగీతిలో బౌద్ధమతం హీనయాన, మహాయాన శాఖలుగా చీలిపోయింది?
   ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
43. అశోకుడు తన కుమార్తె సంఘమిత్ర, కుమారుడు మహేంద్రను బౌద్ధమత వ్యాప్తి కోసం ఏ దేశం పంపించాడు?
   ఎ) శ్రీలంక బి) నేపాల్
   సి) భూటాన్ డి) చైనా
44. శ్రీలంకకు చెందిన ప్రముఖ బౌద్ధ గ్రంథం?
   ఎ) దీపవంశ బి) మహావంశ
   సి) చుళవంశ డి) పైవన్నీ

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) డి; 4) సి; 5) ఎ; 6) బి; 7) సి; 8) డి; 9) ఎ; 10) డి; 11) డి; 12) డి; 13) సి; 14) బి; 15) డి; 16) ఎ; 17) సి; 18) డి; 19) బి; 20) ఎ; 21) సి; 22) బి; 23) ఎ; 24) డి; 25) బి; 26) సి; 27) బి; 28) ఎ; 29) సి; 30) బి; 31) డి; 32) బి; 33) ఎ; 34) బి; 35) సి; 36) డి; 37) ఎ; 38) సి; 39) బి; 40) ఎ; 41) బి; 42) డి; 43) ఎ; 44) డి.

సంతాల్ జనాభా ఉన్న రాష్ట్రాలు ఏవి?

భారతదేశం సంక్షేమ రాజ్యం. ఈ భావనను దృష్టిలో ఉంచుకొని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఇవి సక్రమంగా అమలయ్యేందుకు, వనరుల సమర్థ వినియోగానికి జనాభా లెక్కలను సేకరించడం తప్పనిసరి. జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'డెమోగ్రఫీ' అంటారు. దేశంలో తొలిసారిగా 1872లో జనాభా లెక్కల సేకరణ మొదలైంది. 1881 నుంచి ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కలను సేకరిస్తున్నారు.



జనాభా

భారతదేశ జనాభాలో విభిన్న శారీరక లక్షణాలు కనిపిస్తాయి. ప్రాచీన కాలం నుంచి వివిధ దేశాలకు చెందినవారు భారతదేశంలోకి ప్రవేశించి సాంఘికంగా, సాంస్కృతికంగా ఇక్కడి సమాజంలో కలిసిపోయారు. వీరు స్థానికులతో వివాహ సంబంధాలు ఏర్పర్చుకున్నారు. ఫలితంగా విభిన్న శారీరక లక్షణాలున్న సంతతి ఉద్భవించిందని ఆంత్రోపాలజిస్టుల అభిప్రాయం.

'రిస్లే' అనే ఆంత్రోపాలజిస్టు శారీరక లక్షణాల ఆధారంగా ప్రపంచ జనాభాను ఆరు జాతులుగా విభజించారు. ఏ దేశ జనాభాలోనైనా ఒక జాతి లేదా రెండు జాతుల లక్షణాలు ఉంటాయి. కానీ భారతదేశంలో మాత్రమే ప్రపంచంలోని ఆరు జాతుల లక్షణాలు కనిపిస్తాయి. అవి...

ఎ నీగ్రిటోలు

దేశంలోకి మొదటిసారిగా వలస వచ్చిన జాతిగా వీరిని పేర్కొనవచ్చు. అండమాన్ నికోబార్ దీవుల్లో నివసించే షోంపైన్స్, జార్వాస్, ఓంజెస్ లాంటి తెగలలో, కేరళలోని పులియాన్స్ తెగలలో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి.

బి ప్రోటో ఆస్ట్రలాయిడ్స్

మధ్య భారతదేశంలో నివసించే గోండులు, ముండాలు, భిల్లులు, ఒరేన్‌లు, సంతాలులు, చెంచులు, కురుంబాలు లాంటి గిరిజన తెగలలో ఈ లక్షణాలు కనిపిస్తాయి.

సి మెడిటరేనియన్

వీరినే ద్రవిడులు అని కూడా పిలుస్తారు. దక్షిణ భారతదేశంలో నివసించే ప్రజలను ఈ జాతి సంతతిగా పేర్కొంటారు. వీరినే సింధూ నాగరికత ప్రజల సంతతిగా పేర్కొనవచ్చు. ద్రవిడ ప్రజల జీవన విధానంలో సింధూ నాగరికత ప్రజల సాంస్కృతిక లక్షణాలు ఇప్పటికీ కనిపిస్తాయి.

డి మంగోలాయిడ్స్

ఈశాన్య భారతదేశంలోని అసోం, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ప్రజల్లో, అండమాన్‌లోని 'సెంటినీలీస్' అనే తెగలో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి. ఈ జాతి ప్రజల శరీరంలో 'ఎపికాంతిక్ ఐలిడ్' అనే ప్రత్యేక లక్షణం కనిపిస్తుంది.

ఇ బ్రాకీ సెఫాలస్

వీరినే కాకసాయిడ్ జాతి ప్రజలుగా పేర్కొంటారు. ఈ జాతి వారిలో తల వెడల్పుగా ఉంటుంది. గుజరాత్,మహారాష్ట్రలోని మార్వాడీలు, పశ్చిమ బెంగాల్‌లోని నయనార్ క్షత్రియులు, నంబూద్రీ బ్రాహ్మణుల్లో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి.

ఎఫ్ నార్డిక్స్

వీరినే ఆర్యన్లు అని పిలుస్తారు. భారతదేశంలోకి చివరిసారిగా వలస వచ్చిన జాతిగా వీరిని పేర్కొనవచ్చు. ఈ జాతి లక్షణాలున్న సంతతి ప్రస్తుతం పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లోని రాజపుత్రులు, జాట్‌లలో కనిపిస్తుంది.

జనాభా లెక్కల సేకరణ (2011)

ఒక నిర్దిష్ట ప్రాంతంలో తమలో తాము అంతః ప్రజననం జరుపుకునే, నిర్దిష్ట ఆవాసంలో నివసించే ప్రజా సమూహమే జనాభా. ఇంటింటి సర్వే ద్వారా శాస్త్రీయ పద్ధతిలో జనాభా, దాని అనుబంధ అంశాలను సేకరించే పద్ధతినే జనాభా లెక్కల సేకరణ అంటారు.

భారతదేశం సంక్షేమ రాజ్యం. ఈ భావనను దృష్టిలో ఉంచుకొని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఇవి సక్రమంగా అమలయ్యేందుకు, వనరుల సమర్థ వినియోగానికి జనాభా లెక్కల సేకరణ తప్పనిసరి. జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'డెమోగ్రఫీ' అని అంటారు.

- ప్రపంచంలో మొదటిసారిగా 1841లో ఆధునిక జనాభా లెక్కల సేకరణ ఇంగ్లండ్‌లో ప్రారంభమైంది. 1872లో భారతదేశంలో జన గణన మొదలైంది. 1881 నుంచి పదేళ్లకు ఒకసారి క్రమం తప్పకుండా మన దేశంలో జనాభా లెక్కలను సేకరిస్తున్నారు.
- 2011 జనాభా లెక్కల సేకరణ 15వది, స్వాతంత్ర్యం వచ్చాక ఏడోది. ఈ జనాభా లెక్కల సేకరణ 2010 ఏప్రిల్ 1న ప్రారంభమై 2011 మార్చిలో ముగిసింది. ప్రపంచ జనాభాలో భారతదేశ జనాభా 17.5 శాతం. అత్యధిక జనాభా ఉన్న దేశాల జాబితాలో భారతదేశం తొలి స్థానంలో ఉండగా, చైనా రెండో స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో వరసగా అమెరికా, ఇండోనేసియా, బ్రెజిల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ ఉన్నాయి.
- 2011 మార్చి 1 నాటికి దేశ జనాభా 1.21 బిలియన్లు దాటింది. 2001 నాటికి దేశ జనాభా 1.02 బిలియన్లు ఉండేది. అంటే పదేళ్లలో దేశ జనాభా 18.196 కోట్లు పెరిగింది.
- 1991-2001 దశాబ్దంలో జనాభా వృద్ధిరేటు 21.54 శాతం. కాగా, 2001-11 మధ్యకాలంలో అది 17.7 శాతానికి తగ్గింది.
- 1991-2001 దశాబ్దంలో జనాభా వార్షిక వృద్ధిరేటు 1.9 శాతం కాగా 2001-11లో 1.64 శాతానికి తగ్గింది.
- జనసాంద్రత 2001లో చ.కి.మీ.కు 325 ఉంటే, అది 2011లో 382కు పెరిగింది.
- అక్షరాస్యత 2001 మార్చి 1 నాటికి 64.38 శాతం కాగా, 2011 మార్చి నాటికి 74.04 శాతానికి పెరిగింది.
- లింగనిష్పత్తి 2001 మార్చి 1 నాటికి 933 ఉంటే, 2011 మార్చి 1 నాటికి 943కి పెరిగింది. ప్రతి వెయ్యి మంది పురుషులకు ఉన్న స్త్రీల సంఖ్యను లింగనిష్పత్తి అంటారు. దేశంలోకెల్లా అత్యుత్తమంగా కేరళలో లింగనిష్పత్తి 1084:1000గా ఉంది.
- దేశంలో అత్యధిక జనాభా ఉన్న మొదటి ఐదు రాష్ట్రాలు... ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్).
- దేశంలో తక్కువ జనాభా ఉన్న మొదటి నాలుగు రాష్ట్రాలు... సిక్కిం, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్, గోవా.
- అత్యధిక జనసాంద్రత ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... బిహార్, పశ్చిమ బెంగాల్, కేరళ, ఉత్తరప్రదేశ్.
- అత్యల్ప జనసాంద్రత ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం, సిక్కిం, నాగాలాండ్.
- అత్యధిక జనసాంద్రత ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు.. ఢిల్లీ, చండీగఢ్.
- అత్యల్ప జనసాంద్రత ఉన్న తొలి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు... అండమాన్ నికోబార్ దీవులు, దాద్రా నగర్ హవేలీ.
- జనాభా దశాబ్దపు వృద్ధిరేటు ఎక్కువగా ఉన్న మొదటి నాలుగు రాష్ట్రాలు... మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్, జమ్మూ-కశ్మీర్.
- జనాభా దశాబ్దపు వృద్ధిరేటు తక్కువగా ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... నాగాలాండ్, కేరళ, గోవా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్.
- దేశంలో అత్యధిక అక్షరాస్యత ఉన్న మొదటి రెండు రాష్ట్రాలు... కేరళ, మిజోరాం.
- దేశంలో తక్కువ అక్షరాస్యత ఉన్న మొదటి రెండు రాష్ట్రాలు... బిహార్, అరుణాచల్‌ప్రదేశ్.
- దేశంలో అత్యధిక అక్షరాస్యత ఉన్న మొదటి రెండు జిల్లాలు మిజోరాంలో ఉన్నాయి. అవి.. సెర్‌చ్చిప్, ఐజ్వాల్.
- దేశంలో అక్షరాస్యత తక్కువ ఉన్న మొదటి రెండు జిల్లాలు... మధ్యప్రదేశ్‌లోని అలిరాజ్‌పూర్, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్.
- 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 10.43 కోట్ల(8.6 శాతం) మంది షెడ్యూల్డ్ తెగలకు చెందినవారు.
- ఎస్టీ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం మధ్యప్రదేశ్, తక్కువగా ఉన్న రాష్ట్రం సిక్కిం.
- ఎస్టీ జనాభా శాతం అధికంగా ఉన్న రాష్ట్రం మిజోరాం, తక్కువగా ఉన్న రాష్ట్రం గోవా.
- ఎస్టీ జనాభా లేని రాష్ట్రాలు... పంజాబ్, హర్యానా.
- 2011 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) జనాభా శాతం 16.6. సంఖ్యాపరంగా 20.14 కోట్లు.
- ఎస్సీ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్. తక్కువగా ఉన్న రాష్ట్రం మిజోరాం.
- ఎస్సీ జనాభా శాతం అధికంగా ఉన్న రాష్ట్రం పంజాబ్, తక్కువగా ఉన్నది మిజోరాం.
- ఎస్సీ జనాభా లేని రాష్ట్రం నాగాలాండ్

గతంలో అడిగిన ప్రశ్నలు

1. సంతాల్ జనాభా ఉన్న రాష్ట్రాలు ఏవి? (2011, A.S.O)
   ఎ) మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్
   బి) కర్ణాటక, పశ్చిమబెంగాల్
   సి) ఉత్తరప్రదేశ్, జార్ఖండ్
   డి) జార్ఖండ్, పశ్చిమ బెంగాల్
2. మేఘాలయ ప్రత్యేకంగా గిరిజన రాష్ట్రం. ఆ రాష్ట్రంలో నివసించే గిరిజన తెగలేవి? (2001, J.L.)
   ఎ) ఖాసీలు, ఉషరీలు, లభీర్లు
   బి) ఖాసీలు, జయంతియాలు, గారోలు
   సి) జయంతియాలు, గారోలు, కుర్కిలు
   డి) గారోలు, ఫాంగులు, హామ్‌రో
3. జనాభాపరంగా దేశంలో అతిచిన్న రాష్ట్రం ఏది? (2011, D.L.)
   ఎ) నాగాలాండ్ బి) అసోం
   సి) సిక్కిం డి) కేరళ
4. ఇండియాలో అత్యధిక అక్షరాస్యత ఉన్న జిల్లా ఏది? (2011, D.L.)
   ఎ) సెర్‌చ్చిప్ బి) గుంటూరు
   సి) మిడ్నాపూర్ డి) గాజామ్
5. 'తోడా' అనే తెగలు ఏ రాష్ట్రంలో నివసిస్తున్నాయి? (2002, AEEs)
   ఎ) రాజస్థాన్ బి) మధ్యప్రదేశ్
   సి) అసోం డి) తమిళనాడు
6. భారతదేశంలోని గిరిజనుల్లో సంఖ్యాపరంగా ఎక్కువగా ఉన్నవారు? (2011, Gr-II)
   ఎ) సంతాలులు బి) భిల్లులు
   సి) ముండాలు డి) నాగాలు

సమాధానాలు

1) డి; 2) బి; 3) సి; 4) ఎ; 5) డి; 6) బి.

మాదిరి ప్రశ్నలు

1. 'మీనా' జాతికి చెందిన తెగల వారు ఏ రాష్ట్రంలో అధికంగా నివసిస్తున్నారు?
   ఎ) గుజరాత్ బి) అసోం
   సి) రాజస్థాన్ డి) మధ్యప్రదేశ్
2. 2011లో జరిగిన జన గణన స్వాతంత్ర్యానంతరం ఎన్నోది?
   ఎ) 15 బి) 7 సి) 8 డి) 9
3. కింది వాటిలో అధిక జనాభా ఉన్న రాష్ట్రాల అవరోహణ క్రమాన్ని గుర్తించండి?
   ఎ) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్
   బి) మధ్యప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్
   సి) రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్
   డి) ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్
4. 2011 జనాభా లెక్కల ప్రకారం జనాభావృద్ధి రేటు అధికంగా ఉన్న రాష్ట్రం?
   ఎ) అరుణాచల్ ప్రదేశ్
   బి) మేఘాలయ సి) బిహార్
   డి) జమ్మూ-కశ్మీర్
5. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో జనసాంద్రత ఎంత?
   ఎ) 325 బి) 267
   సి) 382 డి) 176
6. 2011 జనాభా లెక్కల ప్రకారం అత్యధిక జనసాంద్రత ఉన్న జిల్లా ఏది?
   ఎ) దిబాంగ్ వ్యాలీ బి) యానాం
   సి) అంజాన్ డి) నార్త్ ఈస్ట్ ఢిల్లీ
7. కిందివాటిలో అండమాన్ నికోబార్ దీవుల్లో నివసించని తెగ ఏది?
   ఎ) షోంపైన్స్ బి) జార్వాస్
   సి) సెంటినీలీస్ డి) మోప్లాలు
8. జనాభా లెక్కల సేకరణకు సంబంధించి ఏ సంవత్సరాన్ని 'గొప్ప విభాజక సంవత్సరం'గా పేర్కొంటారు?
   ఎ) 1911 బి) 1901
   సి) 1921 డి) 1931
9. మానవ జనాభా 'గుణమధ్యమం'(జియోమెట్రిక్) రేటులో పెరుగుతుండగా, వనరులు మాత్రం 'అంకమధ్యమం' (అర్థమెటిక్) రేటులో పెరుగుతున్నాయని తెలిపిన శాస్త్రవేత్త ఎవరు?
   ఎ) మాల్థస్ బి) కీన్స్
   సి) రికార్డో డి) రొనాల్డ్ రాస్

సమాధానాలు

1) సి; 2) బి; 3) ఎ; 4) బి; 5) సి; 6) డి; 7) డి; 8) సి; 9) ఎ.


కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

పటిష్టమైన ప్రణాళికతోనే ఆశించిన పురోగతి

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ



ప్రణాళికా వ్యూహాలు

వ్యూహం అనే విస్తృత భావనలో అభివృద్ధి ప్రణాళికకు సంబంధించిన విధానపర చర్యలు ఇమిడి ఉంటాయి. భారతదేశంలో ప్రణాళికలకు సంబంధించిన వ్యూహాల్లో పేదరికం, అల్పాభివృద్ధి లాంటి సమస్యల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారు. పరిమాణం, పెట్టుబడుల పంపిణీ ప్రక్రియ, వనరుల సమీకరణ, ప్రభుత్వ రంగ పాత్ర తదితర అంశాలకు చెందిన విధానాలను ప్రణాళికల్లో అవలంబించారు.

భారత్‌లో ఆర్థిక ప్రణాళికల వ్యూహాన్ని ప్రభావితం చేసిన అంశాలు

1) మహలనోబిస్ వృద్ధి నమూనా
2) భారీ పరిశ్రమల వ్యూహం
3) ఉపాధి లక్ష్యం
4) సామాజిక లక్ష్యాలు; వృద్ధి, అసంతులిత వృద్ధి మధ్య వ్యూహం.

మొదటి పంచవర్ష ప్రణాళిక

విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, సాంఘిక పరిస్థితులను మెరుగుపరచడం లాంటి అంశాలకు ప్రాధాన్యమిస్తూ మొదటి పంచవర్ష ప్రణాళిక వ్యూహాన్ని ఖరారు చేశారు.

రెండో పంచవర్ష ప్రణాళిక

రెండో పంచవర్ష ప్రణాళికలో భారీ పరిశ్రమల అభివృద్ధి, ప్రజలకు సాంఘిక సేవల కల్పనపై దృష్టి సారించారు. ప్రొఫెసర్ పి.సి. మహలనోబిస్ రష్యా అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రెండో ప్రణాళికకు అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించారు.

రెండో ప్రణాళికలో అవలంబించిన వ్యూహంలోని ముఖ్యాంశాలు:

- మహలనోబిస్ ప్రకారం.. భారీ పరిశ్రమల్లో పెట్టుబడి పెంపు, సేవలపై వ్యయం పెంపు, కొనుగోలు శక్తి పెంపు ద్వారా నూతన డిమాండ్‌ను సృష్టించడం; చిన్న తరహా, గృహ పరిశ్రమల్లో పెట్టుబడి, ఉత్పత్తిని అధికం చేయడం ద్వారా నూతన డిమాండ్‌కు అనుగుణంగా వినియోగ వస్తువుల సరఫరా పెంచడం లాంటివి అభివృద్ధి వ్యూహంలో ప్రధాన అంశాలు.
- మహలనోబిస్ పెట్టుబడి వ్యూహంలో ప్రభుత్వ రంగానికి ప్రాధాన్యమిచ్చారు.
- నెహ్రూ – మహలనోబిస్ అభివృద్ధి నమూనా రెండో ప్రణాళిక రూపకల్పన సమయంలో వెలువడింది. ఇందులో అభివృద్ధికి సంబంధించి దీర్ఘ కాలిక లక్ష్యాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అధిక పెట్టుబడి రేటు సాధన కోసం పొదుపు రేటును పెంచడం, భారీ పరిశ్రమలకు ప్రాధాన్యమివ్వడం, నూతన పరిశ్రమల రక్షణకు 'రక్షిత విధానం' అవలంబించడం, దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ, లక్షిత వర్గాల ప్రజలకు అవకాశాలను విస్తృతం చేయడం లాంటి అంశాలకు నెహ్రూ – మహలనోబిస్ అభివృద్ధి నమూనాలో ప్రాధాన్యం ఇచ్చారు.
- ఆధునిక యంత్రాలు, విద్యుచ్ఛక్తిని ఉపయోగించి వినియోగ వస్తువులు రూపొందించే కుటీర, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి నెహ్రూ – మహలనోబిస్ నమూనాలో తగిన ప్రోత్సాహం ఇచ్చారు.

మూడో పంచవర్ష ప్రణాళిక

మూడో పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయం, పారిశ్రామిక రంగాల మధ్య ఇంటర్‌డిపెండెన్స్ (పరస్పర ఆధారం) వృద్ధి చేయడంపై దృష్టి సారించారు. జాతీయ, ప్రాంతీయ అభివృద్ధి, స్వదేశీ, బహిర్గత ఆధారాల నుంచి వనరుల సమీకరణ తదితర అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ప్రణాళికలో సాంకేతిక ప్రగతికి చర్యలు తీసుకోవడం, అధిక ఉత్పాదకత సాధించడం, జనాభా నియంత్రణ, ఉపాధి, సామాజిక మార్పు అంశాలపై దృష్టి కేంద్రీకరించారు.

వార్షిక ప్రణాళికలు

వార్షిక ప్రణాళికల కాలం(1966–69)లో.. మూడో పంచవర్ష ప్రణాళికలో ఆర్థిక వ్యవస్థలో సంభవించిన అనిశ్చిత పరిస్థితులను నివారించడంపై దృష్టి సారించారు. దీంతోపాటు ఏ విధమైన అదనపు ద్రవ్యోల్బణ పరిస్థితులు తలెత్తకుండా సహేతుక వృద్ధి రేటు సాధనకు ప్రాధాన్యం ఇచ్చారు. అవస్థాపితా సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం, ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి కేంద్రీకరించారు. విద్య, కుటుంబ నియంత్రణ, రక్షిత తాగునీటి సరఫరా, పారిశుధ్యం తదితర అంశాలపై దృష్టి సారించి వివిధ సాంఘిక సేవా పథకాలను ప్రవేశపెట్టారు.

నాలుగో పంచవర్ష ప్రణాళిక

నాలుగో పంచవర్ష ప్రణాళికా కాలంలో (1969–74) వార్షిక ప్రణాళికల్లో అవలంబించిన వ్యూహాన్ని కొనసాగించారు. చిన్న రైతులకు ప్రోత్సాహం కల్పించేవిధంగా వ్యవసాయం, నీటి పారుదల అభివృద్ధికి సంబంధించిన వ్యూహాలను అమలు చేశారు. ఆధునిక పరిశ్రమలను అభివృద్ధి చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే క్రమంలో.. చిన్న, పెద్ద తరహా పారిశ్రామిక యూనిట్ల వికేంద్రీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఎగుమతులను పెంచడం, దిగుమతులను తగ్గించుకోవడంతో పాటు క్రమంగా విదేశాలపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించడానికి ఈ ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు. సమతౌల్య ఆర్థికవృద్ధిని దృష్టిలో ఉంచుకొని సుస్థిరత, స్వయం సమృద్ధి సాధనకు ఈ ప్రణాళికలో పెద్దపీట వేశారు.

అయిదో పంచవర్ష ప్రణాళిక

పేదరిక నిర్మూలన, ఆర్థిక స్వయం సాధనను దృష్టిలో ఉంచుకొని 5వ పంచవర్ష ప్రణాళిక వ్యూహాన్ని రూపొందించారు. వ్యవసాయ రంగంలో అధిక దిగుబడినిచ్చే వంగడాల వాడకం, బహుళ పంటల కార్యక్రమం ద్వారా ఉత్పత్తి పెంపునకు ప్రాధాన్యం ఇచ్చారు. పారిశ్రామిక రంగ అభివృద్ధిలో భాగంగా వినియోగ వస్తువులు, వ్యవసాయాధారిత పరిశ్రమల విస్తరణ, ప్రోత్సాహం లాంటివాటిపై దృష్టి సారించారు.

ఆరో పంచవర్ష ప్రణాళిక

ఆరో పంచవర్ష ప్రణాళిక వ్యూహంలో నిరుద్యోగ సమస్య, అల్ప ఉద్యోగిత, పేదరికాన్ని అట్టడుగు స్థాయికి తగ్గించడం లాంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడుల వృద్ధిని వేగవంతం చేయడం ద్వారా అవస్థాపనా సౌకర్యాల పెంపు, ఉత్పత్తి, ఎగుమతుల వృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. ఆయా లక్ష్యాల సాధన కోసం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించారు. ప్రజలకు కనీస అవసరాల కల్పన, గ్రామీణ, అసంఘటిత రంగాల్లో ఉపాధి అవకాశాల పెంపునకు ప్రాధాన్యం ఇస్తూ వ్యూహాన్ని సిద్ధం చేశారు.

ఏడో పంచవర్ష ప్రణాళిక

మానవ వనరుల అభివృద్ధి, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఏడో పంచవర్ష ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించుకోవడం ద్వారా దేశంలో పేదరికం, నిరుద్యోగం, ప్రాంతీయ అసమానతల తగ్గింపునకు కృషి చేసే దిశగా అవసరమైన అభివృద్ధి వ్యూహాన్ని అవలంబించారు.

ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక

ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక (1992–97)లో మానవాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ప్రణాళికలో ఉపాధి అవకాశాల విస్తరణకు అవలంబించిన వ్యూహాలు, విధానాలు, కార్యక్రమాల్లోని ముఖ్యాంశాలు కింది విధంగా ఉన్నాయి..

1. వేగవంతమైన, అన్ని ప్రాంతాలకు విస్తరించిన వ్యవసాయ రంగ అభివృద్ధి.
2. వ్యవసాయాధారిత, అనుబంధ కార్యకలాపాలైన డెయిరీ, ఫిషరీలకు సంబంధించి అవస్థాపనా సౌకర్యాలు, మార్కెటింగ్ సౌకర్యాల అభివృద్ధి.
3. గ్రామీణ ప్రాంతాల్లో తయారీ కార్యకలాపాల అభివృద్ధి.
4. చిన్న తరహా, తయారీ రంగ వికేంద్రీకరణపై దృష్టి సారించడం.
5. ఆరోగ్య, విద్యా సౌకర్యాలను పటిష్టపరచడం.
6. సేవా, ఇన్‌ఫార్మల్ రంగాల కార్యకలాపాల్లో వేగవంతమైన వృద్ధి.
7. ఉపాధి వృద్ధి పెంపులో భాగంగా నియంత్రణ విధానాన్ని సరళీకరించడం.
8. అవస్థాపనా సౌకర్యాలు, గృహ వసతి కల్పనకు సంబంధించిన కార్యక్రమాలను ప్రవేశ పెట్టడం.

తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక

తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక (1997–2002) వ్యూహంలో భాగంగా.. వ్యవసాయ ఉత్పత్తి పెంపు ద్వారా సాంవత్సరిక వృద్ధి రేటు పెంపు, వనరుల సమీకరణలో స్వయం సాధన (సెల్ఫ్ రిలయన్స్), గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో మార్పులను తీసుకురావడం ద్వారా గ్రామీణ పేదరిక తీవ్రత తగ్గింపు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని మధ్య తరహా, భారీ పరిశ్రమల్లో సామర్థ్యం, పోటీతత్వం పెంపునకు తగిన చర్యలను విస్తరించడం, ఫార్మల్, ఇన్‌ఫార్మల్ రంగాల్లోని గ్రామీణ, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి, అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. మానవాభివృద్ధిని మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

పదో పంచవర్ష ప్రణాళిక

పదో పంచవర్ష ప్రణాళిక వ్యూహంలో.. ప్రైవేట్ రంగం అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. వృద్ధి పెంపునకు వ్యూహాలు, ప్రభుత్వం ఎదుర్కొంటున్న విధానపరమైన సవాళ్లను అధిగమించడంపై దృష్టి సారించారు. ప్రభుత్వ రంగ పెట్టుబడుల్లో మూలధనం – ఉత్పత్తి నిష్పత్తికి ప్రాధాన్యం ఇవ్వడానికి బదులుగా ప్రైవేట్ రంగంలో అధికవృద్ధి వ్యూహాన్ని అమలు చేశారు.

పదకొండో పంచవర్ష ప్రణాళిక

పదకొండో పంచవర్ష ప్రణాళికలో (2007–2012) పేదరికం తగ్గించడం, ఉపాధి అవకాశాల కల్పన, లింగ సంబంధిత తేడాలు నివారించడం, అక్షరాస్యత పెంచడం, వ్యవసాయ రంగంలో 4 శాతం వార్షిక వృద్ధి సాధించడం ధ్యేయంగా విశాల దృక్పథంతో కూడిన సమ్మిళిత వృద్ధి వ్యూహాన్ని అమలు చేశారు.

పన్నెండో పంచవర్ష ప్రణాళిక

పన్నెండో పంచవర్ష ప్రణాళిక వ్యూహంలో (2012–2017) వ్యవసాయ రంగంలో అధిక ప్రగతి సాధించడం, ఉపాధి కల్పన (ముఖ్యంగా తయారీ రంగంలో) వేగవంతం చేయడం, విద్య, ఆరోగ్యం, శిక్షణా నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి పటిష్ట చర్యలు తీసుకోవడం.

మాదిరి ప్రశ్నలు

1. మహలనోబిస్ పెట్టుబడి వ్యూహంలో ఏ రంగానికి ప్రాధాన్యం ఇచ్చారు?
   1) ప్రభుత్వ రంగం 2) ప్రైవేట్ రంగం
   3) అసంఘటిత రంగం
   4) సంఘటిత రంగం
2. కింది వాటిలో నెహ్రూ – మహలనోబిస్ అభివృద్ధి నమూనాలో భాగం కానిది?
   1) దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ
   2) పరిశ్రమలకు రక్షిత విధానం
   3) సమ్మిళిత వృద్ధి
   4) భారీ పరిశ్రమలకు ప్రాధాన్యం
3. ఎన్నో పంచవర్ష ప్రణాళికలో చిన్న రైతులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయం, నీటి పారుదల అభివృద్ధికి వ్యూహం అవలంబించారు?
   1) 3 2) 4 3) 5 4) 6
4. ఆర్థిక ప్రణాళికా వ్యూహాన్ని కింద పేర్కొన్న ఏ అంశం ప్రభావితం చేసింది?
   1) మహలనోబిస్ వృద్ధి నమూనా
   2) ఉపాధి లక్ష్యం
   3) సామాజిక లక్ష్యాలు 4) పైవన్నీ

సమాధానాలు

1) 1; 2) 3; 3) 2; 4) 4

The head office of BIS is located in?



BANK EXAMS

BANKING AWARENESS

1. What is the minimum capital requirement for New Banks in the Private Sector?
   a) Rs. 200 crore
   b) Rs. 300 crore
   c) Rs. 500 crore
   d) Rs. 600 crore
   e) None of these
2. Many times we read a term "ECB" in financial newspapers. What is the full form of ECB?
   a) Essential Commercial Borrowing
   b) Essential Credit and Borrowing
   c) External Credit and Business
   d) External Commercial Borrowing
   e) None of the above
3. Which among the following banks has launched "Dhanchayat" an educational film to raise awareness on the dangers of borrowing money from unorganised sources?
   a) Axis b) ICICI
   c) HDFC d) SBI
   e) YES
4. What is the maximum monthly pension for the subscribers under Atal Pension Yojana?
   a) Rs 2000 b) Rs 3000
   c) Rs 4000 d) Rs 5000
   e) None of these
5. If a company which is not a non-banking financial company wants to collect public deposits, it is governed by ___ Act:
   a) RBI Act 1934
   b) Banking companies Act
   c) Companies Act 1956
   d) Central Government
   e) None of the above
6. Which among the following has launched a Smart Humsafar Plan, a unique plan which offers multiple benefits of savings and insurance cover for husband and wife under a single policy?
   a) ICICI Prudential
   b) SBI Life c) NIACL
   d) LIC e) HDFC ERGO
7. Which country launched world first Facial recognition ATM?
   a) China b) Japan
   c) US d) Canada
   e) Brazil
8. Which type of machine is used by Business Correspondents?
   a) Micro ATMs b) POS
   c) Biometric Card Reader
   d) Solar empowered
   e) Water resistant
9. Which among the following bank has tied up with Chinese e-commerce giant Alibaba to provide easier trade finance to small and medium enterprises (SMEs) in the country?
   a) HDFC Bank
   b) SBI Bank
   c) Canara Bank
   d) ICICI Bank e) Axis Bank
10. In India, conventionally, bonds are issued by institutions in ____ sector while debentures by corporate in ____ sector.
    a) private, public
    b) public, private
    c) either a or b
    d) cooperative, NBFC
    e) None of the above
11. What is the name of the platform launched by State Bank of India (SBI) that enables customers to book their foreign exchange transactions online?
    a) SBI eforex
    b) SBI emoney
    c) SBI eonline
    d) SBI eshare
    e) SBI ebuddy
12. In CDR, "R" stands for ____.
    a) Ratio b) Receipt
    c) Regulation d) Restructuring
    e) Reserve
13. Which of the following is not a function of General Insurance?
    a) Cattle Insurance
    b) Crop Insurance
    c) Marine Insurance
    d) Fire Insurance
    e) None of the above
14. The Bank for International Settlements (BIS) is the world's oldest international financial organization established on 17 May 1930. The mission of the BIS is to serve central banks in their pursuit of monetary and financial stability, to foster international cooperation in those areas and to act as a bank for central banks. The head office of BIS is located in ___.
    a) Hong Kong b) Switzerland
    c) China d) Mexico
    e) Australia
15. National Investment and Infrastructure Fund (NIIF) is a fund created by the Government of India for enhancing infrastructure financing in the country. To be operational by the year end, the headquarter of NIIF will be located in ____.
    a) Mumbai b) New Delhi
    c) Bengaluru d) Chennai
    e) Kolkata
16. Special Drawing Rights (SDRs) are international foreign exchange reserve assets issued by-
    a) World Bank b) WTO
    c) ADB d) IMF
    e) None of these
17. Which of the following types of accounts are known as "Demat Accounts"?
    a) Zero Balance Accounts
    b) Accounts which are opened to facilitate repayment of a loan taken from the bank. No other business can be conducted from there
    c) Accounts in which shares of various companies are traded in electronic form
    d) Accounts which are operated through internet banking facility
    e) None of the above
18. According to the Socio Economic and Caste Census (SECC) which among the following states in India has highest per cent of Urban BPL households?
    a) Bihar b) Uttar Pradesh
    c) Manipur d) Jharkhand
    e) Sikkim
19. Payment of a cheque may be countermanded by the ___
    a) Payee b) Drawer
    c) True owner d) Drawee
    e) None of these
20. Union Government has decided to set up a Bank Board Bureau (BBB) to monitor key performance indicators of two dozen public sector banks (PSBs). BBB will start functioning from ___.
    a) 31st December 2015
    b) 1st January 2016
    c) 31st March 2016
    d) 1st April 2016
    e) 1st June 2016
21. Identify the well known person related to Banking field in India from the following?
    a) Mrs. Meira Kumar
    b) Mrs. Kiran Shaw
    c) Mr. Arun Jaitley
    d) Dr. D Subbarao
    e) All of the above
22. A fixed deposit receipt is kept with the bank for its safety, is known as ___?
    a) Safe custody
    b) Safe deposit
    c) Locker
    d) Valid safe deposit
    e) None of the above
23. Reserve Bank will issue ___bank notes with 3 additional features to aid the visually impaired in identification.
    a) Rs. 500 and Rs 1,000
    b) Rs. 100 and Rs. 500
    c) Rs. 50 and Rs. 100
    d) Rs. 10 and Rs. 100
    e) None of these
24. Simply click a card launched by SBI special for ____.
    a) Cash Transfer
    b) Online Shopping
    c) Pay Utility Bills
    d) For Home Loans
    e) None of these
25. Banking Companies are prohibited under Sec 8 of banking Regulation Act to sell and purchase securities. Yet Banks are selling securities (of the customer) which are under pledge as permitted by:
    a) Indian Contract Act
    b) SARFAESI Act
    c) Government Notification
    d) Banking Regulation Act
    e) None of these
26. Hypothecation is:
    a) A transaction of conditional sale
    b) A legal transaction whereby goods may be made available as security for a debt
    c) Transfer of ownership by the borrower to the lender
    d) Either a or b
    e) None of the above
27. Mortgage is a:
    a) Security on movable property for a loan
    b) Security on immovable property for a loan
    c) Concession on immovable property
    d) Facility on immovable property
    e) Security on loan sanctioned against fixed deposits
28. What is the minimum amount to be invested under Sukanya Samriddhi Scheme?
    a) Rs. 500 b) Rs. 1000
    c) Rs. 1500 d) No ceiling
    e) Rs. 100
29. The Main activity of the Financial Intelligence Unit India (FIU-IND) is to control:
    a) Tax Evasion
    b) Money Laundering
    c) Terrorism
    d) Avoiding NPAs
    e) Avoiding frauds in ATMs
30. The SARFAESI Act 2002 empowers Banks / Financial Institutions to recover their non-performing assets (bad loans) without the intervention of the Court. In "SARFAESI" second "S" stands for ____.
    a) Securitisation
    b) Security c) Statutory
    d) Share e) Saving
31. The main function of an Asset Management Company is to:
    a) hold the securities of various schemes
    b) manage the funds by making investments in various types of securities
    c) hold its property for the benefit of the unit holders
    d) act on behalf of SEBI
    e) All the above
32. Global Rating Agency Fitch has downgraded Viability Rating (VR) by one notch to 'bb' of which among the following banks?
    a) Bank of Baroda
    b) State Bank of India
    c) Punjab National Bank
    d) Canara Bank
    e) IDBI Bank
33. The Banking Codes and Standards Board of India was registered on 18th February, 2006 under which of the following RBI Act?
    a) Banking Regulation Act
    b) The Societies Registration Act, 1860
    c) Cooperative Societies Act
    d) None of the above
    e) All the above
34. As per the Banking Ombudsman Scheme, any person can file a complaint before the Banking Ombudsman, if the satisfied reply is not received from the bank within a period of ____.
    a) one month b) three months
    c) two months d) six months
    e) None
35. CIBIL as a credit bureau caters to:
    a) Consumer segments
    b) Commercial segments
    c) Both commercial and consumer segments
    d) Nationalized Banks only
    e) Private Banks only
36. Infusion of liquidity, by RBI, is done through _____ from / to banks under a _____ transaction.
    a) borrowing, repo
    b) borrowing, reverse repo
    c) lending, repo
    d) lending, reverse repo
    e) None of the above
37. Some banks are financing big projects like construction of roads, bridges etc. Financing such projects means banks are helping exactly in:
    a) Infrastructural Development
    b) Project Management
    c) Developing core sector Industry
    d) Financial Inclusion
    e) All of the above
38. A rate of exchange established between any two currencies on the basis of the respective quotation of each currency in terms of a third currency is known as:
    a) Cross rate b) Merchant rate
    c) Wash rate d) Composite rate
    e) None of the above

KEY

1) c; 2) d; 3) c; 4) d; 5) c;
6) b; 7) a; 8) c; 9) d; 10) b;
11) a; 12) d; 13) e; 14) b; 15) a;
16) d; 17) c; 18) c; 19) b; 20) d;
21) d; 22) a; 23) a; 24) b; 25) d;
26) b; 27) b; 28) b; 29) b; 30) b;
31) b; 32) c; 33) b; 34) a; 35) c;
36) c; 37) a; 38) a.